ఈనాడు

కరీంనగర్ 8-1-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 149


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్

10% విద్య, ఉద్యోగ రంగాల్లో అమలు



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణాన కేంద్ర ప్రభుత్వం కీలకమైన అస్త్రాన్ని బయటకు తీసింది. భాజపాకు బలమైన మద్దతుదారులుగా ఉన్న అగ్రవర్ణ మధ్యతరగతిని ఆకట్టుకునేందుకు పావులు కదిపింది. ఆర్థికస్థోమత ప్రాతిపదికగా వారికి విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించనున్నట్లు ప్రతిపాదించింది. జనరల్ విభాగంలో ఆర్థికంగా వెనకబడిన వారికి 10% రిజర్వేషన్లు కల్పించాలని సోమవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. విద్య, ఉద్యోగ రంగాల్లో దీనిని వర్తింపజేస్తారు. 10 శాతం కోటా వల్ల బ్రాహ్మణులు, రాజ్‌పుట్‌లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్‌లు, వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ వంటి పలు సామాజిక వర్గాలు లబ్ధి పొందనున్నాయి. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకున్న 49.5% రిజర్వేషన్లకు ఇది అదనం. అంటే రిజర్వేషన్లు 59.5% అవుతాయి. ఈ పరిణామం రాజకీయంగా తీవ్ర చర్చకు తెరలేపింది.

న్యాయ సమీక్షకు నిలబడుతుందా?

- ప్రాథమిక హక్కులకు అనుగుణంగా ఉంటేనే చెల్లుబాటు
- 50% పరిమితే అసలు సమస్య
- అగ్రవర్ణాల కోటాపై ఇరువైపులా బలమైన వాదనలు



- సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్రం కీలక నిర్ణయం
- మంత్రివర్గం ఆమోద ముద్ర
- నేడు పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు

పూర్తి వివరాలు 2లో

4 తక్షణ రాజకీయ కారణాలివేనా?

1. ఎస్సీ/ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టం విషయంలో ఆగ్రహంతో ఉన్న అగ్రవర్ణాలను బుజ్జగించడానికి...
2. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అగ్రవర్ణాలను కాంగ్రెస్‌కు దూరం చేయడం మరో లక్ష్యం.
3. బీఎస్పీని ఇరకాటంలో పెట్టడం కూడా ఇంకో ఎత్తుగడ.
4. రఫేల్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి...

అర్హులు ఎవరు?

ఆర్థికంగా వెనుకబడిన వర్గంలోకి ఎవరెవరు వస్తారన్నదానిపై ప్రభుత్వం స్పష్టమైన నిర్వచనం ఇవ్వనుంది. ప్రతిపాదిత ప్రామాణికాల ప్రకారం ఎవరు ఈ వర్గంలోకి వస్తారంటే..

- వృత్తిపరంగా, వ్యవసాయ పరంగా వార్షికాదాయం రూ. 8 లక్షల కన్నా తక్కువ ఉన్నవారు...
- అయిదెకరాల కన్నా తక్కువ వ్యవసాయ భూమి, 1,000 చదరపు అడుగుల కన్నా తక్కువ విస్తీర్ణం ఉన్న ఇల్లు కలిగి ఉన్నవారు...
- నోటిఫైడ్ మున్సిపల్ ప్రాంతాల్లో 100 గజాల కన్నా తక్కువ స్థలంలో ఇల్లు ఉన్నవారు..
- నాన్-నోటిఫైడ్ మున్సిపల్ ప్రాంతంలో 200 గజాలకన్నా తక్కువ స్థలంలో ఇల్లు ఉన్నవారు..

---

71 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై భారత్ టెస్టు సిరీస్ విజయం

మరో చరిత్ర

దిగ్గజాలకూ దక్కని ఘనత కోహ్లి సేన సొంతం

భారత క్రికెట్ జట్టు అద్భుతం చేసింది. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలోనే ఓడించి నవశకానికి నాంది పలికింది. 71 ఏళ్లుగా ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న భారత్ అక్కడ టెస్టు సిరీస్ గెలవడం ఇదే తొలిసారి. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా భారత్ ఘనత సాధించింది.

...పూర్తి వివరాలు ఛాంపియన్ లో



విరాట్ చరిత్ర సంపాదకీయం 4లో

కాళేశ్వరం సామర్థ్యం పెంపు

- సర్కారు నిర్ణయం!
- ప్రస్తుతం రోజూ రెండు టీఎంసీల నీటి మళ్లింపు దిశగా సాగుతున్న పనులు
- అదనంగా మరో టీఎంసీ కోసం పనుల విస్తరణ
- కొత్త సొరంగ మార్గం కోసం సర్వే

ఈనాడు – హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం రోజుకు రెండు టీఎంసీల నీటిని మళ్లించేలా పనులు చేపట్టారు. మూడు టీఎంసీలు మళ్లించేలా పనులను విస్తరించాలని, దీనిపై కసరత్తు చేయాలని ప్రభుత్వం సంబంధిత ఇంజినీర్లకు సూచించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఎల్లంపల్లి దిగువన అదనపు సొరంగ మార్గం తవ్వకానికి సంబంధించి సర్వే చేపట్టినట్లు సమాచారం. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం పనులను పరిశీలించిన సమయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టుకు, హైదరాబాద్‌కు తాగునీటికీ, పారిశ్రామిక అవసరాలకు కలిపి 225 టీఎంసీలు అవసరం కాగా, ఇందులో 180 టీఎంసీల నీటిని మేడిగడ్డ నుంచి ఎత్తిపోతల ద్వారా మళ్లించారు. రోజుకు రెండు టీఎంసీల చొప్పున 90 రోజుల పాటు మళ్లించి, మిగిలిన నీటిని భూగర్భజలం ద్వారా వినియోగించుకొనేలా ప్రతిపాదించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని మళ్లిస్తారు. ఎల్లంపల్లి నుంచి శ్రీరాంసాగర్ వరదకాలువలో భాగంగా నిర్మించిన మధ్యమానేరు ప్రాజెక్టుకు మళ్లించి, ఆ తర్వాత దిగువన ఉన్న కాళేశ్వరం ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తారు. ఈ పనులన్నీ ...మిగతా 2లో



బరాబర్ నీళ్లిస్తం

- ప్రాజెక్టులను నూరు శాతం పూర్తిచేస్తాం
- సాగునీళ్లు ఇస్తారనే ప్రజలు మళ్లీ అవకాశం ఇచ్చారు
- వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం
- ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం కేసీఆర్ 5 లో

మంత్రివర్గ విస్తరణ కోసం ఏర్పాట్లు

- సాధారణ పరిపాలన శాఖకు ప్రభుత్వ ఆదేశాలు
- విస్తరణపై రెండు రోజులుగా సీఎం కసరత్తు 3 లో

తెలంగాణలో 2 రహదారులకు గుర్తింపు

- సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్రం 6 లో

స్థానిక ఎన్నికలు జరిగే ప్రాంతాలకే కోడ్

- సింగరేణి, ఆర్టీసీ ఉద్యోగులు పోటీచేయొచ్చు
- నియమావళికి సవరణ చేసిన ఎన్నికల సంఘం 16లో

ఇదీ సంగతి!



పేరు మార్చి కొనసాగింపు

ఇక పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శుల వ్యవస్థ

- అనుమతించిన మంత్రిమండలి
- శాసనసభలో మంత్రుల తరఫున వీరూ సమాధానం చెప్పేలా చట్టంలో మార్పులు
- నామినేటెడ్ ఎమ్మెల్యేగా స్టీఫెన్‌సన్
- మంత్రిమండలి సిఫార్సును ఈసీకి పంపిన గవర్నర్
- ఎమ్మెల్యేగా నియమిస్తూ నోటిఫికేషన్ జారీ



ఈనాడు – హైదరాబాద్

రాష్ట్ర మంత్రిమండలి తొలి సమావేశం పార్లమెంటరీ కార్యదర్శుల నియామకానికి పచ్చజెండా ఊపింది. పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులుగా పేరు మార్పు చేసింది. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న నియామకాల ప్రాతిపదికన ఉత్తర్వుల జారీకి మంత్రిమండలి ఆమోదం తెలిపినట్లు సమాచారం. గత అనుభవాల దృష్ట్యా ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, న్యాయపరమైన సమస్యలు ...మిగతా 2లో

హెచ్‌ఏఎల్‌ను బలహీన పరుస్తున్నారు



రాహుల్ గాంధీ

- రూ.15,700 కోట్ల బకాయిలు చెల్లించలేదు
- ఒక్క విమానమూ అందివ్వని డసోకు రూ.20 వేల కోట్లు ఇస్తారా?
- అనిల్ అంబానీ కోసమే ఇదంతా
- మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ విమర్శలు
- హెచ్‌ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల ఆర్డర్లు: నిర్మలా సీతారామన్ వివరణ 14 లో



నిర్మలా సీతారామన్

ఎన్నికల ముందు ఎక్కుపెట్టిన విల్లు

● అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో దిద్దుబాటు చర్యలు ● ఇతర పార్టీలనూ ఇరుకున పెట్టే యత్నం ● రిజర్వేషన్ల ప్రకటన వెనుక భాజపా రాజకీయ వ్యూహం

ఈనాడు – దిల్లీ

ఎన్నో లక్ష్యాలకు గురిపెట్టే బాణాన్ని మోదీ ప్రభుత్వం సంధించింది. మరో 90 రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు మార్చే నిర్ణయాన్ని వెలువరించింది. చట్టపరంగా ఇబ్బందులు ఉంటాయని తెలిసినప్పటికీ అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ రిజర్వేషన్ల కల్పనకు కులం ప్రాతిపదిక కాకపోవడం గమనార్హం. ఆర్థికంగా వెనుకబడిన వర్గా(ఎకనామికల్లీ వీకర్ సెక్షన్- ఈడబ్ల్యూఎస్)ల పేరుతో అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించనుంది. ఈ నిర్ణయం వెనుక నాలుగు తక్షణ రాజకీయ కారణాలు కనిపిస్తున్నాయి.

1 ఎస్సీ/ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టంలోని కొన్ని నిబంధనలను న్యాయస్థానం తిరస్కరించినా ప్రభుత్వం వాటిని పునరుద్ధరించింది. దీనిపై అగ్రవర్ణాల వారు ఆగ్రహంతో ఉండడంతో వారిని బుజ్జగించడానికే ఈ నిర్ణయాన్ని వెలువరించిందన్న అభిప్రాయాలు ఉన్నాయి.

2 ఉత్తర్‌ప్రదేశ్‌లోని అగ్రవర్ణాలను కాంగ్రెస్‌కు దూరం చేయడం మరో లక్ష్యం. గతంలో ఎస్పీ-బీఎస్పీ- కాంగ్రెస్‌లు కూటమిగా ఏర్పడి పోటీ చేసినప్పుడు అగ్రవర్ణాల వారు భాజపాకు మద్దతు ఇచ్చారు. ఇప్పుడు ఎస్పీ-బీఎస్పీలు కూటమిగా ఏర్పడి, కాంగ్రెస్ విడిగా పోటీ చేసే పరిస్థితులు ఉన్నాయి. దీంతో అగ్రవర్ణాలు సంప్రదాయంగా కాంగ్రెస్‌వైపు మళ్లే అవకాశం ఉంది. దాంతో వారు తమ వైపే ఉండేలా చేసేందుకు రిజర్వేషన్లను ప్రకటించింది.

3 బీఎస్పీని ఇరకాటంలో పెట్టడం కూడా ఇంకో ఎత్తుగడ. గతంలో మాయావతి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేసేవారు. దీని వల్ల ఎస్సీల రిజర్వేషన్లకు ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో ఈ అంశాన్ని ప్రస్తావించేవారు. ఇప్పుడు కేంద్ర నిర్ణయాన్ని కాదనడానికి మాయావతికి కారణమే కనిపించదు. దళిత వర్గానికి చెందిన రిపబ్లికన్ పార్టీ అధినేత, కేంద్రమంత్రి రాందాస్ అఠావలే కూడా మరాఠీలకు 16 శాతం రిజర్వేషన్లకు మద్దతు పలకడం గమనార్హం.

4 రఫేల్ వ్యవహారంపై ప్రస్తుతం మీడియాలో చర్చ జరుగుతుండడంతో దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కూడా రిజర్వేషన్ల అంశాన్ని తీసుకొచ్చింది.

న్యాయ వివాదాలను ఎలా అధిగమిస్తారు?

బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన మండల్ కమిషన్ నివేదిక అమలుపై అగ్రవర్ణాలు ఆగ్రహం చెందడంతో గతంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం వారికి కూడా 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదంటూ సుప్రీంకోర్టు దాన్ని తిరస్కరించింది. ప్రస్తుతం వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొనే నిర్ణయం తీసుకున్నట్లు ఓ మంత్రి చెప్పారు. "చట్టపరంగా ఇబ్బందులు ఉండకూడదనే ఆర్థికంగా వెనుకబడిన వర్గం (ఈడబ్ల్యూఎస్) అనే కొత్త వర్గాన్ని సృష్టించాం. ఇందుకోసం రాజ్యాంగంలోని 15, 16వ అధికరణాలను సవరించనున్నాం. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ రిజర్వేషన్ల మాదిరిగా ఇక్కడ కులం ప్రాతిపదిక కాదు. గందరగోళం లేకుండా ఉండడం కోసం ఈడబ్ల్యూఎస్ అంటే కచ్చితమైన నిర్వచనాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు.

మహారాష్ట్ర ఏం చేసింది?

మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మరాఠీలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఇది నిర్ణీత 50 శాతం పరిమితిని మించడంతో ముందుగానే న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమ వాదనలను పూర్తిగా వినకుండా ఉత్తర్వులను కొట్టివేయకూడదంటూ బాంబే హైకోర్టులో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేసింది. అందుకు కోర్టు అంగీకరించింది. ఆ కారణంగానే నవంబరు 29న ప్రకటించిన రిజర్వేషన్లపై ఇంతవరకు అభ్యంతరం తెలపలేదు.

మరో అస్త్రం... జీఎస్టీ ..

ఎన్నికల ముందు ప్రభుత్వం మరో అస్త్రాన్ని ప్రయోగించనుంది. వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) కారణంగా సంప్రదాయంగా మద్దతు ఇచ్చే వ్యాపార వర్గాలు దూరమవుతున్నట్లు గమనించిన ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టనుంది. ప్రస్తుతం వార్షిక టర్నోవర్ రూ. 20 లక్షలు ఉన్నవారికి పన్ను వర్తిస్తోంది. దాంతో రూ. 40-50 లక్షల వార్షిక టర్నోవర్ ఉన్నవారిని కూడా పన్ను నుంచి మినహాయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇదంతా 'నోటా' ప్రభావమే



భాజపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి 'నోటా'యే కారణం. ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టంలో మార్పులు చేయలేదని భాజపాపై అగ్రవర్ణాల్లో పలువురు ఆగ్రహంతో ఉన్నారు. అది మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో ప్రతిఫలించిందని, పలువురు భాజపాకు ఓటు వేయకుండా 'నోటా' మీటను నొక్కారని భావిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో 'నోటా'కు 1.4 శాతం ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్-భాజపాల మధ్య ఉన్న ఓట్ల తేడా కేవలం 0.1 శాతం కావడం గమనార్హం. 22 స్థానాల్లో వచ్చిన మెజార్టీలు 'నోటా'కు వచ్చిన ఓట్లు కన్నా తక్కువగా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో నోటాకు వచ్చిన ఓట్లు 2.1 శాతం ఉండడం విశేషం. ఇవి కూడా అగ్రవర్ణాలవారివేనన్న అభిప్రాయాలు ఉన్నాయి.

అగ్రవర్ణ పేదలకు 10% కోటా

దిల్లీ: అగ్రవర్ణ పేదలకు ఆర్థికస్థోమత ప్రాతిపదికగా విద్య, ఉద్యోగ రంగాల్లో 10% రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు సాధారణ విభాగంలో రిజర్వేషన్లు ఇచ్చేందుకు రాజ్యాంగంలోని 15, 16 అధికరణలను సవరించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు విధించిన 50% గరిష్ఠ పరిమితికి అదనంగా ఈ కోటా ప్రతిపాదిస్తున్నందువల్ల దీనికి అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లును.. పార్లమెంటు శీతాకాల సమావేశాలకు చివరి రోజైన మంగళవారమే ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నదని అధికార వర్గాలు వెల్లడించాయి. బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయ సభల్లోనూ కనీసం మూడింట రెండొంతుల మంది సభ్యులు మద్దతు పలకాల్సి ఉంటుంది. ఒకవేళ బిల్లుకు రాజ్యసభలో విపక్షాలు ఆమోదించకపోతే సమాజంలో ప్రభావవంతమైన వర్గం మద్దతును అవి కోల్పోవాల్సి వస్తుందనేది భాజపా విశ్వాసం. మొదటి నుంచి భాజపాకి అండగా ఉంటున్న అగ్రవర్ణాలవారు ఇటీవలి కాలంలో పార్టీకి కాస్త దూరమవుతున్నట్లు కనిపిస్తుండడంతో భారీ అస్త్రాన్ని ప్రభుత్వం సంధించినట్లు భావిస్తున్నారు. ఈ బిల్లు కోసం అవసరమైతే శీతాకాల సమావేశాలను మరో రెండ్రోజులు పొడిగించే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా రాజకీయ ఎత్తుగడ అని విపక్షాలు విమర్శించాయి. దీనిని ఎలా అమలు చేస్తారో చెప్పాలంటూ పట్టుపట్టాయి.

బిల్లుకు మద్దతు ఇస్తాం గానీ ఇది ఎన్నికల ఎత్తుగడ

'కేంద్ర నిర్ణయం ఎన్నికల ఎత్తుగడ. ప్రజల్ని మోసగించే చర్య. కోటాపై 50% పరిమితి ఉన్నప్పుడు దీనిని ఎలా అమలు చేస్తారు? లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయం భాజపాని ఆవరించిందనడానికి ఇదే నిదర్శనం. పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడానికి కావాల్సిన సంఖ్యాబలం భాజపాకి లేదు. బిల్లుకు మేం మాత్రం మద్దతు ఇస్తాం.'

– అభిషేక్ మను సింఘ్వి, సూర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధులు.

'ప్రభుత్వానికి ధైర్యం ఉంటే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలి. అలా చేయని పక్షంలో ఇదొక రాజకీయ స్టంటుగా మిగిలిపోతుంది. బిల్లు పెడితే మేం మద్దతు ఇస్తాం.' *– అరవింద్ కేజ్రీవాల్, దిల్లీ ముఖ్యమంత్రి.*

'బలహీన వర్గాల వారికి ఉద్యోగాలు వస్తాయంటే సంతోషమే. కానీ రాజ్యాంగపరంగా, చట్టపరంగా ఈ కోటా ఎంత వరకు చెల్లుబాటవుతుంది?'

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి.

ప్రధాని నిర్ణయం విప్లవాత్మకమైనది

'ప్రధాని మోదీ నిర్ణయం విప్లవాత్మకమైనది. కాపు, బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి, కమ్మ, క్షత్రియ తదితర అగ్రకులాల్లో పేదవారికి విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు లభిస్తాయి. 70 ఏళ్లపాటు వీరిపై కాంగ్రెస్ చూపిన వివక్ష వైఖరిని మోదీ అంతమొందించారు.'

– భాజపా ఎంపీ జీవీఎల్ నరసింహారావు

అగ్రవర్ణ పేదలపై అకస్మాత్తుగా ప్రేమ ఎందుకో..?

'అగ్రవర్ణ పేదలపై నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అకస్మాత్తుగా ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందో? ఏ ప్రతిపాదికన 10% రిజర్వేషన్లు అంటున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. రిజర్వేషన్లకు సంబంధించి చాలా రాష్ట్రాలు తీర్మానాలు పంపాయి. వాటి మీద ఏ నిర్ణయం తీసుకున్నారో తెలపాలి.'

– నారాయణ, సీపీఐ జాతీయ కార్యదర్శి.

న్యాయ సమీక్షకు నిలుస్తుందా?

ఈనాడు – దిల్లీ

అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం న్యాయ సమీక్షకు నిలబడుతుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని సుప్రీంకోర్టు కొట్టి వేయవచ్చని కొందరు వాదిస్తుంటే రాజ్యాంగ సవరణ చేసే అధికారం పార్లమెంటుకు ఉందని మరికొందరు వాదిస్తున్నారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పినందున ఇరు వైపుల వాదనలకు ప్రాధాన్యం ఏర్పడింది.

సవరణ చెల్లదు...ఎందుకంటే...

- రాజ్యాంగంలోని 14వ అధికరణం సమానత్వ హక్కు గురించి చెబుతోంది. రిజర్వేషన్లు 50%కి మించితే దానికి విఘాతం కలుగుతుంది. రిజర్వేషన్లు 60 శాతానికి చేరడమంటే ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే. సమానావకాశాలు కల్పించలేక పోయినా కనీసం పోటీపడే అవకాశాన్నయినా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



- రాజ్యాంగంలోని 368వ అధికరణానికి లోబడి రాజ్యాంగంలోని ఏ భాగాన్నయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. అయితే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం దానికి లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ప్రాథమిక హక్కులను హరించే ఎలాంటి సవరణ అయినా రాజ్యాంగ విరుద్ధమని కూడా పేర్కొంది.
- 15, 16 అధికరణాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఆర్థిక, సామాజిక వెనుకబడిన తరగతులకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించడానికి మాత్రమే అవకాశం ఉంది. రిజర్వేషన్లు ఇవ్వాలంటే అగ్రవర్ణ పేదలను ఓబీసీ జాబితాలో చేర్చాలి తప్పిస్తే ప్రత్యేకంగా మరో గ్రూప్ పెట్టడానికి వీలులేదు.
- తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకలాంటి రాష్ట్రాల్లో రిజర్వేషన్లు 50%కి మించాయంటే అందుకు... కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉండడం, వాటిపై ఎవరూ సవాలు చేయకపోవడం వంటి కారణాలు ఉన్నాయే తప్ప రాజ్యాంగం అనుమతించి మాత్రం కాదు.

ఉదాహరణలు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు 5% రిజర్వేషన్లు కల్పించినప్పుడు రిజర్వేషన్లు 51%కి చేరడంతో సుప్రీంకోర్టు అంగీకరించలేదు. దాంతో వాటిని 4%కి తగ్గించాల్సి వచ్చింది. ఇటీవల తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు 50%కి మించడానికి వీల్లేదని స్పష్టం చేసింది.

ఇంతకీ పార్లమెంటులో నెగ్గుతుందా?

ఇలాంటి ముఖ్యమైన రాజ్యాంగ సవరణలకు పార్లమెంటు ఉభయ సభల్లో 2/3 మెజార్టీ అవసరం. ఇప్పుడున్న లెక్కల ప్రకారం ఈ బిల్లుకు 2/3 మెజార్టీ రావాలంటే లోక్‌సభలో 362 మంది సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు అంత మెజార్టీ లేదు. 245 మంది సభ్యులున్న రాజ్యసభలోనూ 2/3 మెజార్టీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. భాజపాకు 73 మంది సభ్యులే ఉన్నారు. మిగిలిన పార్టీలు ఏ మేరకు మద్దతిస్తాయో చూడాల్సిందే!

చెల్లుతుంది...కారణాలేమిటంటే...

- రాజ్యాంగంలోని 15వ అధికరణం ప్రకారం ఎస్సీ, ఎస్టీలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినవారి అభ్యున్నతికి అవసరమైన రిజర్వేషన్లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంది. సర్వోన్నత న్యాయస్థానం ఇందులో జోక్యం చేసుకోలేదు.
- రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికే పరిమితం కావాలన్న నిబంధన రాజ్యాంగంలో ఎక్కడా లేదు.
- ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు ఎక్కడా 50%కి మించి రిజర్వేషన్లు ఉండకూడదని చెప్పలేదు.
- అగ్రవర్ణ పేదలకు ఇచ్చే 10% రిజర్వేషన్లకూ ప్రతిభను ప్రాతిపదికగా తీసుకొని అల్పాదాయ వర్గాలకు అవకాశం కల్పించనున్నందున, రాజ్యాంగంలోని 14వ అధికరణంలో చెప్పిన సమానత్వానికి దెబ్బతగిలే అవకాశం లేదు.

పేరు మార్చి కొనసాగింపు



సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న స్టీఫెన్‌సన్

ముఖ్యమంత్రి అడుగు జాడల్లో నడుస్తా

● 'ఈనాడు'తో ఆంగ్లో ఇండియన్ నామినేటెడ్ శాసనసభ్యుడు స్టీఫెన్‌సన్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో ఆంగ్లో ఇండియన్ శాసనసభ్యునిగా రెండోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు అవకాశం ఇవ్వడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని, దానిని నిలబెట్టుకొంటానని ఎల్విస్ స్టీఫెన్‌సన్ తెలిపారు. ఎమ్మెల్యేగా ఎంపికైన అనంతరం ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. మొదటిసారి ఆంగ్లో ఇండియన్ కేటగిరిలో నాకు అవకాశం ఇవ్వాలని కోరాను. సీఎం నన్ను ఇంటికి పిలిపించి, మాట్లాడి అప్పట్లో ఎంపిక చేశారు. ఈసారి నేను మళ్లీ పదవి అడగలేదు. ఆయనే స్వయంగా ఎంపిక చేసి నాకు చెప్పారు.

ఓటుకు నోటు వ్యవహారం సిగ్గుచేటు

ఓటుకు నోటు లాంటి వ్యవహారం నడిపించడం సిగ్గుచేటు. రాజకీయాల్లో డబ్బు ముఖ్యం కాదు. విలువలతో జీవించాలి. నా పరిధిలో నేను సక్రమంగా వ్యవహరించాను. ఆ ఉదంతంలోనే కాదు నేను ఎమ్మెల్యేగా నిబద్ధతతో ఉన్నాను. కేసీఆర్ దార్శనికుడు. ఆయన పాలన దేశానికే ఆదర్శం. అన్నిమతాల వారికి అండగా నిలిచారు. క్రైస్తవుల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలను చేపట్టారు. ఆయన ఆధ్వర్యంలోని ప్రభుత్వంలో, పార్టీలో రెండోసారి ఎమ్మెల్యే పదవి పొందినందున నా మీద బాధ్యత పెరిగింది. దీనికి అనుగుణంగా విధులను నిర్వహిస్తాను'

(మొదటి పేజీ తరువాయి)

రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గోప్యత పాటించాలని సీఎం సూచించినట్లు తెలిసింది. ఆంగ్లోఇండియన్ నామినేటెడ్ ఎమ్మెల్యేగా ఎల్విస్ స్టీఫెన్‌సన్‌ను మంత్రిమండలి ఎంపిక చేసింది. గత శాసనసభలోనూ ఆయన నియమిత సభ్యునిగా ఉన్నారు. గవర్నర్ నరసింహన్‌కు మంత్రిమండలి స్టీఫెన్‌సన్ పేరును సిఫార్సు చేయగా.. గవర్నర్ ఆమోదం తెలిపి కేంద్ర ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపారు. ఈసీ ఆదేశాలకనుగుణంగా రజత్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. శాసనసభ ఎన్నికలు జరిగి తెరాస రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గత నెల 13న కేసీఆర్, మహమూద్‌అలీతో మంత్రివర్గం ఏర్పడింది. తొలి మంత్రవర్గ సమావేశం సోమవారం ఉదయం 11.30కి ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ప్రగతిభవన్‌లో జరిగింది. మహమూద్‌అలీతో పాటు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, ఇతర ముఖ్యమైన అధికారులు హాజరయ్యారు.

అధికారులు, న్యాయనిపుణులతో చర్చ

రాజ్యాంగంలోని 164 నిబంధన ప్రకారం మొత్తం సభ్యుల సంఖ్యలో 15 శాతం మందిని మాత్రమే మంత్రులుగా నియమించే వీలుంది. వీరికి సహాయకారులుగా ఉండేలా పార్లమెంటరీ కార్యదర్శులను నియమించాలని మంత్రిమండలి చర్చించింది. ఇందుకోసం తెచ్చే ఆర్డినెన్స్ ఎలా ఉండాలనే అంశంపై అధికారులు, న్యాయనిపుణులతో సమావేశంలో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ తరహాలో వారి కొనసాగింపుతో పాటు సాంకేతిక సమస్యలు రాకుండా ఈ పదవి పేరును పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శి(పార్లమెంటరీ పొలిటికల్ సెక్రటరీ)గా మార్చనున్నారు. దీని వల్ల న్యాయపరమైన సమస్యలు తొలగిపోతాయనే అభిప్రాయం వ్యక్తమైంది.

పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శి వ్యవస్థ ఎలా ఉంటుందంటే..

- పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులకు ఎలాంటి హోదా ఇవ్వరు. మంత్రిమండలి సమావేశాల్లో వీరు పాల్గొనే వీలుండదు. ప్రమాణ స్వీకారం లేకుండానే పదవులు చేపడతారు.
- మంత్రులకు సహాయకారులుగా ఉంటారు. శాసనసభలో మంత్రులు లేని సమయంలో వారి తరఫున సమాధానం చెప్పేలా చట్టంలో మార్పు తెస్తారు.
- లాభదాయకమైన పదవుల జాబితా కింద రాకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.
- 2014లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఆరుగురు పార్లమెంటరీ కార్యదర్శులను తొలగించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొని కొత్తనిబంధనలు తేవాలనే అభిప్రాయానికి మంత్రిమండలి వచ్చినట్లు తెలిసింది.

అన్ని వర్గాలకు సమాన న్యాయం: సీఎం

చట్టసభల్లో ఆంగ్లో ఇండియన్ల ప్రాతినిధ్యం ఉండాలనే రాజ్యాంగ నిబంధన మేరకు ఈ వర్గం నుంచి స్టీఫెన్‌సన్‌ను శాసనసభకు మంత్రిమండలి ఎంపిక చేసింది. సీఎంతో పాటు మహమూద్ అలీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెరాస ప్రభుత్వం అన్ని వర్గాలకు సమాన న్యాయం ప్రాతిపదికన పాలన సాగిస్తోందని, శాసనసభకు సంబంధించిన వ్యవహారాల్లోనూ తెలంగాణలో గంగా జమునా తహజీబ్‌ను కొనసాగించడానికి ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. తాత్కాలిక సభాపతిగా ముస్లిం వర్గానికి చెందిన ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను నియమించామని, ఆంగ్లో ఇండియన్ నామినేటెడ్ సభ్యునిగా క్రైస్తవ మతానికి చెందిన ఎల్విస్ స్టీఫెన్‌సన్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో స్టీఫెన్‌సన్‌ను సీఎం ప్రశంసలతో ముంచెత్తారు. నీతి, నిజాయతీలకు మారుపేరని, రూ.కోట్ల ప్రలోభాలు వచ్చినా చెక్కుచెదరలేదని పేర్కొన్నట్లు సమాచారం.. గతంలో నామినేటెడ్ సభ్యుని నియామకంలో జాప్యం జరిగేదని, వారు కొంత విలువైన పదవీకాలాన్ని కోల్పోయేవారని సీఎం అన్నారు. ఈ సమస్యను నివారించడానికి తమ మొదటి మంత్రిమండలి సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

ఎన్నికల సంఘానికి అభినందనలు

గత డిసెంబర్‌లో శాసనసభ ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించారని.. భారత ఎన్నికల సంఘాన్ని మంత్రిమండలి అభినందించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్, ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా ప్రత్యేకంగా ప్రశంసించింది. దీంతో పాటు పలు పెండింగు అంశాలకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది.

శాసనసభ సమావేశాలకు ఆమోదం

ఈ నెల 17 నుంచి జరగనున్న శాసనసభ సమావేశాలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. శాసనసభకు కొత్తగా ఎంపికైన సభ్యులకు భారత రాజ్యాంగ ప్రతులను.. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో శాసనసభకు సంబంధించిన వివిధ నిబంధనల పుస్తకాలను, బుక్‌లెట్లను, ఇతర సమాచారాన్ని అందివ్వాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రతులను శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు సమర్పించగా...సీఎం, మంత్రి మహమూద్‌అలీ వాటిని పరిశీలించి.. కార్యదర్శిని అభినందించారు.

స్టీఫెన్‌సన్‌కు సీఎం ఫోన్

మంత్రిమండలి సమావేశంలో ఎంపిక అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ స్టీఫెన్‌సన్‌కు స్వయంగా ఫోన్ చేసి ఈ విషయాన్ని చెప్పారు. ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఏది న్యాయం!

న్యాయమనేది ఎప్పుడూ కూడా ఔదార్యంతో ఉండాలి. న్యాయం ఎంత ఔదార్యంగా ఉండాలని మనం అనుకుంటామో.. ఆ ఔదార్యం కూడా అంతే న్యాయంగా ఉండటం అవసరం!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

8–1–2019 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
విదియ: ఉ. 9.45 తదుపరి తదియ
శ్రవణం నక్షత్రం: రా. 10.00 తదుపరి ధనిష్ఠ
అమృతఘడియలు: ఉ.10.29 నుంచి 12.16 వరకు
వర్జ్యం: రా. 2.25 నుంచి 4.12 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.49 నుంచి 9.33 వరకు
తిరిగి రా. 10.49 నుంచి 11.41 వరకు
రాహుకాలం: మ. 3.00 నుంచి 4.30 వరకు
సూర్యోదయం: ఉ.6-37; సూర్యాస్తమయం: సా.5-37

రాష్ట్రంలో పొడి వాతావరణం

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. మంగళ, బుధవారాల్లో సైతం ఇలాగే ఉంటుందని చెప్పారు. రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున అత్యల్పంగా మెదక్‌లో 12, ఆదిలాబాద్, రామగుండంలో 14, హైదరాబాద్‌లో 16 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. పగటిపూట కొన్ని ప్రాంతాల్లో సాధారణంకన్నా 3 డిగ్రీలు పెరిగి 32కు చేరింది. తూర్పు భారతం నుంచి గాలులు వీస్తున్నందున చలి తీవ్రత కాస్త తగ్గింది. మరో 3 రోజుల తరవాత తిరిగి చలి పెరిగే అవకాశాలున్నాయి.

కాళేశ్వరం సామర్థ్యం పెంపు

(మొదటి పేజీ తరువాయి)

చురుగ్గా జరుగుతున్నాయి.

అదనపు మోటార్లు, పంపుల ఏర్పాటు పని గుత్తేదారుకు!

మరో టీఎంసీ నీటి మళ్లింపునకు అవసరమైన అదనపు మోటార్లు, పంపులు ఏర్పాటు చేసే పనిని కూడా గుత్తేదారుకు అప్పగించాలని నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఎల్లంపల్లి నుంచి సొరంగమార్గాలు, లిఫ్టుల ద్వారా వరద కాలువలోకి ఎత్తిపోసిన తర్వాత శ్రీరాంసాగర్ ఆయకట్టు అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఒక టీఎంసీ నీటిని మళ్లించేలా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ పనులను మార్చి ఆఖరుకు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనుల య్యాక, నీటిని మళ్లించే సమయానికి పునరుజ్జీవ పథకం పనులూ పూర్తయితే ఎస్సారెస్పీ ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేయవచ్చు. ఈ పథకానికి ఒక టీఎంసీ నీటిని మళ్లిస్తే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అవసరాలకు రోజూ ఒక టీఎంసీ సరిపోదు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపుర, గంధమల తదితర రిజర్వాయర్ల నిర్మాణ పనులు, ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనులు పూర్తయ్యేలోగా మరో టీఎంసీ నీటిని మేడిగడ్డ నుంచి మళ్లించేలా పనులను పూర్తి చేయాల్సి ఉంది. దీంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద మూడు టీఎంసీల నీటిని మళ్లించడానికి అవసరమైన మోటార్లు ఏర్పాటు చేసేలా కాంక్రీటు నిర్మాణాలను ప్రభుత్వం గతంలోనే గుత్తేదారుకు అప్పగించింది. ఈ పనులు జరుగుతున్నాయి.

40 మెగావాట్ల సామర్థ్యంతో..

మేడిగడ్డ వద్ద ప్రస్తుతం 11 పంపులు, మోటార్లు ఒక్కొక్కటి 40 మెగావాట్ల సామర్థ్యంతో అమర్చుతున్నారు. ఈ మోటార్ల ద్వారా రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చు. ఇప్పుడు మరో టీఎంసీని ఎత్తిపోయడానికి అదనంగా ఆరు మోటార్లు, పంపులు అమర్చాల్సి ఉంటుంది. అన్నారం వద్ద ప్రస్తుతం ఎనిమిది ఉండగా, అదనంగా నాలుగు, సుందిళ్ల వద్ద తొమ్మిది ఉండగా, అదనంగా ఐదు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎల్లంపల్లి బ్యారేజి వెనక భాగం నుంచి సొరంగమార్గం ద్వారా నీటిని మళ్లించడం, పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి మరో సొరంగ మార్గంలో పోయడం, ఈ సొరంగమార్గం నుంచి మరో పంప్‌హౌస్ ద్వారా కాలువలోకి ఎత్తిపోయడం, సుమారు 5 కి.మీ. కాలువ ద్వారా శ్రీరాంసాగర్ వరదకాలువతో అనుసంధానం చేసి మధ్యమానేరుకు పంపేలా పనులు జరుగుతున్నాయి. ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు మధ్య రెండు సొరంగమార్గాలు తవ్వారు. వీటిని ఉపయోగించుకొని మరో టీఎంసీ నీటిని మళ్లించడం సాధ్యం కాదు. దీంతో ఎల్లంపల్లి నుంచి మరో సొరంగ మార్గం ద్వారా పత్తిపాక రిజర్వాయర్‌కు నీటిని మళ్లించి, అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా వరద కాలువలో కలుపుతారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం గతంలో ప్రతిపాదనలో ఉండగా, పునరాకృతిలో భాగంగా దీన్ని పక్కనపెట్టారు. ప్రస్తుతం పత్తిపాక రిజర్వాయర్ అవసరం అవుతుందా? లేక నిర్మాణంలో ఉన్న మేడారం రిజర్వాయర్‌ను ఉపయోగించుకోవచ్చా? అన్నది సర్వే తర్వాత తెలుతుందని సంబంధిత ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి.

కొత్తగా 15 కి.మీ.ల సొరంగమార్గం

కాళేశ్వరం ప్రాజెక్టు సామర్థ్యం పెంపు కోసం ఎల్లంపల్లి నుంచి సుమారు 15 కి.మీ. దూరం కొత్త సొరంగమార్గం తవ్వాల్సి ఉంటుందని అంచనా. వరద కాలువలో అదనంగా పంపే ఒక టీఎంసీలో 0.16 టీఎంసీని కాకతీయ కాలువకు ఇవ్వాలనే ప్రతిపాదన కూడా ఉంది. ఇంజినీర్లు సర్వే పూర్తి చేసిన తర్వాత, ఎల్లంపల్లి నుంచి దిగువకు నీటి ప్రవాహ మార్గంపై మరింత స్పష్టత రానుంది. మొత్తంమీద కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ వద్ద నుంచి రోజుకు మూడు టీఎంసీల చొప్పున 270 టీఎంసీల నీటిని మళ్లించే అవకాశం ఉంది.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	12.0	32.9
గుంటూరు	12.9	30.6
ఖమ్మం	13.0	32.0
ఆదిలాబాద్	14.0	29.9
హన్మకొండ	14.0	29.0
కడప	14.0	33.0
రామగుండం	14.0	28.0
కరీంనగర్	15.0	29.0
విశాఖపట్నం	15.4	28.8
అనంతపురం	15.6	31.4
హైదరాబాద్	16.0	29.7
నల్గొండ	16.0	29.0
తిరుపతి	16.4	31.0
మహబూబ్‌నగర్	16.5	32.2
కర్నూలు	16.6	32.7
నిజామాబాద్	16.7	31.6
విజయవాడ	16.9	29.7
సూర్యాపేట	17.0	30.0

దిల్లీ ఏలికలను తేల్చేది తెలంగాణ ప్రజలే

- పార్లమెంటు ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలి
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- తెరాసలో చేరిన నాగార్జునసాగర్, రామగుండం ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీల నేతలు

ఈనాడు - హైదరాబాద్

వచ్చే మేలో దిల్లీ పీఠంపై ఎవరుండాలో తెలంగాణయే నిర్ణయించేలా ప్రజలు ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. శాసనసభ ఎన్నికల్లో చూపించిన స్ఫూర్తిని పార్లమెంటు ఎన్నికల్లోనూ కొనసాగించాలని, కేసీఆర్ సారథ్యంలోని తెరాసను 16 స్థానాల్లో గెలిపించాలన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్, తెదేపా, వామపక్షాలకు చెందిన నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య నాయకత్వంలో.. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నేతృత్వంలో ఆయన అనుచరులు సోమవారం తెలంగాణభవన్‌లో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో తెరాసలో చేరారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పార్టీ ప్రధాన కార్యదర్శి సత్యవతిరాథోడ్, ప్రభుత్వ సలహాదారు వివేక్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ తదితర నేతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. 'ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన 273 స్థానాలు ఇటు భాజపాకి, అటు కాంగ్రెస్‌కు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రాంతీయ పార్టీలే కేంద్రంలో పాగా వేస్తాయి. తెరాస నేతలు, కార్యకర్తలు.. పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు ఎన్నికల వరకు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి. నల్గొండలో తెరాసయే నైతికంగా అన్ని స్థానాలు గెలుచుకుంది. ట్రక్కు గుర్తు వల్లే నకిరేకల్, హుజూర్‌నగర్‌లలో ఓడాం.

మొన్నటి ఎన్నికల ప్రచారంలో తండావాసులు జానారెడ్డిని నిలదీశారు. ఆయన ఓటమిలో 76 తండాలు ప్రముఖ పాత్ర వహించాయి. మిషన్ భగీరథ వచ్చే నెలలో పూర్తి అవుతుంది హాలియా,నందికొండ మున్సిపాలిటీలకు నిధులిచ్చి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడతా. నెల్లికల్లు లిఫ్ట్ పథకం వస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో వీలయినన్ని ఏకగ్రీవం అయ్యేందుకు పార్టీ నాయకులు ప్రయత్నించాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

సోమారపు, చందర్ కలిసి పనిచేయాలి

రామగుండం నేతలు తెరాసలో చేరిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 'చందర్ కేసీఆర్ శిష్యుడు. ఉద్యమంలో ముందున్నారు. కొన్ని కారణాల వల్ల రామగుండంలో టికెట్ రాక స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అక్కడ తెరాస అభ్యర్థి సోమారపు ఓడిపోయినా... చందర్ గెలవడం ఆనందంగా ఉంది. చందర్‌కు సతీవియోగం బాధ కలిగించింది. తన భర్త ఎమ్మెల్యేగా గెలవాలనే ఆమె కోరిక నెరవేరింది. సోమారపు సత్యనారాయణ కేసీఆర్‌కు సన్నిహితుడు. చందర్ ఆయన సలహాలు తీసుకోవాలి. కలిసి పనిచేయాలి. రామగుండంలో చందర్, సోమారపులకు కలిపితే లక్ష ఓట్లు వచ్చాయి. పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ లక్ష ఓట్లు దాటాలి. రామగుండంలో మెడికల్, మైనింగు కళాశాలలను ఏర్పాటు చేస్తామని కేసీఆర్ చెప్పారు. త్వరలో హామీ నిలబెట్టుకుంటాం. చందర్ నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది. ఆయనకు భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయి. మీ నియోజక వర్గ బాధ్యతలు నేను వ్యక్తిగతంగా తీసుకుంటా' అని కేటీఆర్ తెలిపారు. తన మాతృసంస్థలోకి మళ్లీ చేరుతున్నందుకు ఆనందంగా ఉందని చందర్ భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకోగా కేటీఆర్ ఆయనను ఓదార్చారు. సోమారపు మాట్లాడుతూ.. తాను ఓడినా బాధ లేదని, తెరాసకే చెందిన చందర్ గెలవటం సంతోషంగా ఉందన్నారు. వివేక్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చందర్ చురుకుగా పాల్గొన్నారని, సింగరేణి ఎన్నికల్లోనూ చందర్ పార్టీని గెలిపించారని పేర్కొన్నారు.



పోలియో వ్యాధిగ్రస్తుడైన శివసాయితో కేటీఆర్, ఎమ్మెల్యే చందర్

శివసాయికి సత్వరమే చికిత్స

కేటీఆర్ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: పోలియో వ్యాధితో రెండు కాళ్లు దెబ్బతిన్న రామగుండం నియోజకవర్గానికి చెందిన బాలుడు శివసాయిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలని కేటీఆర్ ఆదేశించారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి శివసాయి సోమవారం తెలంగాణభవన్‌కు వచ్చి కేటీఆర్‌ను కలిశారు. అతని దీనస్థితి చూసి చలించిన ఆయన వెంటనే స్పందించారు. గ్రేటర్ హైదరాబాద్ నేత కట్టెల శ్రీనివాస్ యాదవ్‌ని పిలిచి బాలుడిని ఆసుపత్రిలో చేర్చాలని సూచించారు. బాలుని వైద్యానికయ్యే ఖర్చును భరిస్తానంటూ అభయమిచ్చారు.



తెలంగాణ విద్యుత్తు ఇంజినీర్స్ అసోసియేషన్ దైనందినిని ఆవిష్కరిస్తున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, సంఘం నేతలు రవి, శివాజీ, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు

విద్యుత్తు రంగానికి పెను సవాళ్లు

వాటిని తట్టుకొని నిలదొక్కుకోవాలి: కేటీఆర్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు రంగం భవిష్యత్తులో పెనుసవాళ్లను ఎదుర్కోనుందని.. వాటిని తట్టుకొని నిలదొక్కుకోవాల్సిన అవసరముందని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. కాలానుగుణంగా ప్రైవేటు డిస్కమ్‌లను తలదన్నేలా విద్యుత్తు సంస్థలు రాణించాలన్నారు. తెలంగాణ విద్యుత్తు ఇంజినీర్ల సంఘం నూతన సంవత్సర దైనందిని, కాలమానినిలను సోమవారమిక్కడ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే వి.శ్రీనివాస్‌గౌడ్, పలువురు సీఎండీలు, డైరెక్టర్లు, సంఘం నేతలతో కలిసి కేటీఆర్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు శివాజీ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎండీ కార్యదక్షత, ఉద్యోగుల సమర్థత, సీఎం దార్శనికతతోనే ప్రస్తుతం 24 గంటల విద్యుత్ సాధ్యమవుతోందన్నారు. అయినా పెను సవాళ్లు ముందున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. డిమాండ్ పెరిగే కొద్దీ 24 గంటలు ఇవ్వడమే కాదు.. తుపాను వచ్చినా కరెంటు పోకుండా సరఫరా చేసినప్పుడే విజయం సాధించినట్లన్నారు.

వారానికి ఒక రోజు చేనేత వస్త్రాలు ధరిస్తామని విద్యుత్తు ఇంజినీర్లు కేటీఆర్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు.

మంత్రివర్గ విస్తరణ కోసం ఏర్పాట్లు

సాధారణ పరిపాలన శాఖకు ప్రభుత్వ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కోసం ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖకు సూచించింది. ఈ నెల మూడో వారంలో విస్తరణకు అవకాశం ఉందని పేర్కొంటూ దీనికి అనుగుణంగా సన్నద్ధం కావాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. రాజ్‌భవన్‌లో మంత్రుల ప్రమాణ స్వీకారం జరుగుతున్నా దీనికి ఏర్పాట్లు జీఏడీనే నిర్వహిస్తుంది. వేదిక, ప్రాంగణ అలంకారం, ఆహ్వాన పత్రికలను ముద్రించి పంపిణీ చేయడం వంటివి జీఏడీ ద్వారానే జరుగుతాయి. మంత్రివర్గ విస్తరణ ఈ నెల 18న జరుగుతుందనే సంకేతాల నేపథ్యంలో దీనికి అనుగుణంగా ప్రభుత్వం జీఏడీకి సూచనలు ఇచ్చినట్లుగా సమాచారం.

గర్భిణిపై అమానుష దాడి

- గర్భస్రావంతో మాతృ హృదయ నిర్వేదం

ఇల్లెందు సాంస్కృతికం, కొత్తగూడెం పట్టణం- న్యూస్‌టుడే: ఈ దుర్యోధన దుశ్శాసన దుర్నీతి లోకంలో.. ఇది ఓ పాట మాత్రమే కాదు.. నేటి సభ్య సమాజంలో కళ్ల ముందు జరుగుతున్న నిజం కూడా. ఏ పాపం తెలియని ఓ గర్భిణి. ఓ మానవ మృగ దుశ్చర్యకు తన ఆర్నెల్ల గర్భాన్ని కోల్పోయింది. టేకులపల్లి మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మద్దిరాల తండాలో సోమవారం బాదావత్ పద్మ అనే గర్భిణిపై అమానవీయ ఘటన జరిగింది.

ఈ నెల 3న తన కుమార్తెలు మేఘనశ్రీ, అభిలను తల్లి పద్మ అంగన్‌వాడీ కేంద్రానికి పంపింది. మేఘన ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నప్పటికీ పాఠశాల లేకపోవడంతో చెల్లితో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. కేంద్రంలో ఆ రోజు ఆయా లీలావతి మాత్రమే ఉంది. మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలకు దూరంగా మేఘనశ్రీని కూర్చోమని లీలావతి ఆదేశించింది. ఈ విషయాన్ని మేఘనశ్రీ తల్లి పద్మకు చెప్పింది. తన కుమార్తెను ఎందుకు దూరంగా కూర్చోబెట్టావంటూ ఆయాను అడగటంతో పాటు అంగన్‌వాడీ టీచరు జ్యోతికి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో ఆయా తన భర్త వీరూకు ఈ విషయమంతా తెలిపింది. దీంతో ఆవేశంగా కేంద్రానికొచ్చిన వీరూ సభ్యత మర్చిపోయి పద్మపై దాడికి దిగి తలపై కొట్టాడు. అంతటితో ఆగకుండా గర్భిణి అన్న కనికరం లేకుండా కిందపడేసి కడుపు మీద కాలితో తొక్కాడు. పద్మకు గర్భస్రావం కావడంతో చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. ఆమె గర్భంలో చనిపోయిన శిశువును వైద్యులు బయటికి తీశారు. మృత శిశువును చూసి అంతా కన్నీళ్ల పర్యంతమయ్యారు. పద్మ ఆరోగ్య పరిస్థితి మెరుగవ్వడంతో ఇంటికి తీసుకెళ్లారు. అంగన్‌వాడీ ఆయా లీలావతి, భర్త వీరూని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పద్మ

మంత్రివర్గ విస్తరణపై సీఎం కసరత్తు

- రెండు రోజులుగా అధ్యయనం

ఈనాడు - హైదరాబాద్

మంత్రివర్గ విస్తరణకు సిద్ధమవుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సామాజిక సమీకరణాలపై దృష్టి సారించారు. దీనికి అనుగుణంగా కసరత్తు చేస్తున్నారు. ఇటీవలి ఎన్నికల్లో గెలిచిన శాసనసభ్యుల జాబితాపై రెండు రోజులుగా అధ్యయనం చేస్తున్నారు. గత మంత్రివర్గంలో 18 స్థానాలకు గాను 11 ఓసీలు, నాలుగు బీసీలు, ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలలో ఒక్కొక్కరికి అవకాశం కల్పించారు. ఈసారి కూర్పులో ఎలాంటి ప్రామాణికాలను పాటించాలనే అంశంపై ఆయన ఆలోచిస్తున్నారు. గత నెల 13న మంత్రివర్గ ఏర్పాటు సమయంలో సీఎం, మైనారిటీ వర్గానికి చెందిన మహమూద్‌అలీతో ప్రమాణ స్వీకారం చేశారు. మైనారిటీ కోటా భర్తీ అయినట్లే. ఎస్సీ, ఎస్టీ, బీసీ కోటాతో పాటు మహిళా కోటా కూడా భర్తీ కావాల్సి ఉంది. ఈ నెల 18న జరుగుతుందని భావిస్తున్న మంత్రివర్గ విస్తరణలో మరో ఎనిమిది మందిని తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. ఈ దఫాలోనే ఎస్సీ,ఎస్టీ,మహిళా కోటాతో పాటు బీసీ కోటా కింద మంత్రుల నియామకం ఖాయమంటున్నారు. ఎస్సీ,ఎస్టీ, మహిళా కోటాలో ఒక్కొక్కరికి, బీసీ కోటాలో మాత్రం ఇద్దరికి అవకాశం వస్తుందని, మిగిలిన మూడు స్థానాలు ఓసీలకు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. తెరాస తరఫున 88 మంది ఎమ్మెల్యేలుగా గెలిచారు. అనంతరం ఇద్దరు స్వతంత్రులు చేరడంతో పార్టీ బలం 90కు చేరుకుంది. ఈ ఎమ్మెల్యేల్లో బీసీలు 20 మంది, ఎస్సీలు 16 మంది, ఎస్టీలు అయిదుగురు, ఒక మైనారిటీ, మహిళలు ముగ్గురు (ఓసీ ఇద్దరు, ఎస్టీ ఒక్కరు)న్నారు.

పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెట్టండి

'మంత్రివర్గ విస్తరణ నాకు వదిలేయండి.. మంత్రి పదవుల కోసం మీరు ఎవరూ నియోజకవర్గాలను వదిలి ఇక్కడికి రావద్దు. పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించండి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ తెరాస ఎమ్మెల్యేలను ఆదేశించారు. ఆది, సోమవారం కొంత మంది శాసనసభ్యులు ఆయనను కలిసినప్పుడు ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. తన వద్దకు కొంత మంది ఎమ్మెల్యేలు వచ్చినప్పుడు వారి సమస్యలు గురించి సీఎం ఆరా తీస్తున్నారు. ముఖ్యమైన అంశాలుంటే వారితో చర్చిస్తున్నారు. మర్యాదపూర్వకంగా భేటీకి వచ్చిన వారితో పంచాయతీ ఎన్నికల గురించి మాట్లాడి... నేరుగా నియోజకవర్గాలకు వెళ్లాలని సూచిస్తున్నారని తెలిసింది. పంచాయతీ ఎన్నికలు చాలా కీలకమైనవని, మొత్తం అన్ని స్థానాల్లో పార్టీ మద్దతుదారులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని చెబుతున్నారు.

కోలుకుంటున్న అమెరికా కాల్పుల బాధితుడు సాయికృష్ణ

- ప్రమాదంపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా
- అన్ని విధాలా సహకరిస్తామని హామీ
- సుష్మాస్వరాజ్‌ను కలిసిన ఎంపీ సీతారాంనాయక్



చికిత్స పొందుతున్న సాయికృష్ణ

ఈనాడు డిజిటల్, మహబూబాబాద్: అమెరికాలోని మిషిగన్ రాష్ట్రం డెట్రాయిట్ నగరంలో గుర్తు తెలియని దుండగుడి కాల్పుల్లో గాయపడిన మహబూబాబాద్ పట్టణ వాసి పూస సాయికృష్ణ కోలుకుంటున్నాడు. ఈ నెల మూడో తేదీన కాల్పుల ఘటన జరగగా తీవ్రంగా గాయపడిన సాయికృష్ణను అక్కడి ట్రాఫిక్ పోలీసులు హెన్రీఫోర్డ్ ఆస్పత్రిలో చేర్చారు. 'తమ కుమారుడు క్రమంగా కోలుకుంటున్నట్టు అతని స్నేహితులు తెలిపారని' బాధితుని తండ్రి ఎల్లయ్య సోమవారం తెలిపారు. మిత్రులే అతని యోగక్షేమాలు చూసుకుంటున్నట్టు చెప్పారు. అమెరికాకు వెళ్లేందుకు వీసాలు సిద్ధం చేసుకుంటున్నామని వెల్లడించారు. ఇదిలా ఉంటే బాధితుని వైద్యానికి అవసరమైన డబ్బు సేకరించేందుకు గానూ స్నేహితులు నాగేందర్, వినోద్ 'సపోర్ట్ సాయికృష్ణ' అనే పిలుపుతో 'గోఫండ్‌మీ.కామ్' అనే వెబ్‌సైట్ ద్వారా నిధులు సేకరిస్తున్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్

మొదటి రోజు పేపర్-2 పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ పరీక్షలు అయిదు రోజులపాటు జరగనుండగా మొదటిరోజు ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పేపర్-2 ఉంటుంది. గణితం, ఆప్టిట్యూడ్ ప్రశ్నలను ఆన్‌లైన్(కంప్యూటర్)లో నిర్వహిస్తారు. డ్రాయింగ్‌కు మాత్రం రాత(ఆఫ్‌లైన్) పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా సుమారు 1.50 లక్షల మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 20 వేల మంది హాజరుకావొచ్చని అంచనా. పేపర్-2ను ఉదయం నిర్వహిస్తారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుంది. 8.30 గంటల తర్వాత అనుమతించరు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతోపాటు ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలద్వారా అక్రమాలకు పాల్పడకుండా జామర్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపటి నుంచి 4 రోజులపాటు పేపర్-1 పరీక్షలు

బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్ పేపర్-1 రాయాల్సి ఉండగా ఈ నెల 9వ తేదీ నుంచి 12 వరకు నాలుగు రోజులపాటు.. రోజుకు రెండు విడతలుగా ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలకు సుమారు 9.50 లక్షల మంది దరఖాస్తు చేశారు. వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 1.50 లక్షల మంది హాజరవుతారు. పేపర్-1 ఉదయం 9.30-12.30 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 2.30-5.30 గంటల వరకు రెండు దఫాలు నిర్వహిస్తారు.

ఇద్దరిపై పీడీ చట్టం

గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సోమవారం తాజాగా గంజాయి అక్రమ రవాణా చేసే ఇద్దరిపై పీడీ చట్టాన్ని ప్రయోగించారు. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కామెర శ్యామ్(48), పాలకుర్తి మండలం కుక్కలగూడూరుకు చెందిన నలిమెల వినోద్(25)లపై పీడీ చట్టం అమలు చేస్తు జారీ చేసిన ఆదేశాల పత్రాలను కరీంనగర్ జైల్లో ఉన్న వారికి అందజేశారు.

వచ్చి ఇరుక్కున్నాం చచ్చి బతుకుతున్నాం

- ఇరాక్‌లో చిక్కుకున్న నిజామాబాద్ జిల్లా వాసులు
- నకిలీ ఏజెంట్లను నమ్మి నాలుగు నెలలుగా అవస్థలు
- దుర్భర పరిస్థితుల మధ్య పస్తులుంటూ అగచాట్లు

కనుచూపుమేర జన సంచారం లేని ప్రాంతం. పైగా చీకటి గది. తినడానికి తిండి లేదు. తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకవు. పైపెచ్చు సమీపంలోనే బాంబుల మోతలు. ఓ మనిషి మానసికంగా కుంగిపోవడానికి ఇంతకన్నా దుర్భర పరిస్థితులు అక్కర్లేదు. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే ఉన్నారు ఏజెంట్ల మోసానికి బలై ఇరాక్‌లో చిక్కుకున్న నిజామాబాద్ జిల్లా వాసులు. కొన్ని రోజులుగా బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్న వాళ్లు ఎలాగైనా తమను స్వదేశానికి తీసుకెళ్లమంటూ కన్నీళ్లపర్యంతమవుతూ వీడియో సందేశం పంపడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఉపాధి కోసం గల్ఫ్ దేశాల బాటపట్టి పరాయి గడ్డపై అగచాట్లు పడుతున్న తెలంగాణ వాసుల సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. తాజాగా నిజామాబాద్ జిల్లా నుంచి ఇరాక్‌కు వెళ్లిన పదకొండు మంది అక్కడ చిక్కుకున్నారు. నాలుగు నెలల క్రితం వెళ్లిన వాళ్లు 'ప్రస్తుతం తాము ప్రమాదకర ప్రదేశానికి దగ్గరలో ఓ గదిలో ఉన్నట్లు' కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. "అక్కడి ఏజెంట్లు తమ పాస్‌పోర్టులు లాక్కున్నారని, రహస్య జీవనం సాగిస్తూ ఉపాధి లేక పస్తులుంటున్నామని' పేర్కొంటూ వీడియో సందేశం పంపారు. బాధిత కుటుంబ సభ్యులు ఈ మేరకు సోమవారం జిల్లా అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమ గోడు వెళ్లబోసుకున్నారు.

'తమ వాళ్లు అప్పు చేసి ఏజెంట్లకు రూ.లక్షలు ముట్టజెప్పి మరీ అక్కడికి వెళ్లారు. ఏజెంట్లు పని చూపించకుండా వాళ్లను గాలికి వదిలేశారు. వాళ్లంతా అక్కడి చట్టాలకు భయపడి, ఎవరికీ కనిపించకుండా, విద్యుత్తు సౌకర్యం కూడా లేని గదిలో నానా బాధలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి వారిని స్వదేశానికి రప్పించాలి' అని వేడుకున్నారు. ఈ విషయమై తెలంగాణ ఎన్ఆర్ఐ విభాగం అధికారి చిట్టిబాబుతో 'ఈనాడు' మాట్లాడగా బాధితుల తరఫున ఇరాక్ రాయబార కార్యాలయానికి లేఖ రాస్తామని వెల్లడించారు. విషయాన్ని భారత ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. బాధితులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని గల్ఫ్ బాధితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బసంత్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.



ఇరాక్‌లో చిక్కుకున్న బాధితులు

బాధితులు వీరే

- రాజు, శ్రీరాం- దర్పల్లి మండలం, రామడుగు
- లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, గంగారెడ్డి-కొండూరు
- కృష్ణ, గంగన్న- నగేపూర్
- రాజేందర్, సాయన్న- కోరట్‌పల్లి
- రాజేశ్వర్ - కోనసముందర్
- భూమేష్- బజార్ కొత్తూరు



ఇరాక్‌లో చిక్కుకున్న తమ వారిని విడిపించాలంటూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధిత కుటుంబాల సభ్యులు

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నాం

- వీడియో సందేశంలో బాధితుల ఆవేదన

సెప్టెంబరు ఏడో తేదీ ఇరాక్‌కు వచ్చాం. ఇక్కడున్న ఏజెంట్, నిజామాబాద్‌కే చెందిన విజయ్ చారి మమ్మల్ని మోసగించాడు. అప్పట్నుంచి ఏ పని ఇప్పించలేదు. తొలుత కొన్నిరోజులు ఓ గదిలో ఉంచాడు. తర్వాత నకిలీ పాస్‌పోర్టులతో దొంగచాటుగా చెక్‌పోస్టులు దాటిస్తూ మమ్మల్ని బాగ్దాద్ తీసుకెళ్లాడు. ఓ గదిలో ఉంచాడు. మరింత సొమ్ము ఇస్తే పని ఇప్పిస్తానని నమ్మించాడు. ఇంటి నుంచి తెప్పించుకున్న రూ.50 వేలు కూడా తీసుకుని పరారయ్యాడు. సమీపంలో బాంబులు పడిన శబ్దాల మధ్య బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం. నందిపేట మండలం చాపూర్ గ్రామానికి చెందిన బండ్ల నరేందర్ మమ్మల్ని ఇక్కడికి పంపాడు. అందుకుగానూ రూ.1.30 లక్షలు తీసుకున్నాడు. దయచేసి మమ్మల్ని స్వదేశానికి తీసుకెళ్లండి.

- ఈనాడు, నిజామాబాద్

పల్లె ఘొల్లుమంటోంది!

తమిళనాడు ప్రమాదంతో మెదక్ జిల్లాలోని ఐదు పల్లెల్లో విషాద ఛాయలు • నేడు గ్రామాలకు చేరుకోనున్న మృతదేహాలు

ఏ పల్లెలో చూసినా విషాద ఛాయలే. ఎవర్ని కదిలించినా కన్నీటి ధారలే. ఎటువైపు విన్నా నిట్టూర్పులే. మాటలు గొంతు దాటడం లేదు. రోదనలు ఆగడం లేదు. చేతికి అందివచ్చిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లిపోయాడన్న ఆక్రోశంలో ఓ తండ్రి. కుటుంబ పెద్ద దూరమై ఇద్దరు పిల్లల భవిష్యత్తు అంధకారమైందన్న ఆవేదనలో మరో ఇల్లాలు. కుమారుడి పెళ్లి అంగరంగ వైభవంగా చేసినట్టు కన్న కలలన్నీ కల్లలైన నైరాశ్యంలో ఓ తల్లి. ఇవీ తమిళనాడులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ వాళ్లను కోల్పోయిన గ్రామాల్లో సోమవారం కన్పించిన దృశ్యాలు. తమ వాళ్ల ఆఖరిచూపుల కోసం ఎదురుచూస్తూ బాధిత కుటుంబాలు రోదిస్తుంటే చూసితట్టుకోలేక పల్లెలు కన్నీరు కారుస్తున్నాయి.

నర్సాపూర్, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం పుదుకోట్టై సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లా నర్సాపూర్, హత్నూర మండలాల పరిధి ఖాజీపేట, రెడ్డిపల్లి, మంతూరు, చిన్నచింతకుంట, మంగాపూర్ గ్రామాలకు చెందిన పది మంది అయ్యప్పభక్తులు మరణించగా, ఐదురుగు గాయపడిన విషయం విదితమే. మృతదేహాలను తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మంగళవారం ఉదయానికి తాము మెదక్‌కు చేరుకునే అవకాశం ఉందని పుదుకోట్టైలో ఉన్న నర్సాపూర్ తహసీల్దారు భిక్షపతి, సీఐ సైదులు, తెరాస నేత మురళీయాదవ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అంబులెన్సుల్లో మృతదేహాలను తీసుకొస్తున్నట్టు చెప్పారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భూమాగౌడ్, రాజు, శ్రీశైలం పుదుకోట్టై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వెంకటేశ్‌ను మెరుగైన వైద్య సేవల నిమిత్తం తంజావూరు ఆసుపత్రికి తరలించామని వెల్లడించారు. స్వల్పంగా గాయపడిన నరేశ్‌గౌడ్‌ను తమతోపాటు తీసుకొస్తామని తెలిపారు.

మూగబోయిన సన్నిధానం

ప్రమాదంలో మరణించిన ఖాజీపేటకు చెందిన నాగరాజుగౌడ్ గురుస్వామి. ఆయన అయ్యప్ప స్వాముల నిత్య పూజ కోసం తన ఇంటి పైగదిలో సన్నిధానం ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం పూజలు, భజనలతో ఆ ప్రాంతం సందడిగా ఉండేది. ఈ నెల 2న నాగరాజుగౌడ్ శిష్య బృందంతో కలిసి శబరిమలకు బయల్దేరగా.. గ్రామంలోని మిగిలిన స్వాములు అక్కడే పూజలు చేస్తూ వస్తున్నారు. ఆయన మృతితో ఆ సన్నిధానం ప్రస్తుతం మూగబోయింది. "గురుస్వామిగా అందరికీ సుపరిచితుడైన తన కుమారుడికి అయ్యప్ప పాటలన్నా, భజనలన్నా ఎంతో ఇష్టమని' తండ్రి రామాగౌడ్ విలపించారు. ఆయనతోపాటు రోజూ పూజల్లో భాగస్వాములయ్యే భార్య లక్ష్మి, ఎనిమిదో తరగతి చదువుతున్న కుమార్తె లత, ఏడో తరగతి చదువుతున్న చరణ్‌లను ఓదార్చడం కష్టసాధ్యమవుతోంది.

మృతులకు సంతాపంగా నర్సాపూర్ పట్టణంతోపాటు ఖాజీపేట, రెడ్డిపల్లి, మంతూరు, చిన్నచింతకుంట గ్రామాల్లో స్థానికులు సోమవారం ర్యాలీలు నిర్వహించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న బంధువులు, సంబంధీకులు తరలివస్తుండటంతో ఆయా పల్లెల్లో విషాద వాతావరణం నెలకొంది.



చిన్నచింతకుంటలో మృతుడు ప్రవీణ్‌గౌడ్ ఇంటి ఎదుట విలపిస్తున్న బంధువులు

ఈనాడు

విరాట్ చరిత్ర

'గర్వంగా ఉంది... ఇది నా అతిపెద్ద విజయం!'- నిన్న సిడ్నీ టెస్ట్ ముగిశాక భారత జట్టు సారథి విరాట్ కోహ్లి స్పందించిన తీరిది. ఒకప్పుడు ఊహకైనా అందనిది, దశాబ్దాలుగా అసాధ్యమై ఊరించినదాన్ని సాకారం చేసిన అతడి నాయకత్వ ప్రజ్ఞకిప్పుడు యావత్ క్రీడాభారతం గర్విస్తోంది! ఆస్ట్రేలియాతో ఇండియా టెస్ట్ క్రికెట్ ఆడటం ఆరంభించింది 1947లో. నాటి అయిదు పోటీల పరంపరలో 0-4తో తల బొప్పికట్టిన భారత జట్టుకు దరిమిలా ఇంకో ఏడుమార్లు భంగపాటు ఎదురైంది. ముమ్మార్లు ఇరుజట్లూ సమానంగా నిలిచాయే తప్ప బలిష్ఠ ఆసీస్‌ను వారి గడ్డపైనే కంగు తినిపించడమన్నది ఏడు దశాబ్దాల తరబడి ఎండమావినే తలపించింది. ప్రస్తుత పరంపరలో అడిలైడ్ టెస్టును ఖాతాలో వేసుకున్న కోహ్లి సేన, పెర్త్‌లో చతికిలపడింది. ఆపై మెల్‌బోర్న్‌లో గెలుపుతో ఆధిక్యం సాధించిన విరాట్ బృందం సిడ్నీలోనూ పట్టు సడలనివ్వకపోయినా- ఆటకు వర్షం అడ్డంకులు ఏర్పరచింది. లేదంటే 3-1 తేడాతో అద్భుత రికార్డు భారత జట్టుకు పాదాక్రాంతమయ్యేదే! రెండేళ్ల క్రితం ఆస్ట్రేలియా బృందం ఇక్కడ పర్యటించినప్పుడూ వారిని కోహ్లి దళం 2-1 తేడాతో ఓడించింది. దానితో పోలిస్తే, గణాంకాల్లో మార్పు లేకపోయినా- ఆసీస్‌ను వారి సొంతగడ్డ మీద ఇలా పరాజయం పాల్జేయడం క్రీడాభిమానులు, విశ్లేషకుల స్మృతిపథంలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. ఏనాడో మూడు దశాబ్దాల క్రితం ఇంగ్లాండ్ జట్టు ఆసీస్ శ్రేణుల్ని కకావికలం చేసి 'ఫాలో ఆన్'(ఒక జట్టు వరసగా రెండోసారి బ్యాటింగ్‌కు దిగాల్సి రావడం) ఆడించింది. ఇన్నేళ్లకు మళ్ళీ అటువంటి అవమానకర పరిస్థితిని ఆస్ట్రేలియాకు కల్పించిన ఘనత కోహ్లి సేనకే దఖలుపడింది. చరిత్రాత్మక సిరీస్ సాధనలో ఇండియా తిరుగులేని ఆధిక్యానికి దర్పణం పట్టిన ఘట్టమిది!


ఆసీస్ కొత్తతరం క్రికెట్ ఆడుతుంటే ఇండియా ఇంకా సంప్రదాయ పద్ధతికే పరిమితమైందంటూ పదేళ్ల క్రితం ఆ జట్టు సారథిగా రికీ పాంటింగ్ నోరు పారేసుకున్నాడు. నవ్విన నాపచేనే పండిందన్న సామెత చందంగా, దుర్బలమైనదని ఎగతాళికి గురైన టీమిండియా చేతుల్లోనే 'దుర్భేద్య శక్తి'కి తల తిరిగి ముద్ద నోట్లోకి వచ్చింది నేడు! విరాట్ కోహ్లి సారథ్య బాధ్యతలు చేపట్టాక విదేశీ గడ్డపై సాధించిన సిరీస్ విజయాల్లో ఇది నాలుగోది. వెస్టిండీస్‌లో ఒకటి, శ్రీలంకపై రెండు పరంపరల్ని గెలిచిన జట్టు ఆస్ట్రేలియాలో తొలిసారి నెగ్గిన తీరు ఎన్నో విధాల శ్లాఘనీయమైంది. చెతేశ్వర్ పుజారాతోపాటు మయాంక్ అగర్వాల్, రిషభ్ పంత్ వంటి యువకిశోరాల బ్యాటింగ్ మెరుపులు; బుమ్రా, షమి, ఇషాంత్ ప్రభృతుల పదునైన బౌలింగ్ దాడులు ప్రత్యర్థి పతనాన్ని శాసించాయి. మితిమీరిన ఆత్మవిశ్వాసం పనికిరాదన్న హెచ్చరిక, వైరిని ఎన్నడూ తక్కువ అంచనా వేయరాదన్న సందేశం- పెర్త్ టెస్ట్ ఓటమిలో కళ్లకు కట్టాయి. ఇటీవలి కాలంలో దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ వంటి జట్లను టెస్టులో రెండు సార్లూ కుప్పకూల్చి మేలిమి ప్రదర్శనలతో అబ్బురపరచిన భారత బౌలర్లు ఆస్ట్రేలియాలోనూ చిచ్చర పిడుగుల్లా చెలరేగిపోవడం ఎంతగానో లాభించింది. జడేజా గాయం, తుది జట్టులో అశ్విన్ లాంటి నాణ్యమైన స్పిన్ దిగ్గజానికి చోటు దక్కకపోవడం లాంటి అంశాలు వివాదాస్పదం కావడం- ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ప్రస్ఫుటీకరిస్తోంది. గాయంతో పృథ్వీ షా దూరమైనా జట్టు బ్యాటింగ్ బలహీనం కాకపోవడం, అవతలి ఆటగాళ్లు వికెట్లు పారేసుకున్న చోట జడేజా సైతం బ్యాటును ఝళిపించడం- ఇరు శిబిరాల మధ్య అంతరాన్ని పూడ్చలేనంతగా విస్తరించాయి. అదే, కంగారూల కొంపముంచింది!

అరివీర భయంకరంగా చెలరేగిపోయి దుర్నిరీక్ష్యమైన విజయాలు నమోదు చేసే తమ జాతీయ జట్టును ఈసారి ప్రధానంగా కుంగదీసింది బ్యాటింగ్ వైఫల్యమేనంటున్న క్రీడాదిగ్గజం ఇయాన్ ఛాపెల్, కొన్ని మూలసమస్యల్నీ లోతుగా విశ్లేషించారు. క్రమానుగుణ శిక్షణ కొరవడటం, పొట్టి క్రికెట్‌పైనే అధికంగా దృష్టిపెట్టడం మూలాన యువ ప్రతిభను వెలికితేలేకపోతున్నామన్న ఛాపెల్ నిశిత వ్యాఖ్య ఇతర దేశాల క్రీడా వ్యవస్థల్నీ ఆత్మశోధనకు పురిగొలిపేదే. ఒకప్పటిలా భారతజట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు ఏ ఒకరిద్దరి పైనో ఆధారపడిన ఒంటిస్తంభం మేడలు కావన్నది నిజమే. వైరిపక్షం బలాబలాల్ని మదింపు వేసి దీటైన జట్టును కూర్చేలా నేడున్న రిజర్వ్ ఆటగాళ్ల సంఖ్య వచ్చే అయిదు పదేళ్లపాటు భారత్ దూకుడును కొనసాగించగలదని మైకేల్ క్లార్క్ వంటివారు అభిప్రాయపడుతున్నారు. టెస్టులతో పోలిస్తే ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్), పరిమిత ఓవర్ల పోటీలకు జనాదరణ ఇంతలంతలవుతున్న దేశంలో- ఆస్ట్రేలియా తరహా సన్నాహక తప్పిదాలు పునరావృతం కాకుండా భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) తగినంతగా జాగ్రత్తపడాలి. తాజాగా ముగిసిన టెస్టుల పరంపరలో భారత బ్యాటింగుకు వెన్నెముకలా నిలిచిన పుజారాను పొట్టి క్రికెట్లో ఏ ఐపీఎల్ జట్టూ తీసుకోని నేపథ్యంలో- అతడిని సముచిత రీతిలో గౌరవించాలన్న ప్రతిపాదన పట్ల బీసీసీఐ సుముఖత స్వాగతించదగ్గ పరిణామం. వేలంవెర్రి ధోరణుల రంధిలో సహజ ప్రతిభ దురన్యాయానికి గురికాకుండా కాచుకోవడమెంత ముఖ్యమో, చివరి వరస దాకా బ్యాటింగ్ బలిమి కొనసాగే వ్యూహాత్మక కూర్పూ అంతే కీలకం. అడిలైడ్ టెస్టులో చివరి అయిదు వికెట్లను భారత్ కేవలం 25 పరుగుల తేడాలో కోల్పోగా, ఆసీస్ 176 పరుగులు జోడించగలిగింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ పట్టుదల కోల్పోని లక్షణం ఒంటపడితే, అది భారత జట్టును మున్ముందు మరింత శక్తిసంపన్నం చేస్తుంది!



తుమ్మల కిశోర్

రిజర్వు బ్యాంకు ఇటీవల విడుదల చేసిన 'ఆర్థిక స్థిరత్వ నివేదిక'లో దేశ బ్యాంకింగ్ రంగ స్థూల నిరర్థక ఆస్తులు తగ్గుముఖం పట్టాయని పేర్కొంటూ బ్యాంకుల్లో 'కార్పొరేట్ గవర్నెన్స్' ప్రమాణాలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను మరోసారి సూచించింది. బ్యాంకుల నష్ట నివారణ (రిస్క్ మేనేజ్‌మెంట్) విధానాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్నీ గుర్తించింది. కొత్త సంవత్సరంలో దేశ బ్యాంకింగ్ రంగం కొంతమేర కుదుటపడి మెరుగైన పనితీరు కనబరచే దిశగా అడుగులేస్తుందన్న సంకేతాన్ని ఆర్థిక స్థిరత్వ నివేదిక తెలియజేసింది. అంతర్జాతీయంగా ఆర్థికపరమైన సవాళ్లు ఎదురైనప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటి



కోట్లకు పైనే ఉన్నాయి. ఇవికాక గతంలో ఆర్‌బీఐ రెండో విడతగా పంపిన మరో 29 పెద్ద కార్పొరేట్ సంస్థల మొండి బకాయిల జాబితా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దివాలా స్మృతి అమలులో పలు న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రమోటర్లు అడ్డదారులు తొక్కడంతో సమస్య పరిష్కారంలో తీవ్రజాప్యం జరుగుతోంది. 270 రోజుల్లో సమస్య పూర్తి కావాలి. ఏడాది దాటినా అధికశాతం ఖాతాల్లో పరిష్కారం కనుచూపు మేరలో కనబడటం లేదు. గత డిసెంబరు నాటికి ఎన్‌సీఎల్‌టీ వద్ద 1,200 వరకు కేసులు దాఖలయ్యాయి. వాటిలో 52 మాత్రమే పరిష్కారమయ్యాయి. దివాలా స్మృతి కింద సమస్య పరిష్కార వేగంపైనే ఎన్‌పీఏల తగ్గుదల ఆధారపడి ఉంటుంది. మొండిబాకీలను తగ్గించుకొని లాభాల బాట పట్టకపోతే కొన్ని బ్యాంకులు విలీనానికి గురయ్యే అవకాశం ఉంది. అవి మొండిబాకీలను తగ్గించుకొంటూ, రుణవితరణ

కోలుకుని... కుదురుకొని

ష్ఠంగా ఉంటుందని, బ్యాంకింగ్ రంగం క్రమంగా కోలుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తీకరించింది. బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు 2015 మార్చి తరవాత మొదటిసారిగా తగ్గడం ఒకింత ఊరట కలిగించే అంశం. ఇవి 2018 మార్చి నాటికి 11.5 శాతం ఉండగా సెప్టెంబరుకల్లా 10.8 శాతానికి తగ్గాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి 10.3 శాతానికి దిగిరావచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. నిరుడు పలు సంక్షోభాలు, కుంభకోణాలు, తీవ్ర మొండిబాకీల సమస్యలను ఎదుర్కొని నష్టాలపాలైన పలు బ్యాంకులకు కొత్త ఏడాదిలో కొంత ఊరట లభించనుంది. ముఖ్యంగా మొండిబకాయిల ఊబిలో కూరుకుపోయిన ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)లకు ఈ ఏడాది కొంత ఆశావహంగా ఉండే అవకాశం ఉంది.

మెరుగుదల సూచనలు

గతంలో రిజర్వుబ్యాంకు తీసుకొన్న నిర్ణయాలు, కఠిన ఎన్‌పీఏ నిబంధనల వల్ల భారీ మొండిబాకీల వెలికితీత దాదాపు పూర్తయింది. ఆర్‌బీఐ మూడేళ్ల క్రితం తలపెట్టిన ఆస్తి-అప్పుల పట్టిక ప్రక్షాళన సత్ఫలితాలు ఇస్తున్నందువల్ల ఈ ఏడాది మార్చి నాటికి పలు పీఎస్‌బీల ఆర్థిక పరిస్థితి గాడిన పడనుంది. గతంలో ఏటికేడు పెరిగిన మొండి బకాయిలు ఇప్పుడిప్పుడే కాస్త నెమ్మదిస్తున్నాయి. అదేవిధంగా పీసీఏ (సత్వర దిద్దుబాటు చర్య) పరిధిలో ఉన్న 11 పీఎస్‌బీల్లో కొన్ని బ్యాంకుల పనితీరు క్రమంగా మెరుగుపడుతున్నందువల్ల మార్చి నాటికి మూడు, నాలుగు బ్యాంకులు పీసీఏ పరిధి నుంచి బయటకు వచ్చే అవకాశం ఉంది. పీఎస్‌బీలకు ఎప్పటికప్పుడు అవసరమైన మూలధనాన్ని ప్రభుత్వం అందజేస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది వీటి మూలధన నిష్పత్తి (సీఏఆర్-క్యాపిటల్ అడెక్వసీ రేషియో) మెరుగుపడటంతోపాటు రుణవితరణ సామర్థ్యమూ పెరగనుంది. 2017 అక్టోబరులో ప్రకటించిన మెగా మూలధన ప్యాకేజీ (రూ.2.11 లక్షల కోట్ల)కి అదనంగా మరింత మూలధనాన్ని అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మార్చి నాటికి ప్రభుత్వం మరో రూ.83 వేలకోట్ల మూలధనాన్ని కొన్ని పీఎస్‌బీలకు అందించనుంది. పీఎస్‌బీల నష్టాలూ క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. 2018 మార్చి నాటికి రెండు (ఇండియన్ బ్యాంకు, విజయాబ్యాంకు) బ్యాంకులు మినహా దేశంలో ఉన్న పీఎస్‌బీలన్నీ రూ.87 వేలకోట్లకు పైగా నష్టాన్ని చవిచూడగా గడచిన సెప్టెంబరు నాటికి రూ.62 వేలకోట్లకు తగ్గాయి. తరవాత కొన్ని బ్యాంకులు తిరిగి లాభాల బాట పట్టాయి. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి పీఎస్‌బీల నష్టాలు గణనీయంగా తగ్గి లాభాలబాట పట్టవచ్చు. కొన్నేళ్ళుగా అయిదారు శాతానికే పరిమితమైన బ్యాంకుల రుణ వృద్ధిరేటు ఇప్పుడిప్పుడే పుంజుకొంటోంది. గత సెప్టెంబరు నాటికి 13.2 శాతంగా ఉన్న రుణ వృద్ధిరేటు ఈ ఏడాది మార్చి నాటికి మరింత ఎగబాకవచ్చు.

బ్యాంకింగ్ రంగానికి శుభశకునాలు

మొండి బాకీలు స్వల్పంగా తగ్గి, రుణ వసూళ్లు ఇనుమడించినంత మాత్రాన బ్యాంకింగ్ రంగం సంక్షోభాలను అధిగమించి, వృద్ధిబాట పట్టిందనుకోవడానికి వీలులేదు. గతంలో బ్యాంకుల మొండిబాకీల తగ్గుదల, రుణ వసూళ్లపై ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు అంచనాలన్నీ తారుమారయ్యాయి. దివాలా స్మృతి కింద ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్) ద్వారా జరగాల్సిన మొండిబాకీల పరిష్కారంలో తీవ్ర జాప్యం కారణంగా బకాయిల వసూళ్లు అంచనాల మేరకు సాగలేదు. నిజానికి 2017లో ఆర్‌బీఐ తొలివిడత గుర్తించిన 12 పెద్ద కార్పొరేట్ సంస్థల మొండిబాకీల పరిష్కారం నిరుడే పూర్తికావాల్సి ఉంది. వీటి మొత్తం బకాయిలు రూ.2.50 లక్షల కోట్లకు పైగానే ఉంది. కేవలం నాలుగు సంస్థల మొండిబాకీల సమస్య మాత్రమే పరిష్కారమైంది. వీటి మొత్తం బకాయిల విలువ రూ.80 వేల కోట్ల పైమాటే. ఆస్తుల అమ్మకం ద్వారా రూ.43,270 కోట్లు మాత్రమే బ్యాంకులు రాబట్టగలిగాయి. మిగిలిన రూ.37 వేలకోట్ల పైచిలుకు మొత్తాన్ని బ్యాంకులు వదులుకోవాల్సి వచ్చింది. ఇంకా మిగిలిన ఎనిమిది పెద్ద కార్పొరేట్ మొండి బకాయిలు రూ.1.50 లక్షల

వేగంగా సంస్కరణలు



బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు ముందుకు సాగడం లేదు. పీఎస్‌బీల బోర్డులను ప్రక్షాళనచేసి, వాటి జవాబుదారీతనాన్ని మరింత పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పాలన యంత్రాంగాన్ని మరింత పటిష్ఠంగా, పారదర్శకంగా తీర్చిదిద్దాలి. పాలన యంత్రాంగం పకడ్బందీగా లేకుండా ప్రభుత్వం పీఎస్‌బీలకు ఎంత సాయం అందించినా లక్ష్యాలను సాధించలేవన్నది వేరే చెప్పనక్కర్లేదు. కొన్నేళ్లుగా ప్రభుత్వం- పీఎస్‌బీలకు లక్షల కోట్ల రూపాయల మూలధనాన్ని అంచెలంచెలుగా అందిస్తోంది. ఈ ఏడాదీ పెద్దయెత్తున ఆ అవసరం ఏర్పడవచ్చు. ఒకవేళ రిజర్వు బ్యాంకు బ్యాంకుల కనీస మూలధన నిష్పత్తి నిబంధనలను సడలించి బాసెల్-3 నిబంధనలకు అనుసంధానించినట్లయితే, ప్రభుత్వంపై కొంతభారం తగ్గుతుంది. పీఎస్‌బీలకు మూలధనం సమకూర్చే విధానంలో ప్రభుత్వం కొన్ని మార్పులు చేయాలి. పనితీరును బట్టి మూలధనం సమకూర్చుతూ అవి గాడిలో పడకపోతే విలీనమే శరణ్యమన్న సంకేతాన్ని బ్యాంకులకు అందించాలి. ఎన్నికల తరవాత కేంద్రంలో ఏ ప్రభుత్వం కొలువుతీరినా సంస్కరణలకు అంతరాయం కలగకుండా జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా పీఎస్‌బీల మధ్య విలీన ప్రక్రియకు అడ్డంకులు లేకుండా చూడాలి. ఈ ఏడాది రెండో విడత మరిన్ని పీఎస్‌బీల విలీనానికి రంగం సిద్ధం చేయాలి.

పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అయితే రుణ వృద్ధిరేటు మొత్తం మీద 13 శాతానికి పెరిగినప్పటికీ పీఎస్‌బీల వృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. పీఎస్‌బీల రుణ వృద్ధిరేటు మార్చి 2018 నాటికి 5.9 శాతం ఉండగా, గత సెప్టెంబరు నాటికి ఎనిమిది శాతానికి చేరుకుంది. ప్రైవేటు బ్యాంకుల రుణ వృద్ధిరేటు 22 శాతానికి పైగా నమోదైంది. పీఎస్‌బీల డిపాజిట్ వృద్ధిరేటు 18 శాతంపైగా ఉంది. మొత్తంమీద ఈ ఏడాది పీఎస్‌బీల వృద్ధిరేటు నామమాత్రంగా ఉండే అవకాశం ఉంది. మొండిబాకీల విషయంలో కొంత ఊరట లభించినప్పటికీ పీఎస్‌బీలు పలు సంక్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొంటూ ప్రైవేటురంగ బ్యాంకుల నుంచి తీవ్రపోటీని తట్టుకొంటూ మనుగడ సాగించాల్సి ఉంటుంది.

పకడ్బందీగా నిబంధనలు

రెండేళ్ల క్రితం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దివాలాస్మృతి (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్-ఐబీసీ) బ్యాంకుల మొండిబాకీల వసూళ్లలో విప్లవాత్మక మార్పుతెస్తుందన్న అంచనాలను తారుమారు చేసింది. దివాలాస్మృతి కింద సగటు మొండిబకాయిల వసూళ్లు, ఇతర మార్గాల (ఎస్ఏఆర్ఎఫ్ఏఈఎస్ఐ చట్టం- సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్, డెట్ రికవరీ ట్రిబ్యునళ్ళు, లోక్ అదాలత్‌లు) ద్వారా జరిగిన వసూళ్ల కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. ఈ నేపథ్యంలో దివాలాస్మృతిలో కొన్ని మార్పులు చేసి ప్రమోటర్లు అడ్డదారుల్లో బిడ్డింగ్ ప్రక్రియను అడ్డుకోకుండా కఠిన నిబంధనలను ప్రవేశపెట్టాలి. ఎన్‌సీఎల్‌టీలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు మరిన్ని ఎన్‌సీఎల్‌టీలను స్థాపించే దిశలో చర్యలు తీసుకోవాలి.

రిజర్వు బ్యాంకు తాజాగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు ఇచ్చిన రుణాలను పునర్ వ్యవస్థీకరించేందుకు బ్యాంకులను అనుమతించిన నేపథ్యంలో భవిష్యత్తులో అవి మొండిబకాయిల సంక్షోభాన్ని సృష్టించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. కార్పొరేట్ రుణాల పునర్‌వ్యవస్థీకరణ సమయంలో జరిగిన అవకతవకలు, పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలి. రిజర్వు బ్యాంకు స్వయంప్రతిపత్తిని కాపాడుకొంటూ స్వతంత్రంగా పనిచేయడం ఎంత ముఖ్యమో, పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేసుకొని బ్యాంకులు, ఆర్థిక సంస్థల వైఫల్యాలను గుర్తించి వాటిని నివారించడం అంతే ముఖ్యం. బ్యాంకింగ్ రంగంలో మోసాలు, భారీ కుంభకోణాల నేపథ్యంలో బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల పర్యవేక్షణ విధానాన్ని పటిష్ఠపరచే చర్యలను వేగవంతం చేయాలి. భవిష్యత్తులో పీఎన్‌బీ-నీరవ్‌మోదీ కుంభకోణం, ఐఎల్ అండ్‌ఎఫ్ఎస్ వైఫల్యం వంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఆర్‌బీఐ అప్రమత్తంగా వ్యవహరించాలి!

(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

ముంచుకొస్తున్న మరో ముప్పు

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు కొండల్లా పేరుకుపోతున్నాయి. వీటిని సమర్థంగా నిర్మూలించడంలో భారత్ బాగా వెనకబడి ఉంది. వాడేసిన స్మార్ట్‌ఫోన్లు, డెస్క్‌టాప్‌లు, లాప్‌టాప్‌లు, ప్రింటర్లు, మైక్రోవేవ్ ఓవెన్లు వంటివి వ్యర్థాలుగా మారి సవాలు విసరుతున్నాయి. వస్తువులను పునఃశ్శుద్ధి (రీసైక్లింగ్) చేసి వాడుకునేందుకు పటిష్ఠ చర్యలు కొరవడుతున్నాయి. ఈ-వ్యర్థాల్లో ఉండే విష రసాయనాలు, లోహాలు ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. పర్యావరణానికి నష్టం కలుగచేస్తున్నాయి. కేంద్రప్రభుత్వం 2016లో ప్రకటించిన ఈ-వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలులో రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. వినియోగదారులు, తయారీదారులు, ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉపయోగపడే వస్తువులను విడదీసి వినియోగించేవారికి- పునఃశ్శుద్ధి చేసేవారికి మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది.

ఈ-వ్యర్థాల ఉత్పత్తిలో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ తరవాతి స్థానం భారత్‌దే. దేశంలో ఏటా 20 లక్షల టన్నుల ఈ-వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. భారత్‌లో ఈ- వ్యర్థాల వార్షిక పెరుగుదల 36 శాతం మేర ఉంది. 'అసోచామ్' అంచనాల మేరకు 2016లో ఈ-వ్యర్థాల వార్షిక ఉత్పత్తి 180 లక్షల మెట్రిక్ టన్నులు. 2020నాటికి 520 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుతుందని అంచనా. ప్రజల్లో చైతన్యం తేవడానికి ఈ ఏడాది అక్టోబరు 13న మొట్టమొదటి ప్రపంచ ఈ-వ్యర్థాల దినోత్సవాన్ని నిర్వహించారు. 20 దేశాలకు చెందిన దాదాపు 40 సంస్థలు ఇందులో భాగస్వాములయ్యాయి.

అధునాతన చరవాణులు విపణులను ముంచెత్తుతున్న తరుణంలో వాడి పారేసిన చరవాణుల వ్యర్థాలు సమస్యను పెంచుతున్నాయి. డెస్క్‌టాప్‌లు, లాప్‌టాప్‌లు, టీవీల వంటివాటిని పక్కన పడేస్తున్నారు. ఇవన్నీ చెత్త కొనుగోలు చేసేవారికి చేరుతున్నాయి. వీటిని భూమిలో పాతిపెట్టడమో, డంపింగ్ యార్డులో కాల్చిపారేయటమో చేస్తున్నారు. చెరువులు, కాల్వలు, నదులు, సముద్రాల్లోకి చెత్త చేరడం వల్ల కలుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. చెత్తను పునశుద్ధి (రీసైక్లింగ్) చేసి తిరిగి వినియోగించుకునేలా మలచాలని ప్రభుత్వాలు చాలా కాలంగా చెబుతున్నాయి. ఈ-వ్యర్థాలకు సంబంధించిన మొట్టమొదటి చట్టం 2011లో వచ్చింది. ఇందులో తయారీదారే వినియోగానికి పనికిరాని వస్తువులను సేకరించి, వాటిని పర్యావరణహితంగా పునఃశ్శుద్ధి చేపట్టే చోటుకు పంపాలని పేర్కొన్నారు. ఆచరణలో ఈ చట్టం ఆశించిన ప్రయోజనాలు సాధించలేదు. దీంతో అక్టోబరు 1, 2017 నుంచి కొత్త చట్టాన్ని అమలులోకి తెచ్చారు. ఇందులో 21 వస్తువులను చేర్చారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువుల విడిభాగాల విషయంలో తయారీదారులు చొరవ చూపాలని సూచించారు. వినియోగానికి పనికిరాని వస్తువులను తిరిగి పంపేందుకు వీలుగా తయారీదారులు విధిగా సేకరణ కేంద్రాల పోస్టల్, ఈ-మెయిల్ చిరునామా, టోల్‌ఫ్రీ నెంబర్లను వినియోగదారులకు అందించే యూజర్ మాన్యువల్‌లోనూ, వెబ్‌సైట్లలోనూ ప్రచారం చేయాలని చట్టంలో సూచించారు.

వాతావరణంపై ఎలాంటి ప్రభావం పడకుండా వ్యర్థాల్లో ప్లాస్టిక్, ఇతర లోహాలు తిరిగి వినియోగించు



ఈ-వ్యర్థాలతో కొత్త తంటాలు

కునేందుకు అవసరమైన సాంకేతికతను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ రూపొందించింది. పీసీబీ (కాలుష్య నివారణ మండలి) పునఃశ్శుద్ధి పరిజ్ఞానాన్ని తయారు చేసింది. ఈ వ్యర్థాల్లో పావు వంతు ఆక్రమించే ప్లాస్టిక్‌ను అవసరమైన మార్పులు చేసి తిరిగి ఉపయోగించుకునే విధానాలకూ రూపకల్పన చేశారు. దీని ప్రకారం 76శాతం ప్లాస్టిక్‌ను తిరిగి వినియోగించవచ్చు. భారత్‌లో 214 అధీకృత చెత్త విభజన, పునర్వినియోగానికి సంబంధించిన సంస్థలు ఉన్నాయని అంచనా. అయితే 2016-17 మధ్యకాలంలో దేశంలో ఉత్పత్తి అయిన మొత్తం చెత్తలో కేవలం 0.036 శాతం వ్యర్థాలనే పునఃశుద్ధి చేశారు.

అమెరికా లాంటి దేశాల్లో ఆన్‌లైన్ విధానం అమలులో ఉంది. వస్తువు ఎక్కడ కొన్నారన్న దానితో సంబంధం లేకుండా అవసరంలేని, వినియోగించని, పనికిరాని వస్తువులను పునఃశ్శుద్ధికి పంపించాలని వినియోగదారులను ఆ దేశంలో కోరుతారు. నార్వేలో ప్రభుత్వమే ఈ బాధ్యతను చేపట్టింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ- ఈ-వ్యర్థాల ఎగుమతిదారులు, ఉత్పత్తిదారులతో ఒప్పందం చేసుకుంది. 1998లో దీనికి చట్టబద్ధత తెచ్చారు. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. భారత్ లాంటి దేశాలకు ఇది అనుసరించదగిన విధానంగా కనిపిస్తోంది. వ్యర్థాలను పునఃశ్శుద్ధి చేసి వినియోగించుకోవడంలో స్వీడన్ ముందుంది.

వ్యర్థాల నిర్మూలనకు 'త్రీ-ఆర్' విధానం (రెడ్యూస్- తగ్గించడం, రీయూజ్- ఉపయోగించడం, రీసైకిల్- పునర్వియోగించడం) అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యర్థాలు కలిగించే హానిపైన వినియోగదారుల్లోనూ అవగాహన కల్పించడం అవసరం. వ్యర్థాలు భూమిలోకి చేరడం వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. భూమిలో ఆమ్లీకరణ పెరుగుతుంది. వాయుకాలుష్యమూ హెచ్చుతోంది. ఆరోగ్యపరంగా ఊపిరితిత్తులు, గుండె, కాలేయం వంటివి దెబ్బతింటాయి. మానవ జన్యుకణాలపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. మిగతా దేశాలతో పోలిస్తే, భారత్‌లో వీధుల్లో చెత్త ఏరి జీవనం సాగించేవారి సంఖ్య అధికం. అలాంటి వ్యక్తులను గుర్తించి శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాల్సి ఉంది. ఈ-వ్యర్థాల్లో విలువైన వెండి, బంగారం, పలాడియం వంటి లోహాలు సేకరించి, వాటిని తిరిగి విక్రయించుకొనే అవకాశాలూ ఉన్నాయి.

ఈ-వ్యర్థాల పునర్వినియోగంపైన ప్రభుత్వం దృష్టి పెట్టాలి. చెత్తను సేకరించే కేంద్రాల సంఖ్యను పెంచాలి. చెత్తను విడదీసేవారికి, దాన్ని పునర్వినియోగానికి సిద్ధం చేసేవారికి, వినియోగదారులకు మధ్య సమన్వయం అవసరం. రాష్ట్రాల కాలుష్య నియంత్రణ మండళ్లు చైతన్యవంతం కావాలి. ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీదారులు నిబంధనలు అమలు చేస్తున్నారా లేదా అన్నది ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. అప్పుడే ఈ-వ్యర్థాల సమస్యకు పరిష్కారం దొరుకుతుంది!

- పార్థసారథి చిరువోలు

ఈనాడు లేఖలు

మలి విడత భూప్రక్షాళన

భూవివాదాలు లేని తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనివల్ల చాలామంది రైతులకు భద్రతతో కూడిన భూయాజమాన్య హక్కు, పట్టాదారు పుస్తకాలు, పంటసాయం అందించడం ముదావహం. కానీ, ఇంకా పార్ట్ 'బి' భూముల సమస్య అపరిష్కృతంగా ఉంది. ఎంతోమంది రైతులు న్యాయం కోసం, పంట సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ భూముల ప్రక్షాళన కార్యక్రమానికి ప్రభుత్వం త్వరగా శ్రీకారం చుట్టాలి. క్షేత్రస్థాయి విచారణ జరిపి రైతులకు భూములపై న్యాయపరమైన హక్కు కల్పించాలి. పట్టాదారు పుస్తకాలు అందజేసి, పంట రుణాలు మంజూరు చేయాలి.

- వావిలాల రాజశేఖరశర్మ, నాగర్ కర్నూలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు అవకాశం

రాష్ట్రప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. లబ్ధిదారులను గుర్తించడంలో అనుసరిస్తున్న విధానాల వల్ల అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అవినీతి కారణంగా అనేకమంది అర్హులు లబ్ధి పొందలేకపోతున్నారు. ఫలితంగా గ్రామాల్లో వైషమ్యాలు, గొడవలు పెరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అవినీతిని అడ్డుకోవాలంటే దరఖాస్తులను 'ఆన్‌లైన్' ద్వారా స్వీకరించాలి. సాంకేతిక పరిజ్ఞానంపై పేదలకు అవగాహన ఉండదు. అయినా, తగిన ఏర్పాట్లు చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. దరఖాస్తుకు రసీదు ఇవ్వడం, ఫిర్యాదుకు అవకాశాన్ని ఈ ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరచాలి.

- కె.కవిత, కరీంనగర్


సత్యదర్శనం

భారతదేశం కర్మభూమి. వేదభూమి. తపోభూమి. త్యాగభూమి. ఆనంద భూమి. ఇలా ఎన్నో మహోన్నత భూమికలను పోషించిన భారతదేశం నిన్న మొన్న ఆవిర్భవించిన నాగరికతల్ని దీపంచుట్టూ తిరిగే శలభంలా అనుకరిస్తూ నేడు తన దీనావస్థను చాటుకుంటోంది. త్యాగి కానివాడు భోగి కాలేడు. పాశ్చాత్య నాగరికతల్లో 'త్యాగ' శబ్దం కనబడదు. ఏ కొందరో తప్ప వారు భౌతిక సంపదలు సమకూర్చుకొని ఆనందం అనుభవించే ప్రయత్నం చేస్తున్నవారే! త్యాగంతోనే అమృతత్వం సిద్ధిస్తుందని శాస్త్ర వచనం. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసల ద్వారా త్యాగ భావానికి బీజం పడుతుంది. వీటి సమగ్ర స్వరూపమే భారతదేశం. సత్యదర్శనంలో భాగంగా మన ప్రాచీన రుషులు సమగ్ర ప్రకృతికి తమ దేహాన్ని ప్రతీకగా భావించి పరిశోధనలు చేశారు. తమ అంతరంగంలో ఉన్నదే సర్వత్రా వ్యాపించి ఉన్న 'సత్య'మని నిజ నిర్ధారణ చేశారు.

మానవ దేహం పంచభూతాల కేంద్రక స్వరూపం. పంచభూతాలు దేహంలో సమతుల్యంగా ఉన్నప్పుడు ఆ దేహంలో ఆనందం ప్రతిఫలిస్తుంది. ఆరోగ్యవంతమైన శరీరంలో అనంతుడు అలరారుతాడు. అంతటా వ్యాపించి ఉన్న అనంతత్వం తమలో ఉందని భావించిన రుషులు ఆనందస్వరూపుడైన భగవంతుడి అంశను తమ అంతరంగంలో దర్శించి ఆనంద జీవనం చేశారు. మురారి ఉన్నచోట అరిషడ్వర్గాలకు తావుండదు కదా? అటువంటివారికి ప్రశాంత జీవనం ఉన్నచోటనే లభించింది. ఆనందనిలయాలైన కుటీరాల్లో జీవిస్తూ ఆనందనిలయవాసుని అన్వేషణలో తరించారు మన మహర్షులు! వారు నివసించిన చోట అంతరంగంలోనే కాదు బాహ్యంలో సైతం ప్రశాంతి లభించేది. క్రూర మృగాలు సైతం వారి సంతోషానికి అడ్డురాలేదు. కణ్వాశ్రమంలో శకుంతల, ఆమె తనయుడు భరతుడు ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా అలా పెరిగినవారే!

మన రుషులకు ఏది సత్యం, ఏది కాదు అన్న విషయంలో సందిగ్ధత లేదు. స్పష్టత ఉండేది. ప్రకృతికి మనిషికి సంబంధం ఏమిటి అన్నప్పుడు- అది తల్లీబిడ్డల అనుబంధమని బోధపడింది. మనిషికే కాదు, సకల చరాచరాలకూ ప్రకృతే తల్లి.

ప్రకృతిలో ఆవిర్భవించే ప్రతి రుతువూ మనిషికి శ్రేయం కలిగించేదే. వర్ష రుతు ఆగమనంతో అప్పటి దాకా వేడెక్కిన భూమి చల్లబడుతుంది. పంటలకు అనువైన వాతావరణం ఏర్పడుతుంది. తాగునీరు పుష్కలంగా అందివస్తుంది. నేల సస్య శ్యామలమవుతుంది. మనిషికి అన్నం, పశువుకు గ్రాసం పుష్కలంగా లభిస్తాయి. వర్ష రుతువును సాగనంపి పుడమిపై కాలు మోపే చలికాలం విశిష్టత గొప్పది. ఒంటిపై చలి దుప్పటి కప్పుకొనే పుడమి తల్లి అందాలు పర్వత క్షేత్రాల్లో నయన మనోహరంగా ద్యోతకం అవుతాయి. పగటికాలం తగ్గే ఈ రోజుల్లో రాత్రి వేళలు అధికం!



అంతర్యామి

సూర్యచంద్రులు, గ్రహాలు, నక్షత్రాలు... వెరసి భూమిపై సప్త సముద్రాలు, అనంత వినీలాకాశం. అన్నింటికీ మనిషిపై గల వాత్సల్యం ఎల్లలు లేనిది. భానుడి చుట్టూ పుడమి తల్లి సంచారం, తన చుట్టూ చందమామ ప్రదక్షిణం వల్ల ఏర్పడే దివారాత్రాలు, ఎండ-వెన్నెలలు జీవకోటికి జవజీవాలు ప్రసాదిస్తాయి. కంటికి కనిపించే దైవమే సమస్త ప్రకృతి! తానేమిటో ప్రకృతి వెల్లడి చేసినా మానవుడు సత్యాన్వేషణ చేస్తూనే ఉన్నాడు. అంతరిక్ష రహస్యాలు కొన్ని వెల్లడైనా అతడి తహతహ అంతులేనిది. తన అంతరంగంలోకి తొంగిచూస్తే ప్రపంచపు అంతరంగం అతడి దివ్య చక్షువులకు కనిపిస్తుందని, ఆ అంతరంగ వీక్షణం మనిషి మనిషికి మధ్య గల అభేదాన్ని క్షుణ్నంగా ఎరుక పరుస్తుందని, ఆ ఎరుకే ప్రపంచ మానవాళి సమానత్వానికి, సోదర భావానికి వెలుగు దివ్వె అవుతుందనీ బోధపడుతుంది. ఏనాటికైనా మనిషికి పదార్థ విజ్ఞానంతో పాటు పరార్థ జ్ఞానం సైతం అత్యంత అవసరమని అప్పుడే అన్వేషణ పూర్తయి సత్య దర్శనం కనుల ముందు సాక్షాత్కరిస్తుందని తెలుసుకోవాలి.

- గోపాలుని రఘుపతిరావు



అశ్రుత్ కథ


సమస్యలకు ఉజ్రాధాని!

ఛత్తీస్‌గఢ్: అభివృద్ధికి అర్థమే తెలియని ఓ పల్లె కథ ఇది. సమస్యలతో సహవాసానికి అలవాటు పడిపోయిన అక్కడి ప్రజలకు విద్యుత్తు, తాగునీరు, రహదారులు వంటి సౌకర్యాలు కూడా ఉంటాయని తెలీదంటే అతిశయోక్తి కాదు. కోర్బా జిల్లాలోని ఆ గ్రామమే అశ్రుత్. దీన్ని 'ఛత్తీస్‌గఢ్ ఉజ్రాధాని'గా కూడా పిలుస్తారు. చిత్రమేమంటే ఉజ్రాధాని అంటే వెలుగు అని అర్థం. కానీ అశ్రుత్ గ్రామానికి వెలుగే లేదు. పొద్దుగుంకితే అంతా చీకటే. ఇక్కడి పిల్లలు బడికి వెళ్లాలంటే తక్కువలో తక్కువగా 15 కి.మీ.లు నడవాలి. ఇక ఎవరైనా అనారోగ్యం బారిన పడ్డారంటే 25 కి.మీ.ల దూరం తీసుకెళ్లాలి. గ్రామంలో ఓ మందుల దుకాణం ఉన్నా ఎప్పుడు తెరుస్తారో తెలీదు. పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు.. విద్యుత్తు లేని గ్రామమే ఉండకూడదు.. అంటూ ఘనంగా చెబుతున్న నేతలకు ఈ పల్లె సంగతి పట్టడం లేదు. తమ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆక్రోశించడం, అప్పుడప్పుడు ఆగ్రహం చెందడం తప్ప ఆ గ్రామస్థులు ఏమీ చేయలేని నిస్సహాయులై పోయారు.

అద్భుతాలయ చరిత

కొండల నడుమ ఓ కోణార్క్!

రాజస్థాన్: చుట్టూ దట్టమైన అడవులు.. కొండలు.. జలపాతాలు.. సుందరమైన ప్రకృతి నడుమ సంక్రాంతి సంబరాలకు సిద్ధమవుతున్న ఓ సుందర ఆలయం రాజస్థాన్‌లో ఉంది. దేశ, విదేశాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు తరలి వచ్చే ఇక్కడి ఆలయం అనేక విశేషాల సమాహారం. జైపూర్ నుంచి తూర్పువైపునకు కొంతదూరం వెళితే ఈ గల్తాజీ ఆలయం వస్తుంది. ఓ సాధువు పేరిట ఈ ఆలయాన్ని పిలుస్తున్నప్పటికీ ఇది సూర్య దేవాలయం. దీన్ని కోతుల గుడి అని కూడా పిలుస్తారు. గోముఖి నదికి చెందిన మూడు జలపాతాలు ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. ఆలయం మొత్తం గులాబీ రంగు రాతితో నిర్మితమై ఉంటుంది. వాటిపై శ్రీకృష్ణుడి చిన్ననాటి అల్లర్లు చెక్కి ఉంటాయి. మకర సంక్రాంతి రోజున పెద్దఎత్తున భక్తులు తరలి వస్తారు. గాలావ్ అనే సాధువు వందేళ్లు తపస్సు చేయగా దేవుడు ప్రత్యక్షమై.. ఇది గొప్ప పుణ్యక్షేత్రంగా కూడా విలసిల్లుతుందని, ఈ ప్రాంతంలో నీళ్లు పుష్కలంగా ఉంటాయని వరమిచ్చినట్లు పౌరాణిక గాథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది. ఆ సాధువు గుర్తుగానే ఇక్కడ ఆలయం నిర్మించినట్లు చెబుతారు. భక్తులు ఇక్కడి కొలనులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. చుట్టూ అడవులుండటంతో పెద్దసంఖ్యలో కోతులు ఇక్కడికి వస్తుంటాయి. వాటితో మాత్రం పర్యాటకులకు తిప్పలు తప్పడం లేదు.



బరాబర్ నీళ్లిస్తం

> **తెరాస ప్రభుత్వం వస్తేనే ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి సాగునీళ్లు అందిస్తుందనే విశ్వాసంతో ప్రజలు మరోసారి అవకాశం ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి సాగునీరు అందించాం. వలస పోయిన వారంతా వాపసు వచ్చారు. ఈ పరిస్థితి చూసి అక్కడి ప్రజలు 13 సీట్లలో తెరాసను గెలిపించారు. మాపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.**

> **ఈ టర్మ్‌లో అన్ని ప్రాజెక్టులు నూటికి నూరుశాతం పూర్తిచేసి, తెలంగాణలో కోటి ఎకరాల్లో నీరు పారించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఐదేళ్ల పూర్తి సమయం ఉంది. రాజకీయ సుస్థిరతా ఉంది. నిధులకు కొరత లేదు. రైతులకు సాగు నీరు అందించడమే ధ్యేయంగా పనిచేయడానికి పునరంకితమవుదాం. దీనికి అధికారులు, గుత్తేదారులు సహకరించాలి.**

- ప్రాజెక్టుల నీటితో మొదట చెరువులను నింపాలి
- సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్
- కేంద్రంలో ఈ దఫా క్రియాశీల పాత్ర పోషిస్తామని వెల్లడి
- నిర్లక్ష్యం చేసే గుత్తేదారులపై చర్యలకు ఆదేశం



సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం ప్రగతిభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. సమావేశంలో పాల్గొన్న సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్‌కే జోషి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌రావు, ఓఎస్డీ శ్రీధర్ దేశ్ పాండే

ఈనాడు - హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులు అందజేస్తామని.. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం కోటి ఎకరాల ఆయకట్టు సాగులోకి తెచ్చే విధంగా పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నిధులు ఖర్చుపెడితే ప్రయోజనం చేకూరాలని.. దీనికి తగ్గట్లుగా పనుల ప్రాధాన్యాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాలపై సోమవారం ప్రగతిభవన్‌లో ఆయన సమీక్షించారు. ఇటీవల విశ్రాంత ఇంజినీర్లు పరిశీలించి వెల్లడించిన అంశాలు, పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు మురళీధర్, అనిల్‌కుమార్, హరిరాం, విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆయా ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్లు, ఎస్‌ఈలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇంజినీర్ల బృందం ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రికి వివరించడంతో.. పనుల్లో ఎక్కడ ఏ లోపం ఉందో చర్చించి, అక్కడికక్కడే లోపాన్ని సవరించడానికి అధికారులకు సూచనలు చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే గుత్తేదారులను మార్చాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులకు అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించడంతోపాటు పెండింగ్ బిల్లులు కూడా చెల్లిస్తామని.. భూసేకరణ, ఇతర సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. దేవాదుల మూడో దశ మూడో ప్యాకేజీలో ఉన్న సమస్యను ఎలా పరిష్కరించాలో ఆలోచించాలని.. తానుస్వయంగా వచ్చి ఆ పనిని చూస్తానన్నారు. ఈ సందర్భంగా సీఎం ఏమన్నారంటే..

రెండు నదుల్లో ఉన్న వాటా వినియోగం

"తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం. గోదావరి, కృష్ణా బేసిన్లలో రాష్ట్రానికి ఉన్న నీటి వాటాను పూర్తిగా వినియోగించుకునే వ్యూహం అమలు చేయాలి. ప్రాజెక్టులు పూర్తయిన తరువాత కూడా వాటి నిర్వహణ కోసం అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయిస్తాం. ఏ ప్రాంతంలోనైనా ప్రాజెక్టు పనులు పూర్తికావడం ఆలస్యమైతే.. చెరువులు నింపడానికి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరగాలి. గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను ఉపయోగించుకోవాలి.

కేంద్రం నిధులు ఇవ్వలేదు

తెలంగాణ రాష్ట్రం వెనుకబడింది. సాగునీటి రంగంలో వివక్షకు గురైంది. అందుకే ఇక్కడి ప్రజలు పోరాటం చేశారు. తెలంగాణలో ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.20-30 వేల కోట్లు ఇచ్చి సాయపడాలని ప్రధాని మోదీని అనేక సార్లు వేడుకున్నా. మిషన్ కాకతీయను దేశం మెచ్చుకుంది. నీతి ఆయోగ్ కూడా గొప్ప పథకం అని కితాబిచ్చింది. మిషన్ కాకతీయ, భగీరథలకు కలిపి రూ.24 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్.. కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అయినప్పటికీ ప్రధాని రూ.24 కూడా ఇవ్వలేదు. ఈ సారి కేంద్రంలో మనది క్రియాశీల పాత్ర ఉంటుంది. కావాల్సినన్ని నిధులు రాబట్టుకునే అవకాశం ఉంటుంది. దీనికితోడు మన రాష్ట్ర ఆదాయాభివృద్ధి రేటు కూడా బాగుంది. నిధులకు కొరత లేదు. ప్రాజెక్టులు కట్టుకోవడమే మన లక్ష్యం.

మూసీ రివర్ ఫ్రంట్..

గోదావరిలో రాష్ట్రానికి 950 టీఎంసీల వాటా ఉంది. సమైక్య రాష్ట్రంలోనే ఇది ఖరారైంది. దీని ప్రకారమే నదిపై కాళేశ్వరం, తుపాకులగూడెం, సీతారామ ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. ఈ ఏడాది ఎండాకాలంలోనే కాళేశ్వరం పనులు పూర్తిచేసి వర్షాకాలంలో ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు చెరువుల ద్వారా పొలాలకు చేరాలి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపు హౌజులు పూర్తికావాలి. ఎల్లంపల్లి, మిడ్ మానేరు దాకా నీళ్లు రావాలి. మేడిగడ్డ నుంచి రోజూ రెండు టీఎంసీల చొప్పున నీరు తీసుకోవాలి. మూడు బ్యారేజీల్లో 36 టీఎంసీలు, ఎల్లంపల్లిలో 20 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉంటాయి. వచ్చిన నీళ్లన్నింటినీ వచ్చినట్లే చెరువులకు మళ్లించాలి. ఎల్లంపల్లి నుంచి ఒక టీఎంసీ మిడ్ మానేరు ద్వారా శ్రీరాంసాగర్ కాలువలకు మళ్లించాలి. మరో టీఎంసీ మల్లన్నసాగర్ వైపు మళ్లించాలి. ఇక్కడి నుంచి ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో నిర్మించే బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్‌లకు తరలించాలి. మల్లన్నసాగర్ ద్వారానే హైదరాబాద్ సాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్న 10 టీఎంసీల రిజర్వాయర్‌కు నీళ్లు పంపాలి. హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్, ఘణపురం ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలి. గండిపేట, హిమాయత్‌సాగర్‌లు నింపాలి. ఇక్కడి నుంచి మూసీ నది మురికిని వదిలించాలి. దానికి కూడా గోదావరి నీళ్లు అందాలి. మూసీ రివర్ ఫ్రంట్‌ను అహ్మదాబాద్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్‌లాగా అభివృద్ధి చేస్తాం.

తుంగతుర్తిలో రిజర్వాయర్

దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన అనంతరం తుపాకులగూడెం వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని అక్కడ రిజర్వాయర్ నిర్మిస్తున్నాం. అయితే, ఏడాదికి 75 టీఎంసీలకు పైగా నీరు తరలించే వీలుండటంతో ఇప్పుడున్న డిజైన్లు, కాలువలు, ఇతర నిర్మాణాలు అక్కరకు రావు. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాకు దేవాదుల నీరు అందాలి. పాకాల, రామప్ప, ఘణపురం, లక్నవరం చెరువులను నింపాలి. తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ నిర్మించి సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి తదితర నియోజకవర్గాలకు నీరిచ్చే విధంగా కొత్త ప్రతిపాదనలు రూపొందించాలి. సీతారామ ప్రాజెక్టు ద్వారా మే నెలలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకూ నీరు ఇవ్వాలి. బయ్యారం వరకు నీటిని తీసుకురావాలి. ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీరు ఇవ్వాలి. ఈ మేరకు అవసరమైన నిర్మాణాలు చేపట్టాలి.

ఇక కాళేశ్వరం తరహాలో పాలమూరు పనులు

ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను కాళేశ్వరం తరహాలో వేగవంతం చేయాలి. అందుకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయిస్తాం. శ్రీశైలం నుంచి 70 టీఎంసీల వరకు తీసుకునే అవకాశం ఉంది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంతో మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల్లో ప్రభుత్వంపై ఎంతో నమ్మకం వచ్చింది. పాలమూరును పూర్తిచేసి ఆ జిల్లాను సస్యశ్యామలం చేస్తాం".

కేసీఆర్‌కు బెదిరింపు ఫోను కేసు...

విచారణ 17కు వాయిదా

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: దాదాపు ఐదేళ్ల క్రితం కేసీఆర్‌కు ఫోన్‌చేసి బెదిరించిన సంఘటనలో... నాడు ఫిర్యాదుచేసిన ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌కు కోర్టు సమన్లు జారీచేసింది. సోమవారం నాంపల్లిలోని 5వ అదనపు ఎంఎస్‌జే కోర్టులో హాజరుకావాల్సిన ఆయన అనారోగ్య కారణాలతో హాజరుకాలేకపోతున్నట్లు పోలీసుల ద్వారా సమాచారం పంపారు. దీంతో ఈ కేసు విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు. కేసీఆర్‌ను 2013లో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌లో బెదిరించాడు. దీనిపై అప్పట్లో తెరాస పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్న శ్రవణ్ బంజారాహిల్స్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. నిందితుడు మధువినయ్ అని, నెల్లూరు ప్రాంతానికి చెందిన అతను అప్పట్లో బెంగళూరు నుంచి ఫోన్‌చేసి బెదిరించాడని... దర్యాప్తు చేపట్టిన పోలీసులు గుర్తించారు. ఐపీసీ సెక్షన్లు 506, 507 ప్రకారం కేసులు నమోదుచేయడంతో, విచారణకు హాజరు కావాలంటూ నాంపల్లి కోర్టు సమన్లు పంపింది.

కలప అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- స్మగ్లర్లపై పీడీ చట్టం ప్రయోగించండి
- ఏ పార్టీ వారైనా ఉపేక్షించొద్దు
- ఒకవేళ తెరాస వాళ్లుంటే ముందు వారిపైనే చర్యలు తీసుకోండి
- అడవుల సంరక్షణకు కార్యాచరణ రూపొందించండి
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కలప అక్రమ రవాణాతో రాష్ట్రంలో అడవులకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని.. దీనిపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. అక్రమ రవాణాదారులు ఏ పార్టీకి చెందినవారైనా, ఎంతటి పలుకుబడి ఉన్న వ్యక్తులైనా ఉపేక్షించొద్దన్నారు. అవసరమైతే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని సూచించారు. ఒకవేళ తెరాస నాయకులెవరైనా స్మగ్లింగ్‌కు పాల్పడితే ముందు వారిపైనే చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంపై సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు అనురాగ్ శర్మ, సీఎస్ ఎస్.కె.జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, పీసీసీఎఫ్ పి.కె.ఝా, సీనియర్ అధికారులు నర్సింగరావు, రామకృష్ణారావు, రాజీవ్ త్రివేది, నిరంజన్‌రావు, స్మితా సబర్వాల్, రాజశేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "పర్యావరణ పరిరక్షణకు నాలుగు విభాగాలుగా చర్యలు చేపట్టాలి. రాష్ట్రవ్యాప్తంగా, హైదరాబాద్ నగరం లోపల, వెలుపల కోట్లాది మొక్కల పెంపకం, అడవుల పునరుద్ధరణ, కలప అక్రమ రవాణాను అరికట్టడంపై కార్యాచరణ సిద్ధం చేయాలి. ఓ వైపు అడవులు నశించిపోతుంటే.. హరితహారం వంటి కార్యక్రమాల కింద ఎన్ని చెట్లు పెంచినా ప్రయోజనం ఉండదు. గతంలో నక్సలైట్ల వల్ల అడవుల్లోకి వెళ్లలేకపోతున్నామని అధికారులు సాకులు చెప్పేవారు.. ప్రస్తుతం అలాంటి సమస్యలేవీ లేవు. అడవుల పరిరక్షణకు పోలీసు, అటవీ శాఖలు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించుకోవాలి. వనాలను సంరక్షిస్తే భూమి ధర్మాన్ని కాపాడినట్లే. ఇల్లు నిర్మించుకునేటప్పుడు ఎంత కలప కావాలన్నా ఇస్తామంటూ కొందరు బడా వ్యక్తులకు అధికారులు చెబుతుంటారు.. అడవులను నరకడంతోనే వారికి ఈ కలప సమకూరుతుంది. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. కట్టెకోత యంత్రాల (సామిల్స్) నిర్వహణపై నియంత్రణ ఉండాలి. కొత్త వాటికి అనుమతులు ఇవ్వొద్దు. వాహనాల సంఖ్య పెరగడం, సరిపడా చెట్లు లేకపోవడం వల్లే దిల్లీలో వాయుకాలుష్యం విపరీతమైంది. హైదరాబాద్‌లోనూ వాహనాల సంఖ్య ఎక్కువ అవుతుండటంతో కాలుష్యం పెరుగుతోంది.. దీన్ని నివారించాలంటే చెట్లు పెంచడం ఒక్కటే మార్గం. హరితహారం కింద ఏటా నాటే మొక్కల సంఖ్య పెంచాలి. వచ్చే వర్షాకాలం నుంచి ఏడాదికి వందకోట్ల మొక్కలు నాటాలి. ఇందుకోసం ప్రత్యామ్నాయ అడవుల పెంపకం, ఉపాధి హామీ, బడ్జెట్, నగర పాలక సంస్థల నిధులు వినియోగించుకోవాలి. భాగ్యనగరం పరిధిలో ఉన్న 1.5 లక్షల ఎకరాల అటవీ బ్లాకులు, పార్కుల్లో విరివిగా చెట్లు పెంచాలి.. వాటిల్లో నడకదారులు నిర్మించి వాడుకలోకి తేవాలి" అని సూచించారు.

'కృత్రిమ మేధ'తో సమూహాల అంచనా

- గోదావరి, కృష్ణా పుష్కరాల్లో సత్ఫలితాలు
- ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ రాజన్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: పెద్దఎత్తున ప్రజలు ఒకచోటికి చేరే వేడుకల్లో కృత్రిమ మేధస్సు ఉపయోగించి వారి సంఖ్యను కచ్చితంగా అంచనా వేయొచ్చని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ల్యాబ్ ఫర్ స్పెషియల్ ఇన్‌ఫర్మేటిక్స్ ప్రొఫెసర్ కె.ఎస్.రాజన్ తెలిపారు. తద్వారా నియంత్రణా చర్యలు చేపట్టవచ్చన్నారు. పుష్కరాల నిర్వహణలో ఈ పరిజ్ఞానం ఎంతగానో ఉపకరిస్తుందని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కృత్రిమమేధతో గుంపును అంచనా వేసేందుకు జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్)-డ్యాష్‌బోర్డుకు రూపకల్పన చేసినట్లు రాజన్ తెలిపారు. దీంతో రాజమండ్రిలో గోదావరి పుష్కరాలకు హాజరైన భక్తుల లెక్కలను తేల్చామన్నారు. డ్రోన్ల సహాయంతో ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాలు ఇతర చోట్ల ట్రాఫిక్‌ను అంచనా వేశామని చెప్పారు. పాత పద్ధతుల్లో లెక్కింపులో తప్పులు దొర్లుతుండేవని.. కానీ.. కృత్రిమ మేధ ద్వారా 13 ఘాట్స్‌లో వచ్చిపోయే భక్త సమూహాన్ని కచ్చితంగా లెక్కగట్టినట్లు రాజన్ వివరించారు. పుష్కరాలకు వచ్చే ప్రజలను గుర్తించటం, వారి రాకపోకలను పసిగట్టడం, విశ్లేషించటం వంటి మూడు ప్రక్రియల ద్వారా అనుకున్నది సాధించినట్లు పేర్కొన్నారు. ఒకే ప్రాంతంలో పెద్ద సంఖ్యలో జనం గుమిగూడకుండా ముందస్తుగా గుర్తించి చర్యలు చేపట్టేందుకు కృత్రిమమేధ ఉపకరిస్తుందని రాజన్ వివరించారు. కృష్ణా పుష్కరాల సమయంలోనూ తాము పని చేసినట్లు చెప్పారు. ఈ విధానాన్ని ఉపయోగించి దృశ్య విశ్లేషణ, పరిష్కార మార్గాన్ని వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

ఏకగ్రీవ ఒప్పందానికి విఘాతం

సర్పంచి పదవిని ఆశించిన వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవదాసు

మల్లాపూర్, న్యూస్‌టుడే: పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవ ఒప్పందానికి విఘాతం ఏర్పడటంతో సర్పంచి పదవిని ఆశించిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనిది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో కొత్తగా ఏర్పాటైన ఒబులాపూర్(తండా) పంచాయతీలో సర్పంచితో పాటు పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సోమవారం ఉదయం గ్రామ ప్రజలు సమావేశమయ్యారు. సర్పంచి పదవిని కావాలనుకునే వారు రూ.5లక్షలు డిపాజిట్ చేయాలని తీర్మానించారు. ఆ పదవిని ఆశించిన దేవదాసు(55) నగదు ఇవ్వడానికి అంగీకరించాడు. అందులో భాగంగా రూ.2లక్షలు ముట్టజెప్పాడు. మిగతా రూ.3లక్షలు ఎన్నికల నామపత్రాల స్వీకరణకు ముందు చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం తండా వాసులు మిగతా రూ.3లక్షలు ఇదే రోజు ఇవ్వాలని, లేకుంటే వేరే వారికి అవకాశం ఇస్తామనడంతో మనస్తాపం చెందిన దేవదాసు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని మెట్‌పల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

ఇంట్లోకి దూసుకొచ్చిన 'మత్తు' శకటం!

- మద్యం తాగి కారు నడిపిన యువకుడు
- అతివేగంతో అదుపుతప్పి నివాసంలోకి దూసుకెళ్లిన వాహనం
- ప్రమాదంలో మహిళ దుర్మరణం
- పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం



మాధుబై (పాతచిత్రం)



ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లిన కారు, కుప్పకూలిన గోడ, స్నానాల గది

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: చిత్తుగా మద్యం తాగిన యువకుడు అతివేగంగా కారు నడిపి ఓ ఇంటి పెద్దదిక్కు దుర్మరణానికి కారణమయ్యాడు. విధులకు వెళ్లేందుకు ఇంట్లో సిద్ధమవుతున్న ఆమె మీదికే మందుబాబు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. కారు అతివేగంలో డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు ఉన్న ఓ ఇంటి గోడను ఢీకొంది. దీంతో ఇంటి ప్రహరీతోపాటు స్నానాల గది ఒక్కసారిగా కుప్పకూలడంతో అందులో ఉన్న మహిళ తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. గౌలిదొడ్డి నివాసి తోల్డీ మాధుబై(45)కి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఈమె భర్త సత్యాజీ 8 ఏళ్ల కిందట అనారోగ్యంతో మరణించడంతో అప్పటినుంచి ప్రైవేటు సంస్థలో హౌస్‌కీపింగ్ పనిచేస్తూ మాధుబై ఒక్కరే కుటుంబాన్ని పోషిస్తున్నారు. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆమె తమ ఇంటి స్నానాల గదిలోకి వెళ్లింది. ఇంతలో వేగంగా దూసుకొచ్చిన ఓ కారు ముందున్న స్కూటర్, ఇంటి ప్రహరీ, స్నానాల గదిని ఢీకొంది. గోడలు కూలి తీవ్రగాయాలపాలైన ఆమెను స్థానికులు వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 8 గంటలకు ఆమె మృతిచెందారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని టోలిచౌకి ప్రాంతవాసి ఇక్రం అలీ(26)ని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆదివారం రాత్రి బార్కస్‌లో స్నేహితుల ఇంట్లో విందుకు వెళ్లి అక్కడ మద్యం తాగిన అలీ సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అక్కడి నుంచి తిరిగి తన కారులో ఇంటికి బయలుదేరాడు. మద్యం మత్తులో ఉన్న ఇతను గచ్చిబౌలి మీదుగా టోలిచౌకి వెళ్లాల్సి ఉండగా నానక్‌రాంగూడ వద్ద దారితప్పి గోపన్‌పల్లి వైపు వెళ్లాడు. మళ్లీ గచ్చిబౌలి వైపు వస్తుండగా గౌలిదొడ్డి వద్ద అతివేగంగా కారు నడపడంతోనే అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. అలీ ఓ కాల్‌సెంటర్‌లో పనిచేసి ఇటీవలే మానేసినట్లు సమాచారం.

రిజర్వేషన్‌పై భిన్న స్వరాలు

అగ్రవర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వివిధ రాజకీయ పక్షాలు, సంఘాలు దీనికి అనుకూలంగా, ప్రతికూలంగా స్పందించాయి. ఈ నిర్ణయంతో అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని భాజపా నాయకులు వ్యాఖ్యానించగా.. ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికే భాజపా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ ఆరోపించింది.

● స్వాగతిస్తున్నాం: లక్ష్మణ్



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: అగ్రవర్ణాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల శాతాలను స్వాగతిస్తున్నామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. కేంద్రప్రభుత్వ చర్యతో అందరికీ సమాన అవకాశాలు వస్తాయని చెప్పారు.

● 'చరిత్రాత్మక నిర్ణయం'

అగ్రవర్ణాల పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం చరిత్రలో నిలుస్తుందంటూ ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. తాము 20 సంవత్సరాలుగా సాగించిన పోరాటం ఫలించిందన్నారు.

● 'ఈ రిజర్వేషన్లు హర్షణీయం'

అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగ రంగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం నిర్ణయించడం చరిత్రాత్మకమని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆర్థిక వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో, ఆ వెనకబాటు ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

● భాజపా 'రిజర్వేషన్ల మాయ': కాంగ్రెస్



అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనకబడినవారికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు అంటూ భాజపా ఎన్నికల మాయ చేస్తోందని మాజీమంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు విమర్శించారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, రిజర్వేషన్లు యాభై శాతం మించరాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసిన నేపథ్యంలో భాజపా చెబుతున్నదేదీ సాధ్యంకాదన్నారు.

● 'మోదీ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం'



అగ్రవర్ణాల్లో వెనకబడినవారికి 10 శాతం మేరకు రిజర్వేషన్లు పెంచాలన్నది మూల సూత్రాలకే విరుద్ధమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ఈబీసీలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆర్థికంగా సమాజంలో వివక్షకు గురయ్యేవారిని, రాజకీయంగా వెనకబడిన వర్గాలను గుర్తించి ఆదుకోవడమే రిజర్వేషన్ల లక్ష్యమన్నారు. బీసీ జనాభా 56 శాతం ఉన్నా రిజర్వేషన్లు ఉద్యోగాల్లో కనీసం 14 శాతం, రాజకీయంగా 12 శాతం దాటలేదన్నారు.

● ఎన్నికల తంత్రం: తమ్మినేని



ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని ఆహ్వానిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నాలుగున్నరేళ్లుగా ఈ విషయాన్ని విస్మరించిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఇప్పుడు ప్రకటన చేయడం మాత్రం ఎన్నికల మాయలో భాగంగానే జరిగిందని ఆరోపించారు.

● ఓట్లు పొందడానికే...



ఎన్నికల్లో అగ్రవర్ణాల ఓట్లు పొందడానికే ఈబీసీ రిజర్వేషన్లను పది శాతానికి పెంచాలని భాజపా నిర్ణయించిందని ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు విమర్శించారు. అధికారంలో ఉన్న నాలుగేళ్లూ దీనిపై ఎందుకు దృష్టిపెట్టలేదని ప్రశ్నించారు.

● 'తీర్పునకు సుప్రీం కట్టుబడితే పెంపు సాధ్యం కాదు'

రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే తీర్పునకు సుప్రీంకోర్టు కట్టుబడి ఉంటే... రిజర్వేషన్లను పెంచి అమలుచేయడం సాధ్యం కాదని మాజీ అడ్వొకేట్ జనరల్ రామచంద్రరావు అభిప్రాయపడ్డారు. అయితే ఈ విషయంలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని చెప్పారు.

● రాజకీయ క్రీడలో ప్రజల జీవితాలతో ఆటలు



"సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50% పరిమితి విధించింది. అంతకంటే మించిన సందర్భాల్లో కోర్టు తిరస్కరించింది. 50శాతంలోనే అగ్రవర్ణాల్లో వెనుకబడినవారికి 10% రిజర్వేషన్ అంటే దేశంలో సామాజికంగా, రాజకీయంగా పెద్ద సంక్షోభం వస్తుంది" అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ ఆందోళన వ్యక్తంచేశారు. అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్ ఇచ్చే కేంద్ర ప్రకటనపై సోమవారం ఆయన 'ఈటీవీ-ఈనాడు'తో మాట్లాడారు. ఈ నిర్ణయాన్ని బీసీలు, ఎస్సీ, ఎస్టీలు ప్రతిఘటిస్తారని చెప్పారు. 50 శాతాన్ని కాపాడుతూ అదనంగా 10% ఇస్తే సుప్రీంకోర్టు ఏమంటుందో చూడాలని వ్యాఖ్యానించారు. "రిజర్వేషన్‌కు అర్హత ఉన్న కులాల్లో ఐఏఎస్‌లు, డాక్టర్లు, ధనవంతుల కుటుంబాలు ఉన్నాయి. రిజర్వేషన్ ఫలితాలు పొందుతున్న వారే మళ్లీ మళ్లీ పొందుతున్నారు. అణగారిన పేదలకు అన్యాయం జరుగుతోంది. రిజర్వేషన్లు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇస్తున్నారు. పాఠశాల విద్యలో ప్రమాణాలు భయంకరంగా ఉన్నాయి. పేదల్లో ప్రతిభ ఉన్నా సరైన విద్య అందడం లేదు. పేదపిల్లల ప్రతిభను గుర్తించి, ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాల విద్యను సమూలంగా మార్పు చేయాలి. పేదరికాన్ని రూపుమాపేందుకు నిజాయతీగా పని చేయాలి. తాత్కాలికంగా మాట్లు వేస్తున్నారు. ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు ఏమైనా చేస్తాయి. రాజకీయ క్రీడలో అన్ని పార్టీలు ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నాయి" అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

● ఎలా కల్పిస్తారు: ఒవైసీ



'ఆర్థిక స్థితి ఆధారంగా రిజర్వేషన్లు ఎలా నిర్ణయిస్తారు? కేంద్రప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ల పద్ధతి పూర్తిగా మోసపూరితం' అని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని ఈ రకమైన నిర్ణయాలను తీసుకోవడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం సామాజికంగా వెనకబడినవారికి రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, ఆర్థికంగా వెనకబడిన ఉన్నత వర్గాలవారికి రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన తెలిపారు. మోదీ సర్కారు ఎన్ని ఎత్తులకు పాల్పడినా వచ్చే ఎన్నికల్లో ప్రజలెవరూ మద్దతు ఇచ్చే పరిస్థితుల్లో లేరన్నారు.

తెలంగాణలో 2 రహదారులకు గుర్తింపు

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో 334 కిలోమీటర్ల మేర రెండు జాతీయ రహదారుల గుర్తింపునకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందని రహదారి రవాణా శాఖ సహాయమంత్రి మాండవియా తెలిపారు. ఆయన సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ అలీఖాన్ ప్రశ్నకు సమాధానమిచ్చారు. సంగారెడ్డి- నర్సాపూర్- తూప్రాన్- గజ్వేల్- జగ్‌దేవ్‌పూర్- భువనగిరి-చౌటుప్పల్ (సుమారు 154 కి.మీ.) చౌటుప్పల్-షాద్‌నగర్-కంది (180కి.మీ.) జాతీయ రహదారులు కానున్నాయి. హైదరాబాద్ చుట్టూ ఇవి విస్తరించి ఉన్నాయి. భూసేకరణలో 50శాతం భరించడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరించింది.



గొల్లపల్లి గ్రామాన్ని రెండు పంచాయతీలుగా విభజించే రోడ్డు ఇదే..

సగం ఊరికే ఎన్నికలు

పెద్దపల్లి జిల్లా గొల్లపల్లిలో విచిత్ర పరిస్థితి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ఆ గ్రామంలో సగానికే పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. రెండు పంచాయతీలకు అనుబంధ గ్రామమైన 'గొల్లపల్లి'లో ఈ విచిత్ర పరిస్థితి నెలకొంది. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గొల్లపల్లిలో సుమారు 415 మంది ఓటర్లున్నారు. ఈ గ్రామం రెండు పంచాయతీలకు అనుబంధంగా ఉంది. గ్రామం మధ్యలో ఉన్న సీసీ రోడ్డుకు ఉత్తరం వైపు రాఘవపూర్ పంచాయతీ పరిధిలో ఉండగా దక్షిణం వైపు బంధంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉంటుంది. గొల్లపల్లికి సంబంధించి బంధంపల్లి పంచాయతీ పరిధిలో 125 మంది ఓటర్లు, రాఘవపూర్ పరిధిలోని ప్రాంతంలో 290 మంది ఓటర్లున్నారు. బంధంపల్లి పంచాయతీని పెద్దపల్లి పురపాలికలో విలీనం చేయనుండటంతో అధికారులు అక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదు. దీని అనుబంధ గ్రామమైన గొల్లపల్లిలో కూడా ఒకవైపు భాగంలో ఎన్నికలు జరగడం లేదు. గ్రామంలోని ఉత్తరం వైపు ఉన్న ప్రజలు రాఘవపూర్ పంచాయతీ ఎన్నికల్లో పాలుపంచుకోనుండగా దక్షిణం వైపు ఉన్న వారు ఎన్నికలకు దూరంగా ఉండాల్సి వస్తోంది.

కేంద్రం ఇంకా ఇవ్వాల్సింది రూ.85 వేల కోట్లు

- పోలవరం రెండోదశ నిధులు దీనికి అదనం
- ఏపీ యూసీలు ఇవ్వలేదనడం ఒట్టిమాట
- సమాఖ్య స్ఫూర్తికి లోబడే సమస్యల పరిష్కారం
- జయప్రకాశ్ నారాయణ సారథ్యంలోని నిపుణుల కమిటీ వెల్లడి



నిపుణుల కమిటీ రూపొందించిన నివేదికను సోమవారం విజయవాడలో విడుదలచేస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్. పక్కన సెస్ డైరెక్టర్ గలాబ్, సెస్ ఛైర్మన్ రాధాకృష్ణ, కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి అజేయ కల్లం, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పర్వతరావు

ఈనాడు - అమరావతి

విభజన చట్టంలోని అంశాలు, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికీ చాలా అమలు కాలేదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ సారథ్యంలోని నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఇంకా రూ.85 వేల కోట్లు రావాల్సి ఉందని నిగ్గు తేల్చింది. పోలవరం ప్రాజెక్టు రెండో దశ నిధులను కూడా కలిపితే ఈ మొత్తం ఇంకా పెరుగుతుందని పేర్కొంది. కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్ర ప్రభుత్వం యూసీలు ఇవ్వలేదన్న వాదన సరికాదని.. గుంటూరు, విజయవాడలకు ఇచ్చిన రూ.వెయ్యి కోట్లకు సంబంధించి మాత్రమే ఇంకా రూ.771 కోట్లకు యూసీలు ఇవ్వాల్సి ఉందని పేర్కొంది. కేంద్రానికి ఆర్థిక ఇబ్బందులుండి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో నిధులివ్వలేని పరిస్థితే ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను రద్దు చేయాలని కేంద్రానికి సూచించింది. రాష్ట్రానికి ఇంతవరకు కేంద్రం నుంచి ఎన్ని నిధులు వచ్చాయి? ఇంకా ఎంత రావాలో నిగ్గు తేల్చేందుకు, సమస్యల పరిష్కారానికి అవసరమైన సిఫార్సులు చేసేందుకు జయప్రకాశ్ నారాయణ కన్వీనర్‌గా వివిధ రంగాలకు చెందిన 15 మంది నిపుణులతో ఏర్పాటైన కమిటీ రూపొందించిన నివేదికను సోమవారం విజయవాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రయోజనాలంటే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుల ప్రైవేటు వ్యవహారం కాదని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులపై రకరకాల వాదనలు ప్రచారంలో ఉన్నాయని, పార్టీలకు అతీతంగా వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పాలన్న ఉద్దేశంతో.. చిత్తశుద్ధితో ఈ నివేదిక రూపొందించామని తెలిపారు. వాస్తవాలు నిగ్గుతేల్చడం, సమాఖ్య వ్యవస్థ పరిధిలోనే సమస్యను పరిష్కరించుకోవడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పౌరసమాజం, నిపుణులు వారధిగా పనిచేయడమనే లక్ష్యాలతో కమిటీ పనిచేసిందని తెలిపారు.

రెవెన్యూ లోటు ఇవ్వాల్సిందే

మొత్తం 144 పేజీల నివేదికలో పది అంశాలను కమిటీ కూలంకషంగా చర్చించింది. ఇప్పటివరకు కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన నిధుల వివరాలను సంబంధిత ప్రభుత్వ విభాగాలనుంచి ధ్రువీకరించుకున్నాకే నివేదికలో పొందుపరిచింది.

- 2014-15 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు రెవెన్యూ లోటుగా రూ.4,117 కోట్లు మాత్రమే ఇస్తానని కేంద్రం చెప్పడాన్ని తప్పుబట్టింది. రాష్ట్ర ప్రభుత్వ పథకంగా కేంద్రం చెబుతున్న రైతు రుణమాఫీని తీసేసినా కూడా రూ.10,355.07 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.
- రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టుకు ముందు మీరు డబ్బు ఖర్చుపెట్టాలని, తర్వాత మేమిస్తామని కేంద్రం చెప్పడం సరికాదని పేర్కొంది. పోలవరం తొలిదశకు రూ.8,711.19 కోట్లు, రెండో దశకు రూ.27,494 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇచ్చి తీరాలని తెలిపింది.
- వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ ప్యాకేజీ తరహాలో సుమారు రూ.25 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున రూ.1,050 కోట్లు మాత్రమే ఇచ్చారని తప్పుబట్టింది.
- ప్రత్యేక హోదాకు బదులు అవే ప్రయోజనాలతో ప్రత్యేక సాయం అందిస్తామన్నందున కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 90 శాతం వాటా కేంద్రం భరించాలని సూచించింది.
- దుగరాజపట్నం నౌకాశ్రయ నిర్మాణం ఆచరణ సాధ్యం కాదనుకున్నప్పుడు కేంద్రమే ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని ఎంపికచేసి నిర్మించాలని సూచించింది.
- రాష్ట్రానికి కేటాయించిన 11 జాతీయ విద్యాసంస్థల నిర్మాణానికి రూ.12,746.38 కోట్లు అవసరం కాగా ఇంతవరకు రూ.845.52 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపింది.
- పెట్టుబడిదారులకు పన్ను రాయితీలు, రాజధాని అభివృద్ధి, విశాఖ- చెన్నై పారిశ్రామిక నడవా వంటి ప్రధాన ప్రాజెక్టులు, అనుసంధాన మార్గాలవంటి అంశాలపై కేంద్రం అందించాల్సిన సహకారానికి సంబంధించి కమిటీ సిఫారసులు చేసింది.

కమిటీ సభ్యులు వీరే..

జయప్రకాశ్ నారాయణ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ చొరవతో నిపుణుల కమిటీ ఏర్పాటైంది. జేపీ కన్వీనర్‌గా ఉన్న కమిటీలో జస్టిస్ పర్వతరావు, కె.పద్మనాభయ్య, కాకి మాధవరావు, ప్రొ.ఆర్.రాధాకృష్ణ, అజేయకల్లం, ప్రొ.ఎస్.గలాబ్ తదితరులు సభ్యులు. తెలుగు రాష్ట్రాలతో సంబంధంలేని నలుగురు నిపుణులు, కేంద్ర మాజీ మంత్రి వై.కె.అలగ్, 13వ ఆర్థిక సంఘం సభ్యుడు ప్రొ.అతుల్‌శర్మ, 14వ ఆర్థిక సంఘం సభ్యుడు డా.ఎం.గోవిందరాజులు, మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ డైరెక్టర్ ప్రొ.కె.ఆర్.షణ్ముగం నివేదికను పరిశీలించి సమ్మతి తెలిపారు.

ఓటమికి ఉత్తమ్, కుంతియాలే కారణం

- తెరాసతో కుమ్మక్కయ్యారు.. టికెట్లు అమ్ముకున్నారు
- తక్షణం పదవులకు రాజీనామా చేయాలి
- లేదంటే 'ఉత్తమ్, కుంతియా హఠావో- కాంగ్రెస్ బచావో' నినాదంతో ఆందోళనలు
- నన్ను సస్పెండ్ చేసే అధికారం పీసీసీకి లేదు : సర్వే



హైదరాబాద్, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు రామచంద్ర కుంతియాలే కారణమని కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ ఆరోపించారు. ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణం ఇద్దరూ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీబీసీఐడీ కేసుల నుంచి తప్పించుకునేందుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెరాసతో 'మ్యాచ్ ఫిక్సింగ్' చేసుకున్నారని, పార్టీని నాశనం చేశారని ధ్వజమెత్తారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అధికారం పీసీసీకి లేదన్నారు. 'అలాంటిదేదైనా జరిగితే ఏఐసీసీ నుంచి లేఖ రావాలి కదా?' అని ప్రశ్నించారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన నియోజకవర్గాల సమీక్షా సమావేశంలో ఉత్తమ్, కుంతియాలపై తీవ్ర ఆరోపణలు చేశారనే కారణంతో సర్వేను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఆయన సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీని బతికించుకునేందుకు, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు.. 'ఉత్తమ్, కుంతియా హఠావో.. కాంగ్రెస్ బచావో' నినాదంతో ఆందోళన చేపడతామన్నారు. 'ఉత్తమ్ మంచి వాడనుకున్నా.. దళితుడినైన నన్ను ఓడించడానికి కుయుక్తులు చేశారు. నా నియోజకవర్గంలో నాయకులకు ఫోన్ చేసి ఓడించాలని సూచించారు. భట్టి విక్రమార్కనూ ఓడించాలనుకున్నారు. నేను గెలిస్తే సీఎం రేసులో ఉంటానని ఉత్తమ్ భయపడ్డారు. సమీక్షా సమావేశంలో జరిగిన గొడవ కారణంగా నన్ను సస్పెండ్ చేసినట్లు మీడియా ద్వారా తెలిసింది. నేను సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు విధేయుడను, ఏఐసీసీ సభ్యుడిని, నన్ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకునే అధికారం టీపీసీసీకి లేదు. గతంలోనూ గాంధీభవన్‌లో, బయటా ఇలా కొందరు మాట్లాడారు. అప్పుడు వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఓటమికి బాధ్యులు ఉత్తమ్, కుంతియాలే. ఈవీఎంల వల్లే ఓడిపోయామని అధిష్ఠానానికి తప్పుడు నివేదిక ఇవ్వాలని చూస్తున్నారు. ఓడినోళ్లు ఎలా సమీక్షలు పెడతారు? పార్టీని, భార్యను గెలిపించుకోలేని వాళ్లు పదవిలో ఎలా కొనసాగుతారు? గతంలో పొన్నాల లక్ష్మయ్య రాజీనామా చేయలేదా? ఉత్తమ్ ఇప్పుడు సీఎల్పీ పదవి కోసం కూడా ప్రయత్నిస్తున్నారు. అలా జరిగితే పార్టీని వీడటానికి మరో 13 మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారు. మండలిలో పార్టీని నలుగురు ఎమ్మెల్సీలు తెరాసపక్షంలో విలీనం చేస్తే ఉత్తమ్ స్పందించలేదు. సీఎం దూషించినా మాట్లాడలేదు. ఉత్తమ్, కుంతియా గాంధీభవన్‌లో కూర్చొని టికెట్లు అమ్ముకున్నారు. డబ్బులు తీసుకున్నా, కొందరికి టికెట్లు ఇవ్వలేదట. వారందరితో దిల్లీ వెళ్లి అధిష్ఠానాన్ని కలుస్తా. ఎన్నికల సందర్భంగా ఇక్కడ జరిగిన అన్ని విషయాలను వారికి చెప్పి ఉత్తమ్, కుంతియాలను పదవుల నుంచి తప్పించేలా చేస్తా. ఇద్దరూ ఐరన్ లెగ్‌లే. నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా' అని సర్వే సత్యనారాయణ స్పష్టం చేశారు



కోర్టువిచారణకు హాజరైన స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డి

స్వామిగౌడ్, పాతూరిపై కేసుల కొట్టివేత

కరీంనగర్ న్యాయవార్తలు: తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డిపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేస్తూ కరీంనగర్ స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ రాజు తీర్పు చెప్పారు. వారు 2013 ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియమావళిని ఉల్లంఘించారంటూ ఒకటో ఠాణాలో కరీంనగర్ తహసీల్దారు భుజంగరావు ఫిర్యాదుచేయడంతో, కేసులు నమోదయ్యాయి. 2013 నవంబరు 30న కోర్టులో అభియోగపత్రం దాఖలయ్యింది. న్యాయస్థానం స్వామిగౌడ్, పాతూరిలకు సమన్లు జారీచేయడంతో ప్రతి వాయిదాకూ హాజరవుతూ వచ్చారు. అప్పట్లో ఉమ్మడి జిల్లాకలెక్టరుగా ఉన్న స్మితా సబర్వాల్ ఈ కేసులో సాక్షిగా కోర్టుకు హాజరయ్యారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ... ఇద్దరినీ నిర్దోషులుగా పేర్కొంటూ సోమవారం తీర్పునిచ్చారు.

షుక్రియా.. పోలీస్

- చికిత్సకు వచ్చిన అఫ్గాన్ జాతీయుడి సొమ్ము కొట్టేసిన దొంగ
- సత్వరం స్పందించిన పోలీసులు
- చోరీ సొత్తు బాధితుడికి అప్పగింత

ఈనాడు, హైదరాబాద్: ఆరేళ్ల తనయుడికి చికిత్స చేయించేందుకు దేశం కాని దేశమొచ్చాడు. ఇష్టదైవానికి మొక్కేందుకు ప్రార్థన స్థలానికి వెళ్లాడు. అక్కడ చోటుచేసుకున్న అనూహ్య ఘటన అతడిని హతాశుడిని చేసింది. చికిత్స కోసం వెంట తెచ్చుకున్న డబ్బంతా జేబు దొంగ కొట్టేయడంతో నోట మాట రాని పరిస్థితి. తెల్లారితే తనయుడికి ఆపరేషన్ చేయించాల్సిన సమయంలో చేతిలో చిల్లిగవ్వ లేని దుస్థితిలో హైదరాబాద్ పోలీసులు మేమున్నామంటూ అతడిని భుజం తట్టి భరోసా ఇచ్చారు. గంటల వ్యవధిలోనే దొంగను పట్టి తీసుకురావడంతో పాటు పరిస్థితిని న్యాయస్థానంలో వివరించి పోగొట్టుకున్న డబ్బును సకాలంలో బాధితుడికి అప్పగించగలిగారు. పోలీసుల సత్వర స్పందనను స్వయంగా అనుభవించిన బాధితుడు 'షుక్రియా.. పోలీస్' అనకుండా ఉండలేకపోయారు.

అఫ్గానిస్థాన్ ఫరాస్థహర్ష జిల్లా సామంగం గ్రామానికి చెందిన సయ్యద్ మిర్వాయిష్ రహీమి తన ఆరేళ్ల తనయుడు ఫయాజ్ కంటి చికిత్స కోసం గత నెల 29న హైదరాబాద్‌కు వచ్చారు. గత శనివారం శస్త్రచికిత్స చేసేందుకు వైద్యులు ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ప్రార్థన చేసేందుకు రహీమి మక్కా మసీదుకు వెళ్లారు. తనయుడి చికిత్స కోసం తెచ్చుకున్న 1400 అమెరికా డాలర్లు, 5000 అఫ్గానీ కరెన్సీ, రూ.5 వేల నగదును ఆ సమయంలో తన కుర్తా జేబులోనే ఉంచుకున్నాడు. ప్రార్థనల అనంతరం మసీదు నుంచి బయటకు వస్తున్న క్రమంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో జేబుదొంగ ఆ డబ్బు కొట్టేశాడు. కొంతసేపటికే జేబులో డబ్బు లేదని గ్రహించిన బాధితుడు లబోదిబోమనడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

సీసీ కెమెరాలో దొంగ గుర్తింపు


బాధితుడు విదేశీయుడు కావడం.. తెల్లారితే అతని తనయుడికి శస్త్రచికిత్స ఉండటానికి తోడు పరిస్థితి చేయిదాటితే భాగ్యనగరం పరువు పలుచన అవుతుందనే ఉద్దేశంతో హుస్సేనిఆలం ఇన్‌స్పెక్టర్ రమేశ్ కొత్వాల్ సత్వరం స్పందించారు. విషయ తీవ్రత దృష్ట్యా టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ చైతన్యకుమార్ ఆదేశాలతో దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ బృందం మధుమోహన్‌రెడ్డి, ఎస్సైలు శ్రీశైలం, ప్రసాద్‌వర్మ, తఖియుద్దీన్, నరేందర్‌ల బృందం వెంటనే రంగంలోకి దిగింది. మసీదులోని సీసీ కెమెరాల్ని పరిశీలించడంతో పాటు పాత నేరస్థుల చిట్టాను పరిశీలించి.. మిర్జా రహమత్ బేగ్‌ను దొంగగా గుర్తించారు. పరిస్థితిని న్యాయస్థానానికి విన్నవించి బాధితుడికి సోమవారమే డబ్బు తిరిగి వచ్చేలా చేసి శభాష్ అనిపించుకున్నారు.



అఫ్గాన్ జాతీయుడికి డబ్బు అప్పగిస్తున్న కానిస్టేబుల్



నిందితుడు మిర్జా రహమత్‌బేగ్




భయాలు-అపోహలు వద్దు

'నాకెందుకు జబ్బులు వస్తాయి? వచ్చినపుడు చూసుకుందాం లే..' అనే నిర్లక్ష్యంతో కొందరు టీకాలు తీసుకోవటం మానేస్తుంటారు. టీకాలు ఖరీదైనవని కొందరు వెనకాడుతుంటారు. చికిత్సలకయ్యే ఖర్చుతో పోల్చుకుంటే వీటి ధర ఒక లెక్కలోకే రాదు. టీకాలతో నొప్పి పుడుతుందని, జ్వరం లాంటివి వస్తాయనేది మరికొందరి అపోహ. నిజానికి చాలావరకు టీకాలతో తీవ్రమైన దుష్ప్రభావాలేవీ ఉండవనే చెప్పుకోవాలి.

చిన్న జాగ్రత్త.. పెద్ద లాభం! టీకాలు మనకు సరిగ్గా ఇలాగే తోడ్పడతాయి. తీవ్ర దుష్పరిణామాలకు దారితీసే, ప్రాణాపాయాన్ని తెచ్చిపెట్టే ఇన్‌ఫెక్షన్లను సైతం ఇవి మూలంలోనే మట్టుపెడతాయి. నిరంతరం మన చుట్టూ ఎన్నెన్నో సూక్ష్మక్రిములు తిరుగాడుతున్నా నిశ్చింతగా జీవించే నిబ్బరాన్ని కలిగిస్తాయి. అయితే చాలామంది టీకాలు పిల్లలకేనని, పెద్దవాళ్లకు అవసరం లేదని భావిస్తుంటారు. కొందరు డాక్టర్లకూ వీటి గురించి పూర్తిగా తెలియకపోవటం గమనార్హం. ఇటీవలి కాలంలో స్వైన్‌ఫ్లూ వంటి జబ్బులు తరచుగా విజృంభిస్తుండటం.. వీటి మూలంగా కొందరు మృత్యువాత పడుతుండటం చూస్తూనే ఉన్నాం. ముందే టీకాలు తీసుకుంటే ఇలాంటి మరణాలను కచ్చితంగా ఆపేయొచ్చు. కాబట్టి పెద్దవాళ్ల టీకాలపై అవగాహన కలిగుండటం అవసరం. దాదాపు 25% మరణాలు ఇన్‌ఫెక్షన్ల మూలంగానే సంభవిస్తున్న నేపథ్యంలో ఇది అత్యంత ఆవశ్యకం కూడా.

పెద్దలకు మాత్రమే!



ఇప్పుడు ఆరోగ్యం మీద అందరికీ స్పృహ బాగానే పెరిగింది. రకరకాల హెల్త్ చెకప్‌లు చేయించుకోవటం, ఏయే జబ్బులు ముంచుకొచ్చే అవకాశముందో తెలుసుకోవటం, వాటిని ముందే నివారించుకోవటం ముఖ్యమనే భావనా బలపడుతోంది. కానీ ఎందుకనో పెద్దవాళ్ల టీకాల విషయంలో మాత్రం ఇంకా వెనకబడే ఉన్నాం. 'టీకాలా? పెద్దవాళ్లకా?' అని ఆశ్చర్యపోయేవారు కొందరైతే.. 'పెద్దవాళ్లకు కూడా టీకాలుంటాయా?' అని ప్రశ్నించేవారు మరికొందరు. చిన్నప్పుడు వేయించుకున్న టీకాలు ఎల్లకాలం పనిచేస్తాయని కొందరు అపోహ పడుతుంటారు. ఒకవేళ ఇన్‌ఫెక్షన్లు వచ్చినా మందులు వేసుకుంటే తగ్గిపోతాయి కదా అని ఇంకొందరు పొరపడుతుంటారు. ఇది ఏమాత్రం మంచిది కాదు. మామూలుగా కనిపించే ఫ్లూ, హెపటైటిస్, ఆటలమ్మ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు కూడా కొన్నిసార్లు తీవ్ర పరిణామాలకు దారితీయొచ్చు. ప్రాణాపాయమూ సంభవించొచ్చు. అదే టీకాలు తీసుకుంటే ఇలాంటి ఎన్నెన్నో జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఒకవేళ జబ్బులు వచ్చినా వాటి తీవ్రతను, దుష్పరిణామాలను తగ్గించుకోవచ్చు. విలువైన పనిదినాలు కూడా మిగులుతాయి. పిల్లల టీకాల విషయంలో మనకు స్పష్టమైన మార్గదర్శకాలున్నాయి. 'సార్వత్రిక టీకా కార్యక్రమం'లో భాగంగా వీటిని అమలు చేస్తున్నారు కూడా. కానీ పెద్దవాళ్ల టీకాలపై నిర్దిష్టమైన మార్గదర్శకాలేవీ లేవు. కొన్ని సంస్థలు, కేంద్ర ప్రభుత్వం విడివిడిగా కొన్ని మార్గదర్శకాలను రూపొందించినా వాటిని అంతటా ఆచరించటం లేదు. కాబట్టి రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించుకోవటం మంచిది.



డా॥ ఎం.వి. రావు
కన్సల్టెంట్ ఫిజీషియన్
యశోదా ఆసుపత్రి
సోమాజిగూడ
హైదరాబాద్

పెద్దయ్యాక టీకాలెందుకు?

చిన్నప్పుడు మనం రకరకాల టీకాలు తీసుకుంటుంటాం. అప్పుడు ఆయా వైరస్‌లను ఎదుర్కోవటానికి అవసరమైన యాంటీబాడీలు ఒంట్లో తయారవుతాయి. పెద్దయ్యాక వీటి సంఖ్య పెరగాలన్నా, మరింత ఎక్కువకాలం కొనసాగాలన్నా, సమర్థవంతంగా పనిచేయాలన్నా 'బూస్టర్ డోస్'లు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో యాంటీబాడీల సంఖ్య పెరిగి, రోగనిరోధకశక్తి పుంజుకుంటుంది. ఒకప్పుడు మనకు స్వైన్‌ఫ్లూ వంటి సమస్యలు లేవు. కొత్తగా పుట్టుకొచ్చి సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి కొత్త సమస్యలను నివారించుకోవటానికీ టీకాలు తోడ్పడతాయి. అలాగే మధుమేహం, శ్వాసకోశ సమస్యలు, దీర్ఘకాల కాలేయజబ్బు, హెచ్ఐవీ వంటి వాటితో బాధపడేవారిలో రోగనిరోధకశక్తి తగ్గుతుంటుంది. దీంతో ఇతరత్రా జబ్బులు త్వరగా అంటుకునే ప్రమాదముంది. కాబట్టి టీకాల అవసరం మరింత పెరుగుతోంది.

వృద్ధులపై మరింత శ్రద్ధ

పెద్దవాళ్ల టీకాల విషయంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది- వృద్ధుల గురించి. వృద్ధుల్లో రోగనిరోధక శక్తి తక్కువ. జబ్బులను ఎదుర్కొనే సామర్థ్యమూ క్షీణిస్తుంటుంది. దీంతో ఇన్‌ఫెక్షన్ జబ్బులు మరింత త్వరగా దాడిచేయటమే కాదు.. అవి తీవ్రంగానూ పరిణమిస్తుంటాయి. వీటి మూలంగా తరచుగా ఆసుపత్రుల్లో చేరటమే కాదు, ఎక్కువ రోజుల పాటు ఆసుపత్రుల్లో ఉండాల్సిన పరిస్థితీ దాపురిస్తోంది. కాబట్టి 60 ఏళ్లు పైబడిన అందరికీ టీకాల రక్షణ తప్పనిసరి. ఇన్‌ఫ్లూయెంజా, న్యూమోకాకల్ వంటి టీకాలను అవసరమైన మేరకు తీసుకోకపోతే తీవ్రమైన శ్వాస సమస్యలు తలెత్తొచ్చు. వీటి మూలంగానే ఎంతోమంది వృద్ధులు ఆసుపత్రుల్లో చేరుతుండటం గమనార్హం. కొందరికి రకరకాల అవయవాలు విఫలం కావొచ్చు. ప్రాణాపాయమూ సంభవించొచ్చు. అందువల్ల టీకాల విషయంలో నిర్లక్ష్యం అసలే పనికిరాదు.

టీకాలు పలు రకాలు

పెద్దవాళ్లకు వయసు, ఆరోగ్యం తీరుతెన్నులు, జీవనశైలి, చేసే పనుల వంటి వాటిని బట్టి టీకాలు అవసరపడతాయి. వీటి గురించి తెలుసుకొని ఉండటం అవసరం.

ఇన్‌ఫ్లూయెంజా టీకా

ప్రధానంగా ఫ్లూ వైరస్‌లలో నాలుగు రకాలు తీవ్ర ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంటాయి. వీటన్నింటికీ ఇప్పుడు ఒకే టీకా అందుబాటులో ఉంది. గర్భిణులకు, 65 ఏళ్లు పైబడిన అందరికీ ఈ టీకా తప్పనిసరి. గుండెజబ్బులు, ఆస్థమా, క్రానిక్ బ్రాంకైటిస్, మధుమేహం, కిడ్నీ వైఫల్యం, కాలేయ జబ్బులు, థలసీమియా, సికిల్‌సెల్, హెచ్ఐవీ వంటి సమస్యలు గలవారు, రోగనిరోధకశక్తిని తగ్గించే మందులు వేసుకునేవారు కూడా దీన్ని తీసుకోవాలి. అలాగే ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, నర్సులు, సిబ్బంది అంతా విధిగా ఫ్లూ టీకా తీసుకోవాలి.

- **ఏటా ఫ్లూ సీజన్ ఆరంభం కాకముందే దీన్ని తీసుకోవాల్సి ఉంటుంది.**

టీడ్యాప్ టీకా

ఇప్పుడు పిల్లలందరికీ కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం రాకుండా డీపీటీ (డిఫ్తీరియా, పెర్టుసిస్, టెటనస్) టీకా ఇస్తున్నారు. అయితే దీని మూలంగా పుట్టుకొచ్చిన యాంటీబాడీలు ఎల్లకాలం అలాగే ఉండాలనేమీ లేదు. వయసు పెరుగుతున్నకొద్దీ తగ్గిపోతుంటాయి. కాబట్టి పెద్దయ్యాక (టెటన్, డిఫ్తీరియా, ఎసెల్యులర్ పెర్టుటిస్) టీకా తీసుకోవాల్సి ఉంటుంది.

- **దీన్ని పది సంవత్సరాల వయసు నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి 65 ఏళ్లు వచ్చేవరకూ తీసుకోవాలి.**

ఎంఎంఆర్ టీకా

ఒకప్పుడు మనదగ్గర తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా సమస్యలను నివారించే ఎంఎంఆర్ (మీజిల్స్, మమ్స్, రుబెల్లా) టీకా అందుబాటులో లేదు. కాబట్టి ఇప్పటి వృద్ధులకు దీని రక్షణ లేదనే చెప్పుకోవాలి. అందువల్ల వృద్ధులంతా ఎంఎంఆర్ టీకా తీసుకోవటం మంచిది.

- **ఎంఎంఆర్ టీకాను ఎప్పుడైనా వేయించుకోవచ్చు. నెల వ్యవధిలో రెండు మోతాదులు తీసుకోవాలి. అయితే గర్భిణులు దీన్ని తీసుకోకూడదు.**

వారిసెల్లా టీకా

ఆటలమ్మ (చికన్‌పాక్స్) పెద్దగా ఇబ్బంది పెట్టే సమస్యేమీ కాదు. కానీ కొందరిలో ముఖ్యంగా.. రోగనిరోధకశక్తి తగ్గినవారిలో న్యుమోనియా వంటి సమస్యలకు దారితీయొచ్చు. ఇన్‌ఫెక్షన్ మెదడుకు వ్యాపించటం, సెకండరీ బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లూ తలెత్తొచ్చు. ఇవి ప్రాణాంతకంగానూ పరిణమించొచ్చు. కాబట్టి వారిసెల్లా టీకా తీసుకోవటం మంచిది. ఒకసారి ఆటలమ్మ వచ్చినవారికిది అవసరం లేదు. అయితే ఆటలమ్మ వచ్చిందో లేదో తెలియనివాళ్లు, గతంలో ఆటలమ్మ రానివాళ్లు తీసుకోవచ్చు. అలాగే చిన్నప్పుడు టీకా తీసుకున్నారో లేదో తెలియనివాళ్లూ వేయించుకోవాలి.

- **ఒకసారి టీకా తీసుకున్నాక నెల తర్వాత మరోసారి.. ఇలా రెండు మోతాదులు టీకా తీసుకోవాలి.**
- **50 ఏళ్లకు ముందు వారిసెల్లా టీకా తీసుకున్నట్టయితే 50 ఏళ్లు దాటిన తర్వాత ఒక బూస్టర్ టీకా వేయించుకోవాలి.**

హెర్పిస్ జోస్టర్ టీకా

హెర్పిస్ జోస్టర్ వైరస్ చికన్‌పాక్స్ రకానికి చెందినదే. దీని బారినపడ్డవారిలో పొట్ట మధ్యలోంచి వీపు మధ్య వరకు ఒకవైపున వరుసగా ఎర్రటి పొక్కులు వస్తుంటాయి. దీన్ని సర్పి, చల్డి, కంకర్ పత్తర్.. ఇలా రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. దీంతో భరించలేనంత నొప్పి వేధిస్తుంది. అరవై ఏళ్లు పైబడినవారికి సర్పి వచ్చే అవకాశం ఎక్కువ. పైగా వీరిలో సమస్య తీవ్రంగానూ వేధిస్తుంది.

- **ఇంతకుముందు సర్పి వచ్చినా, రాకపోయినా 60 ఏళ్లు పైబడిన అందరూ ఈ టీకా తీసుకోవాలి.**

టీటీపై జాగ్రత్త

మనదేశంలో చిన్న గాయమైనా.. ప్రతిసారీ టీటీ టీకా తీసుకోవటం చూస్తుంటాం. ఇది మంచి పద్ధతి కాదు. చిన్నప్పుడు డీపీటీ టీకాను పూర్తి మోతాదులో తీసుకుంటే ప్రతి పదేళ్లకు ఒకసారి బూస్టర్ టీకా తీసుకుంటే సరిపోతుంది. గాయమైన ప్రతిసారీ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇప్పుడిది టీడ్యాప్ రూపంలో లభిస్తోంది.

హెచ్‌పీవీ టీకా

హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) టీకాను మనదేశంలో ప్రస్తుతం అమ్మాయిలకే ఇస్తున్నారు. అయితే హెచ్‌పీవీ మూలంగా మగవారిలోనూ సమస్యలు బయలుదేరొచ్చు. కాబట్టి అబ్బాయిలకూ ఇవ్వటం అవసరం. అభివృద్ధి చెందిన దేశాల్లో దీన్ని అబ్బాయిలకూ ఇస్తుండటం గమనార్హం.

- **హెచ్‌పీవీ టీకాను లైంగికంగా చురుకుగా లేని వయసులోనే.. అంటే 11, 12 ఏళ్లలోనే ఇవ్వాల్సి ఉంటుంది. ఒకసారి తీసుకున్నాక రెండునెలల తర్వాత, తిరిగి ఆరు నెలల తర్వాత.. ఇలా మూడు సార్లు తీసుకోవాలి.**



న్యూమోకాకల్ టీకా

మనదేశంలో ఏటేటా న్యూమోకాకల్ ఇన్‌ఫెక్షన్లు (న్యుమోనియా, మెదడు పొరల వాపు, రక్తంలో ఇన్‌ఫెక్షన్) పెరిగిపోతున్నాయి. వీటితో మరణాలూ ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులకు మరణాల ముప్పు ఎక్కువ. అందువల్ల 65 ఏళ్లు దాటిన అందరికీ న్యూమోకాకల్ టీకా తప్పనిసరి.

- **ఇందులో రెండు రకాల (పీసీవీ13, పీపీఎస్‌వీ23) టీకాలున్నాయి. ముందు పీసీవీ13 తీసుకుని.. కనీసం ఏడాది తర్వాత పీపీఎస్‌వీ23 తీసుకోవాలి. ఇప్పటికే పీపీఎస్‌వీ23 తీసుకొని ఉంటే కనీసం ఏడాది తర్వాత పీసీవీ13 తీసుకోవాలి. ఒకవేళ 13 ఏళ్లలోపు పీసీవీ13 తీసుకుని ఉంటే మరోసారి తీసుకోవాల్సిన అవసరం లేదు.**

హెపటైటిస్ ఎ టీకా

హెపటైటిస్ ఎ ఇన్‌ఫెక్షన్ తరచుగా కనబడుతుంటుంది. చాలామంది 10-15 ఏళ్ల వయసుకు చేరుకునేసరికి ఒకసారైనా దీని బారిన పడుతుంటారని అంచనా. హాస్టళ్లలో ఉండేవారికి, బయటి తిండి తినేవారికి దీని ముప్పు ఎక్కువ. కాబట్టి వీరికి హెపటైటిస్ ఎ టీకా తప్పనిసరి. అలాగే హెపటైటిస్ ఇన్‌ఫెక్షన్లు గలవారితో సన్నిహితంగా ఉండేవారు, స్వలింగ సంపర్కులు, రక్తం గడ్డకట్టటంలో లోపాల వంటి సమస్యలు గలవారు, కాలేయ మార్పిడికోసం ఎదురుచూస్తున్నవారు, ఆహార పదార్థాలు వండి వార్చేవారు, మాదకద్రవ్యాల అలవాటు గలవారు కూడా దీన్ని తీసుకోవాలి.

- **హెపటైటిస్ ఎ టీకాను రెండుసార్లు తీసుకోవాలి. ఒకసారి తీసుకున్నాక ఆరు నెలల తర్వాత మరోసారి తీసుకోవాలి. జీవితంలో ఒకసారి తీసుకుంటే సరిపోతుంది.**
- **కొందరికి హెపటైటిస్ ఎ, బి వైరస్‌లు కలగలసి వస్తుంటాయి. అప్పుడు రెండు రకాల వైరస్‌లను ఎదుర్కొనే టీకాను ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని మూడుసార్లు తీసుకోవాలి. ఒకసారి తీసుకున్నాక.. తిరిగి నెల తర్వాత, మూడు నెలల తర్వాత తీసుకోవాలి.**

హెపటైటిస్ బి టీకా

హెపటైటిస్ ఎ ఇన్‌ఫెక్షన్ కన్నా హెపటైటిస్ బి ప్రమాదకరమైంది. దీంతో కాలేయం గట్టిపడటం, కాలేయ క్యాన్సర్ల వంటి తీవ్ర సమస్యలూ ముంచుకురావొచ్చు. కాబట్టి హెపటైటిస్ బి టీకాను వీలైనంత చిన్న వయసులోనే తీసుకోవటం ఉత్తమం. చాలావరకిది లైంగిక సంపర్కం ద్వారా, జననాంగస్రావాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. అందువల్ల హెపటైటిస్ బి ఇన్‌ఫెక్షన్ గలవారితో కలిసి జీవించేవారు ఒకసారి రక్తపరీక్ష చేయించుకొని టీకా తీసుకోవటం మంచిది. అలాగే డయాలసిస్ చేయించుకునేవారు, తరచుగా రక్తమార్పిడి అవసరమయ్యేవారు, కీమోథెరపీ తీసుకునేవారికి కూడా హెపటైటిస్ బి టీకా అవసరం.

- **హెపటైటిస్ బి టీకాను జీవితంలో ఒకసారి తీసుకుంటే సరిపోతుంది. ఒక మోతాదు తీసుకున్నాక.. నెల తర్వాత, తిరిగి ఆరు నెలల తర్వాత.. ఇలా మొత్తం మూడుసార్లు టీకా తీసుకోవాలి.**
- **చిన్నప్పుడు హెపటైటిస్ బి టీకా తీసుకుంటే మళ్లీ అవసరం లేదు. అయితే టీకా తీసుకున్నారో లేదో తెలియని సందర్భాల్లో తిరిగి తీసుకోవటమే మంచిది. వచ్చే నష్టమేమీ లేదు. అయితే హెపటైటిస్ బి పరీక్ష చేయించుకొని.. ఇన్‌ఫెక్షన్ లేనట్టు తేలితే వేసుకోవటం ఉత్తమం.**

మెనింజోకాకల్ టీకా

ఇది మెనింజోకాకస్ బ్యాక్టీరియా మూలంగా మెదడు పొరల్లో తలెత్తే వాపు నుంచి కాపాడుతుంది. అయితే ఈ టీకా అందరికీ అవసరం లేదు. పుట్టుకతోనే ప్లీహం లేనివారికి.. ఏవైనా సమస్యలతో గానీ, ప్రమాదాల మూలంగా గానీ ప్లీహం దెబ్బతిన్నవారికి అత్యవసరం. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు, సైనికులకు, ఆఫ్రికా వంటి దేశాలకు వెళ్లేవారికి, మక్కా వంటి ప్రాంతాలకు వెళ్లేవారికి కూడా అవసరం. ఎప్పుడైనా మెనింజైటిస్, న్యుమోనియా వంటివి విజృంభించిన సందర్భాల్లోనూ దీన్ని తీసుకోవాల్సి ఉంటుంది.

- **ఈ టీకాను జీవితంలో ఒకసారి తీసుకుంటే సరిపోతుంది. కొందరికి బూస్టర్ టీకా అవసరపడొచ్చు.**

టైఫాయిడ్ టీకా

ప్రతి సంవత్సరం ఎంతోమంది టైఫాయిడ్ జ్వరం బారినపడుతున్నారు. ఇది సాల్మోనెల్లా టైఫి బ్యాక్టీరియా మూలంగా వస్తుంది. దీని బారినపడ్డవారిలో తీవ్రమైన జ్వరం, నిస్సత్తువ, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలి తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు చర్మం మీద దద్దు కూడా రావొచ్చు. అందువల్ల టైఫాయిడ్ బారినపడకుండా చూసుకోవటం అవసరం. తరచుగా ప్రయాణాలు చేసేవారు, బయటి తిండి ఎక్కువగా తినేవారికి టైఫాయిడ్ టీకా తప్పనిసరి. టైఫాయిడ్ ఉద్ధృతంగా విజృంభించినపుడు బస్తీల్లో, వాడల్లో సామూహికంగా టీకాలు ఇవ్వాల్సి ఉంటుంది కూడా.

- **టైఫాయిడ్ టీకాను నోటి ద్వారానూ, సూదిమందు రూపంలోనూ ఇవ్వచ్చు. దీన్ని ప్రతి మూడేళ్లకు ఒక మోతాదు తీసుకుంటే సరిపోతుంది.**




వృషణాన్ని తొలగించారు.. ముమ్ముందు ఇబ్బందా?


సమస్య - సలహా

సమస్య: మా అబ్బాయి వయసు ఐదేళ్లు. ఒకరోజు వృషణాలు బాగా నొప్పి పెడుతున్నాయన్నాడు. చూస్తే వృషణాలు ఎర్రగా కందిపోయాయి. దగ్గర్లోని ఆసుపత్రికి తీసువెళ్తే వృషణాలు మెలితిరిగాయని చెప్పారు. రక్తసరఫరా నిలిచిపోయిందని అత్యవసరంగా ఆపరేషన్ చేశారు. ఒక వృషణాన్ని పూర్తిగా తొలగించారు. దీంతో పెద్దయ్యాక ఏదైనా సమస్య వస్తుందా? అని భయంగా ఉంది.

– ఎస్. సత్యనారాయణ



సలహా: మీ అబ్బాయి విషయంలో బాధపడాల్సిన పనేమీ లేదు. పెద్దయ్యాక శృంగారంలో పాల్గొనటానికి, సంతానాన్ని కనటానికి వచ్చిన ఇబ్బందేమీ ఉండదు. అదృష్టం కొద్దీ మన శరీరంలో కొన్ని అవయవాలు రెండేసి చొప్పున ఉంటాయి. ఒకటి దెబ్బతిన్నా రెండోది పనిచేస్తుంది. ఎవరికైనా కిడ్నీ మార్పిడి అవసరమైతే దగ్గరి బంధువులు దానం చేయటం చూస్తూనే ఉన్నాం. ఒక కిడ్నీని దానం చేసినా మామూలుగానే జీవించొచ్చు. అలాగే వృషణాలు కూడా. ఒక వృషణాన్ని తొలగించినా కూడా పెద్దయ్యాక సంతానం కనటానికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. సాధారణంగా ప్రమాదాల్లో వృషణాలు తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు, ఇన్‌ఫెక్షన్లు తలెత్తినపుడు, మెలితిరిగి రక్త సరఫరా ఆగిపోయినప్పుడు వృషణాలను తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. కొందరికి క్యాన్సర్ కణితుల మూలంగానూ తొలగిస్తుంటారు. వృషణాలు రెండు వైపులా వేర్వేరుగా ఎదుగుతూ వస్తాయి. కిందికి దిగుతుంటాయి. ఈ క్రమంలో కొందరికి వృషణాలు మెలితిరగొచ్చు. కొందరు పిల్లలు ఒక వృషణంతోనూ పుట్టటం చూస్తుంటాం. వృషణాలు చేసే ముఖ్యమైన పని పురుష హార్మోన్ అయిన టెస్టోస్టీరాన్‌ను, వీర్యాన్ని ఉత్పత్తి చేయటం. సంతానాన్ని కనటానికి ఒక వృషణం ఉన్నా సరిపోతుంది. కాబట్టి మీ అబ్బాయి విషయంలో బెంగ అవసరం లేదు. అయితే ఉన్న వృషణం దెబ్బతినకుండా చూసుకోవటం చాలా అవసరం. ఎత్తు నుంచి కింద పడకుండా.. సైకిల్ తొక్కేటప్పుడు, వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి. దెబ్బలు తగిలే అవకాశం గల బాక్సింగ్, కరాటే వంటి ఆటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అలాగే మూత్ర ఇన్‌ఫెక్షన్లు తలెత్తకుండానూ చూసుకోవాల్సి ఉంటుంది. మగవారిలో మూత్ర ఇన్‌ఫెక్షన్లు తలెత్తితే ప్రత్యుత్పత్తి అవయవాల మీదా దుష్ప్రభావం పడుతుంది. అందువల్ల నీరు ఎక్కువగా తాగేలా చూసుకోవాలి. ప్రతి 3 గంటలకు ఒకసారి మూత్ర విసర్జన చేయమని చెప్పాలి. మలబద్ధకంతోనూ మూత్ర ఇన్‌ఫెక్షన్లు రావొచ్చు కాబట్టి పండ్లు, కూరగాయలు ఎక్కువగా ఇవ్వాలి.



– డా॥ ఎ.నరేంద్రకుమార్
సీనియర్ పీడియాట్రిక్ సర్జన్

మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా
సమస్య – సలహా **సుఖీభవ**
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in


కీళ్లకు పీచు బలం!

మోకీళ్ల నొప్పుల బారినపడకుండా చూసుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఆహారంలో తగినంత పీచు ఉండేలా చూసుకోండి. ఎందుకంటే తగినంత పీచు తీసుకునే వృద్ధులకు మోకీళ్ల నొప్పుల ముప్పు 30% వరకు తగ్గుతున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. పీచుతో బరువు అదుపులో ఉంటుంది. అంతేకాదు.. పేగుల్లో మంచి బ్యాక్టీరియా కూడా వృద్ధి చెందుతుంది. ఇది ఒంట్లో వాపు ప్రక్రియ తగ్గుముఖం పట్టటానికి తోడ్పడుతుంది. ఇవన్నీ కీళ్లనొప్పులను తగ్గించేవే మరి.



పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. మణిశర్మని సంగీత దర్శకుడిగా ఎంచుకున్నారు. పూరి - మణిశర్మలది విజయవంతమైన జోడీ. వారిద్దరి కలయికలో వచ్చిన 'పోకిరి' సంగీతం పరంగానూ సంచలనం సృష్టించింది. రామ్ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించడం ఇదే తొలిసారి. ఈ నెలాఖరున షూటింగ్ ప్రారంభం అవుతుంది.

ఈనాడు సినిమా



త్రివిక్రమ్ సినిమాల్లో సునీల్‌కి మంచి పాత్రలు దక్కాయి. కథానాయకుడిగా మారాక త్రివిక్రమ్ సినిమాల్లో సునీల్ కనిపించలేదు. 'అరవింద సమేత వీర రాఘవ'లో నీలాంబరిగా మెప్పించాడు ఆయన. మరోసారి త్రివిక్రమ్ చిత్రంలో మంచి పాత్ర దక్కినట్టు సమాచారం. అల్లు అర్జున్ - త్రివిక్రమ్ కలయికలో ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇందులో సునీల్ ఓ కీలకమైన పాత్రలో కనిపిస్తాడట.

నాన్న అదృష్టం అమ్మ

- బాలకృష్ణ



'ఎన్టీఆర్ కథానాయకుడు'

మరుగున పడుతున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడానికే ఎన్టీఆర్ బయోపిక్ నిర్మించామని ప్రముఖ కథానాయకుడు నందమూరి బాలకృష్ణ తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జన్మస్థలమైన కృష్ణా జిల్లా పామర్రు మండలం నిమ్మకూరు గ్రామాన్ని నటులు విద్యాబాలన్, కల్యాణ్‌రామ్‌లతో కలిసి ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ బయోపిక్ విడుదలకు ముందు తమ తల్లిదండ్రులైన ఎన్టీఆర్, బసవరామ తారకం ఆశీస్సులతో పాటు బంధుమిత్రులను కలిసి వారి ఆశీర్వాదం తీసుకునేందుకు ఇక్కడికి వచ్చామన్నారు. ఎన్టీఆర్ బయోపిక్ రెండో భాగం చిత్రీకరణ మరో పదిరోజుల్లో పూర్తవుతుందన్నారు.

తెలుగు జాతికి వన్నె తెచ్చిన నాన్న ఎన్టీఆర్‌కి అమ్మ బసవ రామతారకం అదృష్టమని బాలకృష్ణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ కమర్షియల్ హీరో అయినప్పటికీ మహిళా ప్రాధాన్యమున్న సినిమాలు చేసి సందేశం ఇచ్చేవారన్నారు. నిమ్మకూరు గ్రామానికి వస్తే తన తల్లిదండ్రులతో పాటు 17 ఏళ్లపాటు తాత గారి వద్ద పెరిగిన అన్న హరికృష్ణ కూడా గుర్తొస్తున్నారన్నారు. మండలి వెంకటకృష్ణ పాత్రలో ఆయన కుమారుడు మండలి బుద్ధప్రసాద్, కోట్ల విజయభాస్కరరెడ్డి పాత్రలో వర్ల రామయ్య, హరికృష్ణ పాత్రలో కల్యాణ్‌రామ్ నటించారన్నారు. నటి విద్యాబాలన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ బయోపిక్‌లో నటించడం, ఆయన స్వగ్రామమైన నిమ్మకూరును సందర్శించడం తన అదృష్టమన్నారు. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే పట్టుదలకు, పౌరుషానికి నిదర్శమన్నారు. తొలుత గ్రామంలోని ఎన్టీఆర్, బసవరామతారకం కాంస్య విగ్రహాలకు బాలకృష్ణ, విద్యాబాలన్, కల్యాణ్‌రామ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. నందమూరి హరికృష్ణ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు చిత్ర బృందానికి స్వాగతం పలికారు.

- న్యూస్‌టుడే, పామర్రు గ్రామీణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ. చిత్రంలో కల్యాణ్‌రామ్, ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య, విద్యాబాలన్



'వినయ విధేయ రామ'



'పేట'

సినిమాలు సరే.. థియేటర్లేవి?

తెలుగు సినిమా పరిశ్రమలో తరచుగా వినిపించే మాట... థియేటర్ల గుత్తాధిపత్యం. కొద్దిమంది థియేటర్లని తమ ఆధీనంలో ఉంచుకొని, వారికి నచ్చిన సినిమాల్ని మాత్రమే ప్రదర్శించేందుకు వీలు కల్పిస్తున్నారని... మిగిలిన సినిమాల్ని విడుదలకి ముందే చంపేస్తున్నారనేది పలువురు నిర్మాతల ఆరోపణ. థియేటర్లు యజమానుల చేతుల్లో కాకుండా... లీజు పద్ధతిలో మరొకరి చేతుల్లోకి వెళ్లడంతోనే ఈ సమస్యంతా. ఇదివరకు విడుదల సమస్యలు పరిమిత వ్యయంతో తెరకెక్కే చిత్రాలకే ఎదురయ్యేవి. పెద్ద సినిమాలకి ఎలాగూ తారాబలం ఎక్కువగా ఉంటుంది కాబట్టి... వాటికున్న డిమాండ్ దృష్ట్యా థియేటర్లు లభిస్తుంటాయి. ఈసారి మాత్రం పెద్ద సినిమా విషయంలోనూ ఆ సమస్య వినిపిస్తోంది. తెలుగులో రజనీకాంత్ సినిమా విడుదలవుతోందంటే చాలా సినిమాలు వాయిదా పడుతుంటాయి. అలాంటిది ఆయన కథానాయకుడిగా నటించిన 'పేట'కే థియేటర్లు కరవయ్యాయి. దాంతో చాలా రోజులుగా వినిపించని థియేటర్ల గుత్తాధిపత్యం అనే మాట మళ్లీ తెరపైకొచ్చింది. కీలకమైన సంక్రాంతి పండగ సీజన్‌లో నాలుగు పెద్ద సినిమాలు విడుదలవుతుండడంతో థియేటర్ల కొరత ఏర్పడింది.

తెలుగు నాట సంక్రాంతి పండగ అంటే సినిమా పరిశ్రమకీ పండగే. ఏడాది మొత్తం జరిగే వ్యాపారంలో పావు భాగం ఈ పండగ రోజుల్లోనే జరుగుతుంది. అగ్ర కథానాయకుల చిత్రాలు రెండు మూడు చొప్పున ప్రేక్షకుల ముందుకొస్తుంటాయి. సంక్రాంతినే లక్ష్యంగా చేసుకొనే చిత్రాలు తెరకెక్కుతుంటాయంటే ఈ సీజన్‌కి సినిమా పరిశ్రమ ఎంత ప్రాధాన్యం ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు. పండగ రోజుల్లో ఎన్ని సినిమాలు విడుదలైనా చూస్తారని పరిశ్రమ వర్గాల నమ్మకం. అది నిజమే. తెలుగు ప్రేక్షకులకి సినిమా కూడా సంక్రాంతి పండగ సంబరాల్లో ఓ భాగం. అందుకే బాక్సాఫీసు ముందుకు కొత్త సినిమాలు వరస కడుతుంటాయి. ఈసారి ఏకంగా నాలుగు పెద్ద సినిమాలు విడుదలవుతున్నాయి. బాలకృష్ణ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన 'ఎన్టీఆర్ కథానాయకుడు', రజనీకాంత్ 'పేట', రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ', వెంకటేష్ - వరుణ్‌తేజ్‌ల 'ఎఫ్2' చిత్రాలు విడుదలవుతున్నాయి. ఈ చిత్రాలన్నీ కూడా అగ్ర కథానాయకులు నటించినవే. ఒక్క రోజు వ్యవధిలో విడుదలవుతుండడంతో వీటికి తగిన సంఖ్యలో థియేటర్లు దొరకడం కష్టంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 1600 పైచిలుకు థియేటర్లున్నాయి. ఎన్ని సినిమాలైనా వీటిలోనే ప్రదర్శితం కావాలి. ఇదివరకటిలా ఒకొక్క సినిమా వంద రోజులు ఆడే పరిస్థితులు ఉండుంటే ఈ థియేటర్లు చాలు. కానీ ఇప్పుడు ఏ సినిమా అయినా వారం, రెండు వారాల్లోనే సొమ్ములు చేసుకోవాల్సిన పరిస్థితి. దాంతో వీలైనన్ని ఎక్కువ థియటర్లలో తమ సినిమాల్ని విడుదల చేసుకొని, ఎక్కువ ప్రారంభ వసూళ్లు రాబట్టుకోవాలని నిర్మాతలు ప్రయత్నిస్తుంటారు. కానీ థియేటర్లేమో పరిమిత సంఖ్యలోనే అందుబాటులో ఉంటాయి కాబట్టి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఈసారి సంక్రాంతిని లక్ష్యంగా చేసుకొనే 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'వినయ విధేయ రామ', 'ఎఫ్2' చిత్రాలు రూపొందాయి. సంక్రాంతికి కొన్ని నెలల ముందు నుంచే నిర్మాతలు విడుదల తేదీని ఖరారు చేశారు. థియేటర్ల సంఖ్య అటు ఇటైనా ఆ నిర్మాతలు ముందస్తు ప్రణాళిక మేరకే సినిమాల్ని ఏ సమస్య లేకుండా విడుదల చేసుకొంటున్నారు. 'పేట' చిత్రం కూడా సంక్రాంతి బరిలోకి దిగడంతోనే ఆ సినిమా విడుదలకి సమస్యలు ఎదురయ్యాయి. తగిన థియేటర్లు దొరక్కపోవడంతో ఆ చిత్ర నిర్మాత వల్లభనేని అశోక్ తీవ్రంగా స్పందించారు. 'తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల మాఫియాని అరికట్టాల్సిన అవసరం ఉంద'ని ప్రభుత్వాల్ని కోరారు. సినిమా థియేటర్లని గుప్పెట్లో ఉంచుకొన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు నిర్మాతలపై అశోక్‌తో పాటు మరో నిర్మాత ప్రసన్నకుమార్ 'పేట' వేడుకలో చేసిన వ్యాఖ్యలు చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. సామాజిక మాధ్యమాల్లో ఈ విషయంపై వాడి వేడి యుద్ధం సాగుతోంది. ఇదివరకు తెలుగు రాష్ట్రాల్లో 4 వేలకిపైగా థియేటర్లుండేవి. అయితే ప్రేక్షకులు లేక చాలా థియేటర్లు కల్యాణ మంటపాలుగా మారిపోయాయి. దీంతో ఎక్కువ సినిమాలు విడుదలవుతున్నప్పుడంతా థియేటర్ల సమస్యని ఎదుర్కొంటున్నారు నిర్మాతలు.

పండగ సీజన్‌లో ఎన్ని సినిమాలు విడుదలైనా చూడ్డానికి ప్రేక్షకులు సిద్ధంగానే ఉంటారు. అందుకే అనువాద చిత్రాలు పండగని సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తుంటాయి. తమిళంలో తెరకెక్కిన చిత్రాలు తప్పనిసరిగా ఒకట్రెండు విడుదలవుతుంటాయి. 'పేట' అలా విడుదలవుతున్న చిత్రమే. అయితే తెలుగు చిత్ర పరిశ్రమకి సంక్రాంతి కీలకమైన సీజన్ కాబట్టి, ఈ సమయంలో అనువాద చిత్రాలు విడుదల కాకుండా అడ్డుకోవాలని ఇదివరకు నిర్మాతలు చలన చిత్ర వాణిజ్య మండలిపై ఒత్తిడి తీసుకొచ్చారు. కానీ థియేటర్ల నిర్వాహకులు 'పండగకి తగినన్ని సినిమాలు రాకపోతే మా పరిస్థితి ఏంటని? అలాంటప్పుడు అనువాద చిత్రాలే దిక్కు కదా' అనే వాదన వినిపించడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. నిజానికి నిర్మాతలు కూడా పెద్ద సినిమాల్ని ఒకేసారి విడుదల చేయడానికి ఇష్టపడరు. ఒక సినిమాకి మరో సినిమాకి ఒకట్రెండు వారాల విరామం ఉండేలా చూసుకొంటుంటారు. కానీ ఈసారి పండగతో పాటు సుదీర్ఘమైన వారాంతం కలిసొస్తుండడంతో నిర్మాతలు ధైర్యంగా విడుదల చేస్తున్నారు. థియేటర్ల సమస్యపై చలన చిత్ర వాణిజ్య మండలి ప్రధాన కార్యదర్శి ముత్యాల రాందాస్ మాట్లాడుతూ "అన్ని సినిమాలకీ థియేటర్లు దక్కాల్సిందే. అయితే తెలుగులో తెరకెక్కిన మూడు చిత్రాలు ముందస్తుగానే విడుదల తేదీల్ని ఖరారు చేశాయి. అయినా 'పేట'కి కూడా తగినన్ని థియేటర్లు కేటాయించవచ్చు. చిన్న చిత్రాలకి సమస్య ఎదురైనప్పుడు చలన చిత్ర వాణిజ్య మండలి చొరవ తీసుకొని పరిష్కరిస్తుంటుంది. ఈసారి విడుదలవుతున్నవన్నీ పెద్ద సినిమాలే" అన్నారు.

ఎలా సర్దుబాటు అవుతాయి?

"'వినయ విధేయ రామ', 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'ఎఫ్2' సంక్రాంతికి విడుదలవుతాయని ఆరు నెలల కిందటే ప్రకటించారు. వీటికే థియేటర్ల సర్దుబాటుకు నిర్మాతలు, పంపిణీదారులం ఇబ్బందులు పడుతున్నాం. అలాంటిది పదిహేను రోజుల ముందు 'పేట' సినిమాని కొనుక్కొని సంక్రాంతికి విడుదల చేస్తున్నట్టు ఆ నిర్మాత ప్రకటించారు. మూడు తెలుగు సినిమాలు విడుదలవుతున్నప్పుడు అనువాద చిత్రానికి థియేటర్లు ఎలా సర్దుబాటు అవుతాయి? ఇదే నిర్మాత ఈ నాలుగు నెలల్లో రెండు అనువాద చిత్రాలు విడుదల చేశారు. 'సర్కార్' సినిమాకి తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని థియేటర్లు కావాలో అన్ని వేసుకొన్నారు. ఇప్పుడు మాత్రం థియేటర్లు దొరకడం లేదని అనవసరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. మన తెలుగు సినిమాలకి కాకుండా, వేరే సినిమాలకి ఈ సీజన్‌లో థియేటర్లు ఇచ్చే పరిస్థితి లేదు. అనవసరంగా పిచ్చి మాటలు మాట్లాడారు. అలా నేనూ మాట్లాడగలను. కానీ నాకొక క్యారెక్టర్ ఉంది. ఇక్కడ మనం చేస్తున్నది వ్యాపారం. ఈ ఏడాదిలో పలు సినిమాల్ని పంపిణీ చేసి నష్టపోయా. సినిమాపై తపనతో ఏడాదికి ఇన్ని సినిమాలు నిర్మిస్తూ ఇక్కడున్నాం. ఆర్నెళ్ల కిందట ప్రకటించిన సినిమాలకి థియేటర్లు ఉండాలా వద్దా? అనేదే నా ప్రశ్న? అందరూ అర్థం చేసుకోవాలి".

- దిల్‌రాజు, నిర్మాత



దిల్‌రాజు, తమన్నా, మెహరీన్, వెంకటేష్, వరుణ్‌తేజ్, అనిల్ రావిపూడి, శిరీష్

చూస్తున్నంత సేపు నవ్వులే నవ్వులు

వెంకటేష్, వరుణ్‌తేజ్ కథానాయకులుగా నటించిన చిత్రం 'ఎఫ్ 2'. అనిల్ రావిపూడి దర్శకుడు. తమన్నా, మెహరీన్ కథానాయికలు. దిల్‌రాజు నిర్మాత. ఈనెల 12న విడుదల కానుంది. సోమవారం హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ "ఇంట్లో ఇల్లాలు, - వంటింట్లో ప్రియురాలు, మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్.. తరవాత ఆ స్థాయిలో వినోదం పంచే చిత్రమిది. సినిమా చూస్తున్నంత సేపు నవ్వుతూనే ఉంటారు. తమన్నా, మెహరీన్, వరుణ్ ఇలా అందరి పాత్రల్నీ దర్శకుడు బాగా డిజైన్ చేశాడ"న్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ "అనిల్ రావిపూడితో ఇది మూడో సినిమా. తనతో సినిమా అంటే హాయిగా ఉంటుంది. కథ చెబుతున్నప్పుడే బాగా ఆస్వాదించా. సెట్లోనూ ఆడుతూ పాడుతూ పనిచేశాడ"న్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "విభిన్నమైన చిత్రాలు చేయాలన్నది నా ఆశ. పూర్తి స్థాయి వినోదాత్మక పాత్ర దొరకలేదు. 'ఎఫ్ 2' నాకు అలాంటి పాత్రే ఇచ్చింది. వెంకీ కామెడీ ఇరగదీశారు. ఆయనతో పనిచేయడం సవాల్ లాంటిదే. అయితే ఆయన ఇచ్చిన సహకారంతో నటించగలిగాను. సినిమా చూస్తున్నప్పుడు ఒక్కరూ సీట్లో కుదురుగా కూర్చోలేరు. పడీ పడీ నవ్వుతుంటార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రచార చిత్రాల్లో ఎంతగా నవ్వించామో, దానికి పది రెట్ల వినోదం థియేటర్లో అందిస్తాం. దిల్‌రాజు గారితో సినిమా ఎప్పుడూ ప్రత్యేకమే. కుటుంబ సభ్యులతో కలసి ప్రయాణం చేసినట్టు ఉంటుంది. 2గంటల 26 నిమిషాల నిడివి గల సినిమా ఇది. అంతసేపు నవ్వుతూనే ఉంటార"న్నారు. "నిజ జీవితంలో ఎదురయ్యే సన్నివేశాలే తెరపైనా కనిపిస్తాయి. సాధారణంగా సెట్లో నా పని అవ్వగానే వెళ్లిపోతుంటా. కానీ.. ఈసారి మాత్రం షూటింగ్ అయ్యేంత వరకూ ఉండేదాన్ని" అన్నారు తమన్నా. మెహరీన్ మాట్లాడుతూ "ఇంత మంది అనుభవజ్ఞులతో పనిచేయడం మంచి అనుభవం. తొలిసారి నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాన"న్నారు. హర్షిత్ రెడ్డి, శిరీష్, సురేందర్‌రెడ్డి, ఝాన్సీ, మిర్చి కిరణ్, రచ్చ రవి తదితరులు పాల్గొన్నారు.

పంచ్ డైలాగ్

గుళ్లో దేవుణ్ని రోజూ చూడాలనుకోవడం తప్పు కాదు. కానీ ఆ దేవుడి పక్కనే చోటు కావాలనుకోవడం దురాశే.

చిత్రం: పెళ్లి చేసుకుందాం

- పంపినవారు: ములుకూరి సత్తిబాబు, చేబ్రోలు



వివేక్ ఒబెరాయ్

వెండితెర మోదీ

ప్రధాని నరేంద్రమోదీ జీవిత కథతో 'పీఎమ్ నరేంద్రమోదీ' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. మోదీగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటిస్తున్నారు. తాజాగా 23 భాషల్లో రూపొందించిన ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విడుదల చేశారు. 'మేరీ కోమ్', 'సరబ్‌జీత్' లాంటి బయోపిక్‌లతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఒమంగ్‌కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సురేష్ ఒబెరాయ్, సందీప్ సింగ్ నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.



రమి మలెక్

'గోల్డెన్ గ్లోబ్స్' విజేతలు వీరే



ఒలీవియా కోల్‌మన్

ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్స్ పురస్కారాల వేడుక సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఉత్సవానికి కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్ నగరం వేదికగా మారింది. కార్యక్రమానికి ప్రముఖ హాలీవుడ్ తారలంతా అట్టహాసమైన వస్త్రధారణతో హాజరై తమ అందచందాలతో ఆహూతులను అలరించారు. ప్రపంచ దేశాల నుంచి పోటీపడిన పలు సినిమాల్లోంచి ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి పురస్కారాలు అందజేశారు. ఈసారి విజేతల జాబితాలో అమెరికన్ హాస్య ప్రధాన చిత్రం 'గ్రీన్‌బుక్' మూడు పురస్కారాలతో అగ్రస్థానం దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో బ్రిటిష్ చిత్రం 'బొహెమియన్ రాప్సొడీ', స్పానిష్ చిత్రం 'రోమా' చెరో రెండు పురస్కారాలతో నిలిచాయి. వివిధ విభాగాల్లో విజేతల వివరాలివీ.

ఉత్తమ చిత్రం(డ్రామా): బొహెమియన్ రాప్సొడీ

ఉత్తమ చిత్రం(మ్యూజికల్ ఆర్ కామెడీ): గ్రీన్‌బుక్

ఉత్తమ నటుడు(డ్రామా): రమి మలెక్ (బొహెమియన్ రాప్సొడీ)

ఉత్తమ నటుడు(మ్యూజికల్ ఆర్ కామెడీ): క్రిస్టియన్ బాలె(వైస్)

ఉత్తమ నటి(డ్రామా): గ్లెన్ క్లోజ్(ది వైఫ్)

ఉత్తమ నటి(మ్యూజికల్ ఆర్ కామెడీ): ఒలీవియా కోల్‌మన్(ది ఫేవరెట్)

ఉత్తమ సహాయ నటుడు: మహెర్షలా అలీ(గ్రీన్‌బుక్)

ఉత్తమ సహాయ నటి: రెజీనా కింగ్(ఇఫ్ బీల్ స్ట్రీట్ కుడ్ టాక్)

ఉత్తమ దర్శకుడు: అల్ఫొన్సొ కొరొన్(రోమా)

ఉత్తమ స్క్రీన్‌ప్లే: నిక్, బ్రియాన్ క్యూరీ, పీటర్(గ్రీన్ బుక్)

ఉత్తమ విదేశీ భాషా చిత్రం: రోమా

ఉత్తమ యానిమేషన్ చిత్రం: స్పైడర్‌మ్యాన్: ఇన్ టు ది స్పైడర్ వెర్స్



అల్ఫొన్సొ కొరొన్

వసుంధర

సంక్రాంతి వేళ సొగసుగా!

పండగ వేళ అందంగా కనిపించాలనుకుంటాం. అలంకరణతో మెరిసిపోవాలనుకుంటాం. మంచిదే కానీ.... అది అతి కాకూడదు. సంప్రదాయాన్ని మేళవిస్తూనే ఆధునికంగా కనిపించడమే నయాట్రెండ్. ఆ చిట్కాలే చెబుతున్నారు మేకప్ ఆర్టిస్ట్ సునీత కారింగుల.



భారతీయ పండగలు మిగిలిన సందర్భాలకంటే కాస్త భిన్నం. ఒక్కోదానికి ఒక్కో ప్రత్యేకత. అన్ని పండగల్లోనూ సంక్రాంతి ఇంకాస్త ప్రత్యేకం. రంగు రంగుల దుస్తులు, రంగవల్లులు, పిండివంటలతో ఆ సందడే వేరు. సంప్రదాయ దుస్తులైన చీరలు, పరికిణీ ఓణీలతో పాటు క్రాప్‌టాప్, పొడవాటి గౌన్‌లను సాధారణంగా ఎంచుకుంటాం. ఆడంబరంగా కనిపిస్తూనే సింపుల్‌లుక్‌తో మెరిసిపోవాలని కోరుకుంటాం.







ముఖం: పండక్కి ఇంకా వారం రోజుల సమయం ఉంది. అప్పటికప్పుడు అందంగా కనిపించాలని తాపత్రయ పడటం కన్నా... ముందు నుంచీ జాగ్రత్తలు తీసుకోవాలి. అసలే శీతాకాలం... చర్మం పొడిబారి నిర్జీవంగా కనిపించకుండా తగినంత తేమ అందేలా చూసుకోవాలి. శరీరానికి ఆలివ్‌నూనెతో మర్దన చేసుకుని అరగంట అయ్యాక గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి. చర్మంపై తడి ఆరకుండానే మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఇలా రోజూ చేయడం వల్ల చర్మం తాజాగా కనిపిస్తుంది. వీటికితోడు మంచినీళ్లు ఎక్కువ తాగడం, కంటి నిండా నిద్రపోవడం కూడా ముఖ్యమే. అలానే రోజుకి ఒకసారైనా సరే... గులాబీరేకల్ని ముద్దగా చేసుకుని దానిలో చెంచా తేనె, రెండు చెంచాల చక్కెర, కొద్దిగా నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకుని మృదువుగా రుద్దుకోవాలి. ఇలా ఓ పదినిమిషాలు చేసి ముఖం కడిగేస్తే తాజాగా కనిపిస్తుంది.



జుట్టు: ఈ కాలంలో జుట్టు పొడిబారి నిర్జీవంగా ఉంటుంది. అందుకే ఆలివ్, గోరువెచ్చని కొబ్బరి నూనెలను సమపాళ్లలో తీసుకుని తలకు పట్టించాలి. అరగంటయ్యాక తలకు ఆవిరిపట్టాలి. పీహెచ్‌స్థాయి తక్కువగా ఉండే నాణ్యమైన షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారంలో రెండు సార్లు చేస్తే జుట్టు ఆరోగ్యంగా కనిపిస్తుంది. పండగ రోజు కూడా ఈ పద్ధతి తప్పకపోవడమే మేలు.

కేశాలంకరణ: చీరలు, పరికిణీ ఓణీలు, అనార్కలీలు, ఇండోవెస్ట్రన్ కుర్తీలను పండగవేళ ఎంచుకుంటాం. ఇలాంటప్పుడు ముఖ అందాన్ని మెరిపించే హెయిర్‌స్టైల్స్ పైనే ఎక్కువ దృష్టిపెట్టాలి. మీది ఉంగరాల జుట్టు అయితే ఈ పండక్కి సరదాగా హెయిర్ స్ట్రెయిటనింగ్ ప్రయత్నించండి. అదే స్ట్రెయిట్ హెయిర్ అయితే రింగులు తిప్పండి. అప్పుడే మీ రోజువారీ లుక్‌కి కాస్త భిన్నంగా కనిపించడం సాధ్యమవుతుంది. చీర కట్టుకున్నప్పుడు మెస్సీ హెయిర్‌బన్స్, ఫిష్‌టైల్ బాగుంటాయి. పరికిణీ ఓణీకి వాలుజడ మెప్పిస్తుంది. ఇండో వెస్ట్రన్ లుక్‌లో హెయిర్ స్టైల్‌ని ఎంచుకోవాలనుకున్నప్పుడు పక్కజడ ప్రత్యేకంగా కనిపించేలా చేస్తుంది.







అలంకరణ: నిజానికి పండగ సమయాల్లో అలంకరణ కాస్త తక్కువగా ఉంటేనే బాగుంటుంది. అయినవాళ్ల మధ్య అందంగా, సింపుల్‌గా కనిపిస్తేనే మనదైన ప్రత్యేకత. అయితే ముఖం మరీ నిర్జీవంగా కనిపిస్తోందా... ముందుగా ముఖాన్ని శుభ్రంగా కడుక్కుని మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఆపై ప్రైమర్‌ని అద్దుకుంటే ముఖంపై ముడతలు, గీతల వంటివి కనిపించవు. చివరిగా కాంపాక్ట్ పౌడర్‌ని అద్దుకోండి. ఇది కూడా అవసరం లేదనుకున్నప్పుడు మాయిశ్చరైజర్ రాసుకున్న ఐదు నిమిషాలకు కాంపాక్ట్ పౌడర్ రాసుకుంటే సరిపోతుంది. కళ్లకి మాత్రం ఐలైనర్, కాజల్, మస్కారా వాడాలి. ముఖ అందాన్ని రెట్టింపు చేయాలంటే నాణ్యమైన కాజల్‌తో వాటర్‌లైన్, లిడ్‌లైన్ కూడా దిద్దుకోవాలి. ఇలా చేస్తే కళ్లు కాస్త విశాలంగా ఉంటాయి. కనుపాప చక్కగా కనిపిస్తుంది. మస్కారా కూడా పెట్టుకుంటే మీ కళ్లు అందాన్ని రెట్టింపు చేస్తాయి.

పెదాలు: అలంకరణ అంతా పూర్తయ్యాక ఎరుపు, ప్లమ్, హాట్‌పింక్ వంటి రంగుల్లో చక్కటి లిప్‌గ్లాస్ వేసుకుంటే చాలు. పండగ కళ అంతా మీ దగ్గరే కనిపిస్తుంది.

మనసున మనసై

పాత ఏడాది మీరు చేయాలనుకుని చేయలేని పనులను ఈ సంవత్సరం చేసేయండి. ముఖ్యంగా మీ వైవాహిక బంధాన్ని బలోపేతం చేసే అంశాలపై దృష్టి పెట్టండి. అందుకోసం ఎలా ఉండాలో... ఉండకూడదో తెలుసుకోండి.

- మీ భాగస్వామి చేసే మంచి పనులను మెచ్చుకోవడం, అభినందించడం వల్ల మీ మధ్య బంధం మరింత బలపడుతుంది. ప్రయత్నించి చూడండి.
- మీ వారికి తెలియకుండా అతడి ఫోన్‌ను చూడటం మీకు అలవాటా... వద్దు! అలా చేయడం వల్ల కొత్త సమస్యలకు తెర తీసినవారవుతారు. కాబట్టి అలాంటి పనులకు దూరంగా ఉండండి.
- లైంగిక జీవితానికి సంబంధించిన సమస్యలు మీ మధ్య ఉన్నాయా... వాటిని మీరిద్దరూ మనసు విప్పి మాట్లాడుకోండి. ఇలా చేయడం వల్ల మీ మధ్య అనుబంధం మరింతగా దృఢమవుతుంది.
- వీలైనంతవరకూ ఇతరులతో మీ భాగస్వామిని పోల్చకూడదు. దానివల్ల సమస్యలు



పెరుగుతాయే తప్ప తగ్గవు. వివాహ బంధం ఒక పోటీ కాదు. ఈ విషయాన్ని అన్నివేళలా గుర్తుపెట్టుకుంటే సమస్యలు ఉండవు.
- అబద్ధాలు బంధాలను బలహీనం చేస్తాయి. పొరపాటుగా చెప్పే ఓ చిన్న అబద్ధం... దాన్ని కప్పిపుచ్చుకోవడానికి మరోటి... ఇంకోటి ఇలా అది కొనసాగుతూనే ఉంటుంది. కాబట్టి అనుబంధంలో నిజాయతీనే ముఖ్యం అని ఇద్దరూ గుర్తుపెట్టుకోవాలి.
- అన్ని వేళలా భాగస్వామి మనల్నే అంటిపెట్టుకునే ఉండాలని అనుకోకూడదు. బంధంతో పాటు భాగస్వామికి ఇతర బాధ్యతలు కూడా ఉంటాయని మరవకూడదు. కాబట్టి ఎంత అన్యోన్యతగా ఉన్నా... భాగస్వామికి ఏకాంతానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి.
- భాగస్వామిలో ఏదయినా సమస్య ఉందా... దానివల్ల మీరు బాధపడుతున్నారా... అయితే మౌనంగా ఉండిపోవద్దు. అవకాశం వచ్చినప్పుడు విమర్శించొద్దు. ఆ విషయాన్ని తనకు అర్థమయ్యేలా నేరుగా చెప్పండి. సమస్యను ఎలా పరిష్కరించాలనేది ఇద్దరూ కలిసి కూర్చుని ఆలోచించుకోవడం మంచిది.

బంగారం వెండి

7న ముగింపు-క్రితం



	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	32,820	32,970	32,550	32,500
ఆర్నమెంట్	30,660	30,790	30,200	30,150
వెండి (కిలో)	39,950	40,200	40,200	40,200
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	32,520	32,450	32,840	32,660
ఆర్నమెంట్	30,300	30,900	30,440	30,240
వెండి (కిలో)	40,000	40,000	40,100	40,000
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	32,480	32,150	-------	-------
ఆర్నమెంట్	30,210	30,240	3,044	3,024 గ్రా
వెండి (కిలో)	40,500	39,700	42.60	42.20 గ్రా

పోస్టుమార్టం చేశాక... భయపడేదాన్ని!



'డాక్టర్ ఇతడి తలకు పెద్దగా గాయం కావడం వల్ల చనిపోయాడు. ఈమెది ఆత్మహత్యేనని అనిపిస్తోంది. ఎందుకంటే ఈమె విషం తాగింది. ఇతడిని ఏదో పాము కాటేసినట్లుంది. అందుకే చనిపోయాడు...' ఈ సంభాషణ అంతా వైద్యుల మధ్య జరుగుతున్నట్లు అనిపిస్తుంది కదూ! కానీ కాదు. పోస్టుమార్టం గదిలో వైద్యుడి సహాయకురాలిగా పనిచేస్తున్న ఓ సాధారణ ఉద్యోగినిది. మామూలుగా ఎవరైనా చనిపోయారంటేనే చూడటానికి ఆలోచిస్తాం. అలాంటిది పోస్టుమార్టం చేయాలంటే మాటలా... కానీ ఆ పనే చేస్తోంది మంజూ దేవి.

మంజుది బిహార్ సంస్థీన్‌పూర్ జిల్లా. అక్కడి సదర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించే వైద్యుల దగ్గర సహాయకురాలిగా పని చేస్తుంది. శవాన్ని కోయడం, పంచనామా చేశాక తిరిగి కుట్లు వేయడం ఆమె పని. దాదాపు పద్దెనిమిది ఏళ్ల నుంచి ఈ పనులు చేస్తోంది. 'ఇక్కడ ఆసుపత్రి పెట్టినప్పటి నుంచి మా అత్తగారి కుటుంబానికి చెందినవారు ఈ పనే చేస్తున్నారు. మా వారేమో స్థానిక మున్సిపాలిటీలో చిన్న ఉద్యోగం చేసేవారు. మాకు అయిదుగురు పిల్లలు. 2001లో మావారు చనిపోయారు. దాంతో కుటుంబ భారం పెరిగింది. అత్తయ్యతో కలిసి నేను పోస్టుమార్టం పనిలో వైద్యులకు సహాయకురాలిగా చేయడానికి వెళ్లేదాన్ని. వెళ్లిన కొత్తలో ఆ శవాలు, దుర్వాసన, ఆ వాతావరణం చూస్తే వాంతి వచ్చేది. ప్రమాదాలకు గురై, పురుగుల మందులు తాగి, రకరకాల రోగాలతో... ఇలా ఎన్నో శవాలు వచ్చేవి. వాటిని చూస్తే చాలా భయమేసేది. అన్నింటినీ గుర్తుకు తెచ్చుకుంటే అన్నం సహించేది కాదు. రాత్రుళ్లు నిద్రపట్టేది కాదు. విపరీతంగా భయం వేసేది. ఆ తరువాత మెల్లిగా భయం పోయింది. శవాన్నీ ఎలా పంచనామా చేయాలో మా అత్తయ్య దగ్గర్నుంచి నేర్చుకున్నా. అయితే ఈ పని చేస్తుండటంతో చుట్టుపక్కల వారు మమ్మల్ని ఈసడించుకునేవారు. నేను వస్తుంటే చూసి.. దూరం తప్పుకొనేవారు. అందుకు నాకు చాలా బాధేసేది. చాలారోజులు తొందరపడి ఈ పని ఒప్పుకొన్నానా అని ఏడ్చిన రోజులు కూడా ఉన్నాయి. ఇప్పుడు అలాంటివేవి లేవు' అంటూ ఆ రోజులు గుర్తు చేసుకుంటుంది మంజు.

మొదట్లో మంజుకు ఇందులో ప్రాథమిక విషయాలు కూడా తెలిసేవి కావు. ఇప్పుడు శవ పంచనామాకు సంబంధించిన ప్రతి అంశం ఆమెకు తెలుసు. ఇప్పటి వరకు ఆమె పదమూడు వేల శవాలకు పంచనామా చేసింది. ఆ సమయంలో శవాలను కోయడం, తిరిగి కుట్టడం లాంటి అన్ని పనులు ఆమే చేస్తుంది.

ఆదాయమూ తక్కువే...

మంజు అత్తయ్య 2004లో చనిపోవడంతో ఆ పనులు చేయడం మొదలుపెట్టింది. 2006లో ఆమెను తాత్కాలిక ఉద్యోగినిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు అధికారులు. ఆమె పదోతరగతి వరకే చదువుకుంది. ఒకరోజు శవ పంచనామాలో సాయం చేసినందుకు నూట పది రూపాయలు రోజువారీ కూలీగా ఇస్తారు. ఒక్కో రోజు శవం ఉండొచ్చు ఉండకపోవచ్చు. పంచనామా లేని రోజున రూపాయి కూడా ఇవ్వరు. 'ఇన్ని చేస్తున్నా... ఇప్పటి వరకు నేను తాత్కాలిక ఉద్యోగినే. నా విధుల్ని శాశ్వతం చేయమని అధికారుల్ని అడుగుతున్నా. నా కథ దేశవ్యాప్తంగా అందరికీ తెలియడంతో ఇప్పుడిప్పుడే నాయకులు పరిగణిస్తామని చెబుతున్నారు. ఆర్థికంగా సమస్యలు ఉన్నా... నేను మాత్రం పనిలో సంతృప్తి పొందుతా. ఏదో ఒక రోజు నా డ్యూటీని పర్మినెంట్ చేస్తారని ఆశగా ఎదురుచూస్తున్నా. ప్రస్తుతం మా పెద్దబ్బాయి, మూడో అబ్బాయి సంగీతం నేర్చుకుని ఇతరులకు శిక్షణ ఇస్తున్నారు. అమ్మాయికి పెళ్లయ్యింది. ఇద్దరు కవలలు. తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వీళ్లందరికోసం ఎంతకష్టమైనా పడటానికి నేను సిద్ధమే...' అని చెబుతుంది నలభై ఐదేళ్ల మంజూదేవి.

బిడ్డకు తండ్రిని కాదంటున్నాడు!

? నాకు మూడేళ్లక్రితం పెళ్లయ్యింది. ఒక బాబు. పెళ్లయిన మూడు నెలల నుంచే మా అత్తింటివారు వేధించడం మొదలుపెట్టారు. ఈ వేధింపుల వల్లే ఒకసారి అబార్షన్ కూడా అయ్యింది. బాబు నాకు, మా వారికి పుట్టలేదని నిందలు వేస్తున్నారు. ఈ విషయాన్ని పెద్దల పంచాయతీలో చర్చకు తెచ్చాం. వారి ముందు బాగానే చూసుకుంటాం అని చెప్పి వెళ్లారు. ఇంటికి వెళ్తే మళ్లీ పరిస్థితి మామూలే. ఈ సారి సూటిపోటి మాటలతోనే కాకుండా శారీరకంగానూ హింసించడం మొదలుపెట్టారు. మా అత్త పేపర్‌పై సంతకం చేయించి 'ఈ ఇంటికీ నీకు ఎలాంటి సంబంధం లేదు వెళ్లిపో' అని అంటూ ఒత్తిడి తెచ్చింది. నేను వెళ్లకపోయే సరికి నా వస్తువులన్నీ బయటపడేసి ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. నాకు న్యాయం ఎలా జరుగుతుందో చెప్పగలరు? - ఓ సోదరి

✔ మీరు పడ్డ బాధ చూస్తుంటే మీ అత్తింటివాళ్ల మీద గృహహింస కేసు పెట్టాల్సిన అవసరం ఉంది. మీరు ఇప్పటిదాకా వాళ్ల మీద ఎటువంటి క్రిమినల్ కేసు పెట్టకపోతే ఇప్పుడు ఆ పని చేయండి. అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని సెక్షన్ 498ఎ కింద క్రిమినల్ కేసు పెట్టండి. వారు కేసు పూర్వాపరాలు పరిశీలించి మీరు ఎవరిమీద అయితే ఫిర్యాదు చేశారో వారిని పిలిపించి కౌన్సెలింగ్ చేస్తారు. అలా మారే అవకాశం లేనప్పుడు కేసు కోర్టుకి పంపిస్తారు. లేదంటే గృహహింస కేసు కింద కోర్టుకి వెళ్లండి. దానిలోని సెక్షన్ 18 ప్రకారం మీ అత్తింటివాళ్లు పెట్టే హింస నుంచి రక్షణ కోరుతూ ఉత్తర్వులు పొందవచ్చు. సెక్షన్ 19 కింద షేర్డ్ హౌస్‌హోల్డ్... అంటే ఆ ఇంట్లో ఉండే హక్కు కూడా అందుకోవచ్చు. అలానే సెక్షన్ 20 ప్రకారం వైద్య అవసరాలు, పిల్లల చదువుల ఖర్చులు...ఇలా నెల మొత్తానికి ఒకేసారి భరణం పొందవచ్చు. ఒకవేళ వాళ్లు మీ బాబుని తీసుకోవడానికి ప్రయత్నిస్తే సెక్షన్ 21 ప్రకారం కస్టడీ ఆర్డర్ అడగొచ్చు. సెక్షన్ 22 ప్రకారం మీరు ఇన్నాళ్లు పడ్డ మానసిక, శారీరక వేదనకు నష్టపరిహారాన్ని అడిగే అవకాశమూ ఉంది. ఇవన్నీ కోర్టు ఉత్తర్వుల ద్వారా పొందాలంటే దానికి తగిన సాక్ష్యాధారాలను వారికి అందించాల్సి ఉంటుంది. మీ అత్తయ్య మీ చేత విడాకుల కాగితంపై సంతకం పెట్టించినా అది బలవంతంగా మీతో పెట్టించారని కోర్టుకి తెలియచేయండి. మిమ్మల్ని ఇంట్లో నుంచి గెంటేయడం, ఫోన్ లాక్కోవడం వంటివి అమానుషం. ఈ పనులన్నింటికీ వాళ్లకి కచ్చితంగా శిక్ష పడాలంటే మీరు వాళ్ల మీద క్రిమినల్ కేసు కూడా పెట్టాలి. మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్‌లకు ఫిర్యాదు చేయవచ్చు. వారు అత్తింటివారు మిమ్మల్ని పెడుతున్న బాధలకు పోలీస్‌వారిని పిలిపించి కేస్ రిజిస్టర్ చేయమని ఆదేశించే అవకాశాలున్నాయి. మీరు న్యాయపరమైన సాయం కావాలంటే లీగల్ సర్వీసెస్ అథారిటీ వారిని సంప్రదిస్తే మీ తరఫున వారు మీకు ఒక లాయర్‌ని ఏర్పాటు చేస్తారు.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది


– మీ సందేహాలను, సమస్యల్ని vasulegal@eenadu.net కు పంపించగలరు.

నజరానా

చేప ముక్కలను నిల్వ చేయాలనుకుంటున్నారా... వాటికి ఉప్పు రాసి డీప్‌ఫ్రిజర్‌లో పెట్టి చూడండి. ముక్కలు ఒకదానికి ఒకటి అతుక్కోవు. వాటిపై ఐసు కూడా పేరుకోదు. వండుకోవడానికి సిద్ధంగా ఉంటాయి.

రంగవల్లిక

15 చుక్కలు, 5 వరుసలు. 5 వచ్చేవరకు.





- కట్టోజు సుహాసిని
హైదరాబాద్

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
✦ email: vasundhara@eenadu.net

ముత్యాల ముగ్గుల పోటీ

ఈటీవీ తెలంగాణ జనవరి 6, 2019 విజేతలు

1. ఎం.జ్యోతి, ఖమ్మం 2. కె.పరిణీత, ఖమ్మం 3. కె.నాగమణి, ముదిగొండ-ఖమ్మం 4. కె.విద్యుల్లత, కొల్లాపూర్ -నాగర్‌కర్నూల్ 5. కె.నిర్మలాదేవి, న్యూబోయిన్‌పల్లి-హైదరాబాద్ 6. ఎన్.హృద్విష, జగద్గిరిగుట్ట - హైదరాబాద్ 7. పి.అంజలి, భద్రాచలం 8. టి.అశ్వని, ఛత్రినాక - హైదరాబాద్ 9. బి.నర్సవ్వ, మునిపల్లి-నిర్మల్ 10. జి.రోజారాణి, కేసముద్రం-మహబూబాబాద్

చదువు

వైవిధ్య

హెచ్‌సీయూ వృత్తి విద్య

4 కొత్త కోర్సులు

ఉద్యోగాలను ఎక్కువగా అందిస్తున్న రంగాల్లో వైద్యం, విద్య, గ్రామీణాభివృద్ధి ప్రధానమైనవి. వీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని హెచ్‌సీయూ వృత్తి విద్యలో సాధారణ డిగ్రీ అభ్యర్థులు చేయదగిన నాలుగు కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యాలను పెంచుకోడానికీ, విద్యారంగంలో సరికొత్త టెక్నాలజీ వినియోగాన్ని అందిపుచ్చుకోడానికీ, గ్రామీణాభివృద్ధిలో సమర్థంగా భాగస్వాములు కావడానికి ఈ కోర్సులు దోహదపడతాయి. వేగంగా ఉపాధినీ అందిస్తాయి.



వైద్యం, బోధన, పాలన, గ్రామీణాభివృద్ధి రంగాల్లో హెచ్‌సీయూ దూరవిద్యా విభాగం కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించే దిశగా ఇతర సంస్థలతో ఒప్పందాలు చేసుకుని, వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది.

బోధనలో..: కళాశాలలు, పాఠశాలల్లో పని చేసే అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఇప్పటికీ చాలామంది సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఈ లోటును భర్తీ చేసే విధంగా 'ఎడ్యుకేషనల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్' కోర్సును రూపొందించారు. బ్లాక్‌బోర్డు విధానం తెరమరుగైన నేపథ్యంలో కొత్త విధానాలకు అనుగుణంగా బోధకుల్లో ఎటువంటి మార్పులు అవసరమో గుర్తించి వాటిని ఈ కోర్సు ద్వారా అందిస్తారు. ఇది ఏడాది కోర్సు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నార్మ్ (నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్)లోని టెక్నాలజీ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎవరైనా ప్రవేశాలు పొందవచ్చు. కళాశాలల్లో, పాఠశాలల్లో పనిచేసే విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులకు టీచింగ్ టెక్నాలజీని ఉపయోగించుకుంటూ పాఠాలు ఎలా బోధించాలనేది వివరిస్తారు. నార్మ్‌లో ఉన్న అత్యంత మెరుగైన 'ఈ-లెర్నింగ్ ల్యాబ్' ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఈ కోర్సును బోధిస్తారు. దేశంలో ఎటువంటి విశ్వవిద్యాలయమూ ఇప్పటివరకు ఇంతటి నైపుణ్యాలతో కూడిన కోర్సును దూరవిద్య ద్వారా అందించటం లేదని కోర్సు నిర్వాహకులు తెలిపారు. కోర్సు ఫీజు- రూ.25 వేలు (సెమిస్టర్‌కి 12,500).

పాలన, గ్రామీణాభివృద్ధి..: 'డిప్లొమా ఇన్ పంచాయతీరాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్' కోర్సును అందుబాటులోకి తెచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, గ్రామాల అభివృద్ధిని ఎలా చేసుకోవాలి, అందుకు తగిన వనరులను ఎలా సమకూర్చుకోవాలి.. అనే అంశాలపై శిక్షణ ఇస్తారు. గ్రామాల్లో పనిచేసే అనేక సంస్థలు, ఉద్యోగులు, ఈ కోర్సు ద్వారా మరింత నైపుణ్యాలను అందిపుచ్చుకోవచ్చు. లబ్ధి పొందవచ్చు. ఎన్‌జీవోల ఉద్యోగ, వృత్తి అవకాశాలు మెరుగుపడతాయి. దీనికి సంబంధించి భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖలతో ఒప్పందాలు చేసుకొని కోర్సును రూపొందించారు. ఈ కోర్సుకు ఏడాదికి ఫీజు రూ.10 వేలు (సెమిస్టర్‌కి రూ.5 వేలు).

ఈ కోర్సులకు కనిష్ఠ వయసు- 18 సంవత్సరాలు. గరిష్ఠ వయః పరిమితి లేదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ వృత్తిలో నైపుణ్యాలు మెరుగుపరిచే విధంగా ఈ పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ కోర్సు మెటీరియల్‌ను మూడు విభాగాలుగా చేసి విద్యార్థులకు అందజేస్తున్నారు. సాఫ్ట్, హార్డ్ కాపీల రూపంలో విద్యార్థులు వీటిని పొందవచ్చు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు: 2019 జనవరి 31

ఆలస్య రుసుము గడువు: ఫిబ్రవరి 15, 2019

- **సీహెచ్.మురళీకృష్ణ,** ఈనాడు, హైదరాబాద్

వైద్యరంగంలో..

అపోలో మెడ్ స్కిల్స్‌తో ఒప్పందం చేసుకొని 'పీజీ డిప్లొమా ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్', 'పీజీ డిప్లొమా ఇన్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్' కోర్సులను అందిస్తున్నారు. ఈ రెండు కోర్సుల పాఠ్యాంశాలను ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా రూపొందించారు. కొత్తగా డిగ్రీలు పూర్తి చేసిన వారు ఈ కోర్సు పూర్తిచేస్తే వెంటనే ఉపాధి లభించే అవకాశం ఉంది. ఇప్పటికే ఆసుపత్రుల్లో పనిచేసేవారు ఈ కోర్సులు చేసి నైపుణ్యాలను పెంచుకోవచ్చు. సెమిస్టర్‌కి ఫీజు రూ.30 వేలు. డిగ్రీ కనీస అర్హతగా నిర్ణయించారు. ఆంగ్లంలోనే బోధన ఉంటుంది.

ఏ డిగ్రీ చదివిన వారైనా అర్హులే..

దూరవిద్య ద్వారా హెచ్‌సీయూ అందిస్తున్న కోర్సులు చేసేందుకు ఏ విభాగంలో డిగ్రీ పూర్తి చేసినవారైనా అర్హులే. దరఖాస్తు రుసుము రూ.300లు. 2017లో 1500 మంది దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో పరిశీలన అనంతరం 900 మందికి ప్రవేశాలు కల్పించాము. అదనపు వివరాలకు అబిడ్స్‌లోని హెచ్‌సీయూ దూరవిద్య కార్యాలయంలో సంప్రదించవచ్చు. 8897436905, 040-24600264 ఫోన్ నంబర్ల ద్వారా, యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా కూడా అదనపు వివరాలు పొందవచ్చు.



- **జిలానీ,** దూరవిద్య కేంద్రం ప్రిన్సిపల్

కెరియర్ గైడెన్స్ పబ్లిక్ రిలేషన్స్

సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం మీదే సమస్త ప్రపంచ లావాదేవీలు సాగుతుంటాయి. అలా అందుకోడానికైనా.. అందించడానికైనా దాదాపు అన్ని సంస్థల్లోనూ అందరికీ ఒక బంధువు అందుబాటులో ఉంటారు.. వారే ప్రజాసంబంధాల అధికారి. మల్టీనేషనల్ కంపెనీలైనా.. మనదేశంలోని సంస్థలైనా కస్టమర్లతో కనెక్ట్ కావడానికి వీరు సాయం చేస్తారు. వస్తువులు, సేవలు.. సంస్థల కార్యకలాపాలు ఏమైనా ప్రజల్లో బలమైన ప్రభావాన్ని కలిగిస్తారు. పాలసీ నిర్ణయాలను, ఉత్పత్తుల వివరాలను ఎప్పటికప్పుడు జనానికి తెలియజేసి సంస్థలకు అదనపు 'గుడ్‌విల్'ను ఈ అధికారులు జోడిస్తారు.





'ఫలానా సంస్థలో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఫలానా వారు ఎంపికయ్యారు', 'ఈ మొబైల్ సంస్థ కొత్త వెర్షన్ ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకురానుంది', 'ఆ సంస్థ నుంచి కొత్త ఉత్పత్తి రానుంది'- నిజానికి ఇవన్నీ ఆయా సంస్థల అంతర్గత విషయాలు. సంస్థల పనితీరు, మార్కెటింగ్‌పై ప్రభావం చూపే ఈ అంశాలన్నీ ప్రజలందరికీ ఎలా తెలుస్తున్నాయి? దీనికి సమాధానం- పబ్లిక్ రిలేషన్స్ విభాగం. వాటిలో విధులు నిర్వహించేవారు ప్రజాసంబంధ అధికారులు (పీఆర్‌ఓలు).

వ్యాపార సంస్థ, లాభాపేక్ష లేని సంస్థ, విద్యాలయాలు.. ఇలా సంస్థ ఏదైనా తమ కార్యకలాపాలు ప్రజల దృష్టిలో పడేలా చేయడానికి వీరు ఉపయోగపడతారు. అడ్వర్టైజింగ్, మార్కెటింగ్ వీరి పరిధిలోకి రావు. తనకున్న మౌలిక వసతులతో సంస్థ బ్రాండ్‌కు సంబంధించిన బలమైన ముద్ర ప్రజలపై పడేలా చేస్తారు. అడ్వర్టైజింగ్, మార్కెటింగ్‌లు సంస్థ తయారు చేసిన వస్తువునో, సేవలనో ఖరీదు చేసేలా చేసి ఆదాయాన్ని సమకూరుస్తాయి. పబ్లిక్ రిలేషన్స్ మాత్రం కళ్లకు కనిపించని విలువను సంస్థలకు అందిస్తాయి.

తమ వినియోగదారులు, వాటాదారులు, భాగస్వాములు, ఉద్యోగులు మొదలైనవారికి సంస్థకు సంబంధించిన ఉదాహరణకు- సంస్థ నాయకత్వం, తీసుకునే నిర్ణయాలు, అందించబోయే ఉత్పత్తులు మొదలైన అంశాలన్నింటిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తారు. మొత్తంగా సంస్థకు సంబంధించిన 'గుడ్ విల్'కు కారణమవుతారు.

మనదేశంలో పీఆర్ వ్యవస్థకు గత రెండు దశాబ్దాలుగా గుర్తింపు పెరిగింది. కాలక్రమేణా ఆదరణను పెంచుకుంటోంది. దీనిలో ఎక్కువ పోటీ ఉండటంతోపాటు కెరియర్‌పరంగానూ మంచి ఎదుగుదల ఉంటుంది. అన్ని పరిశ్రమల్లోనూ ఈ రంగంలో గిరాకీకి తగ్గట్టుగా నిపుణులు అందుబాటులో లేరు. దీంతో కొత్తగా వచ్చేవారికి మంచి అవకాశాలున్నాయి. సంబంధిత నైపుణ్యాలను పెంచుకోవటానికి శిక్షణనిచ్చే ఎన్నో సంస్థలు అందుబాటులో ఉన్నాయి.

ఎన్నో కోర్సులు

పీఆర్‌ఓలు తమ సంస్థ బ్రాండ్ ప్రాముఖ్యాన్ని ప్రజలకు తెలియజేయగలగాలి. ప్రజలను ఒప్పించగలిగేలా చేయాలంటే అందుకు తగిన నైపుణ్యాలు తప్పకుండా ఉండాలి. దీనితోపాటు సంబంధిత డిగ్రీ కూడా వీరికి అవసరం. ప్రజాసంబంధాలకు సంబంధించి ఎన్నో సంస్థలు డిప్లొమా, పీజీ, ఎంఫిల్, డాక్టరేట్ కోర్సులను అందిస్తున్నాయి. చాలామంది పీజీ స్థాయిలో పీఆర్ కోర్సులను ఎంచుకుంటున్నారు.

డిప్లొమా: ఎక్కువగా కాంబినేషన్‌తో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అడ్వర్టైజింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్, జర్నలిజంతోపాటుగా అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ చేసిన వారు ఎవరైనా ఎంచుకోవచ్చు. కోర్సు కాలవ్యవధి ఏడాది. డిప్లొమా పూర్తిచేసినవారికి అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

డిగ్రీ: బీఏ (పబ్లిక్ రిలేషన్స్) అందుబాటులో ఉంది. ఇంటర్మీడియట్ పూర్తిచేసినవారు అర్హులు. కోర్సు కాలవ్యవధి- మూడేళ్లు. సెమిస్టర్లుంటాయి.

పీజీ: పీజీ డిప్లొమా, మాస్టర్స్ ఇన్ పబ్లిక్ రిలేషన్స్, ఎంబీఏ (పబ్లిక్ రిలేషన్స్), ఎంఏ (పబ్లిక్ రిలేషన్స్), ఎంఫిల్ కోర్సులున్నాయి. కోర్సుల కాలవ్యవధి ఏడాది నుంచి రెండేళ్లు. ఈ కోర్సులకు ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. ఎక్కువగా సోషల్ సైన్సెస్, లిబరల్ ఆర్ట్స్, జర్నలిజం, సైకాలజీ, హ్యూమానిటీస్‌లో డిగ్రీ చేసినవారు ఎక్కువగా పీజీ స్థాయిలో పబ్లిక్ రిలేషన్స్‌ను ఎంచుకుంటున్నారు.

పీహెచ్‌డీ: పబ్లిక్ రిలేషన్స్‌లో డాక్టరేట్ పట్టా సాధించాలనుకునేవారికి డాక్టొరల్ కోర్సులూ అందుబాటులో ఉన్నాయి.

చాలామంది ఉన్నతస్థాయిలో పీఆర్ కోర్సులను అభ్యసించడానికి విదేశాలకూ వెళుతున్నారు. కోర్సుల్లో ప్రవేశానికి చాలా సంస్థలు తమకంటూ ప్రత్యేకంగా ప్రవేశపరీక్షలను నిర్వహిస్తుండగా మరికొన్ని మెరిట్ ఆధారంగా ఎంచుకుంటున్నాయి. కోర్సులకు సంబంధించిన నోటిఫికేషన్లు సాధారణంగా మే, జూన్ నెలల్లో విడుదలవుతాయి.

కోర్సు, అందించే విద్యాసంస్థను బట్టి ఫీజుల్లో తేడాలున్నాయి. సాధారణంగా ఏడాదికి ఫీజు రూ.15,000 నుంచి రూ.2,00,000 వరకూ తీసుకుంటున్నారు.



విభిన్న రకాల విధులు

★ పీఆర్‌ఓలు సంస్థల పేరు ప్రఖ్యాతులకు ఎలాంటి ఇబ్బందీ రాకుండా చూసుకుంటారు. ఉదాహరణకు- సంస్థపై ఏదైనా వదంతి రావడమో, తప్పుడు సమాచారం, అపోహలూ వ్యాపించడమో జరగవచ్చు. అలాంటి సందర్భాల్లో సందిగ్ధతకు తావు లేకుండా కచ్చితమైన, విశ్వసనీయమైన వివరణను మీడియాకూ, ప్రజలకూ అందిస్తారు.

★ ఏదైనా సంఘటన జరిగినపుడు దానికి సంబంధించిన వివరణను ఇవ్వడానికి మేనేజ్‌మెంట్ అందుబాటులో లేనపుడు వారికి ప్రతినిధులుగా వ్యవహరిస్తారు.

★ సంస్థ అధీకృత సమాచారాన్ని ఎప్పటికప్పుడు వినియోగదారులకూ, మీడియాకూ అందుబాటులో ఉంచుతారు.

★ యాజమాన్యానికీ, ఉద్యోగులకూ మధ్య భేదాభిప్రాయాలు రాకుండా, కమ్యూనికేషన్ వ్యవస్థ బలంగా ఉండేలా చూసుకుంటారు.

★ వార్తాసంస్థలకు ఏ సమాచారాన్ని ఇవ్వాలి, దాన్ని ఎప్పుడు విడుదల చేస్తే క్లయింట్‌పై గట్టి ప్రభావం చూపుతుంది వంటి నిర్ణయాలను తీసుకుంటారు.

★ సంస్థల సానుకూల అంశాలను తెలియజేసే ఫండ్ రైజింగ్, వివిధ ఈవెంట్లను నిర్వహిస్తారు.

★ క్లయింట్లకూ, పబ్లిక్, మీడియాకూ మధ్య సానుకూల, ప్రభావవంతమైన కమ్యూనికేషన్ ఉండేలా చూసుకుంటారు.

★ వివిధ మీడియాలను ప్రభావవంతంగా, సృజనాత్మకంగా ఉపయోగించగలిగివుండాలి.

కోర్సులు అందిస్తున్న కొన్ని సంస్థలు

- సెయింట్ జేవియర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్స్, ముంబయి, అహ్మదాబాద్, కోల్‌కతా
- స్కూల్ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ కమ్యూనికేషన్, ముంబయి
- క్రైస్ట్ యూనివర్సిటీ, బెంగళూరు
- ముద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్, అహ్మదాబాద్
- వైఎంసీఏ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మీడియా స్టడీస్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, న్యూదిల్లీ
- ఎంఐసీఏ, గుజరాత్
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్, న్యూదిల్లీ
- ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, న్యూదిల్లీ
- స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్స్ అండ్ రెప్యుటేషన్, ముంబయి
- సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్స్- పుణె, బెంగళూరు
- దిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్స్, దిల్లీ

పీఆర్‌ఓగా రాణించాలంటే..?

పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌కు కొన్ని నిర్దిష్టమైన నైపుణ్యాలుండాలి. సంస్థకూ, పరిశ్రమకూ సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండాలి. త్వరగా, తెలివిగా, వివేకంతో ఆలోచించగలగాలి. సంస్థ పేరు ప్రతిష్ఠలు తనపై ఆధారపడి ఉంటాయి కాబట్టి, చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

- త్వరితగతిన సమస్యను పరిష్కరించగల నైపుణ్యాలుండాలి.
- రాతలోనూ, సంభాషణల్లోనూ మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలను ప్రదర్శించగలగాలి.
- విశ్వాసం కలిగించడంలో, ఒప్పించడంలో సిద్ధహస్తులై ఉండాలి.
- పరిస్థితినిబట్టి మాట్లాడగలగాలి. వ్యవహార దక్షత ఉండాలి.
- మంచి మార్కెటింగ్ వ్యూహాలను రచించి, అమలు పరచగలిగిన నైపుణ్యాలుండాలి.
- ఏ పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండాలి.

ఉద్యోగావకాశాలు

కోర్సులు చేసినవారిని పీఆర్‌లుగా వ్యవహరించినప్పటికీ, ఒక్కో సంస్థలో ప్రత్యేకంగా ఒక్కో హోదాతో పిలుస్తున్నారు. కమ్యూనికేషన్ ఆఫీసర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్, డెవలప్‌మెంట్ డైరెక్టర్, మార్కెటింగ్ కమ్యూనికేషన్ స్పెషలిస్ట్, ప్రెస్ సెక్రటరీ, మీడియా రిలేషన్స్ ఆఫీసర్, రిసెర్చ్ అనలిస్ట్ మొదలైన హోదాలుంటాయి.

దాదాపుగా ప్రతి సంస్థకూ పీఆర్ వ్యవస్థ ఉంటుంది. హోటళ్లు, రాజకీయ పక్షాలు, బ్యాంకులు, పర్యటక ఏజెన్సీలు, వినోద పరిశ్రమ, పోలీస్ విభాగాలు, క్రీడా రంగం, విద్యాసంస్థలు, ఆసుపత్రులు మొదలైనవి పీఆర్‌ను ఎక్కువగా నియమించుకుంటున్నాయి.

సంస్థ, నైపుణ్యాలు, చదివిన విద్యను బట్టి ప్రారంభ జీతం ఉంటుంది. సుమారుగా రూ.15,000 నుంచి రూ.25,000 వరకు ఉంటుంది. అడ్వర్టైజింగ్ లేదా మార్కెటింగ్ సంస్థల్లో అయితే ప్రారంభ జీతం రూ.25,000కు పైగానే అందుకోవచ్చు. అనుభవం పెరిగేకొద్దీ పెద్ద మొత్తంలో జీతభత్యాలను అందుకోవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఇండియన్ ఆర్మీలో ఆఫీసర్లు



ఇండియన్ ఆర్మీ వివిధ ఆఫీసర్ ఎంట్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. దీనికి సంబంధించి ముందస్తు ప్రకటన వెలువడింది. ఈ ఉద్యోగాలకు పురుషులతోపాటు మహిళలూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రీ వివరాలు:

1. షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్‌టీ) ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీం(46వ కోర్సు- అక్టోబరు 2019)
2. షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్‌టీ) జేఏజీ ఎంట్రీ స్కీం(23వ కోర్సు- అక్టోబరు 2019, లా గ్రాడ్యుయేట్లకు)
3. 53వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్)-పురుషులు, 24వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్)-మహిళలు(అక్టోబరు 2019) **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ తేదీలు:** ఎన్‌సీసీ- జనవరి 9 నుంచి ఫిబ్రవరి 7 వరకు, జేఏజీ- జనవరి 16 నుంచి ఫిబ్రవరి 14 వరకు, ఎస్ఎస్‌సీ (టెక్)- జనవరి 23 నుంచి ఫిబ్రవరి 21 వరకు.

గమనిక: పూర్తి వివరాలకు ఆర్మీ అధికారిక వెబ్‌సైట్‌ను చూడవచ్చు. https://joinindianarmy.nic.in/

ఆర్‌బీఐలో జూనియర్ ఇంజినీర్లు



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలోని వివిధ జోన్లలో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు. **పోస్టు-ఖాళీలు:** జూనియర్ ఇంజినీర్(సివిల్/ ఎలక్ట్రికల్) - 24. **అర్హత:** సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో 65% మార్కులతో డిప్లొమా లేదా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 20-30 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ ఎగ్జామ్, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్టు ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 27.01.2019. **వెబ్‌సైట్:** https://www.rbi.org.in/

పీజీఐఎంఈఆర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌లో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు.



పోస్టు-ఖాళీలు: అసిస్టెంట్ ప్రొఫెసర్- 134. **విభాగాలు:** అనాటమీ, జనరల్ సర్జరీ, హెమటాలజీ, ఇంటర్నల్ మెడిసిన్, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, బయోఫిజిక్స్, బయోస్టాటిస్టిక్స్, డెర్మటాలజీ, వైరాలజీ తదితరాలు. **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు బోధన/ పరిశోధనానుభవం ఉండాలి. **వయసు:** 50 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది:** 02.02.2019.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 06.02.2019.

వెబ్‌సైట్: pgimer.edu.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు



దిల్లీలో తమ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని ప్రధాని మోదీకి వినతి పత్రం అందిస్తున్న తెరాస నేతలు

పార్టీ ఆఫీసుకు స్థలమివ్వండి

ప్రధానికి తెరాస ఎంపీల వినతి

ఈనాడు, దిల్లీ: దేశ రాజధాని నగరంలో తమ పార్టీ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని తెరాస ఎంపీలు ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఆయనను సోమవారం వారు పార్లమెంటులో కలుసుకున్నారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కలిపి తమకు 17 మంది ఎంపీలున్నారని, రాజేంద్రప్రసాద్ రోడ్డులో స్థలం కేటాయిస్తే బాగుంటుందని కోరారు. పట్టణాభివృద్ధి శాఖ మార్గదర్శకాల ప్రకారం తమ పార్టీకి వెయ్యి గజాల స్థలం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్రధాని 'శాసనసభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారు.. మంత్రులకు, ఎంపీలకు మిఠాయిలు తినిపించారు. నాకు కనీసం ఒక్కటైనా తినిపించరా' అని సరదాగా అడిగారు. స్పందించిన తెరాస లోక్‌సభా పక్ష నేత జితేందర్‌రెడ్డి బెల్లం, జీడిపప్పుతో చేసిన మిఠాయిని తీసుకొచ్చి ఇస్తానని చెప్పారు. అనంతరం జితేందర్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ తమ అధినేత కేసీఆర్ తోడల్లుడి కుమారుడని ప్రధానికి పరిచయం చేశారు. ప్రధానిని కలిసిన వారిలో తెరాస లోక్‌సభాపక్ష ఉప నేత వినోద్ కుమార్, లోక్‌సభ సభ్యులు జి.నగేశ్, బీబీ పాటిల్, బూర నర్సయ్యగౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సీతారాం నాయక్, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ ముదిరాజ్, మాజీ ఎంపీ వేణుగోపాలాచారి ఉన్నారు.

'మెరిట్ జాబితా'పై ఆ ఆరోపణలు అవాస్తవం: టీఎస్‌పీఎస్సీ

ఈనాడు, హైదరాబాద్: ఫార్మాసిస్టు గ్రేడ్-2 మెరిట్ జాబితాలో పలుమార్లు మార్పులు చేస్తున్నారని కొందరు ఆరోపణలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. ఆ ఆరోపణల్లో వాస్తవం లేదని టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. డిసెంబరు 1న మెరిట్ జాబితా ప్రకటించామని, అప్పుడు కొందరు అభ్యర్థుల అనుభవం/సర్వీస్ వెయిటేజీ కలపలేదని, దాంతో వెయిటేజీ మార్కులను కలిపి ఈనెల 3న మెరిట్ జాబితా ప్రకటించామని కమిషన్ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు.

'అనుబంధ' గుర్తింపునకు ఆహ్వానం

వచ్చే విద్యాసంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు అనుబంధ గుర్తింపునకు సోమవారం తెలంగాణ ఇంటర్ బోర్డు నోటిఫికేషన్ జారీచేసింది. ఆయా కళాశాలలు ఈనెల 10 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.ఆ తర్వాత వెయ్యి నుంచి రూ.10,000దాకా ఆలస్య రుసుముతో మార్చి 20 వరకు అభ్యర్థించవచ్చని బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు.

శాసనసభ, మండలి సమావేశాలకు నోటిఫికేషన్

తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 17న ఉదయం 11.30 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. 20 వరకు సాగుతాయి. మండలి సమావేశాలు ఈ నెల 19, 20న జరుగుతాయి. 19న ఉభయసభల సభ్యులనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. 20న శాసనసభలో, మండలిలోనూ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చించి ఆమోదం తెలుపుతారు.

16న సీఎల్పీ సమావేశం?

హైదరాబాద్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ఈ నెల 16న జరగనున్నట్లు తెలిసింది. 17 నుంచి 20వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన నేపథ్యంలో సీఎల్పీ సమావేశం అనివార్యమైంది. ఈ సమావేశంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన 14న హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. 14, 15 తేదీల్లో భోగి, సంక్రాంతి పండుగలున్నాయి. ఈ నేపథ్యంలో 16న సమావేశం కచ్చితంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. సీఎల్పీ నేతగా ఎవరిని ఎన్నుకుంటారనే దానిపై పార్టీలో ఉత్కంఠ నెలకొంది. ప్రతిపక్షనేతకు క్యాబినెట్ హోదా ఉండడంతో దాన్ని దక్కించుకునేందుకు పలువురు పోటీ పడుతున్నారు.

'ఆపరేషన్ స్మైల్' ఐదో దశ ఆరంభం

ఈనాడు, హైదరాబాద్: వెట్టిచాకిరీలో మగ్గుతున్న బాలలకు విముక్తి కలిగించే ఆపరేషన్ స్మైల్ ఐదో దశను సోమవారం సీఐడీ విభాగం అదనపు డీజీ గోవింద్‌సింగ్ ప్రారంభించారు. ఇందులో పాల్గొనే సిబ్బందికి శిక్షణ అనంతరం, డీజీపీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లు, కర్మాగారాల్లో కూలీలుగా పనిచేస్తున్న పిల్లలతోపాటు తప్పిపోయినవారు, భిక్షాటనలో ఉన్నవారిని కూడా గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చే కృషి ఇది. దీన్ని 2015 నుంచి ఏటా జనవరి, జులై నెలల్లో నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు తెలంగాణలో 22 వేల మంది పిల్లల్ని ఇలా సంరక్షించి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఇందులో బిహార్, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల బాలబాలికలూ ఉండటం గమనార్హం. ముఖ కవళికల ఆధారంగా మనుషులను గుర్తించేందుకు రాష్ట్ర పోలీసులు రూపొందించిన 'దర్పణ్' సాఫ్ట్‌వేర్‌ను సైతం సిబ్బందికి అందించారు. సభకు మహిళా భద్రతావిభాగం ఐజీ స్వాతి లక్రా, ఎస్పీ సుమతి, స్త్రీ-శిశు సంక్షేమశాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మి, కార్మికశాఖ ఉప కమిషనర్ ఫిలిప్స్ హాజరయ్యారు.

ఆర్టీజీఎస్ అద్భుతం అమోఘం

- ఏపీ సీఎం చంద్రబాబుకు కితాబునిచ్చిన టోనీ బ్లెయిర్
- ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రశంస



అమరావతికి విచ్చేసిన బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌కు రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని చూపిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రియల్‌టైం గవర్నెన్స్ పనితీరు అద్భుతం, అమోఘం, స్ఫూర్తిదాయకం అంటూ బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసల వర్షం కురిపించారు. సచివాలయంలో సోమవారం రాత్రి ఆర్టీజీఎస్ పనితీరును 45 నిమిషాల పాటు ఆద్యంతం ఆసక్తిగా గమనించిన ఆయన చివరగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి అమేజింగ్.. అంటూ కితాబునిచ్చారు. అది ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. ప్రకృతి విపత్తులను ఆంధ్రప్రదేశ్ సమర్థంగా ఎదుర్కొంటున్న తీరు ముచ్చటగొలిపిందన్నారు. చంద్రబాబు కొత్త రాష్ట్ర పురోభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని వ్యాఖ్యానించారు.

సాదర స్వాగతం

సచివాలయానికి టోనీ బ్లెయిర్ చేరుకోగానే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయనను ఆర్టీజీఎస్ కార్యాలయంలోకి తోడ్కొని వెళ్లారు. మంత్రి లోకేష్, అధికారులను పరిచయం చేశాక సీఎం మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టోనీ బ్లెయిర్ అనుకోకుండా హైదరాబాద్ వచ్చారు. అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ చెబితే అక్కడకు వచ్చానని చెప్పడం ఆనందానిచ్చింది. టోనీ బ్లెయిర్ గొప్పనేత. చిన్న వయసులోనే బ్రిటన్‌కు ప్రధాని అయ్యారు. ఇటీవల సింగపూర్ పర్యటనలో ఆయన్ను కలిసి ఏపీకి రావాల్సిందిగా ఆహ్వానించా. ఆయన ఇక్కడికి రావడం, టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్‌ఛేంజ్ కోసం పనిచేయడం ఆనందంగా ఉంది. విభజన అనంతరం 2014లో ఇక్కడికి అనేక కష్టాలతో వచ్చాం. విజన్-2050 రూపొందించి 2022 నాటికి దేశంలోనే మూడు అత్యుత్తమ రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీ ఉండాలని శ్రమిస్తున్నాం. ఇందుకోసం ఏడు మిషన్లు, వీటిని సాధించడానికి గ్రిడ్‌లు ఏర్పాటుచేశాం. పవర్ గ్రిడ్‌తో అందరికీ విద్యుత్తు, గ్యాస్ గ్రిడ్ ద్వారాతో ప్రజలకు గ్యాస్ సరఫరా చేస్తున్నాం. రియల్‌టైం గవర్నెన్స్ ద్వారా నేను ఇక్కడ కూర్చునే రాష్ట్రమంతా పర్యవేక్షిస్తున్నా" అంటూ వివరించారు.

ఛాయాచిత్రాన్ని చూసి

2001లో టోనీ బ్లెయిర్ ఉమ్మడి రాష్ట్రంలో పర్యటించినప్పుడు తీసిన ఛాయాచిత్రాన్ని సీఎం తన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో చూపించగా ఆయన ఆశ్చర్యం ప్రకటించారు. ఈ చిత్రంలో ఐటీ సలహాదారు సత్యనారాయణ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు. 2001 తరువాత మళ్లీ ముగ్గురూ అమరావతిలో ఒకేచోట కలిశారు.

ధన్యవాదాలు.. అభినందనలు

ఆర్టీజీఎస్ పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించిన టోనీ బ్లెయిర్ సందర్శకుల పుస్తకంలో ధన్యవాదాలు అంటూ రాయటం ప్రారంభించి అభినందనలతో ముగించారు. ఆర్టీజీఎస్ పనితీరు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందంటూ సంతకం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున నంది వెండి విగ్రహంతోపాటు అరకు కాఫీ ప్యాకెట్‌ని అందజేసి వాటి ప్రత్యేకతలను వివరించారు. టోనీ బ్లెయిర్‌కు గౌరవార్థం సచివాలయంలో ముఖ్యమంత్రి విందు ఇచ్చారు.

రెండో రోజూ బాలికలకు అస్వస్థత

మరో 24 మంది ఆసుపత్రికి తరలింపు



స్పృహ తప్పిన విద్యార్థిని వైద్య శిబిరానికి తరలిస్తున్న దృశ్యం

చిట్యాల, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రెండో రోజూ బాలికలు అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఆహారం వికటించి 22 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం ప్రార్థన సమయంలో 24 మంది బాలికలు కళ్లు తిరిగి పడిపోవడంతో 108 వాహనంలో స్థానిక ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరికి గ్లూకోజ్ ఎక్కించి పంపించారు. సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లలితాదేవి ప్రత్యేకంగా అంబులెన్స్‌ను పాఠశాల వద్ద ఉంచారు. ఆదివారం సాయంత్రం నుంచే ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి డాక్టర్ జయపాల్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలోనే వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. సోమవారం 80 మంది బాలికలను పరీక్షించి వారిలో 24 మందిని చికిత్సకు సిఫారసు చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డ్యూటీ డాక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. అస్వస్థతకు గురైన బాలికలను చికిత్స అనంతరం తల్లిదండ్రులతో ఇళ్లకు పంపిస్తున్నామని ప్రిన్సిపల్ జయశ్రీ తెలిపారు. సోమవారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ రమాదేవి, వైద్యాధికారులు, తహసీల్దార్ షరీఫ్‌మొహియుద్దీన్, సీఐ శ్రీనివాస్ పాఠశాలను సందర్శించారు. ఆహార కల్తీ ఎలా జరిగిందనే విషయమై వంటశాల, నూనె పొట్లాలు, తాగునీటి ట్యాంకులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులు ఎందుకు అస్వస్థతకు గురవుతున్నారనే విషయంపై కారణాలేమిటనేది ధ్రువీకరించలేదు.

నాలుగేళ్లలో 787 కళాశాలల మూత

- అత్యధికం డిగ్రీ, ఎంటెక్ విద్యాసంస్థలే



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లలో భారీగా కళాశాలలు మూతపడ్డాయి. డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సులను అందించే కళాశాలల సంఖ్య గణనీయంగా తగ్గిపోగా.. అదే సమయంలో సంప్రదాయ పీజీ కళాశాలలు, ఫార్మా-డి కళాశాలలు స్వల్పంగా పెరిగాయి. మొత్తం 787 కళాశాలలు మూతపడినట్లు తేలింది. కొత్త విద్యా సంవత్సరానికి(2019-20) ప్రవేశ పరీక్షలు నిర్వహించి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉన్నందున ఆయా కళాశాలల పరిస్థితిపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి గణాంకాలను సేకరించింది. ఆ ప్రకారం 2014-15లో రాష్ట్రంలో 3,688 ఉన్నత విద్య కళాశాలలు ఉండగా 2018-19 విద్యా సంవత్సరానికి వచ్చేసరికి వాటి సంఖ్య 2,901కి తగ్గిపోయింది. అత్యధికంగా 178 డిగ్రీ కళాశాలలు తగ్గాయి. దీనిపై ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రవేశాలు లేనందున స్వచ్ఛందంగా కళాశాలలు మూసేసుకుంటున్నారని, తాము బలవంతంగా ఏ ఒక్కటీ మూసివేయలేదని చెప్పారు.

ముఖ్యాంశాలు ఇవీ..

- 2014-15లో 337 ప్రభుత్వ కళాశాలలుండగా ఈ విద్యా సంవత్సరం 395కు పెరిగాయి.
- 2014-15లో మొత్తం సీట్లు 5,23,291 ఉండగా నేడు 6,52,178కి పెరిగాయి. కళాశాలలు భారీగా తగ్గినా సీట్లు మాత్రం పెరగడం గమనార్హం. అదే సమయంలో ప్రవేశాలు పొందినవారు 3,77,344 నుంచి 3,97,225కి పెరిగారు. బీటెక్‌లో 61,909 నుంచి 68,296కు పెరిగారు. ఇతర రాష్ట్రాల్లోని డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఇతర కేంద్ర ప్రభుత్వ జాతీయ సంస్థల్లో చేరిన విద్యార్థులను పరిగణనలోకి తీసుకొంటే 2014-15లో వేలల్లో పెరిగే ఉంటారని అంచనా వేస్తున్నారు.

కళాశాలల సంఖ్య ఇలా...

కళాశాల	2014–15లో	2018–19లో	వ్యత్యాసం
డిగ్రీ	1329	1151	- 178
పీజీ	520	522	+ 2
బీటెక్	354	205	- 149
ఎంటెక్	272	94	- 178
బీఫార్మసీ	168	127	- 41
బీఈడీ	274	218	- 56
ఎంబీఏ	431	312	-119
ఎంఫార్మసీ	151	112	-39
ఫార్మా-డి	51	55	+4
లా	17	22	+ 5
ఎంసీఏ	88	42	- 46
బీపీఎడ్	13	17	+ 4
ఫార్మా-డి(పీబీ)	20	24	+ 4
మొత్తం	3688	2901	

కట్టుతప్పిన క్రమ'శిక్ష'ణ

- విద్యార్థిని రోజంతా నిలబెట్టిన పాఠశాల యాజమాన్యం
- సాయంత్రం బడికి తాళం వేసి వెళ్లిపోయిన వైనం

జియాగూడ, న్యూస్‌టుడే: ఒకరోజు బడికి రాలేదని ఓ విద్యార్థిని ప్రధానోపాధ్యాయిని ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిల్చోబెట్టారు. రోజంతా నిల్చునే ఉన్న ఆ బాలుడు సొమ్మసిల్లి పడిపోయినా పట్టించుకోకుండా సాయంత్రం పాఠశాలకు తాళాలు వేసి వెళ్లిపోయారు. రాత్రికి కోలుకున్న ఆ బాలుడు స్కూల్ గేటు ఎక్కి కేకలు వేయడంతో స్థానికులు గమనించి బయటకు తీసుకొచ్చారు. హైదరాబాద్ జియాగూడలోని కుల్సుంపురా కాలనీలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జియాగూడ భారత్‌నగర్‌కు చెందిన ఎం.రాజు, కళ దంపతుల కుమారుడు భానుప్రసాద్ కుల్సుంపురా కాలనీలోని నలంద గ్రామర్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. గత నెల 28 నుంచి ఎస్ఏ (సమ్మేటివ్ అసెస్‌మెంట్)-2 పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 4న (శుక్రవారం) బడికి బయలుదేరిన భానుప్రసాద్ దారిలో వాంతులు కావడంతో ఇంటికి వచ్చి పడుకున్నాడు. భాను తండ్రి రాజు తమ పిల్లాడి గురించి స్కూల్‌కు ఫోన్ చేయగా రాలేదని నిర్వాహకులు సమాధానమిచ్చారు. రాజు శనివారం ఉదయం భానుప్రసాద్‌ను బడికి తీసుకెళ్లి.. కాస్త మందలించి దారిలో పెట్టండని పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్‌కు, ప్రిన్సిపల్ మేఘనకు చెప్పారు. దీంతో ప్రిన్సిపల్ భానును పాఠశాల ఆవరణలోనే నిల్చోబెట్టారు. జ్వరంతో ఉన్న భానుప్రసాద్ ప్రిన్సిపల్ కార్యాలయం వద్ద నిల్చోగా కాస్త వెనుకకు జరగమని మరో ఉపాధ్యాయిని ఆదేశించారు. దీంతో భాను ప్రిన్సిపల్ గది పక్కనున్న చిన్న సందులో నిల్చుండిపోయాడు. వాంతులు చేసుకుని, సొమ్మసిల్లి పడిపోయాడు. సాయంత్రం ఆరున్నర గంటలకు స్పృహలోకి వచ్చిన భాను ఏడుస్తూ కాపాడండి.. కాపాడండి అని కేకలు వేశాడు. గేటు ఎక్కి బయటికి తొంగి చూడగా తెలిసిన యువకుడు కనిపించడంతో 'అన్నా కాపాడు' అని అరిచాడు. వారు స్థానికంగానే ఉండే ఆయాను రప్పించి గేటు తాళాలు తెరిపించి బాలుణ్ని బయటికి తీసుకువచ్చారు. తాము భానుప్రసాద్‌ను కావాలని బడిలో ఉంచి తాళాలు వేయలేదని, పాఠశాల మూసేటప్పుడు గమనించకపోవడం వల్లే ఈ పొరపాటు జరిగిందని నలంద గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ 'న్యూస్‌టుడే'తో చెప్పారు.

బైపీసీ విద్యార్థులకు 'బ్రిడ్జి' నుంచి మినహాయింపు

- బీటెక్ బయోటెక్నాలజీలో చేరవచ్చు

ఈనాడు, హైదరాబాద్: బైపీసీ విద్యార్థులు గణితం బ్రిడ్జి కోర్సు పూర్తిచేయకున్నా బీటెక్ బయోటెక్నాలజీ చదివే అవకాశాన్ని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) కల్పించింది. ఆ బీటెక్ కోర్సులో గణితం అవసరం కాబట్టి, కొంత పాఠ్యప్రణాళికను ఆయా విశ్వవిద్యాలయాలు చేర్చాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మార్పు చేసేందుకు అవి అంగీకరిస్తే, బీటెక్ బయోటెక్నాలజీలో ప్రవేశాలు కల్పించవచ్చని సూచించింది. ఆదర్శ పాఠ్యప్రణాళికను కూడా రూపొందించాలని నిర్ణయించింది. ఇది బైపీసీవారికి ఊరట కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇంటర్ బైపీసీ పూర్తిచేసినవారిలో కొందరు వైద్య విద్య, వెటర్నరీ, ఆయుష్, బీఎస్సీ అగ్రికల్చర్ వంటి కోర్సుల్లో ప్రవేశాలు దొరకకుంటే బీఫార్మసీలో చేరుతుంటారు. వారు బీటెక్ బయోటెక్నాలజీలో చేరేందుకు అవకాశం ఉన్నా, ఇంటర్‌లో ఉండగానే గణితంలో బ్రిడ్జి కోర్సు పూర్తిచేయాల్సి ఉంది. దీనిపై పలువురికి అవగాహన లేదు. అసలే బైపీసీ విద్యార్థులకు అవకాశాలు తక్కువ. అందులోనూ 'బ్రిడ్జి' నిబంధనతో వారు బీటెక్ బయోటెక్నాలజీలో చేరేందుకు వెనకడుగు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల ఏఐసీటీఈకి లేఖ రాయడంతో...ఐఐటీ దిల్లీ, జమ్మూ విశ్వవిద్యాలయాల నిపుణులతో కమిటీని నియమించారు. ఆ నివేదిక మేరకు- బీటెక్ బయోటెక్నాలజీలో చేరేందుకు గణితం బ్రిడ్జి కోర్సు అవరోధమని భావిస్తే దాన్ని మినహాయిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. బీటెక్ బయోటెక్నాలజీ పాఠ్యప్రణాళికలో కనీస స్థాయిలో గణితం ఉండేలా చూడాలి. ఆ అంశాలను బోధించేందుకు అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుత నిర్ణయం వల్ల బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుకు కొంత డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. త్వరలో విడుదలయ్యే ఎంసెట్ నోటిఫికేషన్‌లో జేఎన్‌టీయూహెచ్ దీన్ని చేరుస్తుందా, లేదా అనేది చూడాలి. కళాశాలల ప్రతినిధులు ఇప్పటికే ఏఐసీటీఈ ఆదేశాలను జేఎన్‌టీయూహెచ్ అధికారుల దృష్టికి తెచ్చారు. బయోటెక్నాలజీ బోర్డు ఆఫ్ స్టడీస్ అధ్యక్షులు అర్చనా గిరి మాట్లాడుతూ... ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని. ఇక బైపీసీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.



నగరం పల్లెకు బైలెల్లినాది

సంక్రాంతి ప్రయాణం మొదలైంది. హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు అధిక సంఖ్యలో తరలి వెళ్తున్నారు. దీంతో సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. జనరల్ బోగీల్లో సీట్ల కోసం ప్రజలు పోటీలు పడ్డారు. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లలోనూ రద్దీ నెలకొంది.



నాలుగు శాసనమండలి స్థానాలు ఖాళీ

- ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఎమ్మెల్సీలు
- ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర శాసనమండలిలో ఖాళీ అయిన నాలుగు స్థానాలను భర్తీ చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల సంఘం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ముగ్గురు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మరో సభ్యుడు రాజీనామా చేశారు. మొత్తం నలుగురి రాజీనామాలను శాసనమండలి ఛైర్మన్ ఆమోదించడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాల నుంచి ఖాళీ అయ్యే మూడు స్థానాల భర్తీకి ఓటర్ల జాబితా రూపకల్పన పనులను ఎన్నికల సంఘం ఇప్పటికే చేపట్టింది. ప్రస్తుతం రాజీనామా చేసిన నలుగురిలో ముగ్గురు స్థానిక సంస్థల కోటాలో, ఒకరు ఎమ్మెల్యేల కోటా నుంచి ఎన్నికయ్యారు. మైనంపల్లి హనుమంతరావు (ఎమ్మెల్యేల కోటా), పట్నం నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (స్థానిక సంస్థల కోటా) మండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురూ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. స్థానిక సంస్థల కోటా నుంచి తెరాస అభ్యర్థిగా గెలుపొందిన కొండా మురళి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో శాసనసభ ఎన్నికల తరువాత ఎమ్మెల్సీ పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో నాలుగు స్థానాలు ఖాళీ అయినట్లు శాసనసభ కార్యదర్శి కార్యాలయం నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయానికి లేఖ రాశారు. ఆయా స్థానాలను భర్తీ చేసేందుకు ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి డాక్టర్ రజత్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి సమాచారం ఇచ్చారు.

త్వరలో మరో ఆరు ఖాళీలు

శాసన మండలిలో త్వరలో మరో ఆరు స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈ సభ్యుల పదవీ కాలం ఈ ఏడాది మార్చితో ముగియనుంది. ఎమ్మెల్యేల కోటా నుంచి ప్రస్తుత ప్రాతినిధ్యం వహిస్తున్న మహమూద్ ఆలీ, మహ్మద్ ఆలీ షబ్బీర్, మహ్మద్ సలీమ్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సంతోష్ కుమార్, స్థానిక సంస్థల కోటా నుంచి ఎం.ఎస్.ప్రభాకర్‌రావుల పదవీ కాలం త్వరలో ముగియనుంది. ఉపాధ్యాయులు, పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు సభ్యుల పదవీ కాలం కూడా ఈ ఏడాది మార్చిలోనే పూర్తి కానుంది. అన్నీ కలుపుకుని 13 స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటికి ఒకే దఫా ఎన్నికలు జరిపేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

24 గంటల్లో 32,100 ఘనపు మీటర్ల కాంక్రీటు

- పోలవరానికి రెండు గిన్నిస్ రికార్డులు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు చరిత్రలో సోమవారం మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. 24 గంటల్లో 32,100 ఘనపు మీటర్ల కాంక్రీటు స్పిల్‌ఛానల్‌లో వేయడంతో పాటు ఏకధాటిగా 32,315 ఘనపు మీటర్ల కాంక్రీటు వేసిన రికార్డులు నమోదయ్యాయి. ఆదివారం ఉదయం ఎనిమిదింటికి ప్రారంభించిన క్రతువు సోమవారం ఉదయం ఎనిమిదింటి వరకు నిర్విఘ్నంగా కొనసాగింది. ఈ బృహత్ యజ్ఞంలో రెండు గిన్నిస్ రికార్డులు పోలవరం సొంతమయ్యాయి. ఆ సంస్థ ప్రతినిధి రిషీనాథ్ దీన్ని అధికారికంగా ప్రకటించి అవార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రాజెక్టు వద్దే అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలో అతిపెద్ద అవార్డులు రెండింటిని మనం సాధించగలిగామని, ఈ ఘనత పోలవరానికే దక్కిందని పేర్కొన్నారు. అంతకుముందు సీఎం వ్యూపాయింటు నుంచి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. గిన్నిస్ నమోదు సందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించారు.

10వ తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: స్టాటిస్టికల్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారులుగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉద్యోగాలకు ఎంపికైన వారికి మూడో విడత ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొంది.

సెన్సెక్స్ ▲ 155
35850

నిఫ్టీ ▲ 44
10772

డోజోన్స్ 23662 ▲ 229

నాస్‌డాక్ 6845 ▲ 107

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 69.68 ▲ 4 పైసలు
(ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 58.28 ▲
(బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ఘనం (+) నిఫ్టీ	7న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	7న	మార్పు%
BHARTI INFRATEL	293.75	3.05	INDIABULLS HSG	793.90	-4.33
AXIS BANK	637.45	2.88	BAJAJ AUTO	2658.55	-2.77
TATA MOTORS	175.35	2.57	DR. REDDYS LAB	2558.65	-1.59
NTPC	148.60	1.96	EICHER MOTORS	19830.40	-1.36
GRASIM	820.65	1.80	YES BANK	187.15	-1.32
MARUTI SUZUKI	7362.05	1.76	HINDALCO	208.55	-1.11
TITAN COMPANY	944.05	1.68	BPCL	355.55	-1.08


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.88	73.53	బహ్రెయిన్ దీనార్	171.37	195.55
పౌండ్ స్టెర్లింగ్	82.70	93.58	కువైట్ దీనార్	189.76	235.78
యూరో	74.09	83.89	ఒమన్ రియాల్	167.69	191.89
జపనీస్ యెన్/100	59.73	68.49	సౌదీ రియాల్	17.16	20.21
ఆస్ట్రేలియా డాలరు	46.13	52.29	యూఏఈ దిర్హమ్	17.56	20.39
సింగపూర్ డాలరు	46.77	55.39	మలేషియా రింగిట్	15.09	18.72
థాయ్ బాత్/100	199.80	236.45	చైనీస్ యువాన్	7.19	11.92

సోమవారం నిఫ్టీ కదలికలు



పెన్నార్ బిల్డ్ 360

- భవన నిర్మాణ ఉత్పత్తుల రిటైలింగ్ వ్యాపారం
- దేశవ్యాప్తంగా 100 కేంద్రాల ఏర్పాటు యోచన



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ఇంజినీరింగ్ ఉత్పత్తుల తయారీ, స్టీలు భవనాల నిర్మాణ కార్యకలాపాల్లో నిమగ్నమైె ఉన్న పెన్నార్ గ్రూపు భవన నిర్మాణ ఉత్పత్తుల రిటైలింగ్ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. కొన్ని భవన నిర్మాణ ఉత్పత్తులను ప్రస్తుతం ఈ సంస్థ తయారు చేస్తోంది. వీటికి తోడు ఇతర సంస్థల ఉత్పత్తులను (థర్డ్ పార్టీ) సైతం విక్రయించేందుకు వివిధ పట్టణాల్లో రిటైల్ విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఈ వ్యాపారాన్ని పెన్నార్ 'బిల్డ్ 360' అనే బ్రాండు పేరుతో చేపట్టింది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 11 రిటైల్ విక్రయ కేంద్రాలను ప్రారంభించటంతో పాటు ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా మరో ఆరు కేంద్రాలను ప్రారంభించే సన్నాహాల్లో ఉంది. నెమ్మదిగా అన్ని దక్షిణాది రాష్ట్రాలకు భవన నిర్మాణ ఉత్పత్తుల రిటైలింగ్ వ్యాపారాన్ని విస్తరించాలని భావిస్తోంది. ఇప్పటికే పెన్నార్ గ్రూపు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్, స్టీలు భవనాల నిర్మాణం, పర్యావరణ ప్రాజెక్టులకు ఈ రిటైలింగ్ వ్యాపారం జత కలుస్తుంది.

దేశవ్యాప్తంగా విస్తరణ...

ప్రధానంగా స్టీలు పైకప్పు, స్క్రూలు- డ్రిల్లింగ్, ట్యాపింగ్ స్క్రూలు, యూపీవీసీ హార్డ్‌వేర్, టర్బో వెంటిలేటర్లు వంటి భవన నిర్మాణ ఉత్పత్తులను పెన్నార్ ఇండస్ట్రీస్ తయారు చేస్తోంది. వీటితో పాటు ఇతర సంస్థలకు చెందిన భవన నిర్మాణ ఉత్పత్తులైన టీఎంటీ స్టీలు, సిమెంటు, రంగులు, వాల్ పుట్టీలు, వ్యవసాయ ఉపకరణాలు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వైజాగ్, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, ఖమ్మం, రాజమండ్రి, హైదరాబాద్, తాడేపల్లిగూడెంలలో ఒక్కొక్కటి, విజయవాడలో రెండు రిటైలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరాంతంలోగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మరో ఆరు పట్టణాలు/నగరాల్లో ఇటువంటి విక్రయ కేంద్రాలు నెలకొల్పుతారు. భవన నిర్మాణ ఉత్పత్తుల రిటైలింగ్ వ్యాపారాన్ని వచ్చే అయిదేళ్లలో దేశవ్యాప్తంగా విస్తరించాలనే ప్రణాళికను కంపెనీ యాజమాన్యం సిద్ధం చేస్తోంది. వచ్చే అయిదేళ్లలో 100 రిటైలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పెన్నార్ ఇండస్ట్రీస్ ఉపాధ్యక్షుడు కేఎం సునీల్ తెలిపారు. తద్వారా ఈ విభాగం నుంచి రూ.500 కోట్ల అమ్మకాలను నమోదు చేయాలని భావిస్తున్నట్లు వివరించారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో భవన నిర్మాణ ఉత్పత్తుల రిటైలింగ్ నుంచి రూ.100 కోట్ల అమ్మకాలు ఉండవచ్చని పేర్కొన్నారు.

త్వరలో విలీనం పూర్తి

పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలైన పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ (పెబ్స్ పెన్నార్), పెన్నార్ ఎన్విరోలు విలీనం అవుతున్న విషయం విదితమే. దీనికి సంబంధించి చట్టబద్ధమైన లాంఛనాలన్నీ పూర్తయ్యాయి. రెండు కంపెనీల వాటాదార్ల సర్వసభ్య సమావేశాల్లోనూ విలీనానికి ఆమోద ముద్ర లభించింది. ఇక దీనిపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ నుంచి తుది ఉత్తర్వులు రావటమే తరువాయి. విలీన వ్యవహారం ఈ ఆర్థిక సంవత్సరాంతంలోగా పూర్తవుతుందని కంపెనీ వర్గాలు భావిస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఒకే కంపెనీగా పెన్నార్ ఇండస్ట్రీస్, పెబ్స్ పెన్నార్, పెన్నార్ ఎన్విరోలు ముందుకు సాగుతాయి. దీనివల్ల పాలనా పరమైన వ్యయాలు తగ్గుతాయని, నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందని కేఎం సునీల్ వివరించారు.

2018-19లో వృద్ధి రేటు 7.2%

- కేంద్ర గణాంక కార్యాలయం అంచనా

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2018-19) వృద్ధి రేటు 7.2 శాతం నమోదు కాగలదని కేంద్ర గణాంక కార్యాలయం (సీఎస్ఓ) తొలి ముందస్తు అంచనా వేసింది. వ్యవసాయం, తయారీ రంగాల్లో గణనీయమైన వృద్ధి ఇందుకు దన్నుగా నిలుస్తుందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం నమోదైన వృద్ధి రేటు 6.7 శాతంతో పోలిస్తే ఇది 0.5 శాతం ఎక్కువ. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనా వేసిన 7.4 శాతం కంటే ఇది 0.2 శాతం తక్కువగా ఉండటం గమనార్హం. ఇదిలా ఉంటే 2016-17లో స్థూల దేశీయోత్పత్తి 7.1 శాతం, 2015-16లో 8.2 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే. 2017-18తో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాస్తవంగా జోడించిన స్థూల విలువ (జీవీఏ) 6.5 శాతం నుంచి 7 శాతానికి చేరే అవకాశం ఉందని సీఎస్ఓ అంచనా కట్టింది.

7.2% వృద్ధి రేటు సంతృప్తికరమే: గార్గ్

ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంటుందని, 2018-19 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర గణాంక కార్యాలయం తొలి ముందస్తు అంచనా వేసిన 7.2% వృద్ధి రేటు సంతృప్తికరమైనదేనని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ అభిప్రాయపడ్డారు. '2018-19లో జీడీపీ వృద్ధి రేటు చాలా ఆరోగ్యకరంగా నమోదవుతోంది. 2017-18లో నమోదైన 6.7 శాతంతో పోలిస్తే ఇది సంతృప్తికరమైన వృద్ధి రేటు. ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 12.3 శాతం వృద్ధి చెంది రూ.188.41 లక్షల కోట్లుగా నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. తలసరి ఆదాయం కూడా రూ.1,41,447కు చేరొచ్చ'ని గార్గ్ ట్వీట్ చేశారు.

బంధన్ బ్యాంక్‌లో గృహ ఫైనాన్స్ విలీనం

దిల్లీ: దిగ్గజ తనఖా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ప్రమోటర్‌గా ఉన్న గృహ రుణ సంస్థ గృహ ఫైనాన్స్‌ను బంధన్ బ్యాంక్ తన ఆధీనంలోకి తీసుకోబోతోంది. షేర్ల మార్పిడి ద్వారా గృహ ఫైనాన్స్ సంస్థను విలీనం చేసుకోబోతున్నట్లు బంధన్ బ్యాంక్ సోమవారం ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. విలీన ఒప్పందంలో భాగంగా గృహ ఫైనాన్స్ వాటాదార్లు తమ వద్ద ఉన్న ప్రతి 1000 షేర్లకు 568 బంధన్ బ్యాంక్ షేర్లను పొందుతారు. బంధన్ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.59,800 కోట్లు కాగా, గృహ ఫైనాన్స్ మార్కెట్ విలువ రూ.23,224 కోట్లుగా ఉంది.

బీఎస్ఈలో సోమవారం బంధన్ బ్యాంక్ 5.21 శాతం నష్టపోయి, రూ.501.10 వద్ద ముగియగా, గృహ ఫైనాన్స్ 3.86 శాతం తగ్గి, రూ.306.20 వద్ద ముగిసింది.

కొత్త ఔషధాలపై అరబిందో ఫార్మా దృష్టి

ఈనాడు, హైదరాబాద్: కేన్సర్, హార్మోన్లు, బయలాజిక్స్, పెప్టైడ్స్ విభాగాల్లో ప్రత్యేక ఔషధాలపై అరబిందో ఫార్మా దృష్టి కేంద్రీకరిస్తోంది. ఈ సంక్లిష్టమైన ఔషధ విభాగాల్లో వచ్చే మూడేళ్లలో 150 కొత్త ఔషధాలు తయారుచేసి మార్కెట్‌కు అందించాలని భావిస్తోంది. ప్రస్తుతం ఈ ఔషధాలకు 118.2 బిలియన్ డాలర్ల విక్రయాలు నమోదు అవుతున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఇందులో 147 ఔషధాలు ఇప్పటికే అభివృద్ధి ప్రకియలో ఉన్నట్లు పేర్కొంది. కేన్సర్, హార్మోన్ల విభాగాల్లోనే 79 ఉత్పత్తులు సిద్ధం అవుతున్నాయని తెలియజేసింది. ఇవి కాక ఇంకా ట్రాన్స్‌డెర్మల్ ప్యాచ్‌లు, ఇన్‌హేలర్లు, వ్యాక్సిన్లు ఉన్నట్లు వివరించింది. కొన్నింటిని వచ్చే ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌కు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ కొత్త ఔషధాలన్నింటినీ 2021-22 నాటికి పూర్తిస్థాయిలో మార్కెట్‌కు తీసుకురాగలమని అంచనా వేస్తోంది.

నాయుడుపేట యూనిట్ ప్రారంభం

'ఓరల్ డోసేజెస్' తయారీ కోసం నిర్మించిన ఆంధ్రప్రదేశ్‌లోని నాయుడుపేట యూనిట్‌ను ఇటీవల ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టారు. ఇక్కడ 'నాసల్', 'టాపికల్' ఔషధాల తయారీని కూడా చేపట్టారు. విదేశాల్లో ఇటీవల కాలంలో అరబిందో ఫార్మా పలు కంపెనీలను, కొన్ని కంపెనీల వ్యాపారాన్ని, ఔషధ తయారీ యూనిట్లను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అపోటెక్స్‌కు చెందిన ఐరోపా వ్యాపారం, యూఎస్‌లో శాండోజ్‌కు చెందిన చర్మసంబంధ ఔషధాల యూనిట్లు, ఔషధాలు, ఆస్ట్రేలియాలో అడ్వెంట్ ఫార్మాకు చెందిన ఆర్అండ్‌డి ఆస్తులు ఉన్నాయి. ఈ కార్యకలాపాలను స్థిరీకరించినట్లు అరబిందో ఫార్మా వివరించింది.

అతిపెద్ద జనరిక్ ఔషధ సంస్థల్లో ఒకటి...

శాండోజ్ వ్యాపారాన్ని కొనుగోలు చేసిన తర్వాత అరబిందో ఫార్మా ప్రపంచంలోని అతి పెద్ద జనరిక్ ఔషధ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు సాధించింది. అంతేగాకుండా యూఎస్‌లో రెండవ అతిపెద్ద జనరిక్ ఔషధ సంస్థ అయింది. మొదటి స్థానంలో ఇజ్రాయెల్‌కు చెందిన తెవా ఫార్మాసూటికల్స్ ఉంది. మూడు, నాలుగు స్థానాల్లో మైలాన్, లుపిన్ ఉంటాయి.

మారుతీ నుంచి 2 కొత్త మోడళ్లు

దిల్లీ: దేశీయ కార్ల దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో రెండు కొత్త మోడళ్లను విడుదల చేయనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు మోడళ్లను విడుదల చేసిన సంస్థ.. ప్రస్తుత పోర్ట్‌ఫోలియోలోని మోడళ్ల నవీకరణపై దృష్టి పెట్టింది. కొత్త భద్రతా నిబంధనలకు అనుగుణంగా ఎయిర్ బ్యాగ్‌లు, సీట్ బెల్ట్ రిమైండర్, రివర్స్ పార్కింగ్ సెన్సార్‌లు వంటి వాటిని ఏర్పాటు చేయనుంది. ఇక ప్రస్తుత త్రైమాసికంలో ఒక కారును విపణిలోకి ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. బహుళ ప్రాచుర్యం పొందిన కంపెనీ కాంపాక్ట్ కారు వ్యాగన్‌ఆర్ కొత్త వెర్షన్‌ను కంపెనీ ఈ నెలాఖరులో విడుదల చేయొచ్చని తెలుస్తోంది. 2018-19లో కంపెనీ ఎంపీవీ ఎర్టిగా, సెడాన్ సియాజ్‌ల్లో కొత్త వేరియంట్‌లను తీసుకొచ్చింది. గతేడాది ఫిబ్రవరిలో కొత్త స్విఫ్ట్‌ను సైతం విడుదల చేసింది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం.. కొత్త మోడళ్లలో ఒకటి కంపెనీ ప్రీమియం విక్రయశాల నెక్సాలో, మరోకటి ఎరీనా విక్రయశాలల్లో విక్రయించే అవకాశం ఉంది. కొత్త మోడళ్ల విడుదల నేపథ్యంలో 2019 అమ్మకాలపై ఆశావహంగా ఉన్నట్లు ఆర్‌సీ భార్గవ వివరించారు. సాధారణంగానే ఎన్నికల ఏడాదిలో అమ్మకాలు అధికంగా ఉంటాయని గుర్తు చేశారు. జూన్ నాటికి కొత్త భద్రతా ఫీచర్లను ప్రవేశపెట్టనున్నట్లు ఎంఎస్ఐ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజినీరింగ్) సీవీ రామన్ తెలిపారు. ఇప్పటికే ఏడు మోడళ్లను సిద్ధం చేశామని, మిగతా వాటిపై పని చేస్తున్నామని అన్నారు.

డిక్కీ తెలంగాణ విభాగం అధ్యక్షుడిగా రవి కుమార్

ఈనాడు, హైదరాబాద్: దళితుల్లో సామాజిక నాయకత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు దళిత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) వ్యవస్థాపకుడు మిలింద్ కాంబ్లే పేర్కొన్నారు. దళిత పారిశ్రామికవేత్తలను ఒక వేదికపైకి తీసుకురావడంలో సఫలం అయ్యామనీ, వారికి సమాన అవకాశాలు కల్పించే విధంగా విధాన నిర్ణయాల్లో ప్రభావితం చూపిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డిక్కీ తెలంగాణ విభాగం నూతన అధ్యక్షుడిగా కత్తరపాక రవి కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బానోతు రమేశ్ నాయక్, ఉపాధ్యక్షులుగా మునీందర్, దాసరి అరుణలు నియమితులయ్యారు. డిక్కీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రా రవి కుమార్ మాట్లాడుతూ దళితులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు.

మార్కెట్ కబుర్లు

- గత నెలలో రూ.88.05 కోట్ల విలువైన ఆర్డర్లు లభించినట్లు **హింద్ రెక్టిఫైయర్స్ లిమిటెడ్** వెల్లడించింది. ఇందులో డీజిల్ లోకోమోటివ్ వర్క్స్ నుంచే రూ.61 కోట్ల ఆర్డర్లున్నాయని తెలిపింది.
- నిధుల కొరత వల్ల, 2017 ఏప్రిల్1-2018 డిసెంబరు 23 కాలానికి రూ.71.12 కోట్ల డివిడెండ్ చెల్లించలేకపోయినట్లు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూపునకు చెందిన **ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్టేషన్ నెట్‌వర్క్స్** ప్రకటించింది.
- ఐడీబీఐ బ్యాంకుకు 'బీబీ' దీర్ఘకాల, 'బి' స్వల్పకాల విదేశీ కరెన్సీ జారీ క్రెడిట్ రేటింగ్స్‌ను అంతర్జాతీయ రేటింగ్ సంస్థ **ఎస్అండ్‌పీ** జారీ చేసింది. క్రెడిట్‌వాచ్ పరిశీలన నుంచి ఈ బ్యాంకును తొలగించింది.
- మనోవైకల్య చికిత్సలో వాడే లూరాసిడోన్ హైడ్రోక్లోరైడ్ బిళ్లల జనరిక్ విభాగాన్ని అమెరికాలో విక్రయించేందుకు యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం లభించినట్లు ఔషధ తయారీ సంస్థ **లుపిన్** వెల్లడించింది.
- ఇండిగో విమానయాన సంస్థకు బ్యాక్‌ఎండ్ సేవలు అందించే ఇంటర్‌గ్లోబ్ టెక్నాలజీస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఐసీఐసీఐ వెంచర్, అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ సంయుక్త సంస్థ **అయాన్ క్యాపిటల్** తెలిపింది.
- స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి రూ.1,400 కోట్ల రుణ సదుపాయం లభించినట్లు **పీటీసీ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్** ప్రకటించింది.

అంతర్జాతీయ సంకేతాలే దన్నుగా..

- పరుగు తీసిన సూచీలు
- ఫలితాలపై అంచనాలూ కలిసొచ్చాయ్
- 155 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

సమీక్ష

సూచీలు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు దన్నుగా నిలిచాయి. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య సంధి కుదిరే అవకాశం ఉందన్న వార్తలు మార్కెట్‌కు కలిసొచ్చాయి. దీనికి తోడు కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాల సీజన్ మొదలు కానుండటం, మంచి ఫలితాలు నమోదు కావొచ్చన్న అంచనాల నడుమ పలు రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. స్థిరాస్తి, టెక్, ఐటీ, విద్యుత్తు, మన్నికైన వినిమయ వస్తువులు, బ్యాంకింగ్, చమురు-గ్యాస్ షేర్లకు గిరాకీ పెరగడంతో సెన్సెక్స్ 155 పాయింట్లు, నిఫ్టీ 44 పాయింట్లు మేర లాభపడ్డాయి. అంతర్జాతీయ సూచీల కొస్తే ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా ప్రారంభమయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ స్వల్పంగా 4 పైసలు పెరిగి 69.68 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ ఉదయం 35,971.18 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. ఆ తర్వాత వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో 36,076.95 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. అయితే మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో 35,809.23 కనిష్ఠ స్థాయిని కూడా నమోదు చేసింది. చివరకు 155.06 పాయింట్ల లాభంతో 35,850.16 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 44.45 పాయింట్ల లాభంతో 10,771.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,835.95-10,750.15 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 2.84 శాతం లాభపడింది. టాటా మోటార్స్ 2.64%, ఎన్‌టీపీసీ 1.89%, ఇన్ఫోసిస్ 1.57%, మారుతీ సుజుకీ 1.54%, పవర్‌గ్రిడ్ 1.46%, ఓఎన్‌జీసీ 1.30%, టీసీఎస్ 1.21% మేర లాభపడ్డాయి. బజాజ్ ఆటో అత్యధికంగా 2.82% నష్టపోయింది. యెస్ బ్యాంక్ 1.35%, హీరో మోటోకార్ప్ 1.11%, బజాజ్ ఫైనాన్స్ 1.03% చొప్పున నష్టపోయాయి. రంగాలవారీ సూచీలకొస్తే స్థిరాస్తి అత్యధికంగా 1.55 శాతం లాభపడింది. టెక్ 1.16%, ఐటీ 1.11%, మన్నికైన వినిమయ వస్తువులు 1.03% చొప్పున పెరిగాయి. ఆరోగ్య సంరక్షణ, లోహ సూచీలు మాత్రం స్వల్పంగా తగ్గాయి. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు సానుకూలంగానే ముగిశాయి.

ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు విదేశీ భాగస్వాములు

దిల్లీ: చమురు క్షేత్రాల్లో ఉత్పత్తి పెంచేందుకు ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలు ప్రైవేట్, విదేశీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడానికి అనుమతి ఇచ్చినట్లు కేంద్ర చమురు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. ఇక కఠినతర ప్రాంతాల్లో క్షేత్రాలను అన్వేషిస్తే.. ప్రత్యేక ప్రోత్సాహకాలు సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చమురు ఉత్పత్తి చేస్తున్న క్షేత్రాలను కొనసాగించడం, ఏవైనా వాటిలో విదేశీ భాగస్వామిని కుదుర్చుకోవడం వంటి నిర్ణయాలు తీసుకునే అధికారాలను ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు ఇచ్చినట్లు ప్రధాన్ వివరించారు.

7న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	453	వరంగల్	455
చిల్లరగా(ఒక గుడ్డు)	5.15	విశాఖపట్నం	458
బెంగళూరు	452	చెన్నై	460
8వ తేదీకి...		చిత్తూరు	453
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	445

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 381.65 (382.15) 1260331
ASIAN PAINTS 1396.00 (1385.85) 1074373
AXIS BANK LT 637.45 (619.60) 11735286
BAJAJ AUTO L 2658.55 (2734.20) 462215
BAJAJ FINANC 2553.60 (2576.05) 1024328
BAJAJ FINSER 6407.15 (6410.45) 103217
BHARTI AIRTE 324.95 (322.45) 4966909
BHARTI INFRA 293.75 (285.05) 5453037
BPCL 355.55 (359.45) 2895410
CIPLA 514.05 (512.80) 1168002
COAL INDIA L 234.50 (236.50) 7347326
DR. REDDYS 2558.65 (2600.00) 542415
EICHER MOTOR 19830.40 (20103.60) 215668
GAIL 357.10 (353.15) 1704243
GRASIM IND 820.65 (806.15) 1071590
HCL TECH 941.55 (932.35) 1172376
HDFC 1972.90 (1972.60) 2255477
HDFC BANK 2120.65 (2117.45) 1346753
HERO MOTOCOR 2957.95 (2987.85) 361881
HINDALCO IND 208.55 (210.90) 8143876
HINDUSTAN UN 1784.95 (1781.70) 909032
HPCL 249.80 (248.20) 2274016
ICICI BANK 367.70 (365.20) 12719847
INDIABULLS H 793.90 (829.80) 5265183
INDIAN OIL 133.45 (133.95) 10623470
INDUSINDBANK 1559.15 (1548.20) 3991996
INFOSYS LTD 671.70 (661.05) 8046340
ITC 281.65 (280.95) 9757529
JSW STEEL LT 289.85 (287.95) 7041362
KOTAK MAHIND 1246.60 (1247.95) 1211456
LARSEN & TOU 1383.80 (1388.05) 1851513
M&M 729.55 (725.60) 2792255
MARUTI SUZIK 7362.05 (7234.50) 687845
NTPC LTD 148.60 (145.75) 11768203
ONGC 147.85 (145.70) 12700566
POWER GRID C 198.45 (195.90) 2020789
RELIANCE IND 1104.75 (1098.65) 5513559
SBI 296.30 (297.65) 14579399
SUN PHARMA 430.80 (433.80) 4118235
TATA CONSULT 1897.90 (1876.85) 1856423
TATA MOTORS 175.35 (170.95) 21438351
TATA STEEL L 485.50 (487.65) 8406787
TECH MAHINDR 687.50 (681.10) 1885000
TITAN IND 944.05 (928.45) 5337211
ULTRATECH 3926.75 (3914.55) 220371
UPL LIMITED 763.75 (756.40) 1589933
VEDANTA LIMI 193.45 (192.90) 11020289
WIPRO 324.25 (324.45) 1903604
YES BANK LTD 187.15 (189.65) 40515242
ZEE ENTERTAI 462.95 (463.95) 3020561

నిఫ్టీ నెక్స్ట్ 50


ABB 1301.80 (1303.65) 30115
ACC 1477.95 (1469.10) 438357
ADITYA BIRLA 97.60 (98.00) 1233290
AMBUJA CEMEN 218.00 (216.55) 1280088
ASHOK LEYLAN 93.45 (96.80) 34348346
AUROBIND PHA 724.75 (725.85) 1413246
AVENUE SUPER 1571.15 (1577.75) 315570
BANDHAN BANK 498.05 (528.90) 2684675
BANK OFBAROD 122.70 (121.70) 14244449
BEL 91.40 (91.85) 8019169
BHEL 72.25 (71.40) 8163279
BIOCON LTD 620.65 (618.55) 535308
BOSCH LTD 19510.40 (19438.75) 8827
BRITANNIA 3143.80 (3122.70) 152966
CADILA HEALT 348.90 (344.20) 516834
COLGATE PALM 1303.00 (1310.10) 416743
CONTAINER 681.15 (678.05) 477525
DABUR INDIA 420.45 (419.25) 1394010
DLF LIMITED 179.80 (175.15) 10127291
GENERAL INS 263.60 (263.00) 29297
GODREJ CONSU 800.55 (803.40) 513788
HAVELLS INDI 693.55 (678.55) 657814
HDFC STAND L 393.05 (393.50) 346567
HINDUSTAN ZI 274.55 (271.70) 472131
ICICI LOMBAR 865.45 (866.90) 116260
IDEA CELLULR 36.65 (36.20) 8261827
INTERGLOBE A 1113.75 (1143.20) 1022333
L&TFIN.HOLD 145.70 (144.40) 4202422
LIC HOUS.FIN 479.35 (488.10) 1090142
LUPIN 820.45 (828.90) 948727
MARICO LIMIT 386.80 (378.85) 3660860
MCDOWELL 607.60 (604.60) 1239175
MOTHERSON 157.10 (158.65) 3882717
MRF 66978.55 (66603.15) 6823
NHPC LTD 25.95 (25.55) 2658007
NMDC LTD 94.95 (93.95) 3393526
OIL INDIA 174.60 (174.55) 1275303
ORACLE FIN S 3596.20 (3598.20) 14801
P&G HYG&HEAL 9804.20 (9784.95) 2124
PETRONET LNG 217.05 (220.90) 4616473
PIDILITE IND 1102.60 (1105.70) 225286
PIRAMAL ENTE 2279.55 (2358.65) 471723
SAIL 53.40 (53.15) 7375254
SBI LIFE INS 602.45 (602.85) 316222
SHREE CEMENT 16921.70 (16737.10) 11758
SHRIRAM TRAN 1176.30 (1162.65) 900132
SIEMENS 1062.05 (1062.70) 221617
SUN TV LTD 595.35 (592.20) 854838
THE NEW INDI 179.50 (179.85) 23953

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 7.44 (7.83) 281
AISHWARYA TE 2.80 (2.70) 1443
ALPHAGEO 467.05 (469.30) 150
AMAR RAJA BA 735.65 (724.10) 17170
ANDHRA BANK 29.75 (29.75) 46812
ANDHRA CEMEN 5.80 (5.80) 11633
ANDHRA PAPER 448.35 (451.10) 4009
ANDHRA PETRO 68.80 (63.60) 214926
ANDHRA SUGAR 333.55 (333.20) 1123
ASTRA MICROW 80.90 (80.80) 57913
AUROBINDO PH 723.60 (725.40) 38675
AVANTEL SOFT 230.30 (227.95) 1947
AVANTI FEEDS 382.85 (374.55) 20763
BALAJI AMIN 448.50 (450.75) 2765
BARTRONICS 7.50 (7.20) 16185
BHAGIRA CHEM 429 (433.40) 942
BHAGYA NAG 34 (33.50) 1261
BN RATHI SEC 25.75 (26.05) 6924
BRILLIANT SE 1.20 (1.24) 97523
CAMBRIDGE TE 50.85 (46.25) 8600
COMBAT DRUGS 20.25 (19.50) 15
CONT COFFEE 267.85 (269.70) 1341
COROMAN FERT 462.90 (468.80) 10881
CUBEX TUB 15 (14.40) 3000
CYBERMATE 2.25 (2.36) 41612
CYIENT LIMIT 608.25 (608.70) 5663
DECCAN CEMEN 402.15 (398) 480
DIVI'S LAB 1483.70 (1458.70) 26232
DIVYA GRANIT 85.05 (84) 602
DR REDDY 2556.55 (2601.65) 57321
FOUR SOFT 43.55 (42.65) 1824
GATI CORPN 84.65 (83.65) 40964
GAYATRI PROJ 177.80 (178.25) 1019
GMR INFRASTR 15.85 (15.85) 569776
GOLDST INFRA 242.70 (241.90) 18433
GOLDSTONE EN 16.15 (16.25) 2619
GRANULES (I) 88.65 (89.85) 32124
GSS AMERICA 128.80 (129.65) 18510
GVK POWER 7.77 (7.82) 293153
HBL NIFE POW 27.40 (27.55) 14609
HERITAGE FOO 527.90 (521.50) 1497
HIL LTD 1995.75 (2023.25) 1279
HIND FLUROCA 16.30 (16.85) 850
IDL INDUSTRS 297.75 (293.95) 20
IKF SOFT 0.28 (0.29) 39650
ILFS ENGINEE 15 (15) 19454
INCAP 40 (40.95) 152
IVRCL INFRAS 1.01 (1.02) 51744
JEEVAN SCIEN 35.20 (36.95) 1547
KAKATIYA CEM 197.15 (198) 781
KALLAM SPG 18.35 (18.20) 2360
KAVERI SEED 546.55 (550.05) 18903
KCP LTD 90.90 (89.85) 4133
KERNEX MICRO 23.75 (23.15) 352
KNR CONSTRUC 217.50 (217.65) 8927
LANCO INDUS 182.10 (183.55) 2327
LAURUS LABS 376.80 (383.55) 144
LOKESH MACH 45.50 (45.45) 5783
MADHUCON PRO 6.64 (6.60) 5200
MEDINOVA DIA 16.35 (15.60) 3600
MEGA SOFT 7.25 (7.62) 7756
MIC ELECTRON 1.34 (1.41) 800755
MOLD-TEK.TEC 44.05 (43) 676
MOLDTK PLA 260.60 (261.65) 3720
MSR INDIA LT 12.63 (12.07) 11578
NAGARJAGRICH 28 (27.45) 3217
NATCO PHARMA 692.45 (702.95) 5270
NAVA BH VENT 117.90 (117.90) 1108
NCC 88.10 (88.90) 616781
NEHA INTER 4.43 (4.32) 4567
NETTLINX 51.65 (52.30) 22898
NEULAND LAB 488.25 (486.30) 394
NIHAR INFO 15 (14.75) 103
NILE 376.45 (377.35) 463
NORTHGATE TE 0.95 (1) 150253
OIL COUNTRY 16.20 (16.20) 2005
PANYAM CEMEN 13.55 (13.70) 4363
PENNER IND 37 (36.55) 4979
PHYTOCHEM I 47.75 (46.50) 509
PIONEER DIST 165.70 (167) 775
PITTI LAMIN 66.85 (68.45) 4965
POKARNA 158.80 (154.55) 585
PRAJAY ENGS 8.85 (8.75) 4615
PREMIER EXPL 242.20 (246.05) 2389
PRISM CEMENT 87.60 (90.30) 35973
PRUDENTL PHA 3.70 (3.69) 25488
RAASI REFRAC 11.25 (10.73) 861
RAGSAN PETRO 56.10 (57.95) 20
RAIN INDUSTR 121.35 (127.15) 138583
RAJ PACKAGIN 28 (27.75) 355
RAM INFORMAT 40.10 (40.25) 1641
REG.CERAMIC 3.55 (3.53) 10
SAGAR CEM 668.55 (673.05) 292
SAMKRG PIST 189.25 (187.50) 913
SATVAH. ISPA 9.65 (9.80) 6103
SMS PHARMA 71.70 (70.75) 1381
SPHERE GLOBA 18.95 (18.50) 233
SREE RAYAL A 33.35 (34) 49276
SRINIVASA SH 46.90 (45.65) 642
SS ORGANICS 9.92 (9.45) 4500
STARCHIK SP 22.55 (23.60) 720
STEEL EXCHAN 14.80 (14.80) 3290
SUJANA METAL 0.39 (0.39) 6161
SUJANA TOWER 1.05 (1) 500
SURANA TELE 4.75 (4.60) 2002
SURYALAKSH.C 43 (42.75) 1708
SUVEN PHARMA 230.65 (232.55) 11669
TAJ GVK HOTE 174.60 (172.60) 14
TANLA 30.65 (31.25) 4846
TERA SOFTWAR 40.85 (40.30) 12566
TRANS BIOTEK 3.55 (3.51) 18341
TRENDY KNIT 0.19 (0.19) 65500
VAMSHI RUBB 33.50 (31.05) 25734
VBC FERRO 41.65 (43.05) 708
VICEROY HOTE 4.87 (5) 24032
VIJAY TEXTIL 42.20 (41.60) 557
VIMTA LABS 303.65 (306.60) 5883
VISAKA IND 431.75 (423.15) 2394
VISTA PHARMA 28.90 (30.40) 23295
VIVIMED LABS 35.90 (36.10) 37323
VJIL CONSULT 46.20 (47.70) 48342
VST INDUS 3231.40 (3069.50) 142
YBRANT DIGIT 2.69 (2.67) 55074
ZENOTECH LAB 35.60 (36.10) 1867
ZENTECH 73.80 (73.25) 1198

ఈనాడు బిజినెస్

నగదు లభ్యతకు ఇబ్బందేమీ లేదు



అవసరమైతే తప్పక చర్యలు తీసుకుంటాం

● ఎంఎస్ఎంఈ ప్రతినిధులతో సమావేశం ● నేడు ఎన్‌బీఎఫ్‌సీలతో చర్చలు

☛ ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

దిల్లీ

ఆర్థిక వ్యవస్థ అవసరాలకు కావాల్సినంత నగదు ప్రస్తుతం అందుబాటులో ఉందని, ఒకవేళ కొరత ఏర్పడితే కనుక, సత్వరం పరిష్కార చర్యలు చేపడతామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) ప్రతినిధులతో నేడు (మంగళవారం) ముంబయిలో సమావేశమై, ఆ రంగానికి ఎదురవుతున్న నగదు లభ్యత సమస్యలను తెలుసుకుంటానని వివరించారు. 'ద్రవ్య లభ్యత అంటే, భారీగా నగదు అందుబాటులో ఉంచడం (లూజ్ మనీ) కాకూడదు. నిశిత పరిశీలన అనంతరమే, అవసరాల మేరకు వ్యవస్థలోకి నగదు విడుదల చేయాల్సి ఉంటుంది. అందువల్ల ఆర్‌బీఐ అప్రమత్తంగా వ్యవహరిస్తుంది' అని ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల) ప్రతినిధులతో 2 గంటల పాటు సమావేశమైన దాస్ విలేకరులతో చెప్పారు.

✦ ఎంఎస్ఎంఈల అభిప్రాయం తెలిసింది

ఎంఎస్ఎంఈ రంగం తీరు ఎలా ఉంది, ఆర్‌బీఐ ప్రకటించిన రుణాల పునర్‌వ్యవస్థీకరణ పథకాన్ని ఎలా అమలు చేయాలో ఎంఎస్ఎంఈ ప్రతినిధుల అభిప్రాయం తెలుసుకున్నానని వెల్లడించారు. అత్యధిక సంస్థలు మనుగడ సాధించేలా ఈ పథకం ఉపయోగ పడాలన్నదే తమ ఉద్దేశంగా తెలిపారు. బ్యాంకులు, ఎంఎస్ఎంఈల ప్రతినిధులు కలిసి చర్చించుకుని, రుణ పునర్‌వ్యవస్థీకరణ పథక లక్ష్యం సాకరమయ్యేలా చూస్తారనే విశ్వాసాన్ని ఆర్‌బీఐ గవర్నర్ వ్యక్తం చేశారు.

✦ మార్కెట్‌ను ప్రభావితం చేసేలా వ్యాఖ్యానించను

'ద్రవ్య లభ్యత అనేది మార్కెట్‌కు సంబంధించినది. అందువల్ల ట్రేడింగ్ జరుగుతున్న సమయంలో చేసే వ్యాఖ్యలు ప్రభావం చూపుతాయి' అని మాత్రమే దాస్ పేర్కొన్నారు. వేర్వేరు రంగాల నుంచి వచ్చిన సమాచారం మేరకు, డిసెంబరు-జనవరి నెలల్లో అదనపు మార్కెట్ కార్యకలాపాల (ఓఎంఓ) ద్వారా రూ.60,000 కోట్లు ప్రవేశ పెడతామని ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన సంగతి విదితమే. 'ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక సంస్థల అవసరాలు గణనీయంగా తీరే స్థాయిలోనే ద్రవ్యలభ్యత ఉందనే నేను విశ్వసిస్తున్నా. ఎన్‌బీఎఫ్‌సీలకు ద్రవ్య లభ్యత తీవ్రంగా ఉందని కొన్ని నెలలుగా వార్తలొస్తున్నాయి. మంగళవారం ఆ రంగ ప్రతినిధులతో సమావేశమై, తెలుసుకుంటా' అని దాస్ పేర్కొన్నారు.

✦ బ్యాంకుల నిరర్థక ఆస్తులు తగ్గుతున్నాయ్

ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీ) నిరర్థక ఆస్తుల మొత్తాలు తగ్గుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ సంతృప్తి వ్యక్తం చేశారు. 'పీఎస్‌బీలు, ఎన్‌పీఏలపై రోజువారీ పరిశీలన జరుగుతోంది. వీటి స్థితి మెరుగవుతోందనే ఆర్థిక స్థిరత్వ నివేదికలో వెల్లడైంద'ని పేర్కొన్నారు. 'బ్యాంకుల పనితీరు మందగించేలా సంస్కరణలు తేవడం మంచిది కాదు. ఎలాంటి సంస్కరణలు అవసరమనే విషయమై వేర్వేరు వర్గాలతో సంప్రదిస్తున్నా' అని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు.

✦ మధ్యంతర డివిడెండ్‌పై నిర్ణయిస్తాం

ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్ చెల్లించడంపై తుది నిర్ణయం తీసుకున్నాక, ఆర్‌బీఐ బోర్డు వెల్లడిస్తుందని శక్తికాంతదాస్ తెలిపారు. జులై-జూన్‌ను ఆర్థిక సంవత్సరంగా వ్యవహరించే ఆర్‌బీఐ, గత ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 కోట్ల మధ్యంతర డివిడెండ్‌ను అందించింది. పూర్తి ఏడాదికి రూ.40,000 కోట్ల డివిడెండ్‌ను 2018 ఆగస్టులో అందించింది. అంటే గత ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.50,000 కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వానికి అందించినట్లయ్యింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి డివిడెండ్/అదనపు నిధుల రూపేణ రూ.54,817.25 కోట్లు సమీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

ఆర్‌బీఐ మధ్యంతర డివిడెండ్ రూ.30,000-40,000 కోట్లు?

మార్చిలోగా మంజూరుకు అవకాశం

ప్రభుత్వానికి మధ్యంతర డివిడెండ్‌గా రూ.30,000-40,000 కోట్లను ఆర్‌బీఐ మార్చిలోపే బదిలీ చేసే అవకాశం ఉందని సమాచారం. ఈ వ్యవహారంతో నేరుగా సంబంధం కలిగిన ముగ్గురు వ్యక్తులు ఈ సమాచారం తెలిపినట్లు వార్తాసంస్థ రాయిటర్స్ పేర్కొంది. ఫిబ్రవరి 1న ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశ పెట్టనున్నారు. ఈలోగానే ఆర్‌బీఐ బోర్డు నిర్ణయం తీసుకోవచ్చునేది ఇద్దరు ప్రతినిధుల సమాచారం.

✦ బాండ్లు, కరెన్సీల ట్రేడింగ్ ద్వారా ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. ఇందులో కొంతమొత్తాన్ని నిల్వగా ఉంచి, మరింత మొత్తాన్ని ప్రభుత్వానికి డివిడెండుగా అందిస్తుంటారు. ఈ ఆర్థిక సంవత్సరాని (2018-19)కి మధ్యంతర డివిడెండ్ ఎంత ఇవ్వాలనేది ఆర్‌బీఐ బోర్డు ప్రత్యేకంగా నిర్ణయిస్తుంది. వాస్తవానికి జూన్‌లో తమ ఆర్థిక సంవత్సరం ముగిశాక, ఏటా ఆగస్టులో ప్రభుత్వానికి డివిడెండును ఆర్‌బీఐ అందిస్తుంటుంది. మధ్యంతర డివిడెండును ఈసారి కూడా ఇస్తే, వరుసగా ఇలా చేయడం రెండో ఏడాది అవుతుంది. ఈ మొత్తం రూ.30,000-40,000 కోట్లు అయితే కనుక, ఈ మార్చిలోపు ప్రభుత్వానికి ఆర్‌బీఐ నుంచి అందిన మొత్తం రూ.70,000-80,000 కోట్లు అవుతుంది. 2014-15లో ఇలా అందినమొత్తం రూ.65,900 కోట్ల కంటే కూడా ఎక్కువే.

ఆదాయం లక్ష్యానికి రూ.లక్ష కోట్లకు పైగా తరుగు!

ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం అంచనా వేసిన ఆదాయంలో రూ.1-1.4 లక్షల కోట్ల మేర తగ్గవచ్చన్నది అంచనా. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ఆదాయం, పెట్టుబడుల ఉపసహరణపై ఆర్జించదలచుకున్న మొత్తాలు తగ్గడమే ఇందుకు కారణం. దీంతోపాటు రూ.26,000 కోట్ల అదనపు వ్యయాల కోసం పార్లమెంటు ఆమోదానికి ప్రభుత్వం దరఖాస్తు చేసింది. అంటే ద్రవ్యలోటు మరింత పెరగనుంది.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.8.74 లక్షల కోట్లు

ఏప్రిల్- డిసెంబరులో 14% వృద్ధి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) ఏప్రిల్- డిసెంబరు మధ్య ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.8.74 లక్షల కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో జరిగిన వసూళ్ల కంటే ఈ మొత్తం 14.1% అధికమని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఏప్రిల్-డిసెంబరు మధ్య రూ.1.30 లక్షల కోట్ల పన్ను రిఫండ్‌లను జారీ చేశారు. అంతక్రితం ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇవి 17 శాతం ఎక్కువ. ఇక ముందస్తు పన్ను చెల్లింపులు 14.5 శాతం వృద్ధితో రూ.3.64 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్‌లను పరిగణనలోకి తీసుకున్న అనంతరం నికర వసూళ్లు 13.6 శాతం పెరిగి రూ.7.43 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. బడ్జెట్‌లో నిర్దేశించుకున్న ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యమైన రూ.11.50 లక్షల కోట్లలో ఇవి 64.7 శాతానికి సమానం కావడం గమనార్హం. స్థూల గణాంకాల్లో చూస్తే.. ఏప్రిల్- డిసెంబరులో కార్పొరేట్ ఆదాయ పన్ను 14.8 శాతం, వ్యక్తిగత ఆదాయ పన్ను 17.2 శాతం చొప్పున వృద్ధి చెందాయి. రీఫండ్‌లను పరిగణనలోకి తీసుకున్న అనంతరం వ్యక్తిగత ఆదాయపు పన్నుల వసూళ్లలో నికరంగా 14.8 శాతం వృద్ధి ఉండగా, కార్పొరేట్ పన్ను వసూళ్లు 16 శాతం పెరిగాయి. ముందస్తు కార్పొరేట్ పన్ను చెల్లింపులు 12.5 శాతం, ముందస్తు వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపులు 23.8 శాతం వృద్ధి నమోదు చేశాయి.

111 మార్గాలు.. 15 విమానయాన సంస్థలు

ఉడాన్ కింద పొందేందుకు బిడ్లు



దిల్లీ: ప్రాంతీయ విమానయాన సేవల (ఉడాన్) కింద 111 మార్గాల్లో విమానాలు నడిపేందుకు 15 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయని పౌరవిమానయాన శాఖ అధికారులు వెల్లడించారు. సామర్థ్యం కలిగిన చిన్న నగరాలకు, అందుబాటు ప్రయాణ ఛార్జీలతో (గంటకు రూ.2,500 మించకుండా) విమానాలు నిర్వహించడం ఈ పథక ఉద్దేశం. 'మూడోదశ కింద 111 మార్గాల కోసం 15 విమానయాన సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. వీటిని కౌంటర్ బిడ్డింగ్ కోసం ఉంచాం. ఈ 15 సంస్థల్లోనే 6 కౌంటర్ వేశాయి. మొత్తం 17 కౌంటర్ ప్రతిపాదనలు వచ్చాయి' అని అధికారులు తెలిపారు.

✦ మూడోదశ వేలంలో స్పైస్‌జెట్ 37, ఇండిగో 20 మార్గాలకు బిడ్లు వేశాయి. ఘోదావత్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ 15 మార్గాలకు బిడ్లు వేసింది.

✦ మూడోదశ వేలంలో, హెలికాప్టర్ మార్గాలను వేలానికి ఉంచలేదు. ఈశాన్య, కొండ ప్రాంతాల్లో హెలికాప్టర్ సేవలు అందించేందుకు రెండోదశలో అనుమతి పొందిన వారే ఇంకా సేవలు ప్రారంభించకపోవడం ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. 31 హెలిపోర్టులు ఇంకా సిద్ధం కావాల్సి ఉందన్నారు. ఇవి రాష్ట్ర ప్రభుత్వాలు, రక్షణ శాఖ ఆధీనంలో ఉన్నాయి.

✦ గతంలో హెలి ప్యాడ్‌లు మాత్రమే ఉండేవి. వాటిని ప్రత్యేక అవసరాలకు వాడేవారు. ప్రయాణికులను చేరవేసేందుకు హెలిప్యాడ్‌లపై అనుమతి ఇవ్వరు. హెలిపోర్టులు వాడాల్సిందే.

✦ 2016లో ప్రారంభించిన ఉడాన్ కింద తొలిదశలో 5 విమానయాన సంస్థలు 128 మార్గాలు, రెండోదశలో 15 సంస్థలు..325 మార్గాలు (హెలికాప్టర్లతో కలిపి) పొందాయి.

12% .. లాభమే 5% పన్నుతో భారమే!



జీఎస్‌టీ విధానం తీవ్రంగా ప్రభావం చూపించిన రంగాల్లో స్థిరాస్తి ఒకటి. అందుకే ఈ రంగంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ పన్నుల హేతుబద్ధీకరణ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ విషయంపై తదుపరి సమావేశంలో జీఎస్‌టీ మండలి నిర్ణయం తీసుకోవచ్చు. కొన్ని అనధికార వర్గాల సమాచారం ప్రకారం నిర్మాణంలో ఉన్న గృహాలు/ ఫ్లాట్లపై జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించేందుకు జీఎస్‌టీ మండలి మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే నిర్మాణదారుకు ప్రస్తుతమిచ్చే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) లభించదు. తాజాగా మరో వార్త ఏమిటంటే.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఇస్తూనే జీఎస్‌టీని 12 శాతానికి ప్రభుత్వం తగ్గించే అవకాశం ఉందట. ఈ ఊహాగానాలు ఎలా ఉన్నప్పటికీ.. అంతిమంగా ఆ నిర్ణయం ప్రభావం కొనుగోలుదారుపై ఉండక మానదు. మరి అది సానుకూలమా.. ప్రతికూలమా? సోదాహరణగా తెలుసుకుందాం..



- సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్

ప్రస్తుతం స్థిరాస్తి రంగానికి 18% జీఎస్‌టీని ప్రభుత్వం విధిస్తోంది. అయితే స్థలం విలువ కలిపి లేకుంటేనే 18 శాతం.. ఒకవేళ కలిపి ఉంటే ఇందులో 2/3 వంతు అంటే 12% చెల్లిస్తే సరిపోతుంది. పైగా నిర్మాణ నిమిత్తం కొనుగోలు చేసిన సామాగ్రిపై చెల్లించిన జీఎస్‌టీని ఐటీసీ కింద నిర్మాణదారు తిరిగి క్లెయిమ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం సిమెంటుకు 28%, స్టీల్, టైల్స్‌కు 18%, మరికొన్ని నిర్మాణ సామగ్రికి 12%, 5% జీఎస్‌టీ ఉంది. ఈ లెక్కన సగటున నిర్మాణ సామగ్రిపై నిర్మాణదారు దాదాపు 18% మేర జీఎస్‌టీ చెల్లిస్తున్నాడని అనుకుంటే, ఆ పన్ను మొత్తాన్ని తిరిగి పొందే వీలుంటుంది. అందువల్ల ఈ పన్ను వ్యయాన్ని నిర్మాణదారు మొత్తం వ్యయాల్లో చేర్చడు. దాంతో ఆ మేరకు కొనుగోలుదారుపై భారం తగ్గుతుంది. కొనుగోలుదారుల నుంచి పన్ను వసూలు చేసి ప్రభుత్వానికి తిరిగి కట్టే సమయంలోనే తనకు రావాల్సిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను మినహాయించుకొని నికర పన్నును మాత్రమే నిర్మాణదారు చెల్లిస్తాడు. అందువల్ల మొత్తం ఫ్లాట్ వ్యయంలో నిర్మాణ సామగ్రిపై చెల్లించిన జీఎస్‌టీని నిర్మాణదారు కలపలేదనే విషయాన్ని ఇక్కడ మనం అర్థం చేసుకోవచ్చు.

✦ తగ్గినట్లు కనిపించినా భారమే.

జీఎస్‌టీని 5% తగ్గించడం వల్ల చూడటానికి పన్ను రేటు తగ్గినట్లు కనిపించినా ప్రస్తుతంతో పోలిస్తే కొనుగోలుదారుపై మరింత భారం పడనుంది. ఐటీసీ క్లెయిమ్ చేసుకునే వీలు లేకపోవడంతో నిర్మాణ సామగ్రిపై చెల్లించిన జీఎస్‌టీ విలువ మొత్తం వ్యయంలో నిర్మాణదారు చేర్చుతాడు. ఇది పన్నుపై పన్ను చెల్లించాల్సిన పరిస్థితిని తీసుకొస్తుంది. దీనికి తోడు పెరిగిన వ్యయంపై స్టాంప్ డ్యూటీ మరింత ఎక్కువగా కట్టాల్సి వస్తుండటం కూడా కొనుగోలుదారుపై అదనపు భారాన్ని పెంచేదే. అంతేకాకుండా ఐటీసీ రావడం లేదని పన్ను భారం నుంచి తప్పించుకునేందుకు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోళ్లకు కొందరు నిర్మాణదార్లు ఆసక్తిని కనబర్చే అవకాశం ఉంటుంది.

✦ కలగా మిగిలిపోవద్దు..

స్థిరాస్తి రంగంలో జీఎస్‌టీ రేట్లకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకుంటే కొనుగోలుదారుపై భారం తగ్గుతుందో ప్రభుత్వం అటువంటి నిర్ణయమే తీసుకుంటుందని ఆశిస్తున్నాను. జీఎస్‌టీ మండలి కూడా ఆ దిశగానే ఆలోచించాలన్నదే నా విన్నపం. ఎందుకంటే గృహాలు/ ఫ్లాట్ల ధర మరింత పెరిగితే దానిని కొనుగోలు చేసే ఆర్థికశక్తి లేక సామాన్యుడి సొంతింటి కల ఎప్పటికీ కలగానే ఉండిపోతుంది. పై రెండు ప్రతిపాదనల్లో ఐటీసీ లేకుండా 5 శాతానికి జీఎస్‌టీని తగ్గించడం కంటే.. ఐటీసీని ఉంచి 12 శాతానికి జీఎస్‌టీ తగ్గిస్తేనే మేలన్నది నా భావన.

మీ సందేహాలు పంపండి

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా
eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

పన్ను రేట్లు మారిస్తే ఏమిటి?

ఒకవేళ నిర్మాణంలో ఉన్న గృహాలు/ ఫ్లాట్లుపై జీఎస్‌టీని ప్రస్తుతమున్న 18 శాతం నుంచి 5 శాతానికి లేదంటే 12 శాతానికి తగ్గిస్తే ఎవరికి ఎలాంటి ప్రయోజనం ఉంటుందో కింది ఉదాహరణలో చూద్దాం.

ప్రస్తుత జీఎస్‌టీ ప్రకారం..

☛ ఫ్లాట్ మొత్తం వ్యయం **రూ.45,00,000** అనుకుందాం. ఇందులో స్థలం విలువ కలిసే ఉందని భావిద్దాం.

☛ ఇందులో నిర్మాణ సామగ్రి ఖర్చు దాదాపు మూడింట రెండొంతుల వరకు ఉంటుంది. ఈ ప్రకారం **రూ.45,00,000లో 2/3= రూ.30,00,000**

☛ ఈ నిర్మాణ సామగ్రికి సగటున 18% జీఎస్‌టీని లెక్కిస్తే చెల్లించిన పన్ను మొత్తం **రూ.5,40,000.** దీనిని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద నిర్మాణదారు తిరిగి పొందే వీలుంది. అందువల్ల మొత్తం వ్యయానికి దీనిని నిర్మాణదారు చేర్చడు.

☛ నిర్మాణదారు 10% మార్జిన్‌తో విక్రయ ధరను నిర్ణయిస్తే రూ.5,00,000 మార్జిన్ కలిపి విక్రయ ధర **రూ.50,00,000** అవుతుంది.

☛ కొనుగోలుదారు చెల్లించాల్సిన జీఎస్‌టీ.. విక్రయ ధర **రూ.50,00,000 పై (18%లో 2/3 వంతు) 12% = రూ.6,00,000**

☛ **విక్రయ ధర, జీఎస్‌టీ కలిపితే కొనుగోలుదారుకు మొత్తంగా అయ్యే ఖర్చు రూ.56,00,000**

ఐటీసీ ఇచ్చి 12 శాతానికి జీఎస్‌టీ తగ్గిస్తే..

☛ ఈ ప్రతిపాదన ప్రకారం కూడా ఐటీసీని తిరిగి పొందే వీలుండటంతో.. మొత్తం వ్యయంలో ఆ ఖర్చు చేరదు. అందువల్ల ఇక్కడ కూడా నిర్మాణదారు 10% మార్జిన్‌తో కలిపి విక్రయ ధర **రూ.50,00,000** అవుతుంది.

☛ కొనుగోలుదారు చెల్లించాల్సిన జీఎస్‌టీ.. విక్రయ ధర **రూ.50,00,000 పై 8% (12%లో 2/3)= రూ.4,00,000**

☛ **విక్రయ ధర, జీఎస్‌టీ కలిపితే కొనుగోలుదారుకు మొత్తంగా అయ్యే ఖర్చు రూ.54,00,000**

అంటే ప్రస్తుతంతో పోలిస్తే జీఎస్‌టీని 12 శాతానికి తగ్గిస్తే కొనుగోలుదారుకు రూ.2,00,000 వరకు ప్రయోజనం ఉంటుందన్నమాట.

ఐటీసీ లేకుండా 5% జీఎస్‌టీ ప్రకారం..

☛ ప్రతిపాదిత 5% జీఎస్‌టీ విధానంలో ఐటీసీని పొందే వీలు లేనందున ఫ్లాట్ మొత్తం వ్యయానికి (రూ.45,00,000) ఈ రూ.5,40,000ను నిర్మాణదారు చేరుస్తాడు. అప్పుడు మొత్తం వ్యయం రూ.50,40,000 అవుతుంది.

☛ నిర్మాణదారు 10% మార్జిన్ (రూ.5,60,000) కలుపుకొంటే విక్రయ ధర రూ.56,00,000 అవుతుంది.

☛ కొనుగోలుదారు చెల్లించాల్సిన జీఎస్‌టీ.. విక్రయ ధర **రూ.56,00,000 పై 5%= రూ.2,80,000**

☛ విక్రయదారు, జీఎస్‌టీ కలిపితే కొనుగోలుదారు మొత్తంగా అయ్యే ఖర్చు **రూ.58,80,000**

అంటే ప్రస్తుతంతో పోలిస్తే ప్రతిపాదిత 5% జీఎస్‌టీ విధానంలో కొనుగోలుదారు రూ.2,80,000 వరకు ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందన్నమాట. నిర్మాణదారుకు ప్రస్తుతం రూ.5,00,000 మార్జిన్ వస్తుంటే ప్రతిపాదిత విధానంలో రూ.5,60,000 వరకు మార్జిన్ పెరిగింది. ప్రభుత్వం విషయానికొస్తే.. ప్రస్తుత విధానంలో రూ.6,00,000 వరకు ప్రభుత్వానికి వస్తుండగా, ప్రతిపాదిత విధానంలో ఇది రూ.8,20,000 (రూ.5,40,000+ రూ.2,80,000) వరకు పెరుగుతుంది. అంటే ఈ నిర్ణయంతో నిర్మాణదారుకే కాదు ప్రభుత్వానికి కూడా మేలేనన్నమాట.

గమనిక: స్థిరాస్తి రంగంలో జీఎస్‌టీ రేట్లను మార్పు చేస్తే కొనుగోలుదారుపై ఎలాంటి ప్రభావం పడుతుందనే విషయంపై అవగాహన కల్పించడంలో భాగంగా పై విషయాలు తెలియజేశాం. ఇందులో ఎవరి పేరు ప్రతిష్ఠలు దెబ్బతియాలనే ఉద్దేశం రచయితకు కాని పత్రికకు కాని లేదు.

నియామకాలపై పెద్ద ప్రభావం ఉండదు

ఇ-కామర్స్ నిబంధనల్లో తాజా మార్పు నేపథ్యం

దిల్లీ: ఇ-కామర్స్ కంపెనీల ఎఫ్‌డీఐ నిబంధనల్లో ఇటీవల చేసిన మార్పులు నియామకాలపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని నియామక సంస్థలు అంచనా కడుతున్నాయి.



'సమీప భవిష్యత్‌లో 5-10 శాతం మేర మాత్రమే ప్రభావం ఉండొచ్చు. నియామకాలు అంతక్రితం లాగే కొనసాగవచ్చ'ని గ్లోబల్ హంట్ ఎండీ సునీల్ గోయెల్ పేర్కొన్నారు. 'విధాన మార్పుల ప్రభావం ఇ-కామర్స్ రంగంపై మరీ ఎక్కువగా ఉండకపోవచ్చు. సరఫరా, వినియోగదార్ల సేవలు ఆ కంపెనీలకు కీలకం. కాబట్టి వినియోగదార్ల నుంచి పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకుని కంపెనీలు నియామకాలను కొనసాగిస్తాయ'ని ఆయన అంచనా కట్టారు. విదేశీ పెట్టుబడులు ఉన్న ఆన్‌లైన్ కంపెనీలు తమకు వాటాలున్న కంపెనీలకు చెందిన ఉత్పత్తులను విక్రయించరాదని డిసెంబరులో ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇంకా ఏదేని ఒక విక్రేతకు చెందిన ఉత్పత్తుల్లో 25 శాతం కంటే ఎక్కువ విక్రయించడానికి ఇ-కామర్స్ సంస్థలకు అనుమతులు లేవు. అదే సమయంలో లేబుల్ విక్రయాలపై నిషేధం లేదని కూడా స్పష్టం చేసిన విషయమూ విదితమే. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్న ఈ నిబంధనలు అమెజాన్, వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్‌లపై ప్రభావం చూపొచ్చన్న అంచనాలున్నాయి.

ఇండియా ఫస్ట్‌లైఫ్‌లో వాటా విక్రయం వేగవంతం

ఆంధ్రా బ్యాంక్ సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు రంగ జీవిత బీమా సంస్థ అయిన ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా విక్రయానికి ఆంధ్రా బ్యాంకు సన్నాహాలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తన వాటా విలువను మదింపు చేసేందుకు కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయనుంది. ఈ బీమా కంపెనీలో ఆంధ్రా బ్యాంకునకు 30 శాతం వాటా ఉంది. ఇంకా బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకేకు చెందిన లీగల్ అండ్ జనరల్ ఇతర వాటాదార్లుగా ఉన్న సంస్థలు. నిరర్థక ఆస్తులు పెరిగిపోవటం, గత కొంతకాలంగా నష్టాలు నమోదు చేయాల్సిన పరిస్థితి రావటంతో కొన్ని పెట్టుబడులను విక్రయించాలని ఆంధ్రా బ్యాంకు భావిస్తోంది. ఇందులో భాగంగా అనుబంధ సంస్థల్లో వాటాలు విక్రయించబోతోంది. ఈ మేరకు గత ఏడాది నవంబరులో జరిగిన ఆంధ్రా బ్యాంకు బోర్డు డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీతో పాటు ఏఎస్ఆర్ఈసీ ఇండియా లిమిటెడ్, ఇండియా ఇంటర్నేషనల్ బ్యాంక్ (మలేషియా) బెర్హాద్‌లోనూ ఆంధ్రా బ్యాంకుకు వాటాలు ఉన్నాయి. వాటిని కూడా విక్రయించబోతోంది. ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో వాటా విక్రయం ద్వారా అధిక మొత్తంలో నిధులు లభించే అవకాశం ఉన్నట్లు ఆంధ్రా బ్యాంకు అధికార వర్గాలు వివరిస్తున్నాయి.

1న వైదొలగనున్న ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్

తాత్కాలిక అధిపతిగా ప్రపంచబ్యాంక్ సీఈఓ

వాషింగ్టన్: తన పదవి నుంచి ఫిబ్రవరి 1న వైదొలగనున్నట్లు ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ (58) సోమవారం ప్రకటించారు. ఆరేళ్లకు పైగా కిమ్ ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వాస్తవానికి 2022 వరకు కిమ్‌కు గడువు ఉంది. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా ఎప్పుడూ అమెరికా పౌరులే ఉంటున్నారు. బ్యాంకులో అధికవాటా కలిగిన అమెరికాయే ఈ పదవికి నామినేట్ చేస్తుంటుంది. ప్రపంచబ్యాంకుకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా బ్యాంక్ పనిచేస్తున్నట్లు కిమ్ తెలిపారు. ఆయన స్థానంలో, ప్రపంచబ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) క్రిస్టలినా జార్జివా తాత్కాలిక అధిపతిగా ఫిబ్రవరి 1న బాధ్యతలు చేపడతారు. 'ప్రపంచ వ్యాప్తంగా పేదల ఆకాంక్షలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రపంచబ్యాంక్ గ్రూప్ బాధ్యతలు చాలా కీలకం అయ్యాయి. వాతావరణ మార్పులు, ప్రబలుతున్న వ్యాధులు, కరవు, శరణార్థులు అధికమవుతున్నారు. ఈ సవాళ్ల నడుమ బ్యాంక్ అధ్యక్షుడిగా పనిచేయడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా' అని కిమ్ వివరించారు.

రిజర్వేషన్లు ఎందుకు.. ఎలా?



దేశంలో రిజర్వేషన్లపై పెద్ద చర్చే జరుగుతోంది. తాజాగా కేంద్రం అగ్రవర్ణ పేదలకు (ఈడబ్ల్యూఎస్) 10% రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించిన నేపథ్యంలో.. రిజర్వేషన్లు ఎందుకు వచ్చాయి? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతశాతం రిజర్వేషన్లను అమలుచేస్తున్నాయి? అనేవి ఆసక్తికర పరిణామాలు.

రాజ్యాంగం ఏం చెప్పింది?

అంటరానితనం కారణంగా అనాదిగా నిరాదరణకు, వివక్షకు గురవుతున్న ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని భారత రాజ్యాంగం నిర్దేశించింది.

ఎవరికి రిజర్వేషన్లు ఇచ్చారు?

అణగారిన వర్గాలుగా భారత ప్రభుత్వం గుర్తించి, నిర్దేశించిన షెడ్యూల్డు కులాలు(ఎస్సీ), షెడ్యూల్డు తెగలు(ఎస్టీ), ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీ)ల వారికి రిజర్వేషన్లు కల్పించారు. కొన్ని రాష్ట్రాల్లో ముస్లింలకూ బీసీ(ఎం/ఈ) కింద రిజర్వేషన్లు ఇచ్చారు. భారత రాజ్యాంగం, చట్టాలు, స్థానిక నియమ నిబంధనలు ప్రాతిపదికగా ఇవి అమల్లోకి వచ్చాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం ఎలా ఉండేది?

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ ఇండియాలో కూడా కొన్ని కులాలు, వర్గాలకు కోటా విధానం ఉండేది. కొల్హాపూర్ సంస్థానాధీశుడు సాహూ బ్రాహ్మణేతరులు, వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లను ప్రవేశపెట్టారు. 1902లో ఇది అమల్లోకి వచ్చింది. 1932లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రిజర్వేషన్లకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటీష్ ప్రధాని రామ్సే మెక్‌డొనాల్డ్ 'కమ్యూనల్ అవార్డ్'ను ప్రతిపాదించారు. దీని ప్రకారం ముస్లింలు, సిక్కులు, భారత క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లు, యురోపియన్లు, అణగారిన వర్గాల వారికి ప్రత్యేక కోటా ప్రాతినిధ్యం కల్పించారు. దీన్ని గాంధీజీ వ్యతిరేకించగా.. అంబేడ్కర్ సమర్థించారు.

స్వాతంత్ర్యానంతరం ఏం జరిగింది?

ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లకు సంబంధించి దేశ స్వాతంత్ర్యానంతరం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అణగారిన వర్గాల అభ్యున్నతికి భారత ప్రభుత్వం 1950లోనే కార్యాచరణ ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీల జనాభా ప్రాతిపదికన.. విద్యాసంస్థల్లో 20 శాతం సీట్లను ప్రత్యేకించాలని విద్యా మంత్రిత్వశాఖ అప్పట్లోనే ప్రతిపాదించింది. ఆ తర్వాత ప్రభుత్వ రంగం, ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థలతో పాటు, ఉద్యోగాల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం ఖాళీలను జనాభా ప్రాతిపదికన రిజర్వ్ చేశారు.

మండల్ కమిషన్ ఎందుకొచ్చింది?

దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల స్థితిగతుల్ని అధ్యయనం చేసి, సిఫార్సులు చేయడం కోసం 1979 జనవరి 1వ తేదీన అప్పటి మొరార్జీ దేశాయ్ నాయకత్వంలోని జనతాపార్టీ ప్రభుత్వం బి.పి.మండల్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఓబీసీల జన సంఖ్య ఎంత అన్న గణాంకాలు అప్పటికి కమిషన్ వద్ద లేవు. దాంతో అది 1931 నాటి జనాభా లెక్కల్ని వినియోగించుకుని వారి జనాభా 52 శాతంగా నిర్ధారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వంలోని సేవలు, సంస్థల ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కమిషన్ సిఫార్సుచేసింది. ఉన్నత విద్యాసంస్థల్లో ఇదే రిజర్వేషన్ల అమలుకూ మార్పులు చేయాలని సూచించింది. దీనివల్ల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 49.5% కి చేరుకున్నాయి. మండల్ సిఫార్సుల్ని అమలు చేస్తామని 1990లో వి.పి.సింగ్ ప్రభుత్వం ప్రకటించడంతో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున విద్యార్థి ఉద్యమాలు చెలరేగాయి. అప్పటికి సుప్రీంకోర్టు తాత్కాలికంగా స్టే ఇచ్చినా.. ఆ తర్వాత రిజర్వేషన్ల అమలు మొదలైంది.

రిజర్వేషన్ల ఉద్దేశం?

అనాదిగా కుల వివక్ష, అసమానతలు, అవమానాల్ని ఎదుర్కొంటున్న వర్గాల వారికి తగిన న్యాయం చేయడం కోసం, సమానత్వ సాధన కోసం రిజర్వేషన్ల వ్యవస్థ మొగ్గతొడిగింది. అణగారిన వర్గాల విద్య, సామాజిక స్థితిగతుల్ని పెంపొందించి.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఈ చర్య చేపట్టారు.

ఎక్కడెక్కడ?

ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగాలకు, ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, వివిధ చట్టసభల్లో సీట్లకు రిజర్వేషన్లు కల్పించారు.

సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు 1992లో తేల్చిచెప్పింది. అలా దాటితే.. రాజ్యాంగం ప్రస్తావించిన సమానత్వ హక్కు ఉల్లంఘన జరిగినట్లేనని వ్యాఖ్యానించింది.

మారుతున్న ఆలోచనలు

- **వివక్ష నుంచి ఆర్థికానికి:** రిజర్వేషన్లను రాజ్యాంగ నిర్మాతలు దేశంలో కొన్ని సామాజిక వర్గాలు ఎదుర్కొంటున్న సామాజిక 'వివక్ష', 'నిరాదరణ'లకు విరుగుడుగా ముందుకు తెచ్చారనీ, కానీ కొంతకాలంగా ఈ రిజర్వేషన్లకు వివక్షను (డిస్క్రిమినేషన్) ప్రాతిపదికగా కాకుండా వెనకబాటుతనానికి (డిప్రైవేషన్) విరుగుడుగా చూడటం ఆరంభమవుతోందన్న వాదన వినపడుతోంది. పేదరికమన్నది రకరకాల వివక్షలకు దారితీసే మాట వాస్తవమే అయినా.. ఆ పేదరిక నిర్మూలనకు కేవలం వ్యవస్థాత్మకమైన రిజర్వేషన్లనే పరిష్కారంగా చూడలేమనీ, లేదా ఇప్పటికే ఉన్న పేదరిక నిర్మూలన విధానాలకూ ఇది ప్రత్యామ్నాయం కాదని పలువురు వాదిస్తున్నారు. వివక్షనూ, ఆర్థిక వెనకబాటునూ ఒక గాటన కట్టకూడదన్నది వీరి సిఫార్సు.
- **మినహాయింపు నుంచి విస్తరణకు:** రిజర్వేషన్లన్నవి వాస్తవానికి ప్రాథమిక హక్కు అయిన 'సమానత్వ హక్కు'కు ఒక ప్రత్యేకమైన మినహాయింపుగా ఆరంభమయ్యాయి. ఎస్సీ, ఎస్టీలు చిరకాలంగా ఎదుర్కొంటున్న సామాజిక వివక్షలను సరిదిద్దేందుకు, సమానత్వ సాధన కోసం రిజర్వేషన్ల విధానాన్ని 'సమానత్వ హక్కు'కు ఒక మినహాయింపుగా ప్రతిపాదించారనీ, కానీ క్రమేపీ ఇది విస్తరణకు దారితీస్తోందని అంటున్నారు. దీన్ని ప్రత్యేక మినహాయింపుగా కాకుండా వెనకబాటుతనానికి విరుగుడుగా చూడటం వల్లే వివిధ సామాజిక వర్గాలు రిజర్వేషన్ల కోసం ఆరాటపడుతున్నాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఏ రాష్ట్రంలో ఎంత శాతం?

రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పినప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు స్థానిక జనాభాను దృష్టిలో ఉంచుకుని అంతకుమించి రిజర్వేషన్లు ఇస్తున్నాయి. కొన్నింటిపై కోర్టులు స్టే ఇచ్చాయి.

- హరియాణా– 70% (ఎస్సీ-20%, బీసీ ఏ-16%, బీసీ బీ-11%, ప్రత్యేక వెనుకబడిన తరగతులు 10%, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు 10%, వికలాంగులు-3%)
- తమిళనాడు– 69% (ఎస్సీ-18%, ఎస్టీలు-1%, బీసీలు- 20%, ఎంబీసీలు-30%)
- మహారాష్ట్ర– 68%
- ఝార్ఖండ్: 60% (ఎస్సీలు-11%, ఎస్టీలు- 27%, ఓబీసీలు-22%)
- రాజస్థాన్ – 54% (ఎస్సీలు-16%, ఎస్టీలు- 12%, ఓబీసీలు-26%)
- ఆంధ్రప్రదేశ్– 50% (బీసీలు- 29%, ఎస్సీలు-15%, ఎస్టీలు 6% (బీసీల కోటాలోనే ముస్లిం రిజర్వేషన్ల అమలు)
- తెలంగాణ– 50% (బీసీలు- 29%, ఎస్సీలు-15%, ఎస్టీలు 6% (బీసీల కోటాలోనే ముస్లిం రిజర్వేషన్ల అమలు)
- ఈశాన్య రాష్ట్రాలు(అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం) (ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్టీ రిజర్వేషన్లు- 80% , ఇతరులకు- 20%)

ఆకలికి తాళలేక పురుగుల మందు తాగేసిన చిన్నారి

దిల్లీ: ఆకలి బాధకు తాళలేక ఓ చిన్నారి పురుగుల మందునే తాగేసిన అత్యంత దయనీయమైన సంఘటన మధ్యప్రదేశ్‌లోని రట్లాం జిల్లాలో జరిగింది. డిసెంబరు 31న జరిగినట్లుగా చెబుతున్న ఈ ఘటన వివరాలు వెలుగుచూడగానే 'బాలల హక్కుల పరిరక్షణ జాతీయ సంఘం'(ఎన్‌సీపీసీఆర్) విచారణకు ఆదేశించింది. ఓ బృందానికి ప్రత్యేకంగా ఈ కేసు వ్యవహారాన్ని చూసే బాధ్యతను అప్పగించినట్లు ఎన్‌సీపీసీఆర్ అధికారి ఒకరు వెల్లడించారు. బాధిత చిన్నారి ఆరోగ్యపరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ చిన్నారి వయసెంత అన్న విషయం మాత్రం ఇంకా తెలియరాలేదు. చిన్నారి కుటుంబం ఉంటున్న నివాస ప్రాంతం పరిధిలోకి వచ్చే చౌకధరల దుకాణదారును ఎంత బతిమలాడినా రేషన్ గోధుమలను ఇవ్వలేదు. పస్తులతో నీరసించిన ఆ చిన్నారి ఆకలికి తట్టుకోలేక అందుబాటులో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది.

ఇది రాజకీయ ప్రతీకారమే

- **అఖిలేశ్‌పై సీబీఐ ఆరోపణలను తప్పుపట్టిన విపక్షం**
- **పార్లమెంటులో నిరసనలు**



దిల్లీ/ లఖ్‌నవూ: సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌పై సీబీఐ ఆరోపణలు మోపడాన్ని తప్పుపడుతూ విపక్ష ఎంపీలు సోమవారం పార్లమెంటులో నిరసన గళం వినిపించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో గనుల తవ్వకాలకు సంబంధించిన ఆరోపణలపై ఆయన్ని సీబీఐ విచారించవచ్చన్న వార్తల నేపథ్యంలో ఎస్పీతో పాటు బీఎస్పీ, కాంగ్రెస్ తదితర పార్టీల సభ్యులు వ్యక్తం చేసిన నిరసనలతో ఉభయసభల్లో గందరగోళ వాతావరణం నెలకొంది. ఎన్డీయే సర్కారు విపక్ష నేతలపై ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. చర్చనీయాంశాల పత్రాలను ఎస్పీ ఎంపీలు లోక్‌సభలో చించివేసి స్పీకర్ వైపు విసిరేశారు. దీంతో సభను నిర్ణీత సమయానికంటే ముందే వాయిదా వేయాల్సి వచ్చింది. రాజ్యసభలో ఎస్పీ, బీఎస్పీ, ఆప్, ఆర్జేడీ, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల సభ్యులు సభను స్తంభింపజేశారు. రఫేల్‌పై జేపీసీ కోసం కాంగ్రెస్ ఇక్కడా పట్టుపట్టింది. కేరళలో హింసపై వామపక్ష సభ్యులు నిరసనలు తెలిపారు. సభా కార్యకలాపాలను సాగనివ్వాలంటూ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు పదేపదే విజ్ఞప్తి చేసి, ఎలాంటి మార్పు లేకపోవడంతో చివరకు సభను మంగళవారానికి వాయిదా వేశారు.

★ రాజ్యసభ సమావేశాలను బుధవారం వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ సమావేశాలు మంగళవారంతో ముగియాల్సి ఉంది. ముఖ్యమైన ప్రభుత్వ వ్యవహారాలను(గవర్నమెంట్ బిజినెస్) పూర్తిచేయాల్సి ఉండటంతో సమావేశాలను ఒకరోజుపాటు పొడిగించాల్సిందిగా రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి లేఖ రాయగా తదనుగుణంగా నిర్ణయం వెలువడింది. తాజాగా ప్రతిపాదించిన 10 శాతం ఈబీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టేందుకే ప్రభుత్వం సమావేశాల పొడిగింపును కోరి ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

త్రివిధ దళాలకు అరకొర కేటాయింపులే?

సైన్యం, నౌకా, వైమానిక దళాలకు అరకొరగా నిధులు కేటాయిస్తున్నారంటూ రక్షణశాఖపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రభుత్వాన్ని దుయ్యబట్టింది. సైనిక బలగాల కోసం కాలదోషానికి ఆస్కారం లేని ఒక నిధిని సృష్టించడానికి ఆర్థిక మంత్రిత్వశాఖ విముఖత చూపడాన్ని తప్పుపట్టింది. త్రివిధ దళాలకు 2018-19 సంవత్సరంలో రూ.1.72 లక్షల కోట్ల మేర మూలధన కేటాయింపులు అవసరమని రక్షణ శాఖ పేర్కొందని, ఆర్థిక శాఖ మాత్రం రూ.93,982 కోట్లే కేటాయించిందని విమర్శించింది. ఈ కేటాయింపులు రక్షణ శాఖ అంచనాల కన్నా చాలా తక్కువ కావడంతోపాటు ఇప్పటికే సమకూర్చుకున్న ఆయుధాలకు చేయాల్సిన చెల్లింపులకూ సరిపోవని తెలిపింది. ఈ అరకొర కేటాయింపులకు కారణాలు బోధపడటం లేదని వ్యాఖ్యానించింది. సైనిక ఉప ప్రధానాధికారికి రూ.14,097 కోట్ల ఖర్చుకు ఆర్థిక అధికారాలు ఇచ్చినప్పటికీ 2018-19 బడ్జెట్‌లో ఆ మేరకు ప్రత్యేకంగా కేటాయింపులు జరగలేదని తెలిపింది. ఈ స్థాయీ సంఘానికి భాజపా ఎంపీ కల్‌రాజ్ మిశ్ర నేతృత్వం వహిస్తున్నారు.



హసీనాతో ప్రమాణం చేయిస్తున్న బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్

బంగ్లా ప్రధాని పీఠంపై షేక్ హసీనా

ఢాకా: బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా షేక్ హసీనా (71) బాధ్యతలు స్వీకరించారు. దేశాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ ఆమెతో పాటు కొత్త మంత్రులతో సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. 24 మంది కేబినెట్ మంత్రులు సహా మొత్తం 46 మంది మంత్రులు బాధ్యతలు స్వీకరించారు.

హెచ్‌ఏఎల్‌ను దెబ్బ తీస్తున్నారు

- **కేంద్రంపై రాహుల్ విమర్శలు**

దిల్లీ: రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు విషయమై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడి కొనసాగించారు. మిత్రుడు అనిల్ అంబానీకి లబ్ధి చేకూర్చడం కోసమే ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)ను కావాలని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు బయట ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కోసం ఆ సంస్థ తొలిసారిగా రూ.1000 కోట్లు అప్పు తీసుకుందని తెలిపారు. ఇంతవరకు ఒక్క రఫేల్ యుద్ధ విమానాన్ని కూడా సరఫరా చేయని డసో ఏవియేషన్‌కు రూ.20 వేల కోట్లు ఇచ్చారని చెప్పారు. అదే హెచ్‌ఏఎల్‌కు రూ.15,700 కోట్ల బకాయిలను ఇంతవరకు చెల్లించలేదని విమర్శించారు. "ప్రభుత్వ వ్యూహం ఏమిటంటే- హెచ్‌ఏఎల్‌ను బలహీనపరచడం... ఆ సంస్థకు నిధులు ఇవ్వకూడదు... దేశ వ్యూహాత్మక సామర్థ్యాలను బలహీన పరిచి అనిల్ అంబానీకి బహుమతిగా ఇవ్వడం"అని ఆరోపించారు. "హెచ్‌ఏఎల్‌ను నాశనం చేయడం ప్రభుత్వానికి చాలా అవసరం. అది శక్తిమంతంగా ఉంటే ఇతరులకు కాంట్రాక్టులు ఇవ్వలేరు కదా!" అని వ్యాఖ్యానించారు. "హెచ్‌ఏఎల్ ఏమీ నిర్మించలేదని అంటున్నారు. కానీ అనిల్ అంబానీ చేయగలుగుతారట! అనిల్ అంబానీ తన జీవిత కాలంలో ఒక్క విమానాన్నీ తయారు చేయలేదు. హెచ్‌ఏఎల్ ఎన్నో రకాల విమానాలను తయారు చేసింది" అని వివరించారు. హెచ్‌ఏఎల్‌ను కాంగ్రెస్ కాపాడుతుందని చెప్పారు. రూ.30 కోట్ల ప్రజాధనాన్ని అనిల్ అంబానీకి కట్టబెడుతుంటే ఊరుకోబోమని తెలిపారు. "రఫేల్‌పై చర్చకు నాకు 15 నిమిషాల సమయం ఇవ్వండి. నిజాలేమిటో దేశ ప్రజలకు వివరిస్తా" అంటూ ప్రధానికి సవాలు విసిరారు. రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటులో అబద్ధాలు ఆడారని, తాను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేదని ఆరోపించారు. హెచ్‌ఏఎల్‌కు ఇచ్చిన ఆర్డర్లపై ఆమె చెప్పిన వివరాలన్నీ తప్పని అన్నారు. రూ.73 వేల కోట్ల ప్రాజెక్టులు ఇవ్వనున్నట్లు చెప్పిన విషయం కూడా బోగస్సేనని విమర్శించారు.

నిపుణులు అనిల్ సంస్థకు వెళ్లిపోతారు!

హెచ్‌ఏఎల్ వద్ద నగదు లేకపోవడంతో ఆ సంస్థకు చెందిన ప్రతిభావంతులైన ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు అనిల్ అంబానీ కంపెనీకి వలస వెళ్లిపోయే అవకాశం ఉందంటూ రాహుల్ ట్వీట్ చేశారు. జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండడంతో వారు అటువైపు మొగ్గు చూపే సూచనలు ఉన్నాయని చెప్పారు. మరోవైపు కాంట్రాక్టును అమలు చేయడానికి అనిల్ అంబానీ సంస్థకు కూడా నిపుణుల అవసరం ఉండడంతో వారంతా వెళ్లిపోతారని తెలిపారు.

నిర్మలపై హక్కుల తీర్మానం నోటీసు

తప్పుడు సమాచారం ఇచ్చారంటూ నిర్మలాసీతారామన్‌పై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్ సభ్యుడు కె.సి.వేణుగోపాల్ నోటీసు ఇచ్చారు. హెచ్‌ఏఎల్ నిధుల కొరతతో ఇబ్బందులు పడుతోందని ఆ సంస్థ సీఎండీ ఆర్.మాధవన్ చెప్పారని, దీనిపై దర్యాప్తునకు సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు ఖర్గే డిమాండు చేశారు.

హెచ్‌ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల ఆర్డర్లు: నిర్మలా సీతారామన్

హెచ్‌ఏఎల్‌కు ఆర్డర్లు మంజూరు చేసిన వ్యవహారంపై అంతకుముందు లోక్‌సభలో రక్షణశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ వివరణ ఇచ్చారు. ఈ విషయమై రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. ఆ సంస్థకు మొత్తం రూ.లక్ష కోట్లు విలువ చేసే ఆర్డర్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. 2014-18 సంవత్సరాల మధ్య రూ.26 వేల కోట్ల ఆర్డర్లు ఇచ్చామని, మరో రూ.73 వేల కోట్ల కాంట్రాక్టులు ఇవ్వనున్నామని తెలిపారు. 83 తేజస్ విమానాల కోసం రూ.50 వేల కోట్లు, 200 హెలికాప్టర్ల కోసం రూ.20 వేల కోట్లు, 19 డోర్నియర్ విమానాల కోసం రూ.3,400 కోట్లు, ఇతర హెలికాప్టర్ల కోసం రూ.15,000 కోట్లు, ఏరో ఇంజిన్ల కోసం రూ.8,400 కోట్లు కేటాయించామని వివరించారు. ఈ పనులన్నీ హెచ్‌ఏఎల్‌కే అప్పగించనున్నట్లు తెలిపారు.

ముందు చెప్పకుండా బంద్ కుదరదు: కేరళ హైకోర్టు

కొచ్చి: ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలాంటి బంద్‌లకు పిలుపునిచ్చేందుకు వీల్లేదని కేరళ హైకోర్టు సోమవారం స్పష్టం చేసింది. శబరిమల వివాదంపై ఆందోళనల నేపథ్యంలో కేరళలో బంద్‌లకు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల ఛాంబర్, ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. బంద్‌లకు పిలుపునిచ్చే రాజకీయ పార్టీలు, సంస్థలుకనీసం 7రోజుల ముందస్తు నోటీసు ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఏకే జయశంకరన్ నంబియార్‌లతో కూడిన ధర్మాసనంతెలిపింది.

చిదంబరాన్ని ప్రశ్నించిన ఈడీ

దిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా నగదు అక్రమ చలామణి కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత చిదంబరాన్ని ఈడీ సోమవారం ప్రశ్నించింది. ఈడీ ఎదుట చిదంబరం హాజరవ్వడం ఇది రెండోసారి.

నేడూ రేపూ కేంద్ర కార్మిక సంఘాల సమ్మె

దిల్లీ: పది కేంద్ర కార్మిక సంఘాలు మంగళవారం, బుధవారం దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నాయి. సుమారు 20కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు సమ్మెలో పాల్గొంటారని అంచనా వేస్తున్నామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్ తెలిపారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ఏకపక్ష కార్మికచట్టాల సంస్కరణలను నిరసిస్తూ ఈ సమ్మె చేపట్టినట్లు వెల్లడించారు.

మరిన్ని చిక్కుల్లో వాద్రా

దిల్లీ: సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా మరిన్ని చిక్కుల్లో పడ్డారు. ఆయనకు సంబంధించిన ఓ సంస్థపై ఈడీ తాజాగా నగదు అక్రమ చలామణి కేసు నమోదు చేసింది. గురుగ్రామ్‌లో ఆ సంస్థ ఆర్థికపరమైన, ఇతర అవకతవకలకు పాల్పడినట్లు క్రిమినల్ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొంది.



ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరాన్ని సోమవారం ప్రారంభించిన అనంతరం కవాతును పరిశీలిస్తున్న ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరాన్ని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి

దిల్లీ: ఈ ఏడాది (2019) గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొనే నేషనల్ కేడెట్ కోర్(ఎన్‌సీసీ) శిబిరాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం దిల్లీ కంటోన్మెంట్‌లో ప్రారంభించారు. యువతను ఎన్‌సీసీ తీర్చిదిద్దుతున్న తీరు ప్రశంసనీయమని వెంకయ్యనాయుడు అన్నారు. ఎన్‌సీసీలోని సైనిక, నౌకాదళ, వాయుసేన విభాగాలకు చెందిన కేడెట్లు వెంకయ్యనాయుడుకు గౌరవవందనం సమర్పించారు. ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ అయిన లెఫ్టినెంట్ జనరల్ పీపీ మల్హోత్రా ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికారు.

భాజపాతో ఏజీపీ తెగతెంపులు

- **పౌరసత్వ సవరణ బిల్లుకు నిరసన**
- **నేడు ఆమోదించే అవకాశం!**

గువాహటీ/ దిల్లీ: పౌరసత్వ సవరణ బిల్లు-2016ను వ్యతిరేకిస్తూ అసోంలో భాజపా సంకీర్ణ ప్రభుత్వానికి అసోం గణ పరిషత్ (ఏజీపీ) సోమవారం మద్దతు ఉపసంహరించింది. బంగ్లాదేశ్, పాక్, అఫ్గానిస్థాన్‌లకు చెందిన ముస్లిమేతరులు ఆరేళ్లు భారత్‌లో నివాసం ఉంటే దేశ పౌరసత్వాన్ని కల్పిస్తూ రూపొందించిన ఈ బిల్లును ఏజీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బిల్లును ఆపేందుకు ఆఖరు ప్రయత్నంగా దిల్లీలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఏజీపీ ప్రతినిధులు భేటీ అయ్యారు. అనంతరం ఆ పార్టీ అధ్యక్షుడు అతుల్ బోరా మాట్లాడారు. జాతీయ పౌరుల జాబితాను మెరుగుపరచే ప్రక్రియకు విఘాతం కల్పించే ఈ బిల్లు తేకుండా కేంద్రాన్ని ఒప్పించేందుకు విఫలప్రయత్నం చేసినట్లు తెలిపారు. మంగళవారమే బిల్లును లోక్‌సభలో ఆమోదించనున్నట్లు రాజ్‌నాథ్ స్పష్టం చేసిన నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వంలో ఉండే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. 126 మంది సభ్యులున్న అసెంబ్లీలో భాజపా సంఖ్యాబలం 61. సంకీర్ణ ప్రభుత్వానికి బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (12), ఓ స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతుంది. ఈ నేపథ్యంలో 14 మంది సభ్యులున్న ఏజీపీ బయటకొచ్చినప్పటికీ ప్రస్తుతానికి ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదు.

పౌరసత్వ సవరణ బిల్లును ఆమోదించకపోతే మహమ్మద్ ఆలీ జిన్నా విధానానికి మనమంతా తలొగ్గాల్సి వస్తుందంటూ అసోం ఆర్థిక మంత్రి, భాజపా సీనియర్ నేత హిమంతబిశ్వ శర్మ ఆదివారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇది జిన్నా వారసత్వానికి, భారత వారసత్వానికి మధ్య పోరుగా ఆయన వ్యాఖ్యానించారు. దీంతో ఆల్ అస్సాం విద్యార్థి సంఘం, క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి తదితర సంస్థలు 'బ్లాక్ డే'ను పాటిస్తూ ఆందోళనలు చేపట్టాయి. ప్రధాని మోదీ, అసోం ముఖ్యమంత్రి శర్బానంద్ సోనోవాల్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశాయి. లెఫ్ట్ డెమోక్రాటిక్ మంచా నిరసన సభ నిర్వహించింది. హిమంతబిశ్వ శర్మ సోమవారం మరికొన్ని వ్యాఖ్యలు చేశారు. బిల్లు ఆమోదం పొందకపోతే రాష్ట్రంలో హిందువులు ఐదేళ్లలో మైనార్టీలుగా మిగులుతారన్నారు. ఇది అసోంను మరో కశ్మీర్‌గా మార్చాలని కోరుకుంటున్న శక్తులకు ఊతమిస్తుందని వ్యాఖ్యానించారు.

లోక్‌సభకు జేపీసీ నివేదిక..


పౌరసత్వ సవరణ బిల్లు 2016పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నివేదికను సోమవారం లోక్‌సభ ముందుంచారు. దీనిపై మంగళవారం చర్చ జరిగే అవకాశం ఉంది. భాజపా మిత్రపక్షాలైన శివసేన, జేడీయూలు కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తామని ఇప్పటికే తెలిపాయి. మేఘాలయ, మిజోరం ప్రభుత్వాలతో పాటు ఈశాన్య ప్రాంతంలో పలు వర్గాలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి.

ఆవిష్కరణల కొలువు

ఆశ్చర్యంలో ముంచెత్తే ఆవిష్కరణలతో 'కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో' (సీఈఎస్) ఇంటర్నేషనల్ సిద్ధమైంది. అమెరికాలోని లాస్‌వేగస్‌లో జరుగుతున్న ఈ అధునాతన సాంకేతిక వస్తు ప్రదర్శనలో 150కిపైగా దేశాలకు చెందిన 4500 సంస్థలు పాల్గొంటున్నాయి.

దీని పేరు **'హాయ్ మిర్రర్'**. దీనికి ఎదురుగా మనం నిలబడితే చాలు. ముఖంపై చర్మం ఆరోగ్యంతోపాటు మచ్చలు, నల్లని వలయాలు ఇలా అన్నింటినీ విశ్లేషిస్తుంది. దీంతో మొహంలో తేడాలను ఎప్పటికప్పుడు గుర్తించొచ్చు






ఇది **స్మార్ట్ శిరస్త్రాణం**. అత్యవసర సమయాల్లో స్పందించడం దీని ప్రత్యేకత. ప్రమాదం జరిగిన వెంటనే మన ఆప్తులకు ఇది ఎస్‌ఎంఎస్‌లు, ఇ–మెయిళ్లు పంపించగలదు. 'కాస్మో సిటీ బైక్ హెల్మెట్'గా దీనికి నామకరణం చేశారు

పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడే దీని పేరు **స్మార్ట్‌బీట్**. ఇది నిరంతరం పిల్లల శ్వాస తీరును పర్యవేక్షిస్తుంది. ఏదైనా తేడా కనిపిస్తే వెంటనే తల్లితండ్రులను అప్రమత్తం చేస్తుంది



ఛాంపియన్

గావస్కర్‌లు... కపిల్‌దేవ్‌లు.. సచిన్‌లు.. ధోనిలు ఎందరో వెళ్లొచ్చారు.. ఆ గడ్డకి... ఎవరి వల్లా కాలేదు..! సచిన్, అజహరుద్దీన్, ద్రవిడ్, లక్ష్మణ్, సెహ్వాగ్ లాంటి వాళ్లు మహత్తర ఇన్నింగ్స్‌లు ఆడారు.. అయినా ప్రయోజనం లేదు..! ఎవరికి అందనిది.. మహామహులకే చిక్కనిది కోహ్లి సేన సాధించింది.. అదే ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ విజయం! ఈ సిరీస్ టీమ్‌ఇండియా ఎంతో మధురం! మరి ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన కలను కోహ్లి బృందం ఎలా నెరవేర్చింది? ఏమిటీ వీళ్ల విజయ రహస్యం!



నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది

విజయం అనంతరం మైదానంలో కెప్టెన్ కోహ్లి, అతని భార్య అనుష్క శర్మ కలిసి నడిచిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. వర్షం వల్ల చివరి రోజు రద్దైన తర్వాత మైదానంలోకి అడుగుపెట్టిన అనుష్క.. కోహ్లిని కౌగిలించుకొని "నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. మై లవ్" అంటూ అభినందనలు తెలిపింది. ఆ తర్వాత కోహ్లి.. అనుష్క భుజంపై చేయి వేసి మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్లాడు. నూతన సంవత్సర వేడుకల కోసం సిడ్నీ వచ్చిన అనుష్క అక్కడే ఉండిపోయింది.



2011 ప్రపంచ కప్ నెగ్గిన జట్టులో నేను సభ్యుడిని. అందులో భాగమైనందుకు గర్వంగా ఉంది. ఐతే నాకు ఎక్కువ భావోద్వేగం కలిగించింది మాత్రం ఆసీస్‌లో టెస్టు సిరీస్ విజయమే. ఆసీస్‌లో ఇది నా మూడో పర్యటన. ఇక్కడ టెస్టు సిరీస్ గెలవడం ఎంత కష్టమో నాకు బాగా తెలుసు. ఈ క్షణాలు మా అందరికీ గర్వకారణం. గత 12 నెలల్లో జట్టుగా మేమెంత కష్టపడ్డామో మాకు తెలుసు. చరిత్ర సృష్టించామనో.. చరిత్రను తిరగరాశామనో నేను అనుకోవడం లేదు.

– కోహ్లి

71 ఏళ్ల కల ఫలించెను ఈ వేళ..

- తొలిసారి ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచిన భారత్
- 2-1తో ట్రోఫీ కైవసం

వరుణుడు శాంతించలేదు. ఆఖరి రోజు ఒక్క బంతీ పడలేదు. సిడ్నీని మబ్బు కప్పేసింది. కోహ్లీసేన విజయాన్ని అడ్డుకుంది. కానీ భారత క్రికెటర్ల మోముల్లో వెలుగుల్ని మాత్రం ఆపలేకపోయింది. ఆనందం ఆకాశాన్నంటిన వేళ.. కోహ్లీసేన చిందులతో అదరగొట్టింది. మరి మామూలు సందర్భమా అది! భారత క్రికెట్ చరిత్రలో ఓ సువర్ణాధ్యాయం.

అలవోకగా నెగ్గాల్సిన మ్యాచ్ దురదృష్టవశాత్తు డ్రాగా ముగిసిపోతేనేం. ..టీమ్ ఇండియా చరిత్ర సృష్టించింది. 71 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో కసిదీరా ఓడించాలన్న ప్రతి భారతీయుడి స్వప్నాన్ని సాకారం చేస్తూ కంగారూల నేలపై తొలిసారి టెస్టు సిరీస్‌ను చేజిక్కించుకుంది. పసలేని పర్యటక జట్టన్న అపవాదును పోగొట్టుకుంటూ 2-1తో గెలిచి సగర్వంగా బోర్డర్-గావస్కర్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది.

ఎప్పుడో స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో 1947-48లో తొలిసారి ఆసీస్‌లో పర్యటించిన టీమ్‌ఇండియా.. ఎట్టకేలకు 12వ పర్యటనలో అడ్డంకులను అధిగమిస్తూ తన లక్ష్యం సాధించింది. గావస్కర్, కపిల్, సచిన్, కుంబ్లే, ద్రవిడ్.. ఇలా ఎందరో దిగ్గజాలు ఎంతో కాంక్షించినా, ఎంతో శ్రమించినా దక్కని ఫలితం ఇప్పుడు దక్కింది. అందుకే ఈ ఈ విజయం అపురూపం. సొంతగడ్డపై తిరుగులేని ఆస్ట్రేలియాపై కోహ్లీసేన ఆధిపత్యం ప్రదర్శించిన తీరు, బ్యాటుతో బంతితో చూపిన జోరు ఈ విజయాన్ని మరింత మధురంగా మారుస్తున్నాయి. క్రీజులో గోడ కొట్టిన పుజారా.. పదునైన పేస్‌తో అంతా అచ్చెరువొందేలా చేసిన బుమ్రా.. అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెడుతూనే అదరగొట్టిన మయాంక్.. స్ఫూర్తిదాయక నాయకత్వంతో జట్టును నడిపించిన కోహ్లి... ఇలా భారత విజయ సారథులెందరో!



సిడ్నీ

'ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో మట్టికరిపించాలి. టెస్టు సిరీస్ గెలవాలి' అన్నది ప్రతి భారత క్రికెటర్ కలే కాదు.. ప్రతి భారత అభిమాని కల కూడా. ప్రపంచకప్ గెలవడం నుంచి టెస్టు నంబర్‌వన్ కావడం వరకు ఎన్నో గొప్ప విజయాలు సాధించినా, ఎన్నో మైలురాళ్లు అందుకున్నా ఇన్నాళ్లు ఆ లోటు వెంటాడుతూనే ఉంది. కానీ ఇక వెంటాడలేదు. ఆస్ట్రేలియా గడ్డపై టీమ్‌ఇండియా సిరీస్‌ను చేజిక్కించుకుంది. 2-1తో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ గెలిచిన భారత్ మరింత ఘనంగా 3-1తో సిరీస్‌ను ముగించాల్సింది. కానీ వాతావరణమే సహకరించలేదు. వర్షం కారణంగా నాలుగో రోజు కొద్ది ఆట మాత్రమే సాధ్యం కాగా...ఐదో రోజు, సోమవారం ఆటంతా తుడిచిపెట్టుకుపోయింది. ఆతిథ్య జట్టు బతుకు జీవుడా అనుకుంది. భారత్ 622/7 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయగా.. ఆస్ట్రేలియా 300 పరుగులకు ఆలౌటై ఫాలో ఆన్‌లో పడ్డ సంగతి తెలిసిందే. 31 ఏళ్లలో సొంతగడ్డపై కంగారూలకు ఇదే తొలి ఫాలోఆన్. వెలుతురు లేమితో నాలుగో రోజు ఆట నిలిచిపోయే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. ఆ తర్వాత ఆట సాధ్యం కాలేదు. సిరీస్ ఆసాంతం భారత బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలిచిన చెతేశ్వర్ పుజారాకు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది. అతడికే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కూడా దక్కింది.

అనుకున్నట్లే అదరగొట్టింది

ఈసారి టీమ్‌ఇండియా ఆస్ట్రేలియాకు వెళుతోంది అంటే ఎప్పటిలా భయాలు లేవు. ఎన్నో ఆశలతో, ఎన్నో అంచనాలతో కోహ్లిసేన టెస్టు సిరీస్‌లో అడుగుపెట్టింది. చక్కని బ్యాటింగ్‌తో.. అద్వితీయమైన బౌలింగ్‌తో ఆతిథ్య జట్టుపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. అడిలైడ్‌లో పుజారా అద్భుత పోరాటంతోతో మొదలైంది టీమ్‌ఇండియా ఆధిపత్యం. మిగతా బ్యాట్స్‌మెన్ నుంచి పెద్దగా సహకారం లేకున్నా మొక్కవోని పట్టుదలతో శతకం సాధించిన పుజారా... జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ అతడు 71 పరుగులు చేయడంతో భారత్ కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇక బౌలర్లు సమష్టి ప్రదర్శనతో జట్టుకు విజయాన్నందించారు. మ్యాచ్‌లో అశ్విన్, బుమ్రా చెరో ఆరు వికెట్లు పడగొట్టగా.. షమి ఐదు వికెట్లు తీసుకున్నాడు. ఐతే పెర్త్‌లో రెండో టెస్టులో సెలక్షన్ తప్పిదంతో.. ప్రత్యర్థికి సిరీస్ సమం చేసే అవకాశమిచ్చింది. భారత్ ఒక్క స్పిన్నర్‌నూ తీసుకోకుండా.. నలుగురూ పేసర్లనే ఆడించి మూల్యం చెల్లించుకుంది. సహకరిస్తున్న పిచ్‌ను గొప్పగా ఉపయోగించుకున్న లైయన్.. మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించాడు. ఐతే కఠినమైన ఈ పిచ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో శతకం చేయడం ద్వారా కోహ్లి సత్తా చాటుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో షమి (6/56) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మూడో టెస్టులో భారత్ బలంగా పుంజుకుంది. మయాంక్ రాకతో తొలిసారి మెరుగైన ఆరంభం పొందిన భారత్.. పుజారా శతకం, కోహ్లి విలువైన ఇన్నింగ్స్‌తో తొలి ఇన్నింగ్స్‌ను 443/7 వద్ద డిక్లేర్ చేసింది. ఆద్యంతం పట్టును కొనసాగించింది. బుమ్రా (6/33) దాటికి తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలిన ఆసీస్.. ఆ తర్వాత కోలుకోలేకపోయింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ అతడు మూడు వికెట్లు పడగొట్టాడు. షమి, జడేజా కూడా విజృంభించడంతో భారత్ 137 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. అదే ఊపులో నాలుగో టెస్టును ఘనంగా ఆరంభించింది భారత్. పుజారా (193), పంత్ (159 నాటౌట్) జోరుతో 622/7 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి.. మ్యాచ్‌లో తిరుగులేని స్థితిలో నిలిచింది. ఆసీస్‌ను 300కే కుప్పకూల్చి మ్యాచ్‌పై పట్టుబిగించింది. వాతావరణం సహకరిస్తే విజయం సాధించేదే. డ్రా అయినా మరీ నిరాశ చెందాల్సిందేమీ లేదు. 2-1తో సిరీస్ గెలవడం చిన్న విషయమేమీ కాదు. అది ఇచ్చే ఆత్మవిశ్వాసం కొండంత. ఇక టీమ్‌ఇండియా విదేశాల్లో ఇంకెంత మాత్రం తేలిపోయే జట్టుగా ఉండబోదు. అనుమానాలు పోయి.. అభిమానులు కూడా ఇక టీమ్‌ఇండియా ఉపఖండం బయట పర్యటనలను ఆసక్తిగా చూడొచ్చు. ఈ పర్యటన భారత క్రికెట్‌కు మలుపు అనడంలో సందేహం లేదు.

5

సిరీస్‌లో నమోదైన శతకాలు. భారత ఆటగాళ్లే ఈ శతకాలు సాధించడం విశేషం. పుజారా 3 సెంచరీలు చేయగా.. కోహ్లి (123), రిషబ్ పంత్ (159 నాటౌట్) చెరో శతకం బాదారు.

20

సిరీస్‌లో రిషబ్ పంత్ అందుకున్న క్యాచ్‌లు. ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న భారత వికెట్‌కీపర్‌గా అతను రికార్డు నమోదు చేశాడు. తొలి టెస్టులో 11 క్యాచ్‌లు అందుకున్న పంత్.. ఓ మ్యాచ్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న వికెట్ కీపర్‌గా ప్రపంచ రికార్డు సమం చేశాడు.

21

బుమ్రా పడగొట్టిన వికెట్లు. షమి 16 వికెట్లు తీశాడు.

521

పుజారా చేసిన పరుగులు. నాలుగు టెస్టుల్లో మూడు శతకాల సాయంతో 74.42 సగటుతో అతను 521 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 193. రిషబ్ పంత్ 350 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు.

ఈ విజయం అపురూపం

ఈనాడు క్రీడావిభాగం

భారత్ జట్టు ఆస్ట్రేలియాకు వెళుతుంటే ఎంత తేడాతో ఓడిపోతుంది అని లెక్కకట్టేవాళ్లు ఒకప్పుడు.. 0-4తో ఓడిపోయే సిరీస్‌లకు వెళ్లడం అవసరమా అని లెలె లాంటి వాళ్లు వెటకారం చేసేవాళ్లు... దిగ్గజ బౌలర్లను ఎదుర్కొని మన బ్యాట్స్‌మెన్ సెంచరీ సాధిస్తే కేరింతలు కొట్టేవాళ్లు.. మన బౌలర్ ఐదు వికెట్లు పడగొడితే ఆకాశానికెత్తేవాళ్లం.. అలాంటిది టెస్టు గెలవడమే అరుదు అన్న కంగారూ గడ్డపై ఏకంగా సిరీస్ విజయం సాధించడం అత్యద్భుతమే! ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ ఆడటానికి భారత్ తొలిసారిగా అడుగుపెట్టింది 1947-48లో.. అప్పటి నుంచి ఇప్పటిదాకా సిరీస్ గెలుపే లేదు మనకు. 1977-78 పర్యటనలో మనకు మంచి అవకాశం వచ్చింది. అయితే అది కాస్తా 2-3తో చేజారింది. ఈ సిరీస్‌లో ఆధిపత్యం భారత్‌దే అయినా.. ఆఖర్లో తడబడి విజయాన్ని చేజార్చుకుంది టీమ్‌ఇండియా. అప్పటి నుంచి మన జట్టు విజయం కోసం పోరాడుతూనే ఉంది. 1980-81, 2003-04 సిరీస్‌లను డ్రా చేసుకోవడం కూడా భారత్ గొప్ప ఘనతగానే భావించింది.

అక్కడి నుంచి మొదలు.

ఇంట్లో పులి.. ఈ మాటను భారత క్రికెట్ జట్టు చాలాసార్లు నిజం చేసింది. ముఖ్యంగా కంగారూ గడ్డపై మూటగట్టుకున్న ఘోర పరాజయాలను భారత్ ఇంకెక్కడా ఎదుర్కోలేదు. అయితే కోహ్లి సారథ్యంలో బలమైన జట్టుగా ఎదిగిన టీమ్‌ఇండియా.. గతేడాది ఆరంభం నుంచి భిన్నమైన జట్టుగా కనిపించింది. కఠినమైన దక్షిణాఫ్రికా సిరీస్‌లో భారత్ మునుపెన్నడూ లేనంతగా సిరీస్ కోసం పోరాడింది. ఒక మ్యాచ్ గెలవడమే కాక.. కొద్దిలో విజయాలు చేజార్చుకుంది. ఇంగ్లాండ్‌లోనూ సిరీస్ కోల్పోయినా.. ప్రదర్శన మరీ తీసికట్టుగా లేదు. అయితే ఈ సిరీస్‌లు నేర్పిన పాఠాలతో భారత్ కంగారూ గడ్డపై అడుగుపెట్టింది. అయితే ఎప్పట్లానే కోహ్లిపైనే భారత్ ఎక్కువ ఆధారపడతుందని భావించారంతా. కానీ జరిగింది వేరు. ఆసీస్ జట్టు కోహ్లి మీద గురిపెడితే.. పుజారా, రిషబ్ పంత్, మయాంక్ అగర్వాల్ లాంటి ఆటగాళ్లు అసాధారణ బ్యాటింగ్‌తో ప్రత్యర్థిని ఆశ్చర్యపరిచారు. వారు తేరుకునేలోపే భారత్‌కు సిరీస్ విజయాన్ని సాధించిపెట్టారు. ఈ సిరీస్‌లో పుజారా 521 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. పంత్ (350) అతని తర్వాత స్థానంలో ఉన్నాడు. కోహ్లి మొత్తం 282 పరుగులే చేసినా.. జట్టు సిరీస్ గెలిచిందంటే దానికి కారణం పుజారా, పంత్‌లే. ఇక బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్ యాదవ్, షమి లాంటి వాళ్లు భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

వాళ్లు బలహీనమేమి కాదు..

ఈ సిరీస్‌కు ముందు మాజీ ఆటగాళ్లందరూ అన్న మాట ఆస్ట్రేలియా మునుపెన్నడూ లేనంత బలహీనంగా ఉంది.. భారత్‌కు సిరీస్ గెలిచేందుకు ఇదే సరైన తరుణం అని! స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్ లాంటి స్టార్లు లేనందున ఆ జట్టు బలహీనపడిన మాట వాస్తవమే కానీ.. సొంతగడ్డపై ఆస్ట్రేలియా ఎప్పుడూ నీళ్లలో మొసలే! దీనికి తోడు బౌలింగ్‌లో స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ లాంటి వాళ్లతో ఆ జట్టు చాలా బలంగా ఉంది. భారత జట్టు బుమ్రా, షమి లాంటి బౌలర్లతో బలంగా ఉన్నా.. ఎప్పటిలాగే బ్యాటింగ్‌లో తడబడతారని అంతా అనుకున్నారు. కానీ పుజారా, పంత్ లాంటి వాళ్లు అనూహ్యమైన బ్యాటింగ్‌తో భారత్‌కు అవకాశాలు సృష్టించారు. సిరీస్‌లో తొలి టెస్టు గెలవడమే ఈ సిరీస్‌కు మేలి మలుపు. ఈ ఒక్క సిరీస్ విజయంతో భారత్ విదేశాల్లో గెలిచేస్తుందని అనుకోలేం. కానీ విజయమే భారత్ భావి విదేశీ విజయాలకు గొప్ప పునాది అని కచ్చితంగా చెప్పుకోవచ్చు.

కుంబ్లే చెప్పిందే నిజమైంది

ఆస్ట్రేలియా పర్యటనకు ముందు అనిల్ కుంబ్లే చెప్పిన జోస్యం నిజమైంది. సిరీస్‌ను భారత్ 2-1తో నెగ్గుతుందని చెప్పాడు. అంతేకాదు.. వాతావరణం కీలక పాత్ర పోషిస్తుందని, కొన్ని మ్యాచ్‌లకు వరుణుడు అంతరాయం కలిగించవచ్చని అన్నాడు. చివరకు అదే నిజమైంది. భారత్ 2-1తో సిరీస్ నెగ్గింది. చివరి టెస్టు వర్షం కారణంగా డ్రా గా ముగిసింది.

పుజారాతో చిందేయించాడు...



సిరీస్ విజయాన్ని భారత ఆటగాళ్లు ఘనంగా జరుపుకున్నారు. మైదానంలో నృత్యాలు చేశారు. తర్వాత భారత ఆర్మీతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ముందు మైదానంలో పుజారా నడిచే విధానాన్ని అనుకరిస్తూ 'పుజారా డ్యాన్స్'ను జట్టు సభ్యులతో రిషబ్ వేయించాడు. పుజారా నడిచేటపుడు చేతులు కదపడు. దాంతో ఆటగాళ్లందరూ జాగింగ్ చేస్తున్నట్లు కాళ్లను వేగంగా ఊపుతూ.. చేతులను స్థిరంగా ఉంచేలా ఆటగాళ్లతో రిషబ్ స్టెప్పులు వేయించాడు. అయితే సులువైన ఆ స్టెప్పులను వేయడంలో పుజారా ఇబ్బందిపడ్డాడు. అనంతరం హోటల్లో టీమ్‌ఇండియా ఆటగాళ్లు చిందులు వేస్తూ సంబరాలు చేసుకున్నారు. 'మేరే దేశ్ కీ ధర్తీ' పాటకు కెప్టెన్ కోహ్లితో పాటు మిగతా క్రికెటర్లు స్టెప్పులేశారు.

ఇక దక్షిణాఫ్రికా..

ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ కలను నెరవేర్చుకున్న భారత్‌కు ఇంకో కల మిగిలుంది. అదే దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ విజయం! 1992 నుంచి ఈ గడ్డపై పర్యటిస్తున్న భారత్‌కు సిరీస్ విజయం ఎండమావే అయింది. 2018లో సిరీస్ విజయం సాధించే అవకాశాలను కూడా సంపాదించింది అయితే బ్యాటింగ్‌లో కుప్పకూలి ఆ ఛాన్స్ పోగొట్టుకుంది.

"స్మిత్, వార్నర్ గైర్హాజరీతో బలహీనపడ్డ ఆస్ట్రేలియా మీద టీమ్‌ఇండియా సిరీస్ గెలిచింది అనే వ్యాఖ్యల్లో అర్థం లేదు. వాళ్లు జట్టులో లేకపోడం టీమ్‌ఇండియా తప్పు కాదు కదా. ఆస్ట్రేలియా ఎంపిక చేసిన జట్టుతో తలపడి భారత్ విజేతగా నిలిచి గొప్ప ఘనత సాధించింది. మా రోజుల్లో మేం కూడా విజయాల కోసమే ఆడేవాళ్లం. కానీ ప్రస్తుత జట్టు ఫిట్‌నెస్ విషయంలో అత్యుత్తమంగా ఉంది. కెప్టెన్ కోహ్లి జట్టును సమర్థంగా నడిపిస్తున్నాడు" – గావస్కర్



"సిరీస్ విజయం నాకెంతో సంతృప్తినిచ్చింది. 1983 ప్రపంచ కప్, 1985 క్రికెట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ విజయాలతో ఇది సమానం. అంతకంటే ఎక్కువే. క్రికెట్లో టెస్టులే అసలైన ఆట. అత్యంత కఠినమైన ఫార్మాట్ ఐదు రోజుల ఆటే. అందుకే ఈ గెలుపు అన్నిటి కంటే గొప్పది. గతం చరిత్ర. భవిష్యత్తు మిథ్య. 71 ఏళ్ల తర్వాత ఇక్కడ గెలిచాం. వర్తమానంలో ఉండటమే నాకిష్టం. కంగారూ గడ్డపై ఆసీస్‌ను ఓడించిన టీమ్‌ఇండియా తొలి కెప్టెన్ విరాట్ కోహ్లీకి నా సెల్యూట్. టెస్టు క్రికెట్‌ను కోహ్లి కంటే కసిగా ఇంకెవరూ ఆడలేరు. మరే అంతర్జాతీయ కెప్టెన్ అతడి దరిదాపుల్లోకి కూడా రాలేడు" – రవిశాస్త్రి



పతంగుల పండగ.. తియ్యని వేడుక

- ఈ నెల 13 నుంచి 15 వరకు కైట్, స్వీట్స్ ఫెస్టివల్
- వేడుకల నిర్వహణకు పర్యాటకశాఖ ముమ్మర ఏర్పాట్లు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : నాలుగో అంతర్జాతీయ పతంగుల పండగను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ పర్యాటకశాఖ ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ సహకారంతో సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఈ నెల 13 నుంచి 15 వరకు ఈ వేడుక జరుగనుంది. దీంతోపాటు జాతీయ సమైక్యతా పండగలో భాగంగా 'కల్చర్, లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్' (సీఎల్ఐసీ)తో కలిసి అంతర్జాతీయ మిఠాయిల వేడుకనూ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సచివాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేడుకల వివరాలను ఆయన వెల్లడించారు.

19 దేశాల నుంచి...

ఈసారి పతంగుల పండగ పర్యావరణహితంగా జరగనుంది. ప్లాస్టిక్, మాంజా రహితంగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వేడుకలకు 19 దేశాల నుంచి 50 మంది పతంగులు ఎగురవేసే నిపుణులు (కైట్ ఫ్లయర్స్) హాజరుకానున్నారు. మనదేశం నుంచి 60 మంది వరకు పాల్గొననున్నారు. రాత్రివేళల్లో పతంగులు ఎగురవేసే బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'బాలికలను చదివిస్తే వారు ప్రపంచాన్నే మార్చేయగలరు' అనే నినాదంతో బాలికావిద్య ప్రాముఖ్యతపై ఈ వేడుకల ద్వారా అవగాహన కల్పించనున్నారు. వివిధ వంటకాలు, చేనేత వస్త్రాలు, హస్త కళాకృతులకు సంబంధించిన స్టాల్స్ కొలువుదీరనున్నాయి. గత ఏడాది 8లక్షల మంది కైట్ ఫెస్టివల్‌ను వీక్షించగా.. ఈ సంవత్సరం 10లక్షల మంది వస్తారని పర్యాటకశాఖ అంచనా.



అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్ పురస్కరించుకుని సోమవారం సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళా ప్రతినిధులు

వెయ్యి రకాల మిఠాయిలు...

స్వీట్స్ ఫెస్టివల్‌లో సుమారు వెయ్యి రకాల మిఠాయిలు సందర్శకుల నోరూరించనున్నాయి. ఇవన్నీ భాగ్యనగరంలో నివాసముంటున్న తమిళనాడు, కేరళ, పంజాబ్, హరియాణా, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలు, ఇతర దేశాలకు చెందిన మహిళలు తయారుచేయనున్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా రాష్ట్రాలు, బ్రెజిల్, సోమాలియా దేశాలకు చెందిన మహిళలు మిఠాయిలను ప్రదర్శించారు. విభిన్న కులాలు, మతాలు, భాషలకు చెందిన ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడం, తద్వారా జాతీయ సమైక్యత కోసం కృషిచేయడమే వేడుక ముఖ్య ఉద్దేశమని బుర్రా వెంకటేశం తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, పర్యాటకశాఖ ఎండీ మనోహర్ రావు, ఇండియా టూరిజం రాష్ట్ర సహాయ సంచాలకులు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాలంతో భవన అనుమతులు

68 పురపాలికల్లో మొదలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : రాష్ట్రంలోని 68 నూతన పురపాలక సంఘాల్లో భవన నిర్మాణాలకు అంతర్జాలం ద్వారా అనుమతులిచ్చే వ్యవస్థను ప్రభుత్వం సోమవారం లాంఛనంగా ప్రారంభించింది. ఇళ్లు, ఇతర భవనాలు నిర్మించాలనుకునేవారు అనుమతుల కోసం ఇక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. అంతర్జాలంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత పత్రాలనూ సమర్పించవచ్చు. వాటిని అధికారులు పరిశీలించి, నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేస్తారు. నిరాకరించిన సందర్భంలో కారణాలను తెలియజేస్తారు. తమ దరఖాస్తు ఎక్కడ ఉంది, పురోగతి ఏమిటన్న విషయాలను దరఖాస్తుదారులు అంతర్జాలంలోనే చూసుకోవచ్చు. ఏ పురపాలికలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి, నిర్ణీత సమయంలోనే వాటికి అనుమతులిస్తున్నారా వంటిఅంశాలను రాష్ట్రస్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. అంతర్జాల భవన అనుమతుల వ్యవస్థను ప్రారంభించిన సందర్భంగా, పురపాలకశాఖ సంచాలకురాలు టి.కె.శ్రీదేవి కేకు కట్ చేసి వేడుక జరిపారు. కొత్త పురపాలికల్లో ప్రారంభ సమస్యలు, సౌకర్యాల కొరత ఉన్నప్పటికీ సిబ్బంది మద్దతుతో వాటిని అధిగమించి ఈ వ్యవస్థను ప్రారంభించామన్నారు. ప్రజలు నిర్ణీత కాలంలో అనుమతులు పొందవచ్చని, పాలనలోనూ పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ ప్రణాళికశాఖ సంచాలకులు విద్యాధర్ పాల్గొన్నారు.

ఉమ్మడి జాబితా అంశాల బదలాయింపుపై చర్చ చేపట్టాలి

లోక్‌సభలో తెరాస పక్ష నేత జితేందర్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: ఉమ్మడి జాబితాలోని అంశాలను రాష్ట్రాలకు బదలాయించే విషయమై చర్చ చేపట్టాల్సిన అవసరముందని తెరాస లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి అన్నారు. ఈ అంశాన్ని సోమవారం ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌ను సవరించాలని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి జాబితాలోని ఏదేని అంశంపై వివాదం తలెత్తితే కేంద్రానిదే తుది నిర్ణయమవుతోందని, ప్రధాని చెబుతున్న సహకార సమాఖ్య వ్యవస్థకు ఇది విరుద్ధమన్నారు. ఉమ్మడి జాబితాలోని అంశాలను రాష్ట్రాలకు బదలాయించాలని తమ పార్టీ అధినేత కేసీఆర్ ఎప్పట్నుంచో కోరుతున్నట్లు చెప్పారు. రాష్ట్రాలపై పట్టు బిగించేందుకు జాతీయ పార్టీలు దీన్ని ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు.

మినీ అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలి: బీబీ పాటిల్

మినీ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల వేతనాలు పెంచాలని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని సోమవారం ఆయన లోక్‌సభ దృష్టికి తీసుకెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల మాదిరే మినీ కేంద్రాల కార్యకర్తలు కూడా అన్ని రకాల సేవలు అందిస్తున్నారని తెలిపారు. వేతనాలు మరీ తక్కువగా ఉన్నందున ఈ అంశంపై దృష్టిసారించాలని ఆయన కోరారు.

వర్గీకరణ రాజ్యాంగ హక్కుగా పరిగణించాలి

లోక్‌సభ శూన్యగంటలో తెలుగులో మాట్లాడిన ఎంపీ దయాకర్

ఈనాడు, దిల్లీ: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణను రాజ్యాంగ హక్కుగా పరిగణించాలని తెరాస ఎంపీ పసునూరి దయాకర్ డిమాండు చేశారు. ఈ మేరకు ఆయన లోక్‌సభ శూన్యగంటలో తెలుగులో ప్రసంగించారు. 'తెలంగాణ సీఎం కేసీఆర్ ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. అధికారంలోకి వస్తే ఏబీసీడీల వర్గీకరణ 100 రోజుల్లో చేస్తామని భాజపా నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని విస్మరిస్తున్నారు. బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలి' అని ఎంపీ పేర్కొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై దృష్టి సారించాలి : ఎంపీ వినోద్‌కుమార్

దేశంలో ఇప్పటికీ కుష్ఠు వ్యాధిగ్రస్తులను అంటరానివారుగా చూస్తున్నారని, ఈ వ్యాధి నిర్మూలనపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెరాస ఎంపీ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం లోక్‌సభలో పర్సనల్ 'లా'స్ (సవరణ) బిల్లుపై ఆయన ప్రసంగించారు. ఇప్పటి వరకు ఉన్న చట్టాలు కుష్ఠు వ్యాధిని సాకుగా చూపి విడాకులు పొందవచ్చని చెబుతున్నాయన్నారు. ఈ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించవచ్చని అభిప్రాయపడ్డారు.

ఆ గ్రామాల్లో సర్పంచులు ఉండరు

- పోటీ చేయడానికి ఓటర్లు కరవు
- మరికొన్ని చోట్ల ఉప సర్పంచులే సర్పంచులు
- రిజర్వేషన్లతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చిత్రమైన పరిస్థితి


ఈనాడు-ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల రిజర్వేషన్లలో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. వివిధ సామాజిక వర్గాలకు పాలనలో సమానత్వం, పారదర్శకత కల్పనకు ఏర్పాటు చేసిన రిజర్వేషన్ల వల్ల కొన్ని చోట్ల కొత్తచిక్కులొచ్చి పడ్డాయి. జిల్లాలో 1508 గ్రామ పంచాయతీలుండగా.. వాటిలో 613 ఎస్టీలకు రిజర్వు చేశారు. ఎస్టీలకు కేటాయించిన కొన్ని గ్రామ పంచాయతీల్లో ఆ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు లేకపోవడం విశేషం. కొన్ని చోట్ల ఉప సర్పంచులే సర్పంచులుగా చలామణి అయ్యే అవకాశం ఉండగా.. మరి కొన్ని చోట్ల సగం వార్డుల్లో రిజర్వు చేసిన వర్గాల ఓటర్లు లేకపోవడంతో అక్కడ ఉప సర్పంచుల ఎన్నిక కూడా జరగని పరిస్థితి. ఏజెన్సీ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి కొన్ని పంచాయతీల సర్పంచి స్థానాలు పూర్తిగా ఎస్టీలకే కేటాయిస్తున్నారు. ఆయా గ్రామాల్లోనూ ఎస్టీ ఓటర్లు లేకపోవడంతో పాతిక ముప్పై ఏళ్ల నుంచి పంచాయతీ ఎన్నికలు జరగడంలేదు. కొత్త పంచాయతీల ఏర్పాటు, రిజర్వేషన్ల కేటాయింపు వంటి పరిణామాలతో కొన్ని చోట్ల సర్పంచి, వార్డుల స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులే లేకుండా పోయారు.

ఉపసర్పంచూ కరవే

కుమురం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని రహపెల్లి పంచాయతీని 2001 నుంచి ఎస్టీలకు రిజర్వు చేస్తున్నారు. ప్రస్తుతం ఎస్టీ మహిళకు కేటాయించారు. ఇక్కడ 904 మంది ఓటర్లు, 8 వార్డులు ఉన్నాయి. ఒకటి నుంచి నాలుగు వార్డుల వరకు ఎస్టీలకు కేటాయించారు. కానీ.. ఈ ఊరిలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేరు. దీంతో ఈ గ్రామానికి సర్పంచి ఉండరు. ఎస్టీలకు కేటాయించిన నాలుగు వార్డులకు సైతం ఎన్నికలు ఉండవు. ఉప సర్పంచి ఎన్నికకు సరిపడా వార్డు సభ్యులు లేకపోవడం వల్ల ఆ ఎన్నిక కూడా కష్టమే.

■ వాంకిడి మండలంలోని ఖిరిడి పంచాయతీ నుంచి తేజాపూర్ విడిపోయి కొత్త పంచాయతీగా ఏర్పడింది. ఇక్కడ సర్పంచి స్థానాన్ని ఎస్టీ మహిళకు, 3,7,4,6 వార్డులు ఎస్టీలకు కేటాయించారు. కానీ.. ఇక్కడ ఆ సామాజికవర్గ ఓటర్లు లేరు. పది వార్డుల్లో ఆరు వార్డులు ఎస్టీయేతరులకు కేటాయించడంతో ఆయా వార్డు సభ్యుల నుంచే ఎన్నుకున్న ఉప సర్పంచి.. సర్పంచిగా చలామణి అవుతారు.

■ కాగజ్‌నగర్ చింతగూడ పంచాయతీలో విభిన్నమైన పరిస్థితి ఉంది. సర్పంచి స్థానాన్ని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఈ పంచాయతీ మొత్తంలో ఒకే ఒక ఎస్టీ పురుష ఓటరు ఉన్నారు. నాలుగు వార్డులను ఎస్టీలకు కేటాయించారు. ఒకే ఓటరు ఉండటంతో ఇక్కడ వార్డులకు ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు. దీంతో సర్పంచి స్థానం ఏకగ్రీవం కావడం అనివార్యంగా మారింది.



ఇది కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రహపెల్లి గ్రామం. ఇక్కడ సర్పంచి స్థానాన్ని ఎస్టీ మహిళకు కేటాయించారు. ఊరిలో ఎస్టీలెవరూ లేరు

ఆదిలాబాద్ జిల్లాలో..

■ తలమడుగు మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన రుయ్యాడి సర్పంచి పదవిని ఎస్టీ మహిళకు కేటాయించారు. 10వార్డుల్లో సగం అదే సామాజిక వర్గానికి రిజర్వు అయ్యాయి. అయితే ఆ గ్రామంలో ఎస్టీ ఓటర్లు లేరు. నామినేషన్లు వేయడానికి ఎస్టీ ఓటరే లేకున్నా.. 1987లో ఏజెన్సీ చట్టం అమల్లోకి వచ్చినప్పటినుంచి వారికే కేటాయిస్తున్నారు. ఉప సర్పంచి ఎన్నికకు సరిపడా వార్డు సభ్యులు లేకపోవడంతో ఆ ఎన్నిక కూడా జరగడంలేదు. అనాదిగా ఆ గ్రామంలో అయిదుగురు వార్డు సభ్యులు మాత్రమే ఎన్నికవుతున్నారు.

మంచిర్యాల జిల్లాలో..

■ దండేపల్లి మండలం ఏజెన్సీ ప్రాంతంలోని గూడెం గ్రామపంచాయతీని 30 ఏళ్లుగా ఎస్టీలకు కేటాయిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేకపోవడంతో ఆనాటి నుంచి ఇక్కడ పంచాయతీ ఎన్నికలు జరగడంలేదు. పది వార్డుల్లో సగం వరకు ఎస్టీలకే కేటాయించడంతో ఉప సర్పంచి ఎన్నికకు సరిపడా వార్డు సభ్యులు లేక ఆ వార్డులకు కూడా ఎవరూ నామినేషన్లు వేయడం లేదు. ఇది ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతోంది.

ఎస్సీలు ఒక్కరు కూడా లేరు..

■ మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం రాజారం పంచాయతీలో వింత పరిస్థితి నెలకొంది. తప్పుడు నివేదికల కారణంగా ఈసారి ఇక్కడ ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి. రాజారంలో మొత్తం 302 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 202 మంది గిరిజనులు కాగా, ఇతరులు 100 మంది ఉన్నారు. గ్రామంలో ఎస్సీలు ఒక్కరూ లేరు. కానీ ఈ పంచాయతీని ప్రస్తుతం ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. సర్పంచితో పాటు పలు వార్డులను ఎస్సీలకు కేటాయించడంతో వాటికి ఎన్నికలు జరగని పరిస్థితి నెలకొంది.

నిర్మల్ జిల్లా..

■ మామడ మండలం అనంతపేటలోని ఒకటో వార్డులో 107 మంది ఓటర్లుండగా దీనిని ఎస్టీకి రిజర్వు చేశారు. కానీ.. ఈ వార్డులో ఎస్టీ ఓటరు ఒక్కరు కూడా లేరు.

ఎనిమిది కిలోల చిలగడదుంప



చిలగడదుంపను చూపుతున్న రైతు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చిలగడదుంప కిలో, రెండు కిలోల బరువు ఉంటే విశేషం. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు శివారు తమ్మలోనిబావిలో ఏకంగా ఎనిమిది కిలోల బరువు పెరిగింది. గూడూరు జశ్వంత్‌రెడ్డి అనే రైతు తన ఇంటి ముందు పూలమొక్కలతో పాటు చిలగడదుంప కాండాన్ని నాటారు. నాలుగు నెలల తర్వాత భూమిలో తవ్వితే ఎనిమిది కిలోల చిలగడదుంప బయట పడింది. దీనిని చూసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

ఎన్నికలు జరిగే ప్రాంతాలకే కోడ్ వర్తింపు

నియమావళికి సవరణ చేసిన ఎన్నికల సంఘం

ఈనాడు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం కీలక సవరణ తీసుకొచ్చింది. 'రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు(రూరల్ లోకల్ బాడీస్) లేదా పురపాలక సంఘాలకు (అర్బన్ లోకల్ బాడీస్) సాధారణ ఎన్నికల ప్రకటన వెలువడితే ఎన్నికల నియమావళి(కోడ్) కేవలం ఆ ఎన్నికలు జరిగే ప్రాంతాలకు మాత్రమే వర్తిస్తుంది' అంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ మేరకు 2018లో వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనలో నియమావళికి సవరణ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్ స్పష్టంచేశారు.

ఆ ఉద్యోగులు పోటీచేయొచ్చు

సింగరేణి కాలరీస్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు కూడా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయొచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. యాజమాన్యానికి చెందిన ఏజెంట్లు (మేనేజింగ్), మేనేజర్లు, సంస్థ లేదా కార్పొరేషన్ కార్యదర్శులు, ఆ సంస్థలోని ప్రభుత్వ భాగస్వామ్యం కింద పనిచేసే వారు మాత్రం అనర్హులని చెప్పింది. పలువురు కండక్టర్లు దరఖాస్తు చేసిన నేపథ్యంలో ఈ స్పష్టత ఇచ్చింది.

నేడు నిరసన: టీఎంయూ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళ, బుధవారాల్లో తెలంగాణలో అన్ని బస్సు డిపోల ఎదుట భోజన విరామ సమయంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపనున్నట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మోటారు వాహన చట్టసవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆర్టీసీలను నిర్వీర్యం చేసే టూరిస్ట్ పర్మిట్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు లేవనెత్తిన 12 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

సమ్మెలో పాల్గొనకపోవడం దేనికి సంకేతం: ఈయూ

కేంద్ర ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొనకుండా ఎర్రబ్యాడ్జీలు ధరిస్తామని తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) చెప్పడం దేనికి సంకేతమని ఆర్టీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ టీఎంయూ సమ్మెలో పాల్గొనేందుకు తొలుత అంగీకరించి, ఇప్పుడు ఇలా వ్యవహరించడం కార్మికద్రోహమేనన్నారు.

సరైన ప్రణాళికతోనే అభివృద్ధి సాధ్యం

- జేడీ ఫౌండేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ ఎన్నికల్లో సర్పంచిగా పోటీ చేసే అభ్యర్థులు తొలుత గ్రామాల అవసరాలను గుర్తించి, వాటిని ఎలా పరిష్కరించాలో ప్రణాళికలు రూపొందించుకోవాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్ (జేడీ) ఫౌండేషన్ ఛైర్మన్ వి.వి.లక్ష్మీనారాయణ సూచించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రణాళిక అమలు ఆచరణయోగ్యంగా ఉండేలా ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో 'ఐడియా బాక్సు'లను ఏర్పాటు చేసి విద్యార్థుల నుంచి వచ్చిన ఆలోచనలను నిపుణులతో చర్చించి పరిష్కార మార్గాలను ఆలోచిస్తామని తెలిపారు. తద్వారా చిన్నప్పటి నుంచి విద్యార్థులకు పరిశోధన రంగాల్లో ఆసక్తి కలుగుతుందన్నారు. సర్పంచిగా పోటీ చేసే అభ్యర్థుల కోసం హైదరాబాద్‌లోని మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కొత్త భారతదేశాన్ని నిర్మించడం యువత ద్వారానే సాధ్యమన్నారు. 'రైతే రాజు.. గ్రామ స్వరాజ్యం' నినాదంతో ఫౌండేషన్ పని చేస్తుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. గల్లీలో ఉండే సమస్యలు దిల్లీ వారికి తెలియవని, గ్రామాల అభివృద్ధికి సంబంధించి చక్కటి ప్రణాళికలు అవసరమన్నారు. సంపద సృష్టించే విధంగా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు నివారించవచ్చని అన్నారు.

అమెరికా నుంచి వచ్చా.. గ్రామస్వరూపం మార్చా

అవగాహన కార్యక్రమానికి మధ్యప్రదేశ్‌లోని భర్కేడీ గ్రామ మహిళా సర్పంచి భక్తిశర్మ హాజరై అక్కడి గ్రామ పరిస్థితుల గురించి, తాను ఎన్నికయ్యాక చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. 'తొలుత మా గ్రామంలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉండేవి. మద్యం వినియోగం, నేరాలు అధికంగా జరిగేవి. అమెరికాలో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి స్వస్థలానికి వచ్చా. సర్పంచిగా ఎన్నికై నాలుగేళ్లుగా ప్రణాళికబద్ధంగా వ్యవహరించా. నేరాల సంఖ్య పూర్తిగా తగ్గింది. తాగుడును పూర్తిగా మాన్పించాం. గ్రామాల నుంచి తరలి వెళ్లిన 300 మంది యువకులుతిరిగి వచ్చారు' అని చెప్పారు.



సదస్సులో ప్రసంగిస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సర్పంచి భక్తిశర్మ. వేదికపై లక్ష్మీనారాయణ

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00